
# మహాత్ముడు ఆయన సిద్ధాంతాలు



ఇ.ఎం.ఎస్. నంబూద్రిపాద్

అనువాదం
కంభంపాటి సత్యనారాయణ
మహీధర రామమోహన్‌రావు

# మహాత్ముడు ఆయన సిద్ధాంతాలు

ఇ.ఎం.ఎస్. నంబూద్రిపాద్

(కేరళ మాజీ ముఖ్యమంత్రి)

అనువాదం

కంభంపాటి సత్యనారాయణ

మహీధర రామమోహన్‌రావు

విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్

విజయవాడ

MAHATHMUDU - AAYANA SIDHANTHALU

- E.M.S. Namboodiripad

| | | |
|---|---|---|
| ప్రచురణ నెం. | : | 2350/309 - 1R |
| ప్రతులు | : | 1000 |
| ప్రథమ ముద్రణ | : | అక్టోబరు, 1958 |
| ద్వితీయ ముద్రణ | : | అక్టోబరు, 2015 |

© **విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, విజయవాడ**

**టైటిల్ డిజైన్ : గిరిధర్**

వెల : **₹ 90/-**

**ప్రతులకు**

**విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్**
33-22-2, చంద్రం బిల్డింగ్స్
చుట్టుగుంట, విజయవాడ-520 004
ఫోన్ : 0866-2430302
Email : vphpublish@gmail.com

**విశాలాంధ్ర బుక్‌హౌస్**
విజయవాడ, విశాఖపట్నం,
అనంతపురం, గుంటూరు
తిరుపతి, కాకినాడ, ఒంగోలు
శ్రీకాకుళం, కడప.

**హెచ్చరిక :** ఈ పుస్తకంలో ఏ భాగాన్నైనా పూర్తిగా కానీ, పాక్షికంగా కానీ కాపీరైట్ హక్కు కలిగినవారి నుండి లేక ప్రచురణకర్తల నుండి ముందుగా రాతపూర్వక అనుమతి పొందకుండా ఏ రూపంగా వాడుకున్నా కాపీరైట్ చట్టరీత్యా నేరం.

**ముద్రణ : విశాలాంధ్ర విజ్ఞాన సమితి ముద్రణాలయం - విజయవాడ**

# ముందుమాట

ఐక్య కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శిగానూ, కేరళ ముఖ్యమంత్రిగానూ పనిచేసిన భారతదేశ ప్రసిద్ధ మార్క్సిస్టు కామ్రేడ్ ఇ.ఎం.ఎస్. నంబూద్రిపాద్ 1958వ సం॥రంలో "మహాత్ముడు-ఆయన సిద్ధాంతాలు" అనే పుస్తకాన్ని రాశారు. మహాత్మా గాంధీ ఆశయాలు, సిద్ధాంతాల మీద ప్రస్తుతం బి.జె.పి. ప్రభుత్వ నాయకత్వంలో తిరిగి చర్చ జరుగుతోంది. గాంధీజీ హత్యకు కారకులైన ఆర్.ఎస్.ఎస్., దాని శిష్యగణమే ఆయన "వారసత్వం" కోసం స్తోత్రపాఠాలు వల్లిస్తున్నారు. మార్క్స్ అన్నట్లు గతకాలపు "భూతాలను" స్మరించుకుంటున్నారు; వారి పేర్లనూ, నినాదాలనూ, వేషభాషలనూ తమ వినియోగానికై ఆవాహన చేసుకుంటున్నారు. తమ తిరోగమనం విషయంలో ఎట్టి సందేహం లేకుండా ఉండేందుకు గాను పాత తేదీలు, పాత కాలక్రమణ పట్టికలు, పాత శాసనాలు, ప్రాచీన చరిత్ర పరిశోధనా పాండిత్యంలో ఏనాడో మరుగునపడిన పుక్కిటి పురాణాలను పునర్దర్శనం గావించుకుంటున్నారు. ఆర్.ఎస్.ఎస్., దాని ముద్దుబిడ్డ బి.జె.పి. ఈ ప్రయత్నాలను ఇనుమడించిన ఉత్సాహంతో చేస్తున్నారు. ఆ ప్రయత్నాలను నిరోధించవలసిన ఆవశ్యకత ఉన్నందు వల్ల కామ్రేడ్ నంబూద్రిపాద్ రాసిన "మహాత్ముడు-ఆయన సిద్ధాంతాలు" లాంటి పుస్తకాలను విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ తిరిగి ముద్రించి ప్రజలముందుకు తెస్తున్నది.

మహాత్ముని జీవితం మీద, ఆయన సిద్ధాంతాలు, ఆచరణ మీద అనేక వందల పుస్తకాలు వచ్చాయి. కాని మార్క్సిస్టు దృక్కోణం నుంచి చేసిన పరిశీలనలు తక్కువే! గాంధీజీని వ్యక్తిగానూ, స్వాతంత్ర్య పోరాట సేనానిగానూ, ఆయన సిద్ధాంతాలనూ, ఆచరణనూ లోతుగా పరిశీలన చేసిన మొదటితరం మార్క్సిస్టు మేధావుల్లో కామ్రేడ్ నంబూద్రిపాద్ ముఖ్యులు.

సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా భారత ప్రజలు భీషణ పోరాటాలు సాగించారు. ప్రజలు లక్షల సంఖ్యలో పాల్గొన్నారు. ఆ పోరాటాలను విజయవంతం చేయడంలో వేలాదిమంది తమ ప్రాణాలను బలిదానం చేశారు. లక్షలాది కుటుంబాలు దిక్కు దివాణం లేక బజారునపడ్డాయి. పాశవికమైన దమనకాండను ప్రజలు వీరోచితంగా ఎదిరించారు. వారి ధైర్యసాహసాలు, దృఢనిశ్చయం, నిర్మాణ దక్షతే బ్రిటీషు సామ్రాజ్యవాదాన్ని దేశాన్నుంచి నెట్టివేశాయి. ఈ కార్యాచరణకంతకు మహాత్మా గాంధీయే సేనాని.

సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ఒకవైపు భీషణ పోరాటం జరుగుతుంటే, మరో వైపున ఆర్.ఎస్.ఎస్., దాని సర్వసంఘ సంచాలకులు, వారి శిష్యగణం దేశంలో మతోన్మాదాన్ని రెచ్చగొట్టారు. బ్రిటీషు వారికి వ్యతిరేకంగా ఎక్కుపెట్టవలసిన తుపాకులను

మతసామరస్యం కోసం పోరాడుతున్న మహాత్ముని లాంటి వారిపై ఎక్కుపెట్టారు. పోరాటంలో పాల్గొనకుండానే దాని ఫలితాల్లో భాగంకోసం, వారసత్వం కోసం అర్రులు చాస్తున్నారు.

గాంధీ మహాత్ముని సిద్ధాంతాలను, ఆశయాలను, ఆచరణలను గురించిన అనేక అంశాలను కామ్రేడ్ నంబూద్రిపాద్ ఈ పుస్తకంలో లేవనెత్తారు. ఆ ప్రశ్నలకు ఆయనిచ్చిన జవాబులు నేటితరం కమ్యూనిస్టులందరికీ శిరోధార్యం.

బ్రిటీషు సామ్రాజ్యవాదానికి అర్జీలు దాఖలా చేసుకుని తన దేశప్రజల్ని విముక్తుల్ని గావించాలనుకున్న మోహన్‌దాస్ కరమ్‌చంద్ గాంధీ, విజయమో, వీరస్వర్గమో నినాదాన్ని ఏ విధంగా ఇవ్వగలిగాడు? ఆ పరిస్థితులకు ఆయన ఎందుకు నెట్టబడ్డాడు? కొల్లాయిగట్టి, సామాన్యజనాన్ని సహాయనిరాకరణోద్యమానికి ఏ విధంగా పురికొల్పగలిగాడు? "అహింసా" మార్గంలో ప్రజలను కార్యోన్ముఖులను చేసి పాశవికమైన బ్రిటీషు దమనకాండ నెదిరించి కోట్లాదిమంది ప్రజలు పాల్గొనే రీతిలో ఉప్పు సత్యాగ్రహానికి ఎట్లా నాయకత్వం వహించాడు? ప్రభుభక్తి పరాయణ కుటుంబంలో జన్మించి, ఆ ప్రభువుల్నే ఎదిరించగలిగిన శక్తి ఆయనకెట్లా వచ్చింది? ఉద్యమం తీవ్రరూపం దాల్చినపుడు, తన సన్నిహిత స్నేహితులూ, శిష్యులూ నిరసించినప్పటికీ ఉద్యమాన్ని ఎందుకు వెనక్కు లాగాడు? బహుళ సంస్కృతుల దేశంలో పుట్టి, ఆ దేశంలోని మతోన్మాదులను తనదైన మార్గంలో వ్యతిరేకించి హిందూ-ముస్లిం ఐక్యతకోసం తన ప్రాణాన్ని ఏవిధంగా వడ్డాడు? కరమ్‌చంద్ గాంధీ "బాపూజీగా, జాతిపితగా" ప్రజలచేత ఏవిధంగా కొనియాడబడ్డాడు? రాజకీయాల్లో ఆయన వారసత్వం ఎవరికి దక్కాలి?

ఈ ప్రశ్నలన్నింటికీ కామ్రేడ్ నంబూద్రిపాద్ అద్భుతమైన రీతిలో ఈ పుస్తకంలో జవాబులిచ్చాడు. రాజకీయాల్లో ఉన్నవారేగాక, నేటితరం యువకులు సహితం ఈ పుస్తకాన్ని అధ్యయనం చేయాలి. మహాత్ముని సిద్ధాంతాల నుండీ, రాజకీయాల్లో ఆయన కార్యాచరణ నుండీ, ఆయన వ్యక్తిగత జీవనం నుండి నేటి రాజకీయాలు నేర్చుకోవలసినవి ఎన్నో వున్నాయి. నేర్చుకోగలరనే విశ్వాసంతో ఈ పుస్తకాన్ని విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ తెలుగు ప్రజల ముందుంచుతోంది.

విజయవాడ, అభివందనాలతో

2-10-2015.

**గడ్డం కోటేశ్వరరావు**

సంపాదకుడు

# విషయానుక్రమణిక


| | | | |
|---|---|---|---|
| 1. | పరిచయం | ... | 1 |
| 2. | ప్రారంభ దినాలు | ... | 5 |
| 3. | సహాయ నిరాకరణోద్యమం | ... | 16 |
| 4. | మొదటి చీలిక | ... | 32 |
| 5. | సంపూర్ణ స్వరాజ్యం | ... | 41 |
| 6. | ఉప్పు సత్యాగ్రహం | ... | 51 |
| 7. | కాంగ్రెసు నుండి నిష్క్రమణ | ... | 61 |
| 8. | ఐక్య సంఘటన | ... | 70 |
| 9. | అధికార స్వీకారం తర్వాత | ... | 75 |
| 10. | కాంగ్రెసు కార్యవర్గంతో విభేదాలు | ... | 85 |
| 11. | "క్విట్ ఇండియా" ఉద్యమం - అటు తర్వాత | ... | 94 |
| 12. | ఆగస్టు 15 : విజయమా - పరాజయమా? | ... | 107 |
| 13. | గాంధీవాదం అంటే? | ... | 116 |
| 14. | గాంధీజీ తర్వాత గాంధీవాదం | ... | 123 |



# మహాత్ముడు
# ఆయన సిద్ధాంతాలు

## 1. పరిచయం

**మా**నవుల మధ్య సత్సంబంధాలను ఏర్పరచి, ప్రజలకు మంచి జీవనస్థాయిని కల్పించిన చైనా, సోవియట్ దేశాల అభివృద్ధిని గురించీ, అక్కడి నిజ పరిస్థితులను గురించీ చెప్పినందుకు డాక్టర్ జె.సి. కుమారప్ప, పండిట్ సుందరలాల్ వంటి సుప్రసిద్ధ గాంధేయుల్నే "కమ్యూనిస్టుల హంగుదారులు" అంటూ కొందరు నిందించిన రోజు లున్నాయి. వారు మనో వాక్కాయ కర్మేణా గాంధీవాదులు. అందుచేత ఆ దేశాలలో తాము చూచినది "కార్యరూపమైన గాంధీవాదమే" నని చెప్పకుండా ఉండలేకపోయారు.

ఆ రోజుల్లో శ్రీ సి. రాజగోపాలాచారి మద్రాసు ముఖ్యమంత్రిగా వుండేవారు. ఆయన "కమ్యూనిస్టులు నా ప్రధాన శత్రువు"లంటూ ప్రకటించి వారిమీద కత్తికట్టేరు. సోవియట్ సాహిత్యం "ప్రచారక సాహిత్య" మంటూ పేరు పెట్టి వాటిని రైల్వే పుస్తకశాలల్లో అమ్మకూడదని రైల్వేమంత్రి నిషేధించిన రోజులవి. ఆయనే మరోవేపున "స్వేచ్ఛా ప్రపంచం" నుంచి వెలువడుతున్న చెత్త నంతనూ ఉచితంగా పంచడానికి అనుమతించేరు. పార్లమెంటులో కమ్యూనిస్టు సభ్యుడు శ్రీ పి. సుందరయ్య మన దేశం సోవియట్ యూనియన్‌తో వ్యాపార సంబంధాలు పెట్టుకోవాలంటూ తీర్మానం తెస్తే, వ్యాపారశాఖా మంత్రి దానిని వ్యతిరేకించారు.

అప్పటికీ ఇప్పటికీ పరిస్థితులు చాలా మారిపోయేయి. భారత – సోవియట్ వ్యాపార సంబంధాల తీర్మానాన్ని వ్యాపార మంత్రి వ్యతిరేకించిన ఏడాదిలోపునే రెండు దేశాల మధ్య వాణిజ్య ఒడంబడిక జరిగిపోయింది. రెండు దేశాల మధ్యా సాంస్కృతిక ప్రతినిధులు, సాంకేతిక ప్రతినిధులు, పార్లమెంటు ప్రతినిధులు, ప్రజాసంస్థల ప్రతినిధులు,

రాజకీయ నాయకులు – అనేకమంది పర్యటించి వచ్చేరు. "కమ్యూనిస్టులు నా ప్రధాన శత్రువులు" అన్న శ్రీ రాజగోపాలాచారే శాంతి పోరాటంలో సోవియట్ వహిస్తున్న పాత్రనూ, అణు హైడ్రోజను బాంబుల నిర్మూలన విషయమై ఆ దేశం చూపుతున్న దృక్పథాన్నీ మెచ్చుకొన్నాడు. వీటికి తోడు మన ప్రధాని సోవియట్ వెళ్ళినప్పుడు అసమానమైన స్వాగత సత్కారాలు జరిగేయి. అలాగే సోవియట్ నాయకులు మన దేశం వచ్చినప్పుడు వారికి అఖండ సన్మానం జరిగింది. "హిందీ–రూసీ భాయి భాయి" నినాదాలతో దిగంతాలు మ్రోగిపోయేయి.

"విభిన్న సాంఘిక వ్యవస్థలు గల దేశాలు శాంతియుత సహజీవనం చేయాలి" అనే సూత్రాన్ని అంతర్జాతీయ సంబంధాలకు ప్రాతిపదికగా ఉభయ నాయకులూ అంగీకరించడంచేతనే రెండు దేశాల మధ్యా స్నేహ సంబంధాలు ఏర్పడడానికి అవకాశం చిక్కింది. కాంగ్రెసు ప్రధాన కార్యదర్శి శ్రీమన్నారాయణ ఇల్లా వ్రాసేరు

> "ఇతర దేశాలు అనుసరిస్తున్న సిద్ధాంత విషయాలలో కలుగజేసుకొనే అభిప్రాయం మనకు ఈషణ్మాత్రమూ లేదు. అలాగే మన జీవిత విధానంలో ఇతరుల జోక్యాన్ని మనం అంగీకరించలేము." (ఎ.ఐ.సి.సి. ఎకనమిక్ రివ్యూ, 1 డిసెంబరు 1955).

తమ తమ దేశాలలోని సాంఘిక వ్యవస్థలూ, రాజ్యాంగ వ్యవస్థలూ భిన్నంగా వున్నాయనీ, తాము అనుసరిస్తున్న తాత్విక దృక్పథాలు కూడ భిన్నమేననీ భారత, సోవియట్ నాయకు లుభయులూ స్పష్టం చేసేరు. మార్క్సిస్టు సిద్ధాంతాన్నీ, ఆచరణను గట్టిగా సమర్థించుతూనే బుల్గానిన్ కృశ్చేవ్‌లు శాంతిసాధనకై ఉభయదేశాల ప్రభుత్వాలూ, ప్రజలూ పరస్పర సహకారం చేసుకోవాలని కోరేరు. అలాగే మన దేశంలో పాలకవర్గపార్టీ అయిన కాంగ్రెసు నాయకులు తాము గాంధేయ సిద్ధాంతాన్నీ, తదీయాచరణనూ వదిలిపెట్టబోమని గట్టిగా చెప్పేరు; వారిలో ఒకరైన శ్రీమన్నారాయణ ఈ విషయాన్ని నిర్మొగమాటంగా చెప్పినవారిలో ఒకరు.

> "ఈ గమ్యాలను (పంచశీలల ప్రాతిపదికపై ప్రపంచ శాంతి, సహకారాలను నెలకొల్పడం; దోపిడీని నిర్మూలించి, అత్యధికమైన ఆర్థిక సమానత్వాన్ని సాధించి ప్రజా సామాన్యం యొక్క ఆర్థిక స్థితిని చక్కబరచడం) సాధించడంలో సోవియట్ యూనియన్, భారతదేశం ఉపయోగించిన పద్ధతులలో భేదమున్నదనేది మరువకూడదు... <u>లెనిన్, గాంధీల సిద్ధాంతాల మధ్య సమన్వయం సాధ్యంకాదు."</u>

(అదే పత్రిక – క్రింది గీతలు నావి)

భారత, సోవియట్ దేశాల మధ్య సంబంధాలూ, పరస్పర సహకారమూ ఉభయ దేశాల ప్రజలకూ చాల లాభకరం; ప్రపంచశాంతికి అది తోడ్పడుతుంది. అటువంటి

సహకార సంబంధాలు వానిమధ్య ఏర్పడ్డా, మన దేశంలో గాంధేయ సిద్ధాంతముల ననుసరిస్తామని చెప్పే పాలకవర్గ పార్టీకీ మార్క్సిస్టు – లెనినిస్టు సిద్ధాంతాన్ని అనుసరిస్తామని చెప్పే ప్రజాతంత్ర ప్రతిపక్షాలకూ మధ్య అంతఃకలహం నిరంతరాయంగా సాగుతూంది. వేర్వేరు దేశాల మధ్య శాంతియుత సహజీవనమూ, అంతర్జాతీయ సమస్యల పరిష్కారం కోసం పరస్పరం సహకరించుకోవడం వలన మన దేశంలోని విభిన్న వర్గాల మధ్యగల ఘర్షణలు (ఇవి వివిధ సిద్ధాంతాల రూపంలో ద్యోతకమవుతున్నాయి) పరిష్కారం కావు. ఉదాహరణకు భారత ప్రజలు యావన్మందీ సోవియట్ నాయకులకు స్వాగతం ఇవ్వడంలో ఏకత్వం ప్రదర్శించేరు. కాని దేశీయ విధానాలలో బయలుదేరిన సమస్యలు మాత్రం పరిష్కారం కాలేదు.

మన దేశంలో భూ సమస్యను భూదానోద్యమంతో పరిష్కరించగలమా? భూస్వాముల, ఇతర విద్రోహవర్గాల ప్రాబల్యాన్ని నిర్మూలించేటందుకు బలీయమైన రైతు ఉద్యమాన్ని నిర్మించడం అవసరమా?

అతివేగంగా దేశంలో పరిశ్రమలను పెంపొందించుకొనేటందుకు (పెంపొం దించుకోవాలనేది దేశంలో అందరి ధ్యేయమూను) విదేశీయుల గుత్త పెట్టుబడిదారీ వర్గాలతో రాజీమార్గాన పోవాలా? లేక గట్టిగా పోరాటాలు సాగించడమా?

అసలు అతివేగంగా పరిశ్రమలను పెంపొందించుకోవాలనే ఆదర్శం న్యాయమేనా? పాలకవర్గ పార్టీ నాయకులు తమ గమ్యం అని చెప్పుకొంటున్న సర్వోదయ ఆదర్శానికది విరుద్ధమా?

ఈ సమస్యలమీద గాంధేయులకూ మార్క్సిస్టులకూ మధ్యనేగాక, గాంధేయులమని చెప్పుకొనే విభిన్న ధోరణులవారి మధ్య కూడా భేదాభిప్రాయం వుంది.

ఈ పరిస్థితులలో గాంధేయ సిద్ధాంతము, దాని ఆచరణ గురించి సరిగ్గా అర్థం చేసుకోడానికి ప్రతి మార్క్సిస్టూ ప్రయత్నం చేయాలి. శ్రీ డి.జి. టెండూల్కర్ "మహాత్ముడు" అనే శీర్షికతో ఎనిమిది సంపుటాలుగా వ్రాసిన గాంధీ జీవితచరిత్ర వెలువడిన తర్వాత అటువంటి ప్రయత్నాలకు సౌలభ్యం చిక్కింది. తాను "చాల నిర్దుష్టంగా, సాధ్యమైనంతవరకు గాంధీజీ సొంత మాటలలోనే చెప్పడానికి" ప్రయత్నించేనని శ్రీ టెండూల్కర్ చెప్తున్నారు (సంపుటం 1 పుట xvii-xviii).

కావలసిన విషయాన్నంతనూ సేకరించేక ఆయన దానిని గాంధీజీచేతనే సరిచూపించారు.

> "1948 జనవరి 22న నేను ఆయనను ఆఖరు పర్యాయం కలుసుకొన్నాను. అప్పుడు జీవితచరిత్ర ఆకారం గురించి, టైపును గురించి, బొమ్మల్ని గురించి ఒక మాదిరి స్పెల్లింగు



ఉపయోగించడం గురించి, కొటేషను గుర్తులు, కామాలు, హైఫన్లు గురించి - ఇంకా ఇతర చిన్న చిన్న విషయాలు ఎన్నో చర్చించుకొన్నాం." (సంపుటం 1, పుటలు xviii-xix).

మహదేవదేశాయి, ఆర్.ఆర్. దివాకర్, కె.జి. మష్రూవాలా మొదలయిన గాంధీజీ అనుచరులూ, ప్రియ శిష్యులూ అనేకమంది సహాయం, సహకారం తీసుకొన్నానని రచయిత వ్రాసేడు. అన్నింటికన్నా మిన్నగా దీనికి పీఠిక వ్రాస్తూ మన ప్రధాని పండిట్ నెహ్రూ దీనిని ఎంతో మెచ్చుకొన్నారు.

"సమకాలీనులలో ఉత్తమోత్తముడైన ఒక వ్యక్తి జీవితాన్ని తెలుపుతూన్నదనే గాదు, భారతదేశ చరిత్రలోని ఒక అమూల్య యుగాన్ని గురించి చెప్పడం కూడా ఈ పుస్తకంలో వున్న గొప్పదనం..." (సంపుటం, 1, పుట xiv).

# 2. ప్రారంభ దినాలు

**"ప్లాసీ** నుంచి అమృతసర్ వరకూ" అను శీర్షిక క్రింద రచయిత మన దేశ చరిత్రకు మొదటి సంపుటంలో ఇరవయ్యయిదు పుటలలో వివరించారు. ఆ మధ్యకాలంలో జరిగిన పెద్ద పెద్ద ఘటనలను, చరిత్రకెక్కిన ముఖ్య వ్యక్తులను గురించి అందులో వ్రాసేరు : "యుద్ధరంగంలో వీరమరణం పొందిన ఝాన్సీ లక్ష్మీబాయి వంటి తేజస్కులను సృష్టించిన 1857 తిరుగుబాటును"; 1770లో వచ్చిన బెంగాల్ కరువు మొదలుకొని బ్రిటిష్ పాలనకాలంలో దేశాన్ని చుట్టుముట్టిన కరువు కాటకాలను; స్వాతంత్ర్యం, సమానత్వం, సహోదరత్వం అనే ఆశయాలకై విప్లవధ్వజం ఎత్తిన ఫ్రాన్స్ దేశంయెడ భారతదేశపు అభినందనలు తెలిపేటందుకు చిహ్నంగా ఫ్రెంచి నౌకను దర్శించటానికై పట్టుపట్టిన రాజా రామమోహన్‌రాయలను; ఫిరోజ్‌షా మెహతా, దాదాభాయినౌరోజీ, రెనడే, తిలక్ లాంటి విద్వద్రాజకీయ వేత్తలను; 1904లో ఆమ్‌స్టర్‌డంలో జరిగిన అంతర్జాతీయ సోషలిస్టు కాంగ్రెసుకు భారత జాతీయ పితామహుడు దాదాభాయినౌరోజీ భారత ప్రజా ప్రతినిధిగా పాల్గొనబోయినప్పుడు "సభలో వున్న ప్రతినిధు లందరూ నిలబడి, భారత ప్రతినిధి యెడ మర్యాదను సూచిస్తూ టోపీలు తీసి అభివాదనలు జరిపిన ఉదంతాన్ని; భారత జాతీయ మహాసభ వేదికనుంచి స్వరాజ్యం కొరకు పిలుపు ఇవ్వడాన్నీ; సుప్రసిద్ధ మూర్తిత్రయం లాల్, బాల్, పాల్ (లాలాలజపతిరాయ్, బాలగంగాధరతిలక్, బిపిన్‌చంద్రపాల్)ల నాయకత్వాన కొత్తగా అతివాద రాజకీయాల ప్రాదుర్భావాన్ని; తిలక్‌పై పెట్టిన చారిత్రకమైన ఆ కేసు, దానిలో విధించిన శిక్ష, దానికి వ్యతిరేకంగా దేశమంతటా అసమ్మతి, లెనిన్ గొప్పగా ప్రస్తుతించిన బొంబాయి బట్టల మిల్లు కార్మికుల అసమ్మతి సమ్మెను; ప్రథమ

ప్రపంచ యుద్ధకాలంలోనూ, ఆ తర్వాత దేశంలో వచ్చిన సామ్రాజ్య వ్యతిరేకోద్యమ విజృంభణను – ఇంకా ఎన్నో విషయాలను ఆయన తన గ్రంథంలో పేర్కొన్నారు.

సామ్రాజ్య వ్యతిరేక పోరాటాల ద్వారా భారత ప్రజానీకం క్రమక్రమంగా సమైక్యత పొందుతున్న కాలం అది. ఆ దశలోనే మోహన్‌దాస్ కరమ్‌చంద్ గాంధీ పుట్టేరు. ఆయన కరమ్‌చంద్ గాంధీ కడగొట్టు కొడుకు. తాత ఉత్తమచంద్, తండ్రి కరమ్‌చంద్ లిద్దరూ కథియవాడ్‌లోని అనేక సంస్థానాలలో దివాన్లుగా పనిచేసేరు.

> "ఇతర సంస్థానోద్యోగులలో సాధారణంగా కనబడని రాజభక్తి, సామర్థ్యం, యోగ్యత మొదలగు ఉత్తమ లక్షణాలు కలవారుగా వారు ఖ్యాతి సంపాదించేరు... పోర్‌బందర్ సంస్థాన రాజకీయ జీవితంలో గాంధీ కుటుంబం చాల ప్రముఖ పాత్ర ధరించింది."
>
> (సంపుటం 1 పుట 27–28).

పడుచుదనంలో మోహన్‌దాసుపై ఆ యుగప్రభావం బాగా కనిపించింది. మాంసాహార వాదాన్ని బలపరిచే వాదనలలో ఆయనను బాగా ఆకర్షించింది ఇదట: "పొట్టిగా వున్న భారతీయున్ని పరిపాలించే ఇంగ్లీషువాడిని చూడండి. మాంసం తిని ఐదుమూరలు పొడుగెదిగాడు" – అనే పదం ఆ రోజుల్లో బడిపిల్లలలో చాల ప్రచారంలో వుండేదట. అది విని "మాంసం తింటే మనమూ ఇంగ్లీషువాడిని జయించగలం" అనుకొన్నాడట మోహన్‌దాసు. ఈ ఒక్కమారు తప్ప మహాత్ముడు తాను జీవించిన ఎనభయ్యేళ్ళూ శాకాహారిగానే జీవించేడు.

మతం అంటరానితనాన్ని అంగీకరించదని ఆయన చిన్నతనంనుంచీ తల్లితో వాదిస్తుండేవాడట. విదేశాలకు చదువుకొనేటందుకై వెళ్ళినందుకు ఆయన కులంవాళ్ళ వెలికి గురి అయ్యేడు. ఆయన కులస్థులంతా సమావేశమై – "ఈ రోజు నుంచీ ఈతడిని బహిష్కరించాలి. ఇతని కెవరన్నా సాయం చేసినా, ఓడదగ్గరకు సాగనంపబోయినా రూపాయిపావలా జరిమానా విధించబడుతుంది" – అని తీర్మానించేరు.

ఆయన లండన్‌కు తీసుకెళ్ళిన పరిచయ లేఖలలో ఒకటి దాదాభాయినౌరోజీ పేర వుంది.

> "ఆ రోజుల్లో దాదాభాయి లండన్‌లో వున్నారు. భారతీయ వ్యవహారాలను చర్చించేటందుకై ఆయన 1890లో 'ఇండియా' అనే పత్రికను ప్రారంభించారు. అది ఇంగ్లండులోని భారతీయ యువ విద్యార్థుల్ని బాగా ఆకర్షించేది. ఇండియన్ అసోసియేషన్ సమావేశాలలో ఆయన తరచు ప్రసంగిస్తుండేవాడు. అటువంటి సభలోనే ఓమారు గాంధీ ధైర్యం చిక్కబట్టుకొని నౌరోజీని సమీపించి తాను తెచ్చిన పరిచయ పత్రం అందించేడు. ఆయన ఆ ఉత్తరం చదువుకొని – 'నీకు అవసరమైనప్పుడు రా, మాట్లాడుకుందాం' – అన్నారు.

బారెట్లాకు తయారవుతూ మోహన్‌దాస్ గాంధీ అనేక అభ్యుదయకర ఉద్యమాలతో సంబంధం పెట్టుకొనడానికి ప్రయత్నించేడు. ఆయన స్వయంగా నిరీశ్వరవాది కాడు. కాని ఛార్లెస్ బ్రాడ్లా అనే ఆయన ద్వారా నిరీశ్వరవాదంయెడ ఆసక్తి కనబరచేడు. బ్రాడ్లా బ్రిటన్‌లోని నిరీశ్వరవాదుల్లో ప్రముఖుడు. ఆయన తల్లి పోయినప్పుడు అంతిమ సంస్కారాలకు అనేకమంది బ్రిటీష్ ప్రముఖులతోపాటు గాంధీ కూడ హాజరయ్యేడు. "ఇతరులకు దేవుడెంత ఆరాధ్యుడో, బ్రాడ్లీ వంటి నిరీశ్వరవాదులకు "సత్యమనేది అంత ఆరాధ్యం" - అని గాంధీ అభిప్రాయం.

1889లో లండన్ రేవుపనివారు సమ్మె చేసేరు. వారికి సాయపడిన కార్డినల్ మానింగ్‌ను గాంధీ మరొక స్నేహితునితో కలిసివెళ్ళి అభినందించి వచ్చేడు.

అయినా లండన్‌లో వుండగా ఆయనను బాగా ఆకర్షించిన ఉద్యమం శాకాహారోద్యమం. "ఇది ఆయన స్వభావంలో వున్న వైచిత్ర్యం."

"శాకాహారం కోసం లండను నగరంలో తిరిగేటప్పుడు ఆయనకు ఒక చిత్రమైన హోటలు కనబడింది. అక్కడ శాకాహారం ఒక్కటే కాదు, దానిని గురించిన ప్రచార సాహిత్యం కూడ లభించేది. అక్కడే ఆయన సాల్ట్ వ్రాసిన "శాకాహారం ఎందుకు?" అనే పుస్తకం కొన్నాడు. అది చదివేకనే ఆయనకు ఆహారశాస్త్రం మీద ఆసక్తి కలిగింది. శాకాహారోద్యమానికి మూలస్తంభాల వంటి వారితో ఆయనకు పరిచయాలు లభించేయి... లండన్‌లోని శాకాహార సమితిలో ఆయన సభ్యుడుగా చేరేడు. కొద్దికాలంలోనే సమితి కార్యవర్గ సభ్యుడయ్యేడు. మహోత్సాహంతో ఆయన తాను బస చేసిన బేస్ వాటర్ ప్రాంతంలో ఒక శాకాహార క్లబ్‌ను ప్రారంభించేడు. దానికి కార్యదర్శి అయ్యేడు... 'శాకాహారి' అనే పత్రికలో 'హిందువుల ఆచారాలు, ఆహారాలు' అనే విషయంమీద ఆయన తొమ్మిది వ్యాసాలు వ్రాసేరు." (సం. 1, పుట 35-36)

ఎలాంటి యుగంలో ఎలాంటి దేశంలో వుంటూ ఆయన ఈ కృషి సాగించేడో టెండూల్కర్ ఇలా వివరిస్తున్నాడు :

"ఆనాడు జరిగినట్లుగా నూతన భావాల ప్రబోధాచరణలు ఇంగ్లండు చరిత్రలోనే నభూతో, నభవిష్యతి. 1887లో స్వతంత్ర లేబర్ పార్టీ స్థాపింపబడింది. సిడ్నీవెబ్, బెర్నార్డుషా నాయకత్వాన ఫేబియన్ సొసైటీ సోషలిజాన్ని గురించీ, శాస్త్రీయాలోచనా విధానం గురించీ ప్రచారం చేస్తూంది. 1887లో అప్పుడే కారల్ మార్క్స్ వ్రాసిన 'కాపిటల్' మొదటి సంపుటం ఇంగ్లండులో ప్రచురింపబడింది. దానిని శ్రామికవర్గం వేదంలా స్వీకరించింది. మార్క్సు సహచరుడు ఫ్రెడరిక్ ఏంగిల్సు ఇంగ్లండులోనే వుండేవాడు. ఆయన 'కాపిటల్' రెండో సంపుటాన్ని జర్మన్ భాషలో 1885లోనే వెలువరించేడు; మూడో సంపుటం

తయారు చేస్తున్నాడు. 1889లో బెర్నార్డుషా 'ఫేబియన్ వ్యాసాలు' ప్రచురించేడు. 1871లో డార్విన్ ప్రచురించిన 'మానవుని అవతరణ' అనే ఉద్గ్రంథంమీద వాదోపవాదాలు సాగుతున్నాయి. 'పంథొమ్మిదో శతాబ్దం' పత్రికలో ప్రిన్స్ క్రోపాట్కిన్ వ్రాసిన 'పరస్పర సహకారం' అనే పుస్తకం ప్రచురితమవుతూంది. ఆయన స్వయంగా ఇంగ్లండులో తన అభిప్రాయాలను ప్రచారం చేస్తున్నాడు. కళాప్రపంచంలో రస్కిన్, విలియం మోరిస్ నూతనోజ్జీవం కల్పించేరు." (సం. 1, పుట 38)

అభ్యుదయకరములూ, మేధోద్దీపనములూ అయిన రాజకీయోద్యమాలను విడిచిపెట్టి శాకాహారోద్యమాన్ని చేబట్టిన వ్యక్తి పెడతల మనిషిగా ఆ రోజుల్లో తోచవచ్చు. కాని, దానిలో పెడతల ధోరణి ఏమీ లేదని తర్వాతి ఘటనలు రుజువు పరిచాయి. భారతదేశ మిత్రుడైన బ్రిటిష్ నిరీశ్వరవాది చార్లెస్ బ్రాడ్లాతో అభిప్రాయ భేదాలున్నా ఆయనయెడ గల అపూర్వ గౌరవం, లండన్ రేవుపనివారి సమ్మెలో ఆసక్తి, శాకాహారోద్యమంలో మమేకం కావడం – ఇవన్నీ గాంధీజీ కార్యాచరణ, తత్వవిధానంలో అంతర్భాగాలే. ఈ తత్వవిధానం ఒక అర్ధశతాబ్ద కాలం భారతదేశ చరిత్రను తీర్చిదిద్దింది.

తరువాత కొద్ది సంవత్సరాలకు గాంధీజీ దక్షిణాఫ్రికాలో లాయరుగా జీవితం ప్రారంభించేక పై విషయం స్పష్టం అయింది. దక్షిణాఫ్రికాలోని భారతీయుల ప్రత్యక్ష జీవిత పరిస్థితులను చక్కబరచేటందుకు ఆయన తన న్యాయవాద వృత్తినీ, జీవన తాత్విక లక్ష్యాన్నీ జోడించేడు. 1893 నుండి 1914 వరకూ గాంధీజీ చరిత్రను శ్రీ టెండూల్కర్ నూటముప్ఫయి పేజీలలో వివరించేడు. ఆ ఇరవై ఏళ్ళలోనూ గాంధీజీ సత్యాగ్రహ పోరాట పద్ధతిని మెరుగులు దిద్దేడు. 1921, 1930, 1932, 1942లలో దేశవ్యాప్తంగా దానిని అమలుజరిపేడు. ఆ తరువాతి ఉద్యమాలలో ఆయన సత్యాగ్రహ పోరాటాన్ని మరింత పరిణతి పొందించి, నిర్దుష్టంగా తయారుచేసేడు. కాని, ఆనాటి మొదటి ప్రయోగంలోనే ఈనాడు మనం "గాంధీజం" అని పిలిచే తాత్విక సిద్ధాంతాలు, వాని ఆచరణ రూపాలూ సూచనప్రాయంగా కనిపిస్తాయి. అందుచేత రెండు దశాబ్దాలపాటు సాగిన దక్షిణాఫ్రికా ఉద్యమంలోని ప్రత్యేక లక్షణాలను మనం పరిశీలించడం అవసరం.

మొదటిది : విదేశాలలో జీవించే ఇతర ప్రజలందరి ఉద్యమాలలాగే దక్షిణాఫ్రికా భారతీయోద్యమం కూడా అన్ని వర్గాలవారూ కలిసి పాల్గొన్న ఉద్యమం. భారతీయులకు యూరోపియన్లతో సమాన హక్కులుండా లనేది అన్ని వర్గాల, మతాల భారతీయులకు సంబంధించిన సమస్య. భారతీయులకు ఓటు హక్కును తీసెయ్యడానికి ప్రవేశపెట్టబడిన బిల్లుపై చర్చ నక్కడితో వాయిదా వెయ్యాలని దక్షిణాఫ్రికా శాసనసభను కోరుతూ గాంధీజీ ఒక అర్జీ తయారు చేసినప్పటి ఘటన దానికి ఉదాహరణ :

“అంతకుముం దెన్నడూ ప్రజాసేవలో పాల్గొనివుండని యువకు లనేకమంది కార్యరంగం లోకి దుమికేరు. అనేకమంది క్రైస్తవ యువకులు మొట్టమొదటి పర్యాయం సమకూర్చ బడ్డారు. అర్జీ నకళ్ళను తయారుచేయడానికై ఇంగ్లీషు వచ్చిన వలంటీర్లూ, తదితరులు రాత్రంతా పనిచేసేరు. వలంటీర్లుగా చేరిన వ్యాపారస్థులు తమ సొంత బళ్ళతో దూర ప్రాంతాలకంటా వెళ్ళి సంతకాలు చేయించి తెచ్చేరు.” (సంపుటం 1, పుట 49)

అలా జరిగింది ఒక్క దక్షిణాఫ్రికాలో మాత్రమేకాదు. భారతదేశంలో జరిగింది కూడా అంతే. 1896లో గాంధీజీ ఇండియాకు వచ్చినప్పుడు ఆయన దక్షిణాఫ్రికా భారతీయుల ఉద్యమ ఆశయాలను గురించి ప్రచారం చేసేడు. అప్పుడు పత్రికలూ, రాజకీయవేత్తలూ దక్షిణాఫ్రికా భారతీయోద్యమాన్ని బలపరిచేరు. చివరకు ‘పయొనీర్’, ‘టైమ్ ఆఫ్ ఇండియా’ వంటి ఆంగ్లో–ఇండియన్ పత్రికలు కూడా ఆ ఉద్యమం గురించి గాంధీ వ్రాసిన కరపత్రాన్ని సమర్థిస్తూ వ్యాఖ్యలు వ్రాసేయి.

దక్షిణాఫ్రికా ఉద్యమం బలపడుతున్నకొద్దీ గాంధీజీ భారతదేశంలోని గొప్ప గొప్ప ధనికవర్గాల సహాయం ఎక్కువగా సంపాదించగలిగేరు. తాతా కంపెనీ స్థాపకుడు రతన్‌జీ జెమ్‌షెడ్‌జీ తాతా ఆ విధంగా ధనం ఇచ్చినవారిలో ఒకరు. ఆయన ఈ ఉద్యమానికి రూ. 25 వేలు విరాళం ఇచ్చేరు. 1909లో జరిగిన అఖిలభారత ముస్లిం లీగ్ సభలో ఆగాఖాన్ విరాళాలను వసూలు చేసి మూడువేల రూపాయల నిచ్చేరు. జె.బి. పెటిట్ 400 పౌనులు, నిజాం నవాబు రూ. 2500 ఇచ్చేరు.

రెండోది : ఈ విధంగా ఆ ఉద్యమం భారతీయ ధనికవర్గాల ఆశీస్సులను పొందగలిగినా, దానికి నిజంగా శక్తియుక్తులను సమకూర్చి పెట్టినది దక్షిణాఫ్రికాలోని నిరుపేద కష్టజీవుల పోరాటపటిమా, త్యాగనిరతియే. ఓటింగు హక్కును రద్దు చేయడం వలన అన్ని వర్గాల భారతీయులకు నష్టం వున్నమాట నిజమే. కాని దారుణమైన పీడనకూ, దోపిడీకీ గురి అవుతున్నది ‘కాంట్రాక్టు’ కూలీలు. అందుచేత వా రా ఉద్యమాన్ని గట్టిగా బలపరచడంలో ఆశ్చర్యంలేదు. ‘కాంట్రాక్టు’ కూలీల దుర్భర జీవితంతో గాంధీకి కలిగిన ప్రథమ అనుభవాన్ని గూర్చి గ్రంథకర్త ఇలా వ్రాస్తున్నాడు :

“ఒక తమిళుడు చింపిరి గుడ్డలతో ఆ యువ న్యాయవాదిముందు (గాంధీ ముందు) నిలబడ్డాడు. తలగుడ్డ చేతిలోకి తీసుకొన్నాడు. అతని ముందు పళ్ళు రెండు ఊడిపోయేయి. నోటివెంట రక్తం ధారగా కారుతూంది. ఆ దృశ్యం చూచి గాంధీ కంపించిపోయేడు. తలగుడ్డ ధరించి తనతో సమానుడల్లే వ్యవహరించమని కోరేడు. ఆ నిరుపేద బానిస కిదొక నూతన అనుభూతి. అతని పేరు బాలసుందరం. దర్బన్‌లోని ఒక ప్రసిద్ధ యూరపియన్ ఇంట్లో అతడు ‘కాంట్రాక్టు’ కూలీగా పనిచేస్తున్నాడు. అసహాయుడైన ఆ

కూలివానిని యజమాని రక్తం కారేటట్లు కొట్టేడు. గాంధీ అతనిని సర్టిఫికెట్టు తెచ్చుకోమని ఒక డాక్టరువద్దకు పంపేడు. తా నాతనిని మేజిస్ట్రేటు వద్దకు తీసుకుపోయేడు. యజమానిని శిక్షింప చేయడం గాంధీ కోరిక కాదు. కూలివానిని యజమాని అధీనంలోంచి తప్పించాలనేదే ఆయన ఉద్దేశం. 'కాంట్రాక్టు' కూలీ బానిసలాగే యజమాని సొత్తుగా పరిగణింప బడేవాడు. ఇక్కడ గాంధీ అతనిని మరొక యజమానివద్దకు మార్పించగిగేడు. బాలసుందరం గాథ మద్రాసుకంటా పాకింది. దానితో 'కాంట్రాక్టు' కూలీలు ఆయనను తమ ఆప్తమిత్రుణ్ణిగా పరిగణించసాగారు."

'కాంట్రాక్టు' కూలీలు ఒక్కమారు కళ్ళు తెరిచి కార్యరంగంలోకి వచ్చినప్పుడు కార్మికవర్గం అంత వీరత్వంతోనూ పోరాడుతారు. 'చరిత్రాత్మక ప్రస్థానం' అన్న ప్రకరణంలో ఒక కార్మిక సమ్మెను గురించి రచయిత వర్ణించేడు. 'న్యూ కాసిల్' (దక్షిణాఫ్రికా)లో బొగ్గుగని కార్మికులు ఆరు వేలమంది పెద్ద సమ్మె చేసేరు. ఆ సమ్మె కూడా దక్షిణాఫ్రికా భారతీయుల పోరాటంలో ఒక భాగం అయింది. ఈ సమ్మె కాలంలో కార్మికులు అసమానమైన ధైర్యసాహసాలను, సంఘటిత శక్తిని కనబరిచారు.

"సమ్మె పోరాటం ఉజ్జ్వలంగా సాగిపోతూంది. కార్మిక సమూహాలు రోడ్డువెంటా, రైలుకట్టవెంటా పడి నడుస్తున్నారు. వారిలో ఇద్దరు స్త్రీల పసిపాపలు దారిలో మరణించినా, మహా పట్టుదలతో వారు నడిచి ఛార్లెస్ టౌన్ చేరారు. వారిలో ఒకామె బిడ్డ వాతావరణ పరిస్థితులకు తట్టుకోలేక చనిపోయింది. ఒక వాగు దాటుతుండగా రెండో ఆమె బిడ్డ చేయి జారిపడి మునిగిపోయింది. కాని ఆ వీరమాతలు నిరుత్సాహపడలేదు. వారిలో ఒకామె ఇల్లా అంది : "ఎంత ఏడ్చినా చచ్చిపోయినవాళ్ళు తిరిగి రారు. ఇంక ఏడవడం ఎందుకు? బ్రతికి వున్నవాళ్ళ కోసమే పనిచెయ్యాలి." (సంపుటం 1, పుట 170)

సాధారణ ప్రజలు ప్రదర్శించిన సమర సంకల్పానీ, త్యాగనిరతినీ చూచి గాంధీజీ హృదయం ద్రవించిపోయింది. జీవిత పర్యంతం ఆయన ఆ అనుభవాన్ని మరచిపోలేదు. 1915లో ఆయన భార్యతో సహా మద్రాసు వచ్చినప్పుడు అక్కడి వా రిచ్చిన సన్మాన పత్రానికి సమాధానంగా ఆయన ఇలా అన్నారు :

"ఈ సన్మాన పత్రంలోని పొగడ్తలలో పదోవంతుకు కూడా మేము అర్హులం కాము. మమ్మల్నే ఇంత పొగిడినప్పుడు దక్షిణాఫ్రికాలో బాధలు పడుతున్న సోదర దేశీయుల మేలుకోరి ప్రాణార్పణం చేసిన వారిని ఎంతగా పొగడాలి? పదహారు, పద్దెనిమిదేళ్ళ వాళ్ళు నాగప్పన్, నారాయణస్వామి తమ మాతృదేశ గౌరవంకోసం అనేక అగ్నిపరీక్షలను, కష్టాలను, అవమానాలను సహించారు. వారిని స్తుతించడానికి మీవద్ద భాష ఏది? పదహారేళ్ళ వలియమ్మ జ్వరంతో చిక్కి శల్యమైపోయి మార్టిజ్‌బర్గ్ జైలునుంచి విడుదల

చేయబడింది. బయటికి వచ్చిన నెల రోజులలో ఆమె మరణించింది. ఆమె ఎంతో మంచిపిల్ల. ఆమెను పొగడడానికి మీవద్ద భాష ఏముంది? ఆ మహా వ్యక్తులకు ఉత్సాహ ప్రోత్సాహాలు కలిగించినది నేనని వ్రాసేరు. కాని నేను వొప్పుకో లేను. ఒక మహా విశ్వాసంతో, పోరాటంలో ప్రతిఫలాపేక్ష లేకుండా పనిచేసిన ఆ అమాయక ప్రజలే నాకు ఉత్సాహ ప్రోత్సాహాలిచ్చేరు. తమ మహా త్యాగాలతో, విశ్వాసముతో, భగవద్భక్తితో నాచేత ఈ పనులు చేయించేరు. నలుగురిలో కనబడే విధంగా నేనూ, నా భార్యా పనిచేయవలసి రావడం విచారకరం. మేం చేసిన ఈ కొద్దిపాటి పనిని మీరు గోరంతలు, కొండంతలు చేసి వర్ణించేరు. మీరు మాకు ఎత్తదలచిన కిరీటం న్యాయంచేత వారికి ఎత్తాలి. ఎంతో ప్రేమతో, గుడ్డిగా మీరు మమ్మల్ని పొగిడేరు. పొగడవలసింది ఆ యువకుల్ని గాని మమ్ముకాదు." (సం. 1, పుట 200–01)

మూడోది : ఆ పోరాటంలో కష్టజీవులయిన ప్రజలు వీరోచితంగా పోరాడేరు. ప్రధాన పాత్ర వహించేరు. కాని ఉద్యమం ఏ మార్గాన నడవాలో నిర్ణయించినది గాంధీజీకాని వారు కాదు. మహాత్ముడు నడిపిన ఇతర పోరాటాల మాదిరిగానే, దక్షిణాఫ్రికా భారతీయుల పోరాటంలో కూడా ఆదినుంచి అంతంవరకూ ఒకే లక్షణాలు కనబడతాయి : ప్రజానీకం అసమానమైన త్యాగాలు చేస్తారు. పరాక్రమం చూపిస్తారు. కాని, పైనున్న నాయకులు తమకు ఉచితమని తోచిన విధంగా ఉద్యమాన్ని నడిపిస్తారు. ఆ తర్వాత గాంధీజీ అనుసరించిన పోరాట నిర్మాణ పద్ధతులు మొత్తంమీద దక్షిణాఫ్రికా భారతీయ పోరాటంలో రేఖామాత్రంగా కనిపిస్తాయి.

"యంగ్ ఇండియా"కూ, "హరిజన్" పత్రికకూ ప్రారంభకంగా "ఇండియన్ ఒపీనియన్" అనే పత్రిక ప్రారంభించేడు. సబర్మతీ వార్ధా ఆశ్రమాలను తర్వాత జీవితంలో ప్రారంభించినట్లే 1904లో "ఫోనిక్స్" (Phoenix) ఆశ్రమాన్నీ, 1910లో "టాల్‌స్టాయి క్షేత్రా"న్నీ స్థాపించేడు. ఆ ఆశ్రమాలలో వుండేవారు నడచుకోవలసిన విధానాన్ని ప్రతి చిన్న అంశమూ నిబంధనలుగా తయారుచేసేడు. పోరాటాలు ప్రారంభించడానికీ, నడిపించడానికీ 'ఆత్మనిగ్రహం' అలవాటు చేసుకోవాలన్నాడు. పోరాటాలకు ముందూ, పోరాటకాలంలోనూ అధికారులతో విస్పష్టమైన భాషలో జాబులు వ్రాస్తూండడం; జైళ్ళలోనుంచే ఉత్తర ప్రత్యుత్తరాలూ రాయబారాలు సాగించడం; పోరాటంలో పాల్గొన్న ప్రజలతో చెప్పకుండా, వారి అనుమతి తీసుకోకుండా అధికారులతో ఒప్పందాలు చేసుకోవడం; పోరాటంలో ప్రతి చిన్న విషయంలోనూ స్వయంగా దారి చూపించడం; తను అరెస్టయితే తర్వాత నాయకత్వం వహించవలసిన వారిని నియమించడం –

పోరాటానికి తయ్యారీలు నిర్వహణ ముగింపులలో ఆయన అనుసరిస్తూ వచ్చిన పద్ధతులివి. ఇవన్నీ మొట్టమొదటి పర్యాయం దక్షిణాఫ్రికా పోరాటంలోనే మనకు కనబడతాయి.

ఇక్కడ ఒక విషయం గమనించవలసియుంది. గాంధీజీ తన కార్యకలాపా లన్నింటా పచ్చి అభివృద్ధి నిరోధకమైన సామాజిక దృక్పథాన్ని అనుసరించేడు. ఇంగ్లండులో ఉన్నప్పుడు ఆయన శాకాహారోద్యమంలో చేరడానికి కీలకం మన కందులో కనిపిస్తుంది. గాంధీజీ తన శాకాహర ప్రియత్వాన్నీ, లండన్ రేవు కార్మికుల సమ్మెతో ఏకీభావాన్నీ, ఆనాటి ప్రగతిశీల భావనలను వ్యతిరేకించకపోయినా పూర్తిగా నిర్లక్ష్యభావం చూపడాన్నీ సమ్మిళితం చేసినట్లే – దక్షిణాఫ్రికాలోకూడ పాత ఛాందస భావాల్ని, ప్రజానీకం సాగిస్తున్న సాహసోపేత పోరాటాలతో మిళితం చేసేడు. ఇంకా అన్యాయం ఏమంటే, ఆ పోరాటాలను ఒకమూల నడుపుతూనే తన ఛాందస భావాల్ని ప్రజలలో ప్రచారం చేసేడు. మార్క్సు, ఏంగిల్సు, లెనిన్‌లకూ – ఆయనకూ తేడా అక్కడే వుంది. యువక బారిష్టరయిన గాంధీజీ 'శాకాహారి' పత్రికకు వ్యాసాలు వ్రాస్తున్న కాలంలోనే యువక లాయరు లెనిన్, మార్క్సు, సిడ్నీవెబ్ మొదలయినవారి పుస్తకాలను అనువదిస్తున్నాడు. "రష్యాలో పెట్టుబడిదారీ విధానం అభివృద్ధి"ని గురించి లెనిన్ సొంత గ్రంథం వ్రాస్తున్నాడు. ఒకవిధంగా వీరిద్దరూ సమకాలీనులు. లెనిన్ శ్రామికవర్గం సాగించే సాహసోపేతములయిన పోరాటాలను, బాగా అభివృద్ధి పొందిన సిద్ధాంతాలతో జోడించేడు. గాంధీజీ సమకాలీన ప్రపంచంలో కనిపించే పచ్చి అభివృద్ధి నిరోధకములయిన ఛాందస భావాలతో వాటిని జోడించేడు.

1909లో ఆయన "హింద్ స్వరాజ్ లేక ఇండియన్ హోమ్‌రూల్" అనే పుస్తకం వ్రాసేడు. ఆధునిక ప్రపంచం గురించి దానిలో ఆయన ఏం వ్రాసేడో చూడండి : 'ఆధునిక నాగరికత'ను హిందీ స్వరాజ్ చాల తీవ్రంగా నిందిస్తూందని టెండూల్కర్ వ్రాసేడు. ఆ పుస్తకంలో ఇరవై ప్రకరణ లున్నాయి. స్వరాజ్యం, నాగరికత, లాయర్లు, డాక్టర్లు, యంత్రాలు, విద్య, సహాయ నిరాకరణ తదితర విషయాలమీద ఆ ప్రకరణాలు వ్రాసేరు. గాంధీజీ ఆ పుస్తకంలోని విషయాలను క్లుప్తీకరించి తన మిత్రలోకంకి జాబుగా వ్రాసేరు. దానిని టెండూల్కర్ తన పుస్తకంలో పేర్కొన్నారు. ఆ జాబులోని దిగువ భాగాలను చదువుతే ఆధునిక ప్రపంచంయెడ గాంధీజీ దృక్పథం అర్థం అవుతుంది :

> "... భారతదేశాన్ని పరిపాలిస్తున్నది బ్రిటిష్‌వాళ్ళు కాదు; రైలుమార్గాలు, టెలిగ్రాఫు, టెలిఫోన్‌లు, నాగరికతా విజయాలంటూ గొప్పగా చెప్పుకునే ప్రతి 'కొత్త పరికరం' ద్వారా ఆధునిక నాగరికత మన దేశాన్ని పరిపాలిస్తూంది. బొంబాయి, కలకత్తా వంటి ప్రధాన నగరాలన్నీ నిజంగా రొచ్చుగుంటలు, బ్రిటిష్ పాలనస్థానే రేపు ఆధునిక పద్ధతుల

మీద నిర్వహింపబడే దేశీయ పాలన ఏర్పడితే మాత్రం ఇండియా సుఖపడుతుందనా? ఇంగ్లండుకు పోయే ధనం కొంత నిలబడుతుందేకాని అంతకన్న హెచ్చు వుండదు. యూరపుకో, అమెరికాకో రెండో దేశంగా లేక మూడో దేశంగా భారతదేశం పరిగణనకు రావచ్చు... ప్రస్తుత వైద్యశాస్త్రం మంత్రాల, మూఢనమ్మకాల ముద్ద. గొప్ప చికిత్సా నైపుణ్యంగా చలామణీ అయ్యే నేటి వైద్యశాస్త్రంకన్న సంచికట్టు వైద్యం ఉత్తమం. అవినీతి పరులు తమ పెత్తనం నిలుపుకొనేటందు కుపయోగిస్తున్న పనిముట్లు ఈ హాస్పిటళ్ళు, సుఖరోగులకు ఆస్పత్రులు, క్షయరోగులకు ఆస్పత్రులు లేకపోతే ఇందరు క్షయపీడితు లుండరు; వ్యభిచారం తగ్గుతుంది. ఈ ఏభయ్యేళ్ళలోనూ నేర్చుకొన్నది మరచి పోగలిగితేనే మన దేశానికి ముక్తి. రైల్వేలు, టెలిగ్రాఫులు, హాస్పిటళ్ళు, లాయర్లు, డాక్టర్లు వగైరా అన్నీ పోవాలి." (సం. 1, పుట 130)

గాంధీజీ ఈ అభిప్రాయాల్ని ప్రకటించడంతోనే ఊరుకోలేదు. 'ఫోనిక్స్ ఆశ్రమా'న్ని స్థాపించినప్పుడు, 'టాల్‌స్టాయి క్షేత్రాన్ని' ప్రారంభించినప్పుడు ఇతర సమయాలలోను కూడ సహచరులను కూర్చుకోవడంలో ఆయన ఈ భావాల్నే అనుసరించాడు. ఆ ఆశ్రమంలోకీ, క్షేత్రంలోకీ వచ్చిన యువతీ యువకులచే ప్రతిజ్ఞలూ, ప్రమాణాలూ చేయించాడు. అహింస, అస్తేయం, బ్రహ్మచర్యం, సొంతం అనేది లేకుండా చేసుకోడం, రుచులు పోనాడడం - మొదలయిన వాటిని ఆచరించేటట్లు చూచాడు. యువజనులలో సిద్ధాంత, మేధోవికసన కలిగించడం అంటే ఆయన జుగుప్స చూపారు. స్వేచ్ఛగా ఆలోచించడానికి బదులు మారు మాటాడకుండా చెప్పింది చెయ్యమన్నాడు.

ఆయనను అనుసరించే యువతీ యువకులలో త్యాగదీక్షను, నిస్వార్థతను, ఆదర్శాన్ని పురిగొల్పేదేదో వీటన్నింటా వుంది. దుర్మార్గంతో సాగించే పోరాటంలో బుద్ధిపూర్వకంగా బాధానుభవానికి సిద్ధం కావడంలో ఈ పురాతన భావాలు కమ్ముకు పోతున్నాయి. ఆధునిక నాగరికతయెడ గాంధీజీకి గల అసహ్యాము, ఆయన తన అనుచరులలో రేకెత్తించదలచిన అసహ్యాము భారతీయులను, ఇతర ప్రజలను పీడిస్తున్న సామ్రాజ్యవాదానికి వ్యతిరేకతగా రూపొందింది. చారిత్రక భౌతికవాద సృష్టికర్తలు తమ "కమ్యూనిస్టు ప్రణాళిక"లో వర్ణించిన పెటీబూర్జువా సోషలిజానికీ, గాంధీజీ హింద్‌స్వరాజ్‌కీ చాలవరకు పోలికలు కనిపిస్తాయి.

"పెటీబూర్జువా సోషలిస్టులు ఆధునిక ఉత్పత్తి విధానంలోని అవకతవకలను, వైరుధ్యాలను నిశితంగా విడగొట్టి చూడడంలో సమర్థులు. బూర్జువా అర్థశాస్త్రజ్ఞుల బూటకపు సిద్ధాంతాలను ఎంతో చాకచక్యంగా వీరు విమర్శించి వాటి గుట్టును బయట పెట్టగలరు. యంత్రశక్తివల్ల, పని విభజనవల్ల, కొద్దిమంది చేతుల్లోనే భూమి పెట్టుబడి వున్నందువల్ల, ఆర్థిక సంక్షోభాలవల్ల ఎట్టి అనర్థకాలు కలుగుతాయో వీరు చక్కగా రుజువు చేయగలరు.



అంతేకాదు, ఎప్పటికైనా రైతాంగం, పెటీబూర్జువావర్గం శిథిలం కావలసిన వర్గాలేనని కూడ నిరూపించగలరు. శ్రామికవర్గం ఎంత దుర్భరమైన జీవితం గడుపుతూందో, నేటి ఉత్పత్తి విధానంలో ఎన్ని అవకతవకలున్నాయో, పంపక విధానంలో ఎంత అసమానత్వం ఉందో వీరు కండ్లకు కట్టినట్లు చిత్రిస్తారు. పెట్టుబడిదారులు తమ లాభాలకోసం వివిధ దేశాలమధ్య మారణయుద్ధం ఎలా తీసుకువస్తున్నారో, మనిషికీ మనిషికీ మధ్య వుండ వలసిన నైతిక సంబంధాలు ఎలా తలక్రిందులయాయో, పూర్వజాతులు ఎలా విచ్ఛిన్నమవు తున్నాయో వర్ణిస్తారు."

పీడిత ప్రజల సామ్రాజ్య వ్యతిరేకతకూ, గాంధీజీ ఆధునిక నాగరికతా విమర్శకూ సంబంధంలేదు. ఒకవేపున ఆధునిక నాగరికతమీద నిప్పులు చెరుగుతూనే, ఆనాటి ఆధునిక నాగరికతా కేంద్రాలలో ఒకటయిన బ్రిటిషు సామ్రాజ్యానికి గాంధీజీ అత్యంత విశ్వాస పాత్రుడుగా వ్యవహరిస్తూ వచ్చాడు. "భారతదేశంలోని ఇంగ్లీషు వానికి" (యంగ్ ఇండియా, అక్టోబరు 1920) అనే లేఖలో ఆయనే ఈ విషయాన్ని ఇలా వ్రాసుకొన్నారు:

"సామ్రాజ్య శ్రేయస్సుకోసం నాలుగుమార్లు నేను ప్రాణాపాయ స్థితిని తెచ్చుకొన్నాను. బోయెరు యుద్ధకాలంలోనే నేనొక అంబులెన్సు దళానికి సారధ్యం వహించి పనిచేసేను. మా అంబులెన్సు దళం కృషిని జనరల్ బుల్లర్ తన నివేదికలలో పేర్కొన్నాడు. అలాగే నేటాల్‌లో జులూలు తిరుగబడినప్పుడు, ఒక అంబులెన్సు దళాన్ని నడిపాను. గత యుద్ధం ప్రారంభమైనప్పుడు కూడ ఒక అంబులెన్సు దళాన్ని సమకూర్చేను. దానికోసం పడిన శ్రమ ఫలితంగా ప్లూరసీ వ్యాధి తీవ్రంగా పట్టుకొంది. యుద్ధం సందర్భంలో ఢిల్లీలో జరిగిన మహాసభలో నేను లార్డు ఛెమ్సుఫర్డుకు ఇచ్చిన వాగ్దానం ప్రకారం నా కర్తవ్యాన్ని నిర్వహిస్తూ, సైనికులను చేర్చేటందుకు ఖేదాజిల్లాలో తిరుగుతూ, ఆ దీర్ఘ ప్రయాణాలలో రక్తగ్రహణి తెచ్చుకుని, చచ్చిబ్రతికేను. సామ్రాజ్యంలో నా దేశానికి సమాన హోదా సిద్ధించగలదనే విశ్వాసంతోనే ఇవన్నీ చేసేను." (సం. 2, పుట 30-31)

సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా దేశంలో తిరుగుబాటు భావాలు రగులు కొంటున్న సమయంలో జరిగినవే ఇవన్నీ. ఒకవైపున గాంధీ సామ్రాజ్యవాద యుద్ధాలలో ఫిరంగులకు బలికావడానికై యువకుల్ని రిక్రూట్‌చేసి సామ్రాజ్యవాద సేవకు పూనుకొన్నాడు. రెండోవైపున సర్ కర్జన్ వైలీని (బెంగాల్లో ఉద్యోగం చేసిన జిల్లా కలెక్టర్) చంపడానికి ప్రయత్నించిన మదన్‌లాల్ ధింగ్రాను ఇంగ్లండులో కూడ ఎక్కువమంది నిందించలేదుగాని, గాంధీజీ ఆయనను నిరసించాడు. గాంధీజీలోనూ, ఆయన అహింసా సిద్ధాంతంలోనూ వున్న ప్రత్యేక లక్షణమే అది. దేశభక్తుడుగా ఆ పని చేయడానికి తనకు హక్కు వున్నదని ధింగ్రా పోలీసు కోర్టులో చెప్పాడు :

"ఒక జాతిని ఒక జాతి ఆయుధబలంతో తొక్కిపెట్టి, పరిపాలిస్తున్నంత కాలం, ఆ జాతులమధ్య నిరంతర యుద్ధవాతావరణం వున్నదనే నా అభిప్రాయం. అందుకే నిరాయుధం చేయబడిన జాతికి యుద్ధావకాశాలు తక్కువగా వుంటాయి. నాకు అటు ధనమూ లేదు, ఇటు విద్వత్తూ లేదు. ఈ దశలో రక్తంతప్ప నా మాతృదేశానికి నే నేమివ్వగలను? ఈవేళ భారతదేశం నేర్చుకోవలసింది 'ఏలా ఆత్మార్పణ చేయాలి' – అనేదే. మనం ఆత్మార్పణ చేసి ఆ మార్గం నేర్పాలి. అందుకే నే మరణిస్తున్నా. నా మరణం ఇతరులకు మార్గదర్శి అవుతుంది." (సం. 1, పుట 125)

ఆ రోజుల్లో వలసశాఖకు ఉపమంత్రిగా వున్న కరుడుగట్టిన సామ్రాజ్యవాది విన్‌స్టన్ చర్చిలు కూడా ఢింగ్రా ప్రకటనమీద ఇలా వ్యాఖ్యానించాడు : "దేశభక్తి పేరున ఇంతకు ముందెన్నడూ ఇంత ఉదాత్తత వినిపించలేదు." కాని గాంధీజీ అభిప్రాయం వేరు. ఆయన ఇలా వ్రాశారు :

"ఢింగ్రా చేసిన పనివలనగాని, అలాంటి చర్యలవలనగాని భారతదేశానికి లాభం చేకూరుతుందని ఎవరయినా భావిస్తే అది గొప్ప పొరపాటు. ఢింగ్రా దేశభక్తుడే. అయినా ఆయనది అంధదేశాభిమానం. ఆయన తప్పుమార్గంలో ఆత్మార్పణ చేసేడు. దానివలన చెడు ఫలితాలే కలుగుతాయి."

సామ్రాజ్యవాద దోపిడీకీ పీడనకూ వ్యతిరేకంగా అశేష ప్రజాసామాన్యాన్ని ఆయన మేల్కొలిపి సమీకరించేడు. ఆ పోరాటాలలో సాహసోపేతంగా, అనుపమ త్యాగాలు ప్రదర్శించిన వందలాది స్త్రీ పురుషులకు అగ్రశ్రేణిలో నిలిచి వారిని నిడిపేడు. ఆ విధంగా భారతదేశంలోని కోట్లకొలది ప్రజల విశ్వాసాన్నీ, అభిమానాన్నీ చూరగొన్నాడు. కాని ఆయనే రెండోవేపున దోపిడీని అంతమొందించడానికి తీవ్ర పోరాటం పనికిరాదన్నారు. సామ్రాజ్యవాద యుద్ధాలకూ, పీడనకూ సాయపడడమే సిసలయిన పంథా అని బోధించ డానికి పూనుకొన్నాడు. అహింస పేరుతో ఢింగ్రా వంటి విప్లవవీరుల్ని నిరసించిన వ్యక్తే రెండోవేపున సామ్రాజ్య యుద్ధానికి యువకుల్ని బలిపశువులుగా తోలడానికేమీ సంకోచించ లేదు. ఆయనే అన్నిటికన్న ఎక్కువగా సామ్రాజ్యవాద దోపిడీని వ్యతిరేకించే పేరుతో మానవ నాగరికతలోని ఆధునిక శాస్త్రీయ అభివృద్ధికరమయిన ప్రతిదానినీ నిరసించారు.

# ౩. సహాయ నిరాకరణోద్యమం

ప్రథమ ప్రపంచయుద్ధం చివరిభాగంలో భారత జాతీయ రాజకీయరంగంలో అవతరించిన వ్యక్తి స్వరూప స్వభావాలివి. అనేక విషయాలలో ఆయన తలతిక్క మనిషి అనే అభిప్రాయం వున్నా గోఖలేవంటి గొప్ప గొప్ప జాతీయ నాయకులు ఆయనను ఎంతో గౌరవించేవారు. గోఖలేకూ, సర్వెంట్సు ఆఫ్ ఇండియా సొసైటీలోని ఆయన మిత్రులకూ గాంధీయెడ ఎంతో ప్రేమా, భక్తీ వుండేవనీ, "ఆయనయెడ గల గౌరవం సన్నగిల్లుతుందేమోనన్న భయంతోనే" ఆయనను సొసైటీలో చేర్చుకోవడంలేదనీ గోఖలేయే అన్నట్లు టెండూల్కర్ వ్రాశాడు. మూడోతరగతి ప్రయాణీకుల కష్టాలను తెలుసుకొనేటందుకు తాను మూడోతరగతి పెట్టెలోనే భారతదేశం అంతా తిరగాలనుకొంటున్నానని గాంధీజీ చెప్పినప్పుడు గోఖలే అదొక విచిత్రమైన అభిప్రాయంగా భావించినట్లు ఆయన వ్రాశాడు.

అయినా గాంధీజీ భారతదేశానికి వచ్చి స్థిరపడ్డ కొద్ది ఏళ్ళకే, గొప్ప జాతీయ రాజకీయోద్యమానికి నాయకుడయ్యాడు. అనేక సాంఘిక, తాత్వికాభిప్రాయాలలో ఆయనతో ఏకీభవించేవాళ్ళు దేశంలో ఎంతోమంది వుండివుండరు. రాజకీయోద్యమాలలో ఆయనకన్న వయోవృద్ధులూ, సమవయస్కులూ రాజకీయాభిప్రాయాలలోనూ, వ్యక్తిగత జీవితానికి సంబంధించిన అభిప్రాయాలలోనూ ఆయనతో భేదాభిప్రాయం కలిగివున్నారు. కాని ఆయన జాతీయ రాజకీయ రంగంలోకి రాగానే వాళ్ళు మంత్రముగ్ధుల్లా అయిపోయారు. ఆయన రాజకీయ పలుకుబడి క్రిందకూ, వ్యక్తిగత పలుకుబడి క్రిందకూ వచ్చేసేరు. ఆయన సలహాను, మార్గదర్శిత్వాన్నీ స్వీకరించేరు. తెలివితేటలలోను, మేధాసంపదలోనూ ఆయనను

మించినవాళ్ళే ఆయన నాయకత్వం క్రింద పనిచేయడానికి సిద్ధపడ్డారు. ఆయన నిర్ణయాలకు కట్టుబడివుంటామన్నారు.

చూడడానికిది చాలా అద్భుతంగా కనపడొచ్చు. కాని దీనిలో ఆశ్చర్యం ఏమీ లేదు. గాంధీజీ సామాజిక దృక్పథంలో అసాధారణమైన విషయాలూ, మత, ఆధ్యాత్మిక భావాలూ కనిపిస్తున్నా, ఆయన రాజకీయాదర్శాలనూ, గమ్యాలనూ సాధించేటందుకై ఎత్తుగడలు ఎంతో అసామాన్యమైనవైనా వానిలో ఒక ప్రత్యేక లక్షణం వుంది. భారతీయ సమాజంలో దినదినాభివృద్ధి పొందుతూ, జాతీయ రాజకీయ జీవితంలో తన పలుకుబడిని స్థిరపరుచుకుంటున్న ఒక వర్గం యొక్క ఆశలకూ, ఆశయాలకూ అవి సరిగ్గా సరిపడు తున్నాయి.

ఇక్కడ మనం ఒక విషయాన్ని జ్ఞాపకం చేసుకోవాలి. 19వ శతాబ్దపు ప్రథమార్థ భాగంలోనే భారతీయ సమాజంలో ఒక నూతన వర్గం తల ఎత్తుతున్న సూచనలు కనిపించేయి. అభివృద్ధికరమైన సామాజిక సంస్కరణల కొరకు ఉద్యమం ప్రారంభమయింది. వివాహ విషయాలలోను, స్త్రీల హక్కులు, వారసత్వం మొదలగు విషయాలలోను సంస్కరణలు కోరుతూ, నూతన సంస్కృతిని అభివృద్ధిపరచేటందుకు అనేక రాష్ట్రాలలో రాజా రామమోహనరాయ్ వంటివారు పనిచేసేరు. ఆ విధంగా బ్రిటిష్‌వాళ్ళ రాకకు పూర్వం దేశంలోవున్న మధ్యతరగతి క్రమంగా ఆధునిక బూర్జువావర్గపు లక్షణాలను అలవరచుకొంటూ వుందన్నమాట. బ్రిటిష్ పాలకుల అభిమానాదరాలతో వృద్ధిపొందుతున్న ఈ వర్గం బ్రిటిష్‌వాళ్ళ యెడ ఎంతో భక్తి విశ్వాసాలు కలిగివుండేది. బ్రిటిష్ నాగరికతకు ప్రతిబింబంగా భారతదేశాన్ని వృద్ధిపొందించాలనుకొనేవారు. కాని, బ్రిటిష్‌వాళ్ళు తమ మట్టుకే బూర్జువా రాజకీయ ప్రజాతంత్రం వుండాలిగాని ఇతరత్రా వర్తింపచేయడానికి ఇష్టపడేవారు కాదు. అందుచేత ఈ వర్గంతో బ్రిటిష్‌వాళ్ళకు ఘర్షణ వచ్చింది. తల ఎత్తుతున్న ఈ బూర్జువావర్గపు ద్వంద్వ స్వభావమే భారత జాతీయ మహాసభ సంస్థాపకుల "మితవాద రాజకీయాలకు" మూలం.

క్రమంగా ఆ వర్గం తన "మితవాద రాజకీయాలను" అధిగమించింది. బూర్జువా మేధావివర్గం క్రమంగా పెరిగింది. నెమ్మదిగానే అయితేనేం వ్యాపారస్థులూ, పారిశ్రామిక యజమానులూ అయిన బూర్జువావర్గం బలపడింది. భారతదేశాన్ని అధునాతన స్థితికి తెచ్చేటందుకై ఈ రెండు తరగతులవారూ అనేక దశాబ్దాలపాటు కృషిచేసి ఎంతో అనుభవం సంపాదించేరు. జపాన్ చైనాలవంటి ప్రాచ్యదేశాలలో ప్రజాతంత్రోద్యమం తల ఎత్తుతూంది. వీటన్నింటికితోడు 1905లో రష్యాలో వచ్చిన విప్లవం. ఇవన్నీ కూడ 'అతివాద రాజకీయాలు' తల ఎత్తడానికి తోడ్పడ్డాయి. గోఖలే, నౌరోజీ మొదలయిన పాత నాయకులకు

పోటీగా తిలక్ మొదలయిన కొత్త నాయకులు పుట్టుకొచ్చేరు. తీర్మానాలు చెయ్యడం, రాయబారాలు నడపడం, తదితరములయిన రాజభక్తి పూర్వకమయిన పద్ధతులను అవలంబించం పరిపాటిగా వుండేది. దాని స్థానే నూతన ఆందోళనారూపం తల ఎత్తింది. ఈ నూతన రూపం ప్రజానీకాన్ని విశేషంగా ఆకర్షించడంతో, ప్రభుత్వాధికారులు తొక్కిళ్ళు పడిపోయారు. ఈ నూతన ఆందోళనారూపమే లాలా లజపతిరాయ్, బాలగంగాధర తిలక్, బిపిన్ చంద్రపాల్ వంటి నూతన నాయకులకు ప్రజలలో విశేష పలుకుబడి నిచ్చింది. వారిలో తిలక్‌కు ఆరేళ్ళ శిక్ష విధింపబడింది. ఆయన ఆధునిక జాతీయోద్యమానికి ప్రథమ వీరుడుగా పరిగణన పొందాడు. ఈ శిక్ష పడడంతో దేశం అంతటా బెంగాల్ విభజనయెడ తీవ్ర వ్యతిరేకత బయలుదేరింది. స్వదేశీ ఉద్యమం ప్రారంభమయింది. దేశంయొక్క ఆర్థిక విముక్తికై ప్రారంభమైన మొదటి ఉద్యమం అదే. ఈ కొత్త సంచలనం ఫలితంగానే బెంగాల్, పంజాబ్, యు.పి. మొదలయినచోట్ల 'టెర్రరిస్టు' ఉద్యమం అని సాధారణంగా చెప్పబడే ఉద్యమం తల ఎత్తింది. నిజంచేత దాని కా పేరు సరియైనదికాదు. బెంగాల్‌లో అనుశీలన సమితి, యుగాంతర సంస్థ, పంజాబులో గదర్ పార్టీ దీనికి నాయకత్వం వహించాయి.

1906లో జరిగిన సూరత్ కాంగ్రెసులో కొత్త, పాత ధోరణుల మధ్య ముఖాముఖీ ఘర్షణ వచ్చింది. జాతీయ కాంగ్రెసు రెండుగా చీలిపోయింది. ఒక భాగాన్ని (అతివాదుల్ని) కాంగ్రెసులోనుంచి బయటకు వెళ్ళగొట్టారు.

ఈ విభేదానికి గల కారణాలు శాశ్వతంగా అలాగే వుండిపోలేదు. మొదటి ప్రపంచయుద్ధంలో వలసదేశాలలో తీవ్రమైన సంచలనం ఏర్పడింది. ఆసియాలోని అనేక దేశాలలో జాతీయ స్వాతంత్ర్య పోరాటాలు తీవ్రమైనాయి. ఈ పరిస్థితులలో మితవాదులు కూడ సూరత్ కాంగ్రెసునాటి భావాలతోనే లేరు. మిత్రరాజ్య నాయకులు అన్ని దేశాల ప్రజలకూ స్వయంనిర్ణయాధికారం వుండాలని ప్రకటించడం, వలస దేశాల ప్రజలలోనూ, పరాధీనదేశాల ప్రజలలోనూ సామ్రాజ్య వ్యతిరేక భావాలు విజృంభించడంతో 'మితవాదుల'కీ, 'రాజభక్తుల'కీ కూడ ధైర్యం కలిగింది. పదేళ్ళ క్రితం అతివాదు లవలంబించిన పద్ధతుల నవలంబిస్తే తాము రాజకీయంగా బలపడగలమనే నమ్మకం వారికి కలిగింది.

పరిస్థితులలో వచ్చిన ఈ మార్పుతో రెండు పక్షాల వారిమధ్య సమాధానం ఏర్పడడానికి అవకాశం కలిగింది. విభేదాలు వచ్చిన సూరత్ కాంగ్రెసు తర్వాత పదేళ్ళకు లక్నో కాంగ్రెసులో (1916) ఉభయ పక్షాలవారూ ఏకమయ్యారు. అతివాదులకూ, మితవాదులకూ మధ్య సమాధానం కుదిరింది. రెండోవైపున కాంగ్రెసుకూ, ముస్లింలీగుకూ ఒప్పందం కుదిరింది. (కాంగ్రెసు ప్రతిపాదించిన రాజ్యాంగంలో ముస్లిములకు కొన్ని

హామీలిస్తూ 1916లో లక్నోలో ఒప్పందం జరిగింది.) ఈ రెండూ దేశమంతటా స్వరాజ్యం (హోమ్‌రూల్) కోసం సాగుతున్న ఉద్యమానికి బాగా ఊతం ఇచ్చాయి. అంతక్రితం రెండు హోమ్‌రూల్ లీగులను తిలక్ ఒకటీ, అనిబిసెంటమ్మ ఒకటీ వేర్వేరుగా నడుపుతుండేవారు. దేశ పరిపాలనా వ్యవస్థలో పెద్ద మార్పులను కోరుతూ దేశవ్యాప్తంగా ఒక మహోద్యమాన్ని నిర్మించేందుకు అవి ఈ ఒప్పందాలను ఉపయోగించుకొన్నాయి.

గాంధీజీ దక్షిణాఫ్రికాలో ఒక అసాధారణమైన ఉద్యమాన్ని నడిపేరు. ఆయన పనులన్నింటిలాగే ఇది కూడ అపహాస్యానికి లోనయింది; 'సెభాష'నిపించుకొంది. ఆ ఉద్యమానుభవాలతో ఆయన భారతదేశం తిరిగి వచ్చేనాటికి దేశంలోని బూర్జువావర్గం యావత్తూ జాతీయ రాజకీయ పోరాట రంగంలోకి ప్రవేశిస్తూంది. స్వరాజ్యం కావాలనే చిన్న నినాదంతో సమైక్య బూర్జువావర్గం దేశాన్నంతనూ సమీకరించడానికి ప్రయత్నిస్తూంది.

అతివాదులు, మితవాదులు, కాంగ్రెసువాదులు, ముస్లింలీగర్లు, తిలక్ హోమ్‌రూల్ లీగ్‌కు చెందినవారూ, అనిబిసెంటమ్మ హోమ్‌రూల్ లీగ్‌కు చెందినవారూ యావన్మంది రాజకీయవేత్తలూ బూర్జువావర్గమూ దక్షిణాఫ్రికాలో గాంధీజీ కాంట్రాక్టు కూలీలను సమీకరించిన విధానాన్నీ, వారి కోరికలలో కొన్నింటినైనా సాధించడాన్నీ ఎంతో హర్షించేరు. కాని వారు ఆయన తాత్వికాభిప్రాయాలనూ, వివిధ పోరాట పద్ధతులనూ ఒప్పుకోలేదు.

వేర్వేరు కోవలకు చెందిన బూర్జువా ప్రజాతంత్ర రాజకీయోద్యమాల వారందరికీ ఆధునిక బూర్జువావర్గ రాజకీయోద్యమమే ఒరవడి. ఆ తాత్వికాభిప్రాయాలే వారికి ఆచరణీయాలు. మితవాద, అతివాద రాజకీయాలంటే వారి దృష్టిలో బ్రిటన్‌లోని టోరీ, లిబరల్ రాజకీయాలవంటివేనని వారి భావం. కాని, గాంధీజీలో ఆధునిక బూర్జువావర్గపు తాత్వికాలోచనగాని, ఆర్థిక దృక్పథంగాని, సామాజిక విజ్ఞానంగాని, రాజకీయ దృష్టిగాని కనబడలేదు. ఆయనది క్రైస్తవ మతఛాయలతో కూడివున్న హిందూమతవాద ధోరణి. మతప్రసక్తిలేని రాజకీయాలు కావాలనేవారి ప్రధానాశయానికే ఆయన విరుద్ధంగా కనబడ్డాడు.

అతివాదులకూ – మితవాదులకూ, కాంగ్రెసుకూ – లీగ్‌కూ సమాధానం ఏ ఉద్దేశంతో కుదిర్చేరో ఆ ఆశయ సాధనకే ఒక బలీయమైన ప్రజా ఉద్యమాన్ని నడపగల నాయకుడుగా వారాయనను రెండు మూడేళ్ళలోపున అంగీకరించారు. గాంధియన్ విధానంలోని ప్రధానమైన లక్షణాలను, యుద్ధానంతర కాలంలో ఈ లక్షణాలను జాతీయ రాజకీయ జీవితానికి వర్తింపచేసిన పద్ధతినీ, 1916లో లక్నోలో ఐక్యత సాధించిన యావత్తు బూర్జువావర్గం యొక్క ప్రయోజనాల కది ఉపయోగించిన పద్ధతినీ అర్థం చేసుకొన్నవారికి ఇది ఆశ్చర్యమనిపించదు.



గాంధీజీ, ఆనాటి ఇతర నాయకులకూ మధ్య ఒక్క తేడా వుంది. ఆయన ప్రజలతో, వారి జీవితాలతో, సమస్యలతో, ఆశలు, ఆశయాలతో సంబంధం కలిగివుండేవాడు. రాజకీయాలంటే విద్వాంసులైన రాజకీయవేత్తల మధ్య జరిగే చర్చలుగా ఆయన స్వీకరించ లేదు. ప్రజల సమస్యలన్నింటితో సంబంధం పెట్టుకొనే నిస్వార్థ ప్రజాసేవకుల సొత్తుగా ఆయన దానిని భావించేరు. గాంధీవాదంలోని ఈ ప్రధాన లక్షణం దక్షిణాఫ్రికా పోరాటం లోనే కనబడింది. సాధారణ ప్రజల త్యాగ, నిస్వార్థతలు ఆయనను ఎంత ఉత్తేజపరిచాయో పైన వ్రాశాను.

సాధారణ ప్రజలతో సన్నిహిత సంబంధాలు పెట్టుకోవాలనే ప్రబలమైన వాంఛా, ప్రజా సమస్యలను, జీవిత పరిస్థితులను అర్థం చేసుకోవాలనే కోరికా తన రాజకీయ కార్యక్రమంలో నూతన పద్ధతులను పరిణతి పొందించడంలో గాంధీజీకి తోడ్పడ్డాయి. ఆయన పద్ధతులు 'అతివాదుల' పద్ధతులకూ, 'మితవాదుల' పద్ధతులకూ కూడ చాల భిన్నం. ఆయన తన పద్ధతిని ప్రథమ పర్యాయం భారతదేశంలో ఏలా ఆచరణలో పెట్టేరో టెండూల్కర్ వ్రాశారు :

> "జనవరి నెల మధ్యలో తన బంధువులను కలుసుకోడానికి గాంధీ రాజకోట, పోర్‌బందరు వెళ్ళాడు. ఆయన ఎప్పుడూ బీదప్రయాణీకునిలా దుస్తులు వేసుకొని మూడో తరగతి బండిలో ప్రయాణించేవాడు. పెద్ద కోటు, తెల్లని మఫ్లరు తీసేసి ఒక ధోవతి, చొక్కా, చౌకబారు కాశ్మీర్ టోపీ ధరించి ఆయన ప్రయాణం చేస్తున్నాడు.
>
> "మధ్యలో వాధ్వాన్ అనే స్టేషనులో దర్జీపని చేసుకుని బ్రతికే మోతీలాల్ అనే ఒక ప్రజాసేవకుడు గాంధీని కలుసుకొని వీరాంగాంలో వసూలు చేస్తున్న" సుంకాల మూలంగా రైలు ప్రయాణీకులకు కలుగుతున్న ఇబ్బందులను చెప్పాడు.
>
> గాంధీ ఉన్నట్లుండి 'నువ్వు జైలుకు పోవడానికి సిద్ధమేనా' అని అడిగేడు. 'మీరు నాయకత్వం వహిస్తే మేము జైలుకు పోవడానికి సిద్ధమే'నని మోతీలాల్ అన్నాడు." (సంపుటం 1, పుట 196).

వెంటనే వీరాంగాం సుంకాల విషయమై గాంధీజీ బొంబాయి ప్రభుత్వంతో ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపాడు. వెంటనే ఫలితం లేకపోయినా, తర్వాత కొన్నాళ్ళకి వైస్రాయిని కలుసు కొన్నప్పుడు ఈ సమస్య పరిష్కారం అయింది. వీరాంగాం సుంకాల వసూళ్ళను నిలిపేసేరు.

దీని తర్వాత మరొక సందర్భం వచ్చింది. దాంట్లో కూడ గాంధీజీ ఈ పద్ధతినే అనుసరించేరు. ఈమారు వ్యవహారం బీహారులోని చంపారన్ జిల్లాలో నీలిమందు తోటల యజమానులతో వచ్చింది. చంపారన్‌లో ఉద్యమం ప్రజా ఉద్యమంగా సాగింది.



వీరాంగాంలోకన్న ఉన్నతస్థాయికి పోయింది. కాని చంపారన్ సమస్య పోరాటంతోగాని పరిష్కారం కాలేదు. గాంధీజీ భారతదేశంలో నడిపిన మొదటి ప్రజాపోరాటం అదే.

చంపారన్ పోరాటానికి చాలా ప్రాముఖ్యత వుంది. అది యూరపియన్ తోటల యజమానులతో జరిపిన పోరాటం. రెండోది ప్రజల కోరికలపై అది జరిగింది. ఆనాటి మేధావుల్లో శ్రేష్ఠులనదగిన యువకులు కొందరు అందులో పాల్గొన్నారు. తర్వాత వారు గాంధీజీ శిష్యులుగా, అతి సన్నిహితులుగా పనిచేసేరు. రాజేంద్రప్రసాద్, మజరుల్‌హక్, జె.బి. కృప్లానీ మొదలైనవారంతా ఆ రోజుల్లో వచ్చినవారే. మూడోది : యూరపియన్ తోటల యజమానులూ, వారికి వత్తాసుగా నిలబడ్డ ప్రభుత్వాధికారులూ ఎంత బిగువు చూపినా ఆ ఉద్యమం విజయవంతంగా ముగిసింది. తర్వాత తర్వాత గాంధీజీ అనేకమార్లు నిర్వహించిన ఆ మాదిరి జాతీయ పోరాటాలకు అది ఒద్దిక అనవచ్చును. ఈ ఉద్యమంలో మధ్యతరగతికీ, పైతరగతికీ చెందిన స్వార్థరహితులైన వ్యక్తులు కొందరు సాధారణ ప్రజల మధ్య వారిలో ఒకరుగా నిలబడ్డారు. కొన్ని నిర్దిష్టమైన కోరికల కోసం ప్రభుత్వానికి వ్యతిరేకంగా వారిని నిలబడేటట్లు ఉత్తేజపరిచారు.

1918 ఫిబ్రవరి – మార్చి నెలలలో గాంధీజీ అహమ్మదాబాద్ బట్టల మిల్లు పనివారి సమ్మెలో కలగచేసుకొన్న పద్ధతి చాల ముఖ్యమైనదీ, కొత్తదీ కూడ. కార్మికులకూ, పెట్టుబడిదారులకూ మధ్య ఏర్పడిన తగవులో గాంధీజీ తన పోరాట పద్ధతిని ఉపయోగించడం ఇదే ఆరంభం. ఆ పోరాటాన్ని ఆయన నడిపిన పద్ధతి క్రమంగా 'గాంధేయ ట్రేడ్ యూనియన్ వ్యవస్థ'కు దారితీసింది. మన జాతీయోద్యమ పరిణామంలో శ్రామిక వర్గోద్యమం మీద బూర్జువా నాయకత్వం పరిణతిచెందడంలో దానికి ప్రత్యేక ప్రాముఖ్యత వుంది.

> "ఈ సమ్మెను విజయవంతంగా నడపడానికి గాంధీ ఒక కొత్త పద్ధతిని ప్రవేశపెట్టేడు. కొన్ని షరతులను పెట్టేడు : ఎన్నడూ హింసకు పూనుకోరాదు. దొంగకూలీలను బాధించకూడదు. ఇతరుల దానధర్మాలమీద ఆధారపడకూడదు. సమ్మె ఎంతకాలం సాగినా గట్టిగా నిలబడాలి. సమ్మెకాలంలో గౌరవప్రదమైన పని ఏదైనా చేసుకుని తిండి సంపాదించుకోవచ్చు... వారు (సమ్మెదారులు) వేల సంఖ్యలో సభలకు వచ్చేవారు. గాంధీ వారికి తమ ప్రతిజ్ఞలను మరువవద్దనీ, శాంతి, ఆత్మాభిమానం కాపాడుకోవాలనీ గుర్తుచేసేవాడు. కార్మికులు అనునిత్యమూ బజార్లవెంట 'ఏక్ తేక్' – 'ప్రతిజ్ఞ నిలబెట్టుకోండి' – అనే బానర్లతో ఊరేగుతుండేవారు.
>
> "పరిస్థితి విషమించసాగింది. ఒకరి ధర్మంమీద తిండి సంపాదించుకొనే హీన స్థితికి మిల్లు పనివారు పోవడానికి గాంధీ అంగీకరించలేదు. కాని వేలాది జనానికి పని

కల్పించడం అంత సులభం కాదు. మొదటి రెండు వారాలు కార్మికులు ఎంతో ధైర్యం, గుండె నిబ్బరం కనబరచారు. వేల సంఖ్యలో సభలు జరిపేవారు. కాని చివరకు వారు జారిపోతారేమో ననిపించింది. రౌడీ చర్యలకు దిగుతారేమోననీ, ఆ విధంగా వారి ఆశయం విఫలం అవుతుందేమోననీ గాంధీ భయపడసాగేడు. రోజువారీ సభలలో హాజరు క్రమంగా తగ్గుతూంది. వచ్చినవారిలో కూడ నిరుత్సాహం, నిరాశ తాండవించసాగాయి."

"ఈలోపున గాంధీ మధ్య మధ్య మిల్లు యజమానులను కలుసుకొంటున్నాడు. కార్మికులకు న్యాయం కలగచెయ్యమని అడుగుతున్నాడు. కాని వారు బిర్రబిగిసి 'మాకూ ఒక మర్యాద వుంది. కార్మికులకూ మాకూ సంబంధం బిడ్డల – తల్లిదండ్రుల సంబంధం. మా మధ్యన పైవారికి సంబంధం ఏమిటి? మధ్యవర్తిత్వం ఏమిటి?' – అంటున్నారు."

"గాంధీ చెప్పినట్లు – ఇరవైరోజులు గడిచేయి. ఆకలీ, మిల్లు యజమానుల దూతలూ తమ పని తాము చేస్తున్నారు. వారిని రక్షించగల దేవుడు లేడనీ, ప్రతిజ్ఞలనేవి బాధ్యత తప్పించుకొనేటందుకు బలహీనులవలంబించే ఉపాయాలనీ సైతాను చెవి నిల్లుకట్టుకొని పోరుతూంది."

"మార్చి 12వ తేదీన ఆనాటి కింకా గాంధీకి దారి దొరకనేలేదు. కార్మికుల సభలో ఒక ఆలోచన తట్టింది. 'మీ ప్రతిజ్ఞలు నిలబెట్టుకొనేటందుకు మనం ఇద్దరం కలిసే మాటాడుదాం' అన్నాడు. అప్రయత్నంగా ఆయననోట ఈ మాటలు వచ్చేసేయి. సమ్మె పరిష్కారం కావడమో, కార్మికులంతా మిల్లులు వదిలిపోవడమో జరిగేవరకూ సమ్మెదారులు నిలబడి సమ్మెను కొనసాగించకుంటే నేను తిండి ముట్టను."

"గాంధీ ఇల్లా అంటాడని సమ్మెదారులు అనుకోలేదు. వారంతా 'మీరు వద్దు. మేమే ఉపవాసం చేస్తాం. మీరు ఉపవాసం చేయడం మహా ఘోరం. మా పొరపాటు మన్నించండి. కొసకంటా మా ప్రతిజ్ఞ నిలబెట్టుకుంటాం' – అన్నారు." (సంపుటం 1, పుట 269–70 క్రింది గీతలు నావి.)

గాంధీజీ నిరశనవ్రతానికి పూనుకోవడం ఇదే ప్రథమం కాదు. పోరాటానికి ఉద్యుక్తులయిన ప్రజల ఉత్సాహాన్ని అణచడానికై నిరశనవ్రతం చేయడానికి మాత్రం ఇదే ప్రథమం. దీనిలో మరో ప్రత్యేకత కూడా వుంది. అన్నివర్గాల ప్రజలూ పాల్గొంటున్న ఉద్యమంలోగాక, కార్మికవర్గ పోరాటం సందర్భంలో ఈ నిరశనవ్రతం చేయడానికి ఒక ప్రాముఖ్యత వుంది. ఈ ప్రయోగంలో ఆయన పొందే విజయం ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న బూర్జువావర్గానికి అమూల్యమైన పాఠంగా ఉపకరిస్తుంది. ప్రజల్ని సమీకరించగల, తీవ్ర పోరాటాలకు వారు దిగకుండా వారించగల పోరాటపద్ధతి వాళ్ళ కళ్ళపడింది.

వీరాంగాం, చంపారన్, అహమ్మదాబాద్ పోరాటాలు పెద్ద ఎత్తున జరగవలసిన భావి పోరాటాలకు నమూనాలూ, ఒద్దికలూ అనవచ్చును. ఈ పోరాటాలు మూడూ ప్రజలలో ఒక్కొక్క తరగతికి చెందినవారి ఒకటో రెండో పాక్షిక కోరికల కోసం నడిపినవే. రెండోవైపున ప్రజానీకం యావత్తూ వాంఛిస్తున్న 'స్వరాజ్య' వాంఛ లక్నోలో అతివాద మితవాద కాంగ్రెసువాదుల్నేగాక కాంగ్రెసునీ, ముస్లింలీగ్‌నీ కూడ ఏకం చేసింది. జాతీయ వాంఛను సాధించేటందుకు కూడా గాంధీజీ తన ప్రత్యేక పద్ధతిని అనుసరించవలసి వచ్చింది.

"గ్రామానికి ఇరవైమంది చొప్పున సైన్యంలో చేరాలి" అనే నినాదంతో గుజరాత్‌లోని ఖేదా జిల్లాలో ఒక పెద్ద ఉద్యమం ప్రారంభించడంతో ఈ ప్రత్యేక పోరాట పద్ధతి మొదలయింది. ఆ రోజుల్లో ఇంగ్లీషువాళ్ళు యుద్ధం కొనసాగించాలంటే లక్షలకొద్దిమంది భారత యువకులు సైనికులుగా చేరవలసిన ఆవశ్యకత ఏర్పడింది. ఆ విషయం పాఠకులకు తెలుసు. వైస్రాయి ఢిల్లీలో ఒక సమావేశం జరిపాడు. దానికి గాంధీజీని ఇతరులతోపాటు ఆహ్వానించేడు. సైనికుల్ని రిక్రూట్ చేయాలనే తీర్మానాన్ని బలపరుస్తూ అక్కడ గాంధీజీ మాట్లాడేరు. హిందూస్థానీ భాషలో ప్రచారోపన్యాసాలు ఇవ్వనీయాలనేది ఒక్కటే ఆయన పెట్టిన షరతు. దానిని వైస్రాయి తక్షణం ఒప్పేసుకొన్నాడు.

సైనికులను రిక్రూట్ చేసే సమస్యమీద గాంధీజీ మంచి తెలివైన బూర్జువా రాజకీయవేత్తలాగ వ్యవహరించాడు. 'దౌర్జన్య రాహిత్యం గురించి' నైతిక పాఠాలు చెపుతున్నా, సామ్రాజ్యవాద యుద్ధంలో యువకుల్ని తుపాకిమేతగా రిక్రూట్ చేయడానికి ఆయన కేమాత్రం సంకోచం కలగలేదు. దీనికి ఆయన కోరిన ప్రతిఫలమల్లా 'స్వరాజ్యం'. స్వరాజ్యం కోసం నడిపే ఉద్యమంలో రిక్రూట్‌మెంటు ఒక భాగమని ఆయన సమర్థించుకొన్నాడు.

> "సామ్రాజ్య రక్షణకై జరుగుతున్న యుద్ధంలో పాల్గొనడమే స్వరాజ్య సంపాదనకు సులభమైన మార్గం. సామ్రాజ్యం నశిస్తే, దానితోపాటు మన ఆశలూ అంతరిస్తాయి. మన హక్కుల్ని ఈవేళే సాధించుకోకుంటే తర్వాత మోసం చేస్తారని కొందరంటున్నారు. సామ్రాజ్య రక్షణకై మనం కూర్చుకొన్న శక్తే, తర్వాత మన హక్కుల్ని సంపాదించిపెడుతుంది." (సం. 1, పుట 280)

గాంధీజీ, తదితర రాజకీయవేత్తలూ పెట్టుకొన్న ఆశలు ఫలించలేదు. స్వరాజ్యం ఇవ్వడానికి బదులు బ్రిటిష్‌వాళ్ళు జాతీయోద్యమం మీద కొత్త దాడులు ప్రారంభించారు. జాతీయోద్యమం యొక్క ఆశయాలకూ, కోరికలకూ మాంటేగూ ఛేమ్స్‌ఫర్డ్ సంస్కరణలు సున్న చుట్టాయి. ఆ సంస్కరణలకు మితవాదులలో మితవాదులు కూడా సంతృప్తిచెందలేదు. దానికితోడు విదేశీ ప్రభుత్వం రౌలట్ బిల్లులను తెచ్చి తనను వ్యతిరేకించేవారందరినీ



నేల రాసెయ్యడానికి ఏర్పాట్లు చేసుకొంది. మాంటెగూ–ఛెమ్స్‌ఫర్డ్ సంస్కరణలకూ, రౌలట్ బిల్లులకూ ప్రజలలో తీవ్ర వ్యతిరేకత చెలరేగింది.

ఈ పరిస్థితులలో గాంధీజీ తన ప్రక్రియను ఉపయోగించి అహింసాత్మక పరిధిలో ప్రజలను రాజకీయ పోరాటంలోకి తీసుకురావడానికి ఉద్యమించాడు. క్రమక్రమంగా ఎక్కువమంది ప్రజలు తన భావాలకు అంగీకారం వెలిబుచ్చుతున్నా పెద్ద పెద్ద కాంగ్రెసు నాయకులే చాలమంది వ్యతిరేకిస్తారని ఆయన ఎరుగును. అందుచేతనే ఆయన కాంగ్రెసు పేరిట కాకుండా వేరుగా తన బలగాన్ని కూర్చుకున్నాడు.

రౌలట్ బిల్లుల్ని గజెట్‌లో ప్రకటించగానే గాంధీజీ తన సత్యాగ్రహాశ్రమంలో ఒక సమావేశాన్నేర్పాటు చేశాడు. అందులో సత్యాగ్రహ ప్రతిజ్ఞను తయారుచేశారు. వల్లభాయ్ పటేల్, సరోజినీ నాయుడు, బి.జి. హార్నిమన్, ఉమర్ సోబానీ, శంకర్‌లాల్ బాంకర్, అనసూయాబెన్‌లు దానిమీద సంతకాలు పెట్టారు. “ఈ బిల్లులు గనక చట్టాలు చేయబడితే వానిని ఉపసంహరించుకొనేవరకూ వీటికి కట్టుబడి ఉండడానికి సహాయం నిరాకరిస్తాము. ఇక మనం ఏర్పరచబోయే కమిటీ సహాయ నిరాకరణ చేయదగినవిగా నిర్ణయించే ఇతర చట్టాలకు కూడా సహాయం నిరాకరిస్తాము...” అని సంతకాలు పెట్టినవారు ప్రతిజ్ఞలు తీసుకొన్నారు. “ఈ పోరాటంలో విశ్వాసం ఉంచి సత్యానికే కట్టుబడి ఉంటామనీ, ప్రాణ, విత్తాలకు ఏ విధమైన నష్టమూ కలిగించమ”నీ వారు ప్రతిజ్ఞ తీసుకొన్నారు.

గాంధీజీ బొంబాయిలో సత్యాగ్రహ సభను స్థాపించేరు. ఆ సభవారు సత్యాగ్రహ ప్రతిజ్ఞమీద సంతకాలను సేకరించ పూనుకున్నారు. ఒక్క పదిహేను రోజుల్లో రమారమి 1200 మంది ఆ సభలో చేరారు. 1919 మార్చి నెలలో ఆ సభ తరఫున ఒక ప్రకటన వెలువడింది. దానిలో ఇలా చెప్పబడింది :

> “సత్యాగ్రహ ప్రమాణాన్ని దృష్టిలో పెట్టుకొని కమిటీ సమాలోచన చేసిన మీదట ప్రస్తుత నిషిద్ధ వాఙ్మయానికి సంబంధించిన చట్టాన్నీ, పత్రికల నమోదుకు సంబంధించిన చట్టాన్నీ శాంతియుతంగా ఉల్లంఘించాలని సలహా ఇస్తుంది.”

కమిటీ నిషిద్ధ వాఙ్మయంలోంచి “హింద్ స్వరాజ్”, “సర్వోదయ”, “సత్యాగ్రహి కథ” మొదలయిన పుస్తకాలను కొన్నిటిని పేర్కొని వాటిని చదవమంది.

రౌలట్ బిల్లులను ప్రతిఘటించే కార్యక్రమంలో గాంధీజీ దేశవ్యాపిత హర్తాళ్‌ను సూచించాడు.

> “సత్యాగ్రహం అనేది పారిశుద్ధ క్రమంలో ఒక భాగం. మనదొక పవిత్రమైన పోరాటం. ఆ పవిత్రతకు తగినట్లుగా మనం ఆత్మపరిశోధన కార్యంతో దానిని ప్రారంభిస్తే బాగుంటుంది. ఆనాడు భారతదేశంలోని ప్రతినిధులందరూ తమ పనులన్నీ కట్టిపెట్టి,



ఉపవసించి, ప్రార్థనలతో గడపాలి. ముసల్మానులు ఒక రోజుకన్న ఎక్కువ కాలం ఉపవాసం ఉండలేక పోవచ్చును. అందుచేత ఉపవాస వ్యవధి 24 గంటలే వుండాలి. ఈ మన విజ్ఞప్తిని అన్ని రాష్ట్రాలూ పాటిస్తాయో లేదో చెప్పడం కష్టం. కాని బొంబాయి, మద్రాసు, బీహార్, సింధు రాష్ట్రాలు కూడా పిలుపు నందుకుంటాయనే నమ్మకం నాకు గట్టిగా వుంది. ఈ ప్రదేశాలన్నీ తగు విధంగా హర్తాళ్‌ను ఆచరిస్తే చాలును." (అదే పుస్తకం, పుట 297)

1919 ఏప్రిల్ 6న హర్తాళ్ జరగాలని నిశ్చయింపబడింది. రౌలట్ బిల్లులకు వ్యతిరేకంగా దేశం ఆ మూలనుంచి ఈ మూలకు మహోద్యమం ప్రారంభమయింది. అమృతసర్‌లో ప్రజల ఉత్సాహమూ, ఉద్యోగుల దుర్మార్గము కూడ పరాకాష్టకు పోయాయి. సర్ మైకేల్ ఓ డయ్యర్ కసాయి పాలనలో జనరల్ డయ్యర్ మహా ఘాతుకాలు జరిపింది అక్కడే. ఏప్రిల్ 6న ప్రదర్శనలతో ప్రారంభమై అనేక ఘటనలు వరసగా కొనసాగి జలియన్ వాలాబాగ్ హత్యలతో  పర్యవసితం అయ్యాయి.

ఖిలాఫత్ ఆందోళన గాంధీజీకీ, ఆయన సహాయ నిరాకరణోద్యమానికీ ఎంతో పుష్టినిచ్చింది. ఏమంటే ఖిలాఫత్ సమస్యను మత సమస్యగానూ, రాజకీయ సమస్యగానూ భావించే ముస్లిం మతస్థులంతా దీనితో సత్యాగ్రహులుగా తయారయ్యారు. గాంధీజీ బహు తెలివిగా బ్రిటిష్‌వాళ్ళ వలన జరిగిన అపరాధాలలో దానిని కూడా చేర్చాడు.

1920 మార్చి 10వ తేదీన ఆయన ఒక ప్రకటన చేశాడు. దానిలో ఇల్లా వుంది: "ఖిలాఫత్ నేడొక ప్రధాన సమస్య అయింది... ఇప్పు డీ కోర్కెలను ఆమోదించకపోతే ఏం చెయ్యవచ్చునో ఒక్కమాట చెప్తాను. రహస్యంగా సాగించినా, బహిరంగంగా జరిపించినా యుద్ధం వట్టి అనాగరిక ప్రక్రియ; ఆచరణయోగ్యమైంది కాదు. అందు చేతనైనా, దానిని వదిలెయ్యవలసిందే. ఏ పరిస్థితులలోనూ అది మంచిది కాదనే విషయాన్ని ప్రతివాళ్ళూ అంగీకరించేటట్లు చేయగలుగుతే, న్యాయంగా మనకు రావలసినదానిని చాల వేగంగా పొందగలుగుతాం. దౌర్జన్యాన్ని విడిచి పెట్టటానికి ప్రతిజ్ఞ చేసిన దేశంగానీ, వ్యక్తిగానీ అప్రతిహతమైన శక్తిని చూపగలుగుతాడు." (సం. 1, పుట 345)

ప్రజలలో పెద్ద తిరుగుబాటు తేవాలనే ఆదుర్దాతోనే ముస్లింలు పని చేస్తున్నారు గాని, వారికి దౌర్జన్యరహిత పద్ధతులమీద విశ్వాసం వుండి కాదని గాంధీజీ ఎరుగును. అందుచేత వారు దౌర్జన్యరహిత పంథా ననుసరించి తీరాలని పట్టుపట్టలేదు.

"కొరాన్ చెప్పిన విధులు కొన్ని ప్రత్యేకంగా ముస్లిముల కున్నాయి. వానిలో హిందువులు కలిస్తే కలియవచ్చు, లేకపోతే లేదు. అందుచేత సహాయ నిరాకరణ, దౌర్జన్య రాహిత్యోద్యమం విఫలం అయితే, న్యాయాన్ని అమలుజరిపేటందుకు ఇస్లాము మత

గ్రంథాలలో చెప్పిన ఇతర పద్ధతులన్నింటినీ అనుసరించవచ్చును." (సం. 1, పుట 346)

ఈ విధంగా కొంతమంది సత్యాగ్రహులను గాంధీజీ సమకూర్చుకోగలిగేడు. ఆ రోజుల్లో ప్రజల మనస్సులను కలతపెడుతున్న రౌలట్ బిల్లులు, పంజాబు దౌర్జన్యాల వంటి సజీవ రాజకీయ సమస్యలమీద ఆయన విజయవంతంగా ఆందోళన చేయగలిగాడు; ఖిలాఫత్ సమస్యమీద ముస్లిం మతస్థులను కలుపుకోగలిగాడు. ఈ పరిస్థితులన్నీ సమకూడడంచేతనే గాంధీజీ తనంత తానుగా 1920 ఆగస్టు 1వ తేదీన సహాయ నిరాకరణోద్యమానికి పిలుపునివ్వగలిగాడు. కాంగ్రెసు నిర్ణయం వచ్చేవరకూ వేచివుండ వలసిందని మాలవ్యా పండితుడు మొదలయినవారు చెప్పినప్పుడు ఆయన ఇల్లా సమాధానం ఇచ్చారు :

"కాంగ్రెసుయెడ నాకున్న భక్తి విశ్వాసాలను బట్టి దానియొక్క విధానం నా అంతరాత్మకు వ్యతిరేకంగా వుండకపోతే దానిని అమలుజరపవలసి వుంటుంది. కాంగ్రెసులో నా అభిప్రాయాన్ని అధిక సంఖ్యాకులు ఆమోదించకపోతే నేను కాంగ్రెసు పేరున నా విధానాన్ని అమలుజరపకపోవచ్చు. ఏదన్నా ఒక విషయంమీద కాంగ్రెసు ఒక నిర్ణయాన్ని చేస్తే, అంతమాత్రంచేత కాంగ్రెసువాది ఎవ్వరూ దానికి విరుద్ధమైన కార్యాచరణకు పూనుకోరాదని లేదు. అలా చేసినప్పుడు ఆ పనివల్ల కలిగే మంచిచెడ్డలకు ఆతడే బాధ్యుడవుతాడు. కాంగ్రెసు తన అభిప్రాయాలతో ఏకీభవించడంలేదనే తెలివిడితోనే అతడు పనిచేస్తాడు. "ప్రతి కాంగ్రెసువాదికీ, ప్రతి ప్రజాసంస్థకూ తన సొంత అభిప్రాయాన్ని ప్రకటించేటందుకు, దాని ప్రకారం పనిచేసేటందుకు హక్కు వుంది. ఒక్కొక్కప్పుడది వారి ధర్మం కూడా. ఆ విధంగా వారు కాంగ్రెసు యొక్క తీర్పులను ముందే ఊహించగలగాలి. దేశ సేవకు అదే ఉత్తమమైన విధానం." (సం. 2, పుట 3)

గాంధీజీ మౌలానా షౌకత్ ఆలీ మొదలయినవారితో కలిసి విస్తారంగా సంచారం చేశాడు. రౌలట్ బిల్లుకు, పంజాబు దురంతాలకు వ్యతిరేకంగానూ ఖిలాఫత్ కొరకూ ప్రజానీకంలో తీవ్ర ప్రచారం చేశాడు. 1920 సెప్టెంబరు 4-9 తేదీల మధ్య కలకత్తాలో జరిగిన కాంగ్రెసు ప్రత్యేక మహాసభలో దీని ఫలితం కనబడింది. గాంధీజీ చొరవ మూలంగా క్రమంగా దౌర్జన్యరహిత సహాయ నిరాకరణోద్యమాన్ని తీవ్రపరచేందుకు కాంగ్రెసు తీర్మానించింది. ఆ తీర్మానంలోని కార్య విధానభాగం ఇలా వుంది :

"పైన చెప్పిన అన్యాయాలు సవరించబడి స్వరాజ్యం ఏర్పడేవరకూ దౌర్జన్యరహిత నిరాకరణోద్యమాన్ని తీవ్రంచేసే కార్యవిధానాన్ని అంగీకరించడం తప్ప భారత ప్రజలకు మరోదారి లేదని కాంగ్రెసు అభిప్రాయపడుతూంది.

ఇంతవరకు ప్రజాభిప్రాయాన్ని ప్రతిబింబిస్తూ దానిని రూపొందించుతున్న వర్గాలు దీనిని ప్రారంభించాలి; ఈ ప్రభుత్వం బిరుదులివ్వడం ద్వారాను, పాఠశాలలను నిర్వహించడం ద్వారాను, న్యాయస్థానాలను లెజిస్లేటివ్ కౌన్సిళ్ళను నిర్మించడం ద్వారాను తన పెత్తనాన్ని పటిష్ఠమొనర్చుకొంటూండడంవల్ల; ప్రస్తుతం ఉద్యమం ఉన్న పరిస్థితినిబట్టి సాధ్యమైనంత తక్కువ బాధలు అనుభవించడం మంచిదని భావిస్తూండడంవల్ల, ఈ ఉద్యమ లక్ష్యాన్ని సాధించగలిగే విధంగా సాధ్యమైనంత తక్కువ త్యాగం చేయమని పిలుపు ఇవ్వడం మంచిదని భావిస్తూండడంవల్ల ఈ క్రింది కార్యక్రమాన్ని అమలుజరపమని కాంగ్రెసు హృదయపూర్వకంగా సలహా యిస్తోంది :

1. బిరుదులను త్యజించాలి. ఆనరరీ ఉద్యోగాల్నీ, స్థానిక సంస్థలలో నామినేట్ చేయబడిన స్థానాల్నీ విడిచిపెట్టాలి;
2. ప్రభుత్వోద్యోగులను సన్మానించడంకోసం జరిపేవైనా, ప్రభుత్వోద్యోగులే ఇచ్చేవైనా అధికార యుతమైనవీ, తత్తుల్యమైనవీ అయిన సమావేశాలకు, దర్బార్లకు హాజరుకా నిరాకరించాలి;
3. వివిధ రాష్ట్రాలలో క్రమక్రమంగా స్కూళ్ళ, కాలేజీల నుంచి విద్యార్థుల్ని మానిపించెయ్యాలి;
4. లాయర్లూ, ఇతర వ్యవహర్తలూ బ్రిటిష్ కోర్టుల్ని బహిష్కరించాలి. ప్రజల మధ్య తగాయిదాలను పరిష్కరించేటందుకు వారు మధ్యవర్తి పరిష్కార కోర్టులను స్థాపించాలి;
5. సైనికులు, గుమాస్తాలు, పనివారు మెసపొటేమియాలో పనికి రిక్రూట్ కావడానికి నిరాకరించాలి;
6. సంస్కరణల సభలకు (నూతన సంస్కరణల ప్రకారం ఏర్పడు శాసనసభలు నిలబడుతున్న వారు తమ అభ్యర్థిత్వాల్ని ఉపసంహరించుకోవాలి. కాంగ్రెసు సలహాను కాదని ఎన్నికలలో నిలబడేవారికి ఓటర్లు ఓట్లు ఇవ్వనిరాకరించాలి.
7. విదేశీ వస్తువుల్ని బహిష్కరించాలి.” (సం. 2, పుట 12–13)

ఈ తీర్మానాన్ని పరిశీలిస్తే గాంధీజీ తలపెట్టిన కార్యక్రమం యొక్క ప్రధాన వర్గ స్వభావం, రాజకీయ స్వభావం అర్థం అవుతుంది. “ఇంతవరకూ ప్రజాభిప్రాయాన్ని ప్రతిబింబిస్తూ దాన్ని తీర్చిదిద్దుతున్న వర్గాలు” – అంటే బూర్జువా, పెటీ బూర్జువావర్గాలు ఈ సహాయ నిరాకరణోద్యమాన్ని ప్రారంభించాలని దీనిలో స్పష్టంగా చెప్పబడింది. ఇక ఈ కార్యక్రమంలోని అంశాలు ఉద్యోగవర్గాన్ని చికాకు పరచవచ్చు. చికాకు పుట్టించవచ్చు. వాళ్ళని ఇరుకులో పెట్టవచ్చును. ఇబ్బంది కలిగించవచ్చును. కాని సామ్రాజ్యవాద పాలన యొక్క ముఖ్యమైన పునాదుల్ని కొంచెం కూడా అవి కదల్చవు. పరిశ్రమలలో పనిచేసే కార్మికుల్ని జనరల్ సమ్మె చేయమనిగాని, పన్నుల నిరాకరణ భూముల స్వాధీనం లాంటి పోరాటాలు చేయమని రైతుల్ని గాని అలాంటి ఉత్తేజకరమైన ప్రజాపోరాటాలు జరపమని

ఈ కార్యక్రమంలో కోరలేదు. ఆ మాదిరి పోరాటాలవలన భారతీయ పెట్టుబడిదారులకూ, భూస్వాములకూ దెబ్బ తగులుతుంది. విదేశ పాలకుల ఆర్థిక, రాజకీయ పునాదులు కదిలిపోతాయి. 'సైనికులు, గుమాస్తాలూ, పనివారూ' పనిచేయ నిరాకరించడం 'మెసపొటేమియా' వరకే. దీనినిబట్టి దౌర్జన్యరహిత సహాయ నిరాకరణోద్యమం సామ్రాజ్యవాద ప్రభుత్వపు పునాదులమీద దెబ్బతీయడానికిగాక, ప్రభుత్వం కాంగ్రెసుతో రాజీకి వచ్చేటందు కవసరమైనంత ఒత్తిడి తీసుకురావడానికే ఉద్దేశించబడిందని స్పష్టమవుతుంది.

పారిశ్రామిక కార్మికుల సమ్మెను రాజకీయ పోరాటంగా ఉపయోగించాలనే అభిప్రాయం గురించి గాంధీజీ 1919 ఏప్రిల్ 18న చెప్పిన మాటలను ఈ సందర్భంలో జ్ఞాపకం చేసుకోవడం ఉపయోగకరం :

> "దక్షిణాఫ్రికాలో సత్యాగ్రహ పోరాటం జరుగుతున్నప్పుడు, వేలకొద్దీ భారతీయ కూలీలు పనులు మానేశారు. అదొక సత్యాగ్రహ సమ్మె. కనక కేవలం ఐచ్ఛికమూ, శాంతియుత మూను. ఈ సమ్మె జరుగుతున్నప్పుడు యూరపియన్ గని కార్మికులు, రైల్వే పనివారు మొదలయినవారు కూడ సమ్మె ప్రకటించారు. యూరోపియన్ సమ్మెదారులతో సహయోద్ధత్వం నెరపవలసిందిగా నావద్దకు రాయబారం వచ్చారు. నేను సత్యాగ్రహిని. కనక ఆ విధంగా చేయనని చెప్పేశాను. దానికో ఆలోచన కూడా అక్కర్లేదు. అంతేకాదు, యూరోపియన్ల సమ్మెలో దౌర్జన్య చర్యలు, ఆయుధ ప్రయోగాలు ప్రాముఖ్యం వహిస్తున్నాయి. వాళ్ళ సమ్మెతోనే మా సమ్మెను కూడా జమకట్టేస్తారనే భయంతో మా సమ్మెకు తాత్కాలికంగా నిలుపుదల చేశాను. అప్పటి నుంచీ దక్షిణాఫ్రికాలోని యూరోపియన్లు సత్యాగ్రహాన్ని గౌరవనీయమైన, యోగ్యమైన ఉద్యమంగా భావించసాగారు. జనరల్ స్మట్సు దాన్ని "చట్టబద్ధమైన ఉద్యమం" అన్నాడు. ఈ క్లిష్ట సమయంలో కూడ నే చేయగలది అంతే. నా చర్యను దేనినైనాసరే దౌర్జన్య చర్యలను సాగించేటందుకు అనువుగా ఉపయోగించు కోనిస్తే నేను సత్యాగ్రహానికే ద్రోహం చేసినవాడి నవుతాను..." (సం. 1, పుట 317, క్రింది గీతలు నావి)

శ్రామికవర్గం రాజకీయ ప్రయోజనాలకై జనరల్ సమ్మెచేసి రాజకీయ పోరాటంలోకి వస్తే, ఉద్యమం తాము పెట్టిన హద్దులలో ఉండదని బూర్జువా వర్గానికి సహజంగా వుండే భయం తప్ప, దౌర్జన్యం అంటే కనబరచే వెలపరానికి మరో కారణం లేదు. సామ్రాజ్యవాదుల దురంతపు యుద్ధాలలో మారణహోమం కావడానికై "ఒక్కొక్క గ్రామం నుంచి ఇరవైమంది" తయారు కావాలని పిలుపిచ్చిన గాంధీజీ, సాధారణ ప్రజలు, కార్మికులు, కర్షకులు సంఘటిత రాజకీయ శక్తిగా రంగంలోకి వచ్చినప్పుడు ఏవో కొన్ని

దౌర్జన్య ఘటనలు జరిగాయంటూ అదిరి పోవడానికి అదే కారణం.

మధ్యతరగతి రైతులూ, బీద రైతులూ, భూమిలేని పేదలూ కోరే కోరికలను – విపరీతమైన వడ్డీలకు ఇచ్చిన అప్పుల్ని రద్దుచేయాలనీ, మక్తాలు బాగా తగ్గించాలనీ, భూస్వాముల భూముల్ని రైతులకు పంచాలనీ మొదలయిన వానిని – తన కార్యక్రమంలో చేర్చడానికి ఆయన పొడుగునా నిరాకరిస్తూనే వచ్చారు. దానికి కూడా కారణం అదే. 1921 డిసెంబరులో నాగపూరు కాంగ్రెసు చేసిన తీర్మానంలోని అంశమే ఆయన ఈ విషయంలో వెళ్ళగల హద్దూ, వెళ్ళిన పరిమితీను :

> "దౌర్జన్య రహిత సహాయ నిరాకరణ తీర్మానాన్ని కాంగ్రెసు పునరుద్ఘాటిస్తూంది. ప్రభుత్వంతో బుద్ధిపూర్వకంగా సహకరించడం నుంచి పన్నులు ఇవ్వడానికి నిరాకరించడం వరకూ దౌర్జన్య రహిత సహాయ నిరాకరణ పథకాన్ని మొత్తంగా గాని, కొంత భాగాన్ని కాని భారత జాతీయ కాంగ్రెసో, అఖిల భారత జాతీయ కాంగ్రెసు కమిటీయో నిర్ణయం చేసిన ప్రకారం అమలుజరపబడుతుంది." (సం. 2, పుట 35–6)

ప్రభుత్వానికి పన్నులు ఇవ్వడానికి నిరాకరించడం – అంతవరకూ మాత్రం గాంధీజీ తన పథకంలోకి చేర్చుకోడానికి సిద్ధంగా వున్నాడు. అంతవరకు పెద్ద రైతులు – భూస్వాములు కూడా ఆయనవెంట ఉండగలుగుతారు.

కాని, ఆ రోజుల్లో సాధారణ ప్రజ తమ కార్యసరళికి నిషేధాల నంగీకరించే స్థితిలోలేరు. దౌర్జన్యరహితంగా వుండాలనే షరతు వున్నా, తిరుగుబాటుకు పిలుపు ఇవ్వడంతో రైతులు, చేతిపనులవారు, కార్మికులు తదితరులు ఎక్కడికక్కడే పీడనకు వ్యతిరేకంగా తిరుగుబాట్లు ప్రారంభించారు. పారిశ్రామిక కార్మికులూ, తోటల కూలీలూ సమ్మెలు చేశారు. రైతులలోకూడ చాల తీవ్రమైన అసంతృప్తి బయల్పడ నారంభించింది. ఇవన్నీ గాంధీజీ కూడదనుకొన్న అనేక సంఘటనలకు కారణం అయేయి; వానిని టెండూల్కర్ ఈ విధంగా వర్ణించాడు :

> "కాంగ్రెసు కార్యక్రమాన్ని అమలుజరుపుతున్న చాలమంది కొత్త కార్యకర్తలు ఒక విధమైన మైకంలో వున్నట్లు పని చేశారు. భయం, నిరుత్సాహం, దిగ్భ్రాంతి పూర్తిగా అదృశ్యమైనాయి. మారుమూల గ్రామాలలో కూడ ప్రజలు కాంగ్రెసును గురించీ, ఖిలాఫతును గురించీ, పంజాబు ఘటనలను గురించీ మాట్లాడుకొంటున్నారు. పల్లెప్రాంతాలలో చాలచోట్ల "ఖిలాఫత్" అనే మాటకు విపరీతమైన అర్థాలు చెప్తున్నారు. "ఖిలాఫ్" అనే ఉర్దూ మాట నుంచి అది వచ్చిందని (ఖిలాఫ్ అంటే వ్యతిరేకత అని అర్థం) ప్రజలు అభిప్రాయపడ్డారు. అందుచేత దానిని 'ప్రభుత్వాన్ని వ్యతిరేకించండి'గా అర్థంచేసుకొన్నారు. జాతీయత, మతం, మిస్టిసిజం ఇవన్నీ కలగాపులగంగా తయారయాయి."

మూడు దశాబ్దాలపాటు సత్యాగ్రహోద్యమానికి నాయకత్వం వహించిన గాంధీజీ ఆ పరిస్థితులకు ఉత్సాహపడలేదు. 'సైతాను ప్రభుత్వం'తో సహాయ నిరాకరణ చేయమంటూ తా నిచ్చిన పిలుపును ప్రజలు ఉత్సాహంతో స్వీకరించినందుకు సంతోషించడానికి బదులు ఆయన ఆందోళన ప్రకటించాడు. "ప్రజానీకం సహాయ నిరాకరణలో పాల్గొనాలంటే దౌర్జన్యరహితమైన, సత్యపూరితమైన వాతావరణం వుండాలి" అన్నాడు.

రౌలట్ చట్టాలకు వ్యతిరేకంగా ఆందోళన జరుగుతున్నప్పుడే ఆయన ఈ క్రింది మాటల్లో ఆందోళన వ్యక్తీకరించాడు :

"నేను వెనుకంజ వేశాను. హిమాలయ పర్వతమంత పొరపాటు చేశాననుకొన్నాను. భగవానుడికీ, మానవుడికీ క్షమార్పణ చెప్పుకున్నాను. ప్రజానీకం జరుపుతున్న సహాయ నిరాకరణాన్నే కాదు, నేను చేస్తున్న సహాయ నిరాకరణను కూడా నిలిపేశాను."

1922లో చౌరీ-చౌరా ఘటన (యు.పి.లోని చౌరీ-చౌరా గ్రామంలో పోలీసులు ప్రజలపై జరిపిన హింసాకాండకు ప్రతీకారంగా ప్రజలు పోలీసుస్టేషన్‌లోని 22 మంది పోలీసుల్ని చంపివేశారు.) జరిగినాక - దాని నాయన "మహావమానం" అనుకొన్నాడు. తాను తయ్యారీలుచేసి ప్రారంభించిన విస్తృత సహాయ నిరాకరణోద్యమం తన చేతుల్లో వుండదని గ్రహించాడు. ఇక సహాయ నిరాకరణోద్యమాన్ని నిలిపివేయడానికై నిర్ధారణ చేసుకొన్నాడు.

చౌరీ-చౌరా ఒక్కటే కాదు, దానికి ముందు మలబారులో తిరుగుబాటు వచ్చింది. దానినే మోప్లా తిరుగుబాటు అంటారు. బ్రిటిష్ ప్రభుత్వంతో సహాయ నిరాకరణ చేయమంటూ గాంధీజీ ఇచ్చిన పిలుపుతోపాటు రైతుల భూస్వామ్య వ్యతిరేక వాంఛలు కూడా జతపరచబడ్డాయి. ఫలితంగా మలబారులోని పీడిత రైతాంగం వేల సంఖ్యలో తిరుగుబాటు చేసింది. దేశంలోని ఇతర ప్రాంతాలలో కూడా గాంధీజీ ఆదేశాన్ననుసరించి వేలకొలది యువకులు స్కూళ్ళు, కాలేజీలు, కోర్టులు మూసేశారు. సహాయ నిరాకరణ సందేశాన్ని వ్యాపింపచేయ బూనుకున్నారు. వారు రైతాంగం వద్దకు వెళ్ళి శిస్తులు తగ్గాలనీ, విపరీతంగా వున్న పన్నుల భారం తగ్గాలనీ వారి వాంఛలకు వాగ్రూపం ఇచ్చారు. "ప్రజాభిప్రాయాన్ని ప్రతిబింబిస్తూ దాన్ని తీర్చిదిద్దుతున్న వర్గాలు ప్రారంభించవలసిన" ఆ ఉద్యమం ఆ వర్గాలు గీసిన హద్దుల్ని దాటిపోయి, నిజమైన జాతీయోద్యమంగా పరిణతి పొందుతూంది.

అంతేకాదు, రైతువర్గం ఒకమారు ఉద్యమంలోకి వచ్చాక తన నిర్మాణ పోరాట రూపాల్ని తానే నిర్ణయించుకొంటుంది. మలబారు తిరుగుబాటులో ఇది చాల స్పష్టంగా కనిపించింది. భూస్వాముల రికార్డులు తగులబెట్టడం, రిజిస్ట్రారు ఆఫీసులను తగులబెట్టడం,



ప్రభుత్వ కార్యాలయాల మీద దాడి చేయడం, పోలీసుల తుపాకులు లాక్కోవడం, ప్రజాకోర్టులు ప్రారంభించడం, ప్రభుత్వ ఖజానాలలోని ధనాన్నీ భూస్వాముల గాదెల్లోని ధాన్యాన్నీ పంచుకోవడం – రైతాంగం తిరుగుబాటు చేసినప్పుడు కనిపించే పోరాట రూపాలన్నీ అక్కడ కనబడ్డాయి.

ప్రభుత్వ యంత్రంతో తలపడినప్పుడు రైతాంగం గాంధీజీ విధించిన దౌర్జన్యరహిత నిబంధనలకు కట్టుబడి వుండదని చౌరీ–చౌరా ఉదంతం చూపింది.

అందుకే గాంధీజీ ఇల్లా అన్నారు : "మద్రాసు (మలబారు) హెచ్చరిక నిచ్చింది. కాని నేను ఖాతరు చేయలేదు. భగవంతుడు చౌరీ–చౌరా ద్వారా స్పష్టంగా చెప్పేశాడు." చౌరీ–చౌరాలో పోలీసులు ప్రజలనెంతో రెచ్చగొట్టారని ఆయన ఎరుగును. అందుకే జనం ఠాణా తగులబెట్టేసి పోలీసుల్ని చంపేశారు. పోలీసుల దౌర్జన్యాలకు ప్రతిక్రియగా చేసినాకాని, ప్రజల ఈ దౌర్జన్యాన్ని గాంధీజీ క్షమించడానికి తయారుగాలేదు. రైతులను కార్యరంగంలోకి తెస్తే వారికీ ప్రభుత్వ యంత్రానికీ మధ్య అటువంటి ఘర్షణలు తప్పవని ఆయన గ్రహించారు. అనుకోడానికే అది భయంకరంగా అనిపించింది. ఆ ఉద్యమాన్ని కొనసాగించడమంటే "ప్రతిజ్ఞను భగ్నమొనర్చడమూ, భగవంతునియెడ అపరాధం చేయడమూ"నని తలచాడు. అందుచేత సహాయ నిరాకరణోద్యమాన్ని నిలిపివేయడానికి నిర్ణయించాడు.

# 4. మొదటి చీలిక

**స**హాయ నిరాకరణోద్యమ సందర్భంలో ఎక్కడో ఏదో చిన్న సంఘటన జరిగితే గాంధీజీ ఇంత కంగారుపడడం ఎందుకో ఆయన సహచరులకూ, అనుచరులకూ చాలమందికి అర్థంకాలేదు. ఆయన ఉద్యమాన్ని ఆపేయడానికి నిశ్చయించగానే వారంతా ఏమనుకున్నారో టెండూల్కర్ ఇల్లా వర్ణించాడు :

> "ఉద్యమాన్ని హఠాత్తుగా ఆపడంతో అంతా అదిరిపడ్డారు. బార్డోలీ నిర్ణయం జైళ్ళలోనే వున్న చాలామంది కాంగ్రెసు నాయకులకు ఆందోళన కలిగించింది. కార్యకర్తలంతా కోపపరవశులయ్యారు. గాంధీని అందరూ వ్యతిరేకించారు. ఆయన తీసుకొన్న దృక్పథానికి అసమ్మతి తెలుపుతూ మోతీలాల్ నెహ్రూ, లజపతిరాయ్ మొదలయినవారు జైళ్ళనుంచి కోపోద్రేకంతో జాబులు పంపించారు. ఎక్కడో కన్యాకుమారి అగ్రంవద్ద వున్న ఒక ఊళ్ళో దౌర్జన్యం జరిగితే హిమాలయాలవద్ద వున్న ఒక పట్టణాన్ని శిక్షించడం ఏమి సబబు? అని మోతీలాల్ నెహ్రూ ప్రశ్నించారు. చౌరీ-చౌరానూ, గోరఖ్‌పూర్‌ను ఎడంగాబెట్టి, వ్యష్టిగానూ, సమిష్టి గానూ సహాయ నిరాకరణోద్యమాన్ని సాగించమన్నారు." (సం. 2, పుట 117)

రౌలట్ బిల్లులకు వ్యతిరేకంగాను, ఖిలాఫత్ ఆందోళన సమయంలోను గాంధీజీ కాంగ్రెసులో తీసుకువచ్చిన ఐక్యత మొట్టమొదటి పర్యాయం పైవిధంగా బ్రద్దలయింది. ఆయన ఇటు మితవాదుల్నీ అటు అతివాదుల్నీ కూడ దౌర్జన్యరహిత సహాయ నిరాకరణోద్యమం ద్వారా ఐక్యపరచారు. దౌర్జన్యరాహిత్యానికి ఆయన ఇస్తున్న ప్రాముఖ్యత మితవాదుల్ని సంతృప్తిపరచింది. సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ప్రజానీకాన్ని పోరాటానికి

ఆహ్వానించడం అతివాదులకు సంతృప్తి కలిగించింది. అయినా, ప్రజల పోరాట చర్యలయెడ గాంధీజీకి గల బెదురూ, సహాయ నిరాకరణోద్యమాన్ని నిలిపెయ్యడానికి ఆయన చూపిన ఆతురతవల్ల ఇది వరకు కాంగ్రెసువాదుల మధ్య విభేదాలకు కారణమైన సమస్యలన్నీ తిరిగి బయటపడ్డాయి.

జాతీయవాంఛను సాధించేందుకు అనుసరించవలసిన విధానం ఏమిటి? బ్రిటిష్ వాళ్ళతో శాంతియుతమైన చర్చలు జరపడమా? లేక వాళ్ళకు వ్యతిరేకంగా పోరాటం నడపడమా లేక ప్రభుత్వానికి వ్యతిరేకంగా పట్టుదలగా పోరాటాలు నడిపేటందుకు ప్రజల్ని సమీకరించడమా లేకుంటే అంతకంత కెక్కువగా సంస్కరణలను సాధించేటందుకు చట్టబద్ధ కార్యక్రమంమీద ఆధారపడడమా? గతంలో ఈ సమస్యలే అతివాదులకూ, మితవాదులకూ మధ్య విభేదాల్ని తెచ్చిపెట్టాయి. నే డవే మరోరూపంలో ప్రత్యక్షమైనాయి.

సహాయ నిరాకరణోద్యమాన్ని నిలిపివేసినందుకు గాంధీజీకి అసమ్మతి తెలిపిన మోతీలాల్ నెహ్రూ, లజపతిరాయ్ మొదలయిన వారంతా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా గట్టిగా పోరాడాలనే వాళ్ళుకాదు. వారిలో మోతీలాల్ నెహ్రూ వంటి కొందరు గతంలో మితవాదుల్లోని వాళ్ళే. బ్రిటిష్ సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా ప్రజల్ని సమీకరించడంలో గాంధీజీ అనుసరిస్తున్న పద్ధతి వలన సామ్రాజ్యవాదులమీద గట్టి ఒత్తిడి తేవచ్చునని గ్రహించి వారు ఆయన నాయకత్వాన్ని అంగీకరించారు. ఆ ఒత్తిడి ఫలితంగా సామ్రాజ్య వాదులు కాంగ్రెసుతో రాయబారాలు జరపవలసి వస్తుందనీ, గాంధీజీ నాయకత్వాన ప్రారంభమయ్యే ప్రజోద్యమాలకు తెలివిగా ఉపయోగించుకొని అంతకంతకెక్కువగా రాజ్యాంగ సంస్కరణలను సాధించవచ్చుననీ వారు ఆశించారు. అందుచేతనే ఎక్కడో ప్రజలు దౌర్జన్య చర్యలకు దిగారనే విషయమై వా రట్టే బాధపడలేదు. అల్లాంటివి జరక్క మానవు. కాంగ్రెసు దీనికి బాధ్యత తీసుకోదు. తీసుకోకూడదు. తమ వర్గం పెట్టుకొన్న హద్దుల్నే ఈ ఉద్యమం దాటి పోతుందనే భయం గాంధీజీకిమల్లే వీరికి లేదు. అందుకే ఆయన నిర్ణయం వారికంత కోపం కలిగించింది.

సరే, సహాయ నిరాకరణోద్యమాన్ని నిలపడమనేది రూఢి అయిపోయింది. ఇంకేం చేయాలి? అనే ప్రశ్న వారిని పట్టుకొంది. ప్రజలు క్రమంగా అహింసా సూత్రాన్ని ఆకళింపు చేసుకొంటారనీ, గాంధీజీ తలపెట్టినమాదిరి పోరాటాన్ని కాంగ్రెసు నడిపేటందుకు అవకాశాలు లభించగలవనీ కొందరు చెప్తూవచ్చారు. ఆపాటి ఓర్పు వీరికిలేదు. బ్రిటిష్ వాళ్ళు కాంగ్రెసుతో రాజీకి దిగేటట్లు అహింసాయుత సహాయ నిరాకరణ చేయగలదనే వారు ఆ పద్ధతిని స్వీకరించారు. అటువంటప్పుడు సహాయ నిరాకరణోద్యమాన్ని నిలుపు

చేయాలని కాంగ్రెసు కూడా నిర్ణయించ వలసివస్తే మరో కొత్త ఎత్తుగడను వెతుక్కోవడం అవసరమని వారు భావించారు.

కొత్త ఎత్తుగడలను వెతకడంలో వారికి కొత్త శాసన సమితులు (Legislative Councils) కనబడ్డాయి. వానిని బహిష్కరించడం కాక, ఉపయోగించుకోవాలని తలచారు. అహింసాయుత సహాయ నిరాకరణోద్యమంలో శాసన సమితుల్ని బహిష్కరించడం కూడ ఒక కార్యక్రమంగా ఉన్నంతకాలం వానిని బహిష్కరించడంలో అర్థం వుంది. అంతేగాని సహాయ నిరాకరణ ప్రసక్తే లేనప్పుడు శాసన సమితుల్ని బహిష్కరించ నవసరంలేదని వారు వాదించారు.వారీ అభిప్రాయాలను బహిరంగంగా ప్రకటించడంతోనే సంతృప్తి పడలేదు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించేటందుకు స్వరాజ్య పార్టీని నిర్మించారు కూడా. అయితే కాంగ్రెసువాదుల్లో కొద్దిమందే ఈ పంథా తొక్కారు. 1922లో గయలో జరిగిన కాంగ్రెసు మహాసభ 1740–890 ఓట్లతో శాసన సమితులలో ప్రవేశించే కార్యక్రమాన్ని త్రోసిపుచ్చింది.

కాంగ్రెసువాదులలో పోరాట వ్యగ్రత వున్నదని చెప్పడాని కిదొక ఉదాహరణ. స్వరాజ్య పార్టీవారి సంఖ్య ఎక్కువగాకపోయినా కాంగ్రెసులో వారికి గల పలుకుబడి తక్కువేమీకాదు. కాంగ్రెసువాదులలో మంచి పేరు ప్రఖ్యాతులు గల అగ్రశ్రేణి నాయకులు కొందరు వారితో వున్నారు. శాసన సమితులలో ప్రవేశించరాదనేగాని ఏంచెయ్యాలో కాంగ్రెసుకు మరో కార్యవిధానం లేదు. ఈ రెండు కారణాలచేత స్వరాజ్య పార్టీవారికి కాంగ్రెసులో మంచి పలుకుబడి వుంది.

స్వరాజ్య పార్టీవారికీ 'నో ఛేంజర్ల'కూ మధ్య (మార్పు అక్కర్లేదనేవారు నో ఛేంజర్లు) వివాదం ప్రారంభమైనప్పుడు గాంధీజీ జైలులో వున్నారు. (సహాయ నిరాకరణోద్యమాన్ని నిలిపివేసిన తర్వాత ఆయనను జైలులో పెట్టారు. ఆయన విడుదలయి వచ్చేసరికే కాంగ్రెసు రెండుగా చీలిపోయి వుంది. రెండు పోటీ సంస్థలుగా అది బ్రద్దలుకావడానికి సిద్ధంగా వుంది. ఆ పేచీలను చల్లార్చి కాంగ్రెసులోని రెండు పక్షాలవారినీ ఏకం చేయడానికి గాంధీజీ పూనుకొన్నారు. పరిస్థితులన్నీ పరిశీలించారు. శాసన సమితులకు వెళ్ళేది ఖాయమేనన్న సంగతి పసికట్టారు. అటువంటి సమస్యమీద కాంగ్రెసు నాయకత్వంలో వచ్చిన చీలికను అధిక సంఖ్యాకులు ఓటు బలంతో సర్దుబాటు చేయడం సాధ్యంకాదని ఆయనెరుగును.

"శాసన సమితిలో ప్రవేశించడం ఖాయం. ఈ దశలో చేయవలసిందేమి? స్వరాజ్య పార్టీవారి విధానాలను సహాయ నిరాకరణవాదులు వ్యతిరేకించాలా? లేక తటస్థంగా



వుంటూ తమ వరకు వీలయినచోట్ల వారికి సాయపడుతుండాలా?... స్వరాజ్య పార్టీవారి కార్యక్రమం బాగా కొనసాగి, దేశానికి లాభకరం అయేటట్లయితే, నిజంగానే నమ్మకంలేని నాబోటిగాళ్ళు ఆ ప్రత్యక్ష ప్రమాణం చూసి తమ తప్పు తెలుసుకుంటారు. స్వరాజ్య పార్టీవారు కూడ దేశభక్తులు. అనుభవంతో తాము చేసినది తప్పని వారు తెలుసుకొన్న వెంటనే సర్దుకొంటారు. అందుచేత, నేను వారి మార్గానికి అడ్డురాను. నాకు నమ్మకంలేని పనులకు నేను సహాయపడలేకపోయినా స్వరాజ్య పార్టీవారు శాసన సమితులలో ప్రవేశించడానికి వ్యతిరేకంగా ప్రచారమూ చెయ్యను." (సం. 2, పుట 172)

స్వరాజ్య పార్టీవారిని గాంధీజీ ఆశీర్వదించిన పద్ధతి యిది. ఆయన అనుచర వర్గంలోని రాజగోపాలాచారి, వల్లభభాయ్ పటేల్, రాజేంద్రప్రసాద్ మొదలయిన 'నో ఛేంజర్ల' వాంఛ మరొక విధంగా వుంది. కనక, వారితో ఆయన ఎంతో ఓర్పుగా వాదించ వలసి వచ్చింది. స్వరాజ్య పార్టీవారి విధానాలను ఎప్పుడూ వ్యతిరేకించడం ద్వారానే 'నో ఛేంజర్ల' ఎత్తుగడలలోని గొప్పదనం నిరూపితం కాగలదనీ, శాసనసభల బయట ఒక క్రమపద్ధతిలో, నిరంతరాయంగా పనిసాగించి వాని గొప్పతనాన్ని నిరూపించుకోవాలనీ ఆయన చెప్పారు. స్వరాజ్య పార్టీవారు శాసన సమితుల కార్యకలాపాలలో మునిగితేలు తుంటారనీ, అందువలన స్వాతంత్ర్య పోరాటంలో పెద్ద విజయాలేవీ కలుగబోవనీ ఆయన చెప్పారు. ప్రజలలో కష్టపడి పనిచెయ్యడంవలననే విజయం లభిస్తుందన్నారు. దేశాన్ని రాబోయే పోరాటాలకు సంసిద్ధం చెయ్యాలన్నారు. ప్రజలను సంఘటితపరచడానికి పూనుకొమ్మనీ, అలా చేసినప్పుడే జాతీయవాంఛ నెరవేరుతుందనీ చెప్పారు.

ఎంతో చాకచక్యంగా గాంధీజీ ఈ విధంగా ఒప్పించి, స్వరాజ్య పార్టీని కాంగ్రెసులో భాగంగా గుర్తింపబడేటట్లు చేశాడు. అంతేకాదు, కాంగ్రెసు తన రాజకీయ కార్యక్రమానికి కేంద్రంగా చేసుకొనేటట్లు చేయగలిగారు. రెండోవైపున స్వరాజ్య పార్టీవారు ఖద్దరును ప్రచారంలోకి తెచ్చేటట్లూ, అస్పృశ్యతను నిర్మూలించేటట్లూ, హిందీని ప్రచారం చేసేటట్లూ ఒప్పించగలిగారు. ఈ కార్యక్రమాలలో పాల్గొనడం ఒక బాధ్యతగా వారిచేత ఒప్పింపచేశారు.

"నో ఛేంజర్ల నుంచి ఏ విధమైన ఆటంకమూ లేకుండా స్వరాజ్య పార్టీవారు తమ కార్యవిధానాలను కొనసాగించుకొనే అవకాశం కలిగించడం వలన దేశానికి ఎంతో మేలున్నదనే అభిప్రాయానికి నేను వచ్చాను. తమ కిష్టంలేకపోతే నో ఛేంజర్లు ఆ కార్యవిధానాలలో పాల్గోకుండా ఉండొచ్చు. స్వరాజ్య పార్టీవారి లాగానే వారు తమ నిర్మాణ కార్యక్రమాన్ని అనుసరించడం అవసరం. వారికా స్వేచ్ఛ కూడా వుంది. వ్యక్తిగత సహాయ నిరాకరణ విధానాన్ని అనుసరించే స్వాతంత్ర్యం వారికుంది. కాని, కాంగ్రెసు

ఆ కార్యక్రమాన్ని నిలిపివేయడం వలన సహాయ నిరాకరణవాదులను కాంగ్రెసు బలపరచజాలదు. వత్తాసునివ్వజాలదు. వారు తమ ఆత్మబలంతోనే పని చెయ్యాలి. అది వారికో పరీక్ష...” (సం. 2, పుట 220)

తర్వాత కొన్ని సంవత్సరాలపాటు గాంధీజీ, ఆయన సహచరులయిన ‘నో ఛేంజర్లూ’ నిర్మాణ కార్యక్రమంమీదనే తమ దృష్టిని కేంద్రీకరించి గట్టిగా పనిచేశారు. ఈ కార్యక్రమాన్ని కొనసాగించే క్రమంలోనే గాంధీజీ అఖిలభారత ఖాదీ బోర్డును ఏర్పరచారు. ఆ కార్యక్రమాన్ని ప్రచారం చేయడంకొరకే ఆయన దేశం అంతటా పర్యటించారు. వెళ్ళినచోటల్లా ఆయన ఖాదీ కార్యక్రమాన్ని ప్రచారం చేశారు. అస్పృశ్యతను వ్యతిరేకించారు. హిందీని దేశభాషగా స్వీకరించేటట్లు ప్రోత్సహించారు.

నిర్మాణ కార్యక్రమాన్ని ప్రచారం చేయడానికై ఆయన మూలమూలలకంటా వెళ్ళిన పద్ధతిలోనే ప్రజలనాకర్షించే లక్షణాలూ వున్నాయి; ప్రజలు సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా రాజకీయ పోరాటంపట్ల ఆసక్తి చూపకుండా చేసే లక్షణాలూ వున్నాయి.

వీటిలో చాల ముఖ్యమైన దొకటుంది. రాజకీయ సమస్యలను గాంధీజీ ఎన్నడోగాని ఈ సంచారంలో తడవలేదు. 1922లో ఆయన తన ఉపన్యాసాలన్నింటా పంజాబు దురంతాలను గురించి, రౌలట్ బిల్లులను గురించి, ఖిలాఫత్ ఉద్యమాన్ని గురించి – బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా తరచు పేర్కొనేవాడు. 1924–28లలో ఆయన ఇచ్చిన ఉపన్యాసాలనూ వానిని పోల్చిచూడండి. ఈ ఉపన్యాసాలన్నీ సామాజిక సమస్యల, ఆత్మవిజ్ఞాన (Spiritual) సమస్యల మీదనే. వారు అనుభవిస్తున్న రాజకీయ, ఆర్థిక వ్యవస్థ మీదగాక, కొన్ని సామాజిక దురన్యాయాలకు వ్యతిరేకంగానూ, కొన్ని ఆత్మపరినిష్ఠితములయిన విలువల కోసమూ ప్రజలను ఆయన హెచ్చరించాడు.

రెండవ విషయం : సామ్రాజ్యవాదానికి, భూస్వామ్య విధానానికి, ఇతర విధాలయిన పీడనకు వ్యతిరేకంగా ప్రజలనాయన ఉత్తేజపరచకపోయినా, ప్రజల దీనదశను ఆయన వర్ణించారు. సామాజిక అసమానతలను గురించి మాట్లాడాడు. వానిని సవరించవలసిన ఆవశ్యకతను గురించి చెప్పాడు. అన్ని తరగతుల ప్రజల సమస్యలనూ పరిశీలించారు. వారి దుర్భర పరిస్థితులను వర్ణించారు. వారి బాధల నివారణకోసం తన సభికులను హెచ్చరించారు. ఈ విధంగా ఆయన పీడిత, తాడిత ప్రజలందరినీ, అన్ని తరగతులవారినీ ఆకర్షించారు.

ఉదాహరణకు ఆయన దేవదాసీలతో మాట్లాడిన తీరు తీసుకోండి. “నేను మిమ్మల్ని నాతో తీసుకుపోతా. తిండి, బట్ట ఇస్తా. చదువు చెప్పిస్తా. మంచి పరిసరాలలో ఉంచుతా.

ఈ అవమానకరమైన బ్రతుకు వదలి నాతో వస్తారా?” అని ఆయన అడిగారు. వాళ్ళు “అలాగే” నన్నారు. ఈ విషయాన్ని ఆయన తన ఉపన్యాసంలో పేర్కొని తన హృదయావేదన నంతనూ ఇలా వెలిబుచ్చారు :

> “వారితో మాట్లాడి, ఆ విషయాన్ని సాకల్యంగా అర్థంచేసుకొన్నాక చిన్నపిల్లలను అవినీతి కార్యాలలో ప్రవేశపెట్టే దురాచారంమీద నా మనస్సు రగిలిపోయింది. వారిని ‘దేవదాసీ’లని పిలవడం మతం పేరుతో దేవుణ్ణి అవమానించడమే...” (సం. 2, పుట 371)

మునిసిపల్ సమస్యలను గురించి ప్రశ్నించిన బెంగుళూరు పౌరులకు (టాక్స్ పేయర్లు) ఆయన ఇచ్చిన సమాధానం వినండి :

> నిర్బంధ ప్రాథమిక విద్య నిక్కడ ప్రవేశపెట్టినందుకు నాకు చాల సంతోషంగా వుంది. మీ పట్టణంలోని విశాలమైన రోడ్లు, అద్భుతమైన దీపాలు, అందమైన పార్కులు చాల బాగున్నాయి. మీరిచ్చిన సన్మానపత్రం చూస్తే ఇక్కడున్న మధ్యతరగతులవారూ, పైతరగతులవారూ చాల సుఖపడుతున్నారని భావిస్తున్నాను. అయితే ఈ నగరంలో బీదవాళ్ళంటూ వున్నారా? ఉంటే వారు పరిశుభ్రంగా, ఆరోగ్యంగా జీవించడానికై మీరు చేస్తున్న పనేమిటి? వారి కష్టాలలో, దుఃఖాలలో మీరు భాగం పంచుకుంటున్నారా? వారు తమ పాకీదొడ్లను శుభ్రంగా ఉంచుకొనేటట్లు సాయపడుతున్నారా? బీద తరగతుల వారి పిల్లలకు, ముదుసలులకు, రోగిష్టులకు చవుకగా పాలు లభించేటట్లు తోడ్పడు తున్నారా? మీ వర్తకులు కల్తీలేని శుభ్రమైన ఆహార పదార్థాలు అమ్ముతున్నారా?... ఇంకా చాలా ప్రశ్నలున్నాయి. వాటన్నింటికీ సంతృప్తికరంగా సమాధానం ఇవ్వగలిగితే నేను చాలా సంతోషిస్తాను. ఇవ్వలేకపోయేటట్లయితే ఈ సమస్యలను గురించి శ్రద్ధ చూపమని కోరుతాను...” (సం. 2, పుట 363–64)

మూడోది : మరొకటి కూడా వుంది. కష్టజీవులయిన ప్రజల తరఫున, వారికి అర్థం అయ్యే భాషలో ఆయన మాట్లాడుతున్నా, ఈనాడున్న సాంఘిక వ్యవస్థకు వ్యతిరేకంగా ప్రజలను సమీకరించే ఏ పనినీ ఆయన ఒప్పుకోరు. 1927లో సక్లత్వాలా (బ్రిటిష్ కమ్యూనిస్టు పార్టీ నాయకుల్లో ఒకరు; భారతీయుడు) ఇండియాకు వచ్చినప్పుడు ఆయనతో సంభాషించాడు. ఆ సమయంలో సక్లత్వాలా కాయన ఇచ్చిన సమాధానాలు ఆయన స్వభావాన్ని తెలుపుతాయి. “కామ్రేడ్ సక్లత్వాలా మనస్ఫూర్తిగా మాట్లాడాడు. ఆయన విశ్వాసం స్వచ్ఛమైనది. ఆయనకు బీదలంటే వున్న అభిమానం నిరుపమానం” అని ఆయన ఒప్పుకొన్నారు. కాని ప్రక్కనే ఈ మాటలన్నారు : “అయినా కామ్రేడ్ సక్లత్వాలా వాస్తవిక విషయాలను పరిశీలించడానికి నిరాకరిస్తూన్నారు. ఇండియానూ, ఇండియా పరిస్థితులను ఆయన మరచిపోతున్నారు.”

కామ్రేడ్ సక్లత్వాలా మరచిపోతున్న 'వాస్తవిక విషయాలు', 'ఇండియా పరిస్థితులు' ఏమిటి?

> "నేను పెట్టుబడిదార్లను శ్రామికులకు శత్రువులుగా పరిగణించను. వారిద్దరి మధ్య సమన్వయం సాధ్యమని నా అభిప్రాయం. దక్షిణాఫ్రికాలో, చంపారన్‌లో, అహమ్మదాబాద్‌లో నేను ప్రారంభించిన కార్మిక సంస్థలు పెట్టుబడిదారుల కేవిధంగానూ వ్యతిరేకం కాదు. పై అన్నిచోట్లా, అన్ని సందర్భాలలోనూ అవసర మనుకొన్నంతవరకూ ప్రతిఘటించడం జరిగింది. అన్ని సందర్భాలలోనూ పూర్తి విజయం లభించింది. ఆస్తి సమానంగా పంపకం జరగాలనేది నా ఆశయం. కాని, అది జరిగేలాగ కనబడ్డంలేదు. అందుచేత న్యాయమైన విధంగా పంపకం జరిగేటందుకు నేను పనిచేస్తాను. ఖద్దరు ద్వారానే నా పని చేయదల చాను. అది బ్రిటిష్ దోపిడీ విధానం యొక్క మూలాన్ని ఛేదిస్తుంది. బ్రిటిష్ సంబంధాలను పరిశుద్ధం చేస్తుంది. ఆ విధంగా ఖద్దరు స్వరాజ్యం తెస్తుంది." (సం. 2, పుట 340)

మరొకలా చెప్పాలంటే, ఖాదీ కార్యక్రమం కార్మిక – పెట్టుబడిదారీ వర్గాల మధ్య సహకారమును సాధిస్తుంది. బ్రిటిషు సంబంధాలను పరిశుద్ధం చేస్తుంది.

నాలుగోది : నిర్మాణ కార్యక్రమం ఆచరణ కుద్దేశించినది. అంటే ఆ పని చేస్తానని ప్రతిజ్ఞ చేసిన ప్రతి ఒక్కరూ ఏదో కొంతపని చెయ్యాలి. తన దగ్గరకు వచ్చిన ప్రతివాళ్ళకూ ఏదో ఒక పని ఇవ్వడం గాంధీజీలో వున్న గొప్పదనం. కార్మికుడు కానీండి, కర్షకుడు కానీండి, చదువుకొన్నవాడే కానీండి; గాంధీజీ ప్రతి ఒక్కనికీ చేతినిండా పనిచెప్తారు. ఆ పని చేయడం వలన దేశాన్ని ఆధ్యాత్మికంగా, ఆర్థికంగా, రాజకీయంగా పునరుజ్జీవం పొందిస్తున్నామనే ఉదాత్త భావన వానిలో కలిగిస్తారు. చరఖాను గురించి, కుటీర పరిశ్రమలను గురించి, హిందీని గురించి, హరిజనోద్ధరణ గురించి, సంఘ సంస్కరణను గురించి ఆయన ఇచ్చిన ఉపదేశాలు సాధించిన ప్రయోజనమిదే.

ఈ సమస్య లన్నింటిమీదా గాంధీజీ ఎదుటివారిలో ఉత్సాహం పుట్టిస్తారు. స్వరాజ్య పోరాటానికి తయారు కావడంలో ఇవన్నీ తప్పక చేయవలసినవేనన్న భావం కలిగిస్తారు. నిర్మాణ కార్యక్రమంలోని అంశాలన్నింటి వెనుకా సామ్రాజ్య వాదాన్ని ప్రతిఘటించాలనే సందేశం ఇమిడి వుంది. దీనిద్వారానే గాంధీజీ తన నాయకత్వం క్రింద జాతీయోద్యమంలో పనిచెయ్యడానికి బద్ధకంకణులైన కార్యకర్తలను వందల సంఖ్యలో తయారుచేసుకోగలిగేరు. సేవా, త్యాగమూ అనేవి వారిని ఉత్తేజపరచి కార్యరంగంలోకి తెచ్చాయి. అయితే వారికి గాంధీజీ ప్రాతినిధ్యం వహిస్తున్న వర్గం యొక్క అస్తిత్వాన్నే నిర్మూలించగల విప్లవోత్సాహమను "పాపకళంకం" సోకదు.

అయిదోది : రాజకీయ ప్రసక్తి కనిపించని నిర్మాణ కార్యక్రమాన్ని స్వరాజ్య పార్టీవారి

రాజకీయ కార్యక్రమాలతో జతకలపడం ఆ రోజుల్లో గాంధీజీ విధానాల యొక్క ప్రత్యేకత. నిజమైన 'రాజకీయ' కార్యక్రమం సాగిస్తున్నది తామేనని స్వరాజ్య పార్టీవారు సంతృప్తి పడేటట్లు చేస్తూనే (పోరాటానికి అవకాశం వున్న పద్ధతులన్నింటి ద్వారా ప్రభుత్వాన్ని బట్టబయలు చేయడం, ప్రతిఘటించడమూను), భవిష్యత్తులో సామ్రాజ్యవాదంతో పోరు తప్పదనీ, ఆ పోరాటానికి దేశాన్ని సన్నద్ధం చేస్తున్నది తామేననే సంతృప్తి నిర్మాణ కార్యకర్తలలో కలిగిస్తూ కాంగ్రెసులోని రెండు పక్షాలవారినీ – అటు స్వరాజ్య పార్టీవారిని, ఇటు నిర్మాణ కార్యకర్తలనూ కూడ – తన గుప్పిట పెట్టుకొన్నారు. కాంగ్రెసులోని కార్యకర్తలనూ, నాయకులనూ తన నాయకత్వం క్రింద ఆ విధంగా ఏకీకృతం చేశారు.

స్వరాజ్య పార్టీవారిని ఆశీర్వదిస్తూ వారు శాసనసభలలో "కాంగ్రెసు యొక్క నిర్మాణ కార్యక్రమ భాగాన్ని బలపరచేటందుకు కృషి చేయాల"ని నిర్దేశించారు. వారు చేయ కూడనిదేమో ఆయన ఇల్లా చెప్పారు :

> "ప్రతిదానిని అడ్డగించడమే నన్న విధానం పనికిరాదు... ప్రభుత్వం కొనే బట్టలన్నీ చేతితో వడికినవే, చేతితో నేసినవే అయి వుండాలని తీర్మానాలు ప్రవేశపెట్టాలి; విదేశీ బట్టల మీద రక్షణ సుంకాలు విధించాలని కోరాలి... ఆ తీర్మానాలు శాసనసభ ఆమోదం పొందినా వాటిని ప్రభుత్వం అమలుజరపకపోతే ఆ ప్రభుత్వాలు రద్దుకావాలనీ, నిర్దిష్ట సమస్యలమీద ఓటర్ల అభిమతానికి నిలబడమనీ వారికి తెలియపరచాలి. తమ స్థానాలకు రాజీనామాలిచ్చి దేశాన్ని శాసనోల్లంఘనానికి తయారుచేయాలి." (సంపుటం 2, పుట 172–73)

ఒకవైపున తాను నిర్మాణ కార్యకర్తనే తప్ప స్వరాజ్య పార్టీవాడిని కానంటూ, వారి కార్యక్రమాలన్నింటా ఆయన విశేష శ్రద్ధ తీసుకొనేవారు. కేంద్ర శాసనసభలో స్వరాజ్య పార్టీవారూ, వారి మిత్రకోటీ అనుసరించిన ఎత్తుగడలు సుప్రసిద్ధం. జాతీయవాంఛను గురించిన సుప్రసిద్ధ తీర్మానాన్ని వారే ప్రతిపాదించారు. ప్రతినిరోధకరమైన ఎత్తుగడల నవలంబించడం, ఆ తీర్మానం నిరాకరింపబడినప్పుడు వాకౌట్ చేయడం జరిగింది. ఆ ఎత్తుగడలను గాంధీజీ ఆశీర్వదించారు. బ్రిటిష్ పాలకులతో స్వరాజ్య పార్టీవారు రాయబారాలు జరపడానికై తన పేరు ప్రతిష్ఠల నుపయోగించుకోనిచ్చారు. కొంత విజయావకాశం వున్నదనుకొనేవరకు తానా సంప్రదింపులకు దూరంగా వుండేవారు.

స్వరాజ్య పార్టీ నాయకుడైన దేశబంధుదాస్‌కు, ఇండియా మంత్రి లార్డ్ బర్కెన్ హెడ్‌కు మధ్య జరిగిన సంప్రతింపుల్ని గురించి ఆయన వెలిబుచ్చిన అభిప్రాయం ఈ సందర్భంలో ఉల్లేఖయోగ్యం. 1925 మే 1వ తేదీన గాంధీజీ కలకత్తాలో ఒక సభలో మాట్లాడుతూ ఇంగ్లండులోని 'అసమాన రాజకీయ దురంధరు'లతో రాజకీయ సంబంధాలు



పెట్టుకొనేకన్న భారతదేశపు శక్తిని లోపలనుంచే ఇనుమడింపచేయగల నిర్మాణ కార్య క్రమంలో మునిగిపోవడం నాకిష్టం అన్నారు. కాని తర్వాత కొద్దిరోజులకే జూన్ 20వ తేదీన దేశబంధుదాస్ చెప్పినదానికి ఒప్పుకోవలసిందంటూ ఇంగ్లీషువారికి గాంధీజీయే విజ్ఞప్తి చేశారు.

"ఫరీద్‌పూర్ ఉపన్యాసానికి చాల ప్రాముఖ్యముంది. దేశభక్తులు తమ ఉద్దేశా లేమిటో స్పష్టంగా చెప్పాలనీ, మొదట వారే ముందుకు రావాలనీ కోరే బ్రిటిష్ - ఇండియను మిత్రుల అభిలాషకు అంతకన్న గొప్ప సమాధానం ఉండదు. ఆయన తన అభిప్రాయం చెప్పారు. మృత్యువు క్రూరహస్తం ఆయనను మనకు లేకుండా చేసింది. దేశబంధుదాసు యొక్క ఉద్దేశాలమీద నమ్మకం కుదరని ఇంగ్లీషువారికి నేనొక హామీ ఇస్తున్నా. డార్జిలింగ్‌లో నేనున్నన్ని రోజులూ తన మాటలకాయన ఎంత విశ్వాసం ఇస్తున్నారో చూశాను. ఆయన మరణం చూసైనా మన పాత గాయాలను, అనుమానాలను మరచిపోలేమా?" (సం. 2, పుట 255)

అవకాశం దొరికినప్పుడల్లా స్వరాజ్యం కావాలనే కోరికను ఆయన ప్రతిపాదించి, బ్రిటిష్ ప్రభుత్వంతో రాయబారాలు ప్రారంభించడానికై స్వరాజ్య పార్టీవారికి ఒకమూల సావకాశం ఇచ్చారు. రెండోవైపున త్యాగశీలురయిన వేలకొలది నిర్మాణ కార్యకర్తల సహాయంతో దేశం అంతటా కొన్ని సంస్థలను వ్యాపింపచేసి, ఒకవేళ రాయబారాలు విఫలమైతే మరోసారి అహింసాయుత పోరాటాన్ని సాగించేటందుకు దేశాన్ని తయారుచేయ బూనుకొన్నారు. సహాయ నిరాకర ణోద్యమానంతరం ఆయన క్రమంగా పరిణతి పొందించిన పోరాట పద్ధతి యిదే.

బూర్జువావర్గం యొక్క రాజకీయావసరాలకు ఈ విధానం చాల అనుకూలం. అంతేకాదు, దీనిని విజయవంతంగా నడపగలిగినవాడు గాంధీజీ ఒక్కడే. ఆయన స్వయంగా నిర్మాణ కార్యక్రమానికి నాయకత్వం వహించాడు. రాయబారాలు నడపడంలో స్వరాజ్య పార్టీ వారికి వెనుకనుండి నాయకత్వం వహించాడు. బూర్జువావర్గానికి కావలసిన ఈ లక్షణాలే ఆయనను నిర్మాణ కార్యకర్తలకూ, స్వరాజ్య పార్టీవారికి కూడా నాయకత్వం వహింపజేశాయి. కాంగ్రెసువారే కాదు, మితవాదులూ, ఇతర బూర్జువా పార్టీలూ, గ్రూపులూ కూడ ఆయన నాయకత్వాన్ని అంగీకరించాయి.

# 5. సంపూర్ణ స్వరాజ్యం

**గాం**ధీజీ యిచ్చిన ఉత్సాహ ప్రోత్సాహాలతో కాంగ్రెసు శాసనసభా ప్రవేశాన్నీ, నిర్మాణ కార్యక్రమాన్నీ సాగిస్తున్న దశలో జాతీయ రాజకీయరంగంలో రెండు నూతన శక్తులు ఆవిర్భవించాయి. ఒకటి : హిందూ, ముస్లిం మతవాదశక్తులు. రెండు : సామ్రాజ్య వ్యతిరేక అతివాదశక్తులు. ఇవి రెండూ శాసనోల్లంఘనోద్యమాన్ని నిలిపివేసినాకనే రంగంమీదికి వచ్చాయి. నిలిపివేయడం వలన కలిగిన నిరాశా నిస్పృహలవల్ల, రాజకీయ గందరగోళంవల్ల ఇవి వచ్చాయి. ఇవి రెండూ కూడా వాని వాని ప్రత్యేక పద్ధతులలో గాంధీజీకీ, ఆయన అనుచరులకూ, అటు స్వరాజ్య పార్టీ కార్యక్రమాలలోనూ, ఇటు నిర్మాణ కార్యక్రమాలలోనూ కూడ ఆటంకాలు కలిగించాయి.

శాసనోల్లంఘనోద్యమాన్ని నిలిపివేసినప్పుడు కాంగ్రెసులో చీలిక వచ్చింది. అటు తర్వాత స్వరాజ్య పార్టీలోనే చీలికలు వచ్చాయి. ప్రభుత్వాన్ని దుయ్యబట్టడానికీ, బట్టబయలు చేయడానికీ శాసనసభలకు వెడుతున్నామనే మొదటి ఆలోచనను స్వరాజ్య పార్టీ వారిలో కొందరు కట్టిపెట్టి 'కలిసివచ్చినంతవరకు సహకరించాలి' అనే విధానాన్ని అవలంబించా లన్నారు. ఆ విధానంతో వారొక ప్రత్యేక శాఖగా ఏర్పడ్డారు. శాసనసభలలో అనుసరించ వలసిన ఎత్తుగడలను గురించి వచ్చిన ఈ భేదాలు ఇంకా విస్తరించి మతవాదరూపం ధరించాయి.

1921 నాటి సహాయ నిరాకరణవాదులలో చాలమంది ఏదో ఒక మతంవారి కోరికలను సమర్థించడం ప్రారంభించారు. కుల మత సంస్థలు ముఖ్యంగా హిందూ, ముస్లిం మత సంస్థలు అభివృద్ధి పొందసాగాయి. ఎవరికివారే తమ మతస్థుల ప్రాబల్యం

కోసం పెద్ద గొంతెమ్మకోరికలు ప్రారంభించారు. మరీ బాధాకరమైన విషయం ఏమంటే, కాంగ్రెసులోని పెద్దనాయకులే కొందరు ఈ మతవాదులను భుజానవేసుకోవడం. కొందరు హిందూమత సంస్థలను బలపరుస్తూంటే కొందరు ముస్లిం మత సంస్థలను బలపరచారు.

నాయకుల స్థాయిలో వాదనలు, ప్రతివాదనలు జరగడంతోనే ఈ మతవాదం ఆగలేదు; దేశంలో ప్రజా జీవితాన్నే అది చుట్టుముట్టింది. గోహత్య, మసీదుల ముందు వాద్యఘోష, మతస్వీకారం, పునఃపరివర్తనం మొదలయిన సమస్యలు భయంకరరూపం ధరించాయి. అనేక సందర్భాలలో ఇవి కొట్లాటలకు, దొమ్మీలకు దారితీశాయి. సహాయ నిరాకరణ, ఖిలాఫతు ఉద్యమాల కాలంలో ఏర్పడిన మత సౌమనస్యం ఆ రోజులలో ఆ ఉద్యమానికి జాతీయ, ప్రజాతంత్రోద్యమ రూపాన్ని కలిగించింది. అది నేడు అంతరించి తీవ్ర విద్వేషాలు చెలరేగాయి.

ఈ పరిస్థితులను చూచి గాంధీజీ చాల సంతాపం ప్రకటించారు. సహాయ నిరాకరణోద్యమ దినాలనాటి ఉదాత్త ఆనందోత్సాహాల్ని హత్యచేస్తున్న ఈ అంతః కలహానికి ఆయన మనస్సు క్షోభించింది. దేవునిపేరు చెప్పి మనుషులు సాగిస్తున్న రాక్షసకృత్యాలకు ఆయన హృదయం విదీర్ణమైపోయింది. మతం పేరుతో జరుగుతూన్న దారుణాలకు వ్యతిరేకంగా శాంతి సౌహార్దాలను కోరుతూ ఆయన మొట్టమొదటిమారు తన ఉపవాసవ్రతం ప్రారంభించారు.

దీనివలన తాత్కాలికమైన ఉపశాంతి మాత్రమే కలిగింది. వివిధ మతాలకు చెందిన నాయకులు గాంధీజీవద్దకు వచ్చి మతశాంతిని నెలకొల్పడానికై గట్టిగా కృషి చేస్తామని వాగ్దానాలు చేశారు కాని, దేశప్రజల జీవితంలో ఆ ఉపవాసం వలన విశేష ప్రయోజనం గాని, దీర్ఘకాలిక ప్రయోజనంగాని లేకపోయింది. పైగా, గాంధీజీ నాయకత్వాన కాంగ్రెసు స్వరాజ్య సాధనకై జరిగే పోరాటంలో ముందుకు సాగినకొలదీ, దేశంలో మతద్వేషాలు తీవ్రమైనాయి. అటు తర్వాత సామ్రాజ్యవాదంతో జరిపిన పోరాటాలలో ప్రతి దశలోనూ మత వైషమ్యాలనేవి గాంధీజీ మార్గానికి అవరోధమయి కూర్చున్నాయి. చిట్టచివరకు వికృతమైన స్వరాజ్యమే లభించింది. గాంధీజీ ఆశయాలకే విరుద్ధంగా హిందువులు అధిక సంఖ్యలో వున్న భారత యూనియనుగానూ, ముస్లిములు అధికంగా వున్న పాకిస్తాన్‌గానూ ఇండియా విభజింపబడిపోయింది. హిందూ మతాభిమానులలోని ఒక హంతకుని చేతిలో ఆయన దుర్మరణం పొందారు.

మతం పేరుతో చేసే దుర్మార్గాలయెడ వెలపరంతోనే గాంధీజీ మతవాద శక్తుల ప్రాదుర్భావానికి చింతపడలేదు. స్వతంత్ర పోరాటంలో దేశంలోవున్న వివిధ వర్గాలను, కులాలను, వర్ణాలను ఏకముఖం చేయడానికై ప్రయత్నిస్తున్న రాజకీయవేత్త ఆయన.

అందుచేత మత సమస్యను వివిధ మతాల మానవుల మధ్య ఉండవలసిన సంబంధంగా మాత్రమే పరిగణించరాదనీ, కార్యాచరణకు సంబంధించిన రాజకీయ సమస్యగా దాన్ని భావించాలనీ ఆయన అర్థం చేసుకొన్నారు. బ్రిటిష్‌వాళ్ళ చేతుల నుంచి లాక్కున్న అధికారాన్ని దేశ ప్రజలలో ఎవరెంత వశపరచుకోవాలనే విషయమై తగువులాటగా ఆయన దానిని పరిగణించారు.

స్వరాజ్యం అంటే ఏమిటి? అదెలా వుంటుంది? స్వరాజ్యం వచ్చాక ఏర్పడే రాజ్యాంగ చట్టం నుంచి ప్రజలు ఏమేమి ఆశించవచ్చును? – అనేదానిమీద కొంతయినా అంగీకారం కుదిరితేతప్ప స్వరాజ్యాన్ని సాధించలేము. స్వరాజ్య వాంఛను కాదనేటందుకు తగిన కారణం ఏదీ దొరకక బ్రిటిష్ ప్రభుత్వం దేశప్రజలలో వున్న మతవైషమ్యాలను సాకుగా తీసుకొంటున్న సమయంలో ఈ అంగీకారం మరీముఖ్యం.

దేశంలోని అన్ని తరగతుల ప్రజలకూ అంగీకారయోగ్యమైన రాజ్యాంగ చట్టాన్ని తయారుచెయ్యమని ఆ రోజుల్లో ఇండియా మంత్రిగా వున్న లార్డ్ బర్కెన్ హెడ్ భారత రాజకీయవేత్తలను సవాలు చేశాడు. హిందువులు ముస్లిములు ఒకరిమీదొకరు, ఆ ఇద్దరి మీదా క్రైస్తవులూ, అస్పృశ్యవర్ణాలూ మా కిది కావాలంటే, మా కింత ఉండాలని పేచీ పడతారని ఆయనకు గట్టి నమ్మకం. దీనికితోడు యూరోపియన్ ‘పెట్టుబడిదారులు’, సంస్థానాధీశులు, భూస్వాములు మొదలయిన వారంతా కాంగ్రెసూ, తదితర మతవాదేతర ప్రజాతంత్రవాదులూ తెచ్చే జాతీయ, ప్రజాతంత్ర వాంఛలకు అడ్డుపుల్లలు వేస్తారని ఆయన విశ్వాసం.

కాంగ్రెసు దేశంలోని ప్రముఖ జాతీయ రాజకీయ సంస్థగా బ్రతకదలచుకొంటే ఈ సవాలును అంగీకరించాలి, అంగీకరించింది కూడా. కాంగ్రెసు చొరవ తీసుకొని అఖిలపక్ష కమిటీని ఏర్పరచింది. దానికి మోతీలాల్ నెహ్రూ అధ్యక్షులు, జవహర్‌లాల్ నెహ్రూ కార్యదర్శి. ప్రత్యేక ప్రాతినిధ్యం, స్థానాల కేటాయింపు, కేంద్రానికీ రాష్ట్రాలకూ మధ్య అధికారాల పంపిణీ మొదలగు సమస్యల మీద భేదాభిప్రాయాలున్నా మొత్తంమీద అన్ని కులాల, మతాల రాజకీయ నాయకులలో అత్యధిక సంఖ్యాకులను ఆకర్షించింది నెహ్రూ కమిటీ రిపోర్టు.

నెహ్రూ కమిటీ రిపోర్టును కాంగ్రెసువాదులు, మితవాదులు, తదితర అగ్ర రాజకీయ నాయకులు అంగీకరించడం స్వరాజ్య పార్టీ నాయకులకు ఘనవిజయమని చెప్పాలి. కాని ఈ ఐక్యతకు మూలమైన ధోరణిని సామ్రాజ్యవాద వ్యతిరేకులలోని అతివాదవర్గం సవాలు చేసింది.

సహాయ నిరాకరణోద్యమాన్ని నిలిపివేయడంతో సాధారణ కాంగ్రెసు కార్యకర్తలు,

వలంటీర్లు చాలమంది కోపోద్రిక్తులయ్యారు. శత్రువు బలహీనంగా వున్నప్పుడు తమ నాయకులే తమకు ద్రోహం చేశారనే భావం లక్షలమంది కాంగ్రెసువాదులలో ఏర్పడింది. గాంధీజీ ఉద్యమాన్ని నడిపిస్తున్న పద్ధతిలోనే ఏదో లోపం ఉన్నట్లనిపించింది. అలాగని చిత్తరంజనదాసు, మోతీలాల్ నెహ్రూ, విఠల్‌భాయ్ పటేల్ మొదలయినవారు కాంగ్రెసులో ప్రవేశపెడుతున్న పద్ధతులంటే కూడ వారికి సమ్మతం కావడంలేదు. అందుచేత వారు 'నే ఛేంజర్లు'గా వుండిపో యారు. అంటే శాసనసభా ప్రవేశానికి ఇష్టపడలేదన్నమాట. అలాగని 'నే ఛేంజర్ల' రాజకీయాలతో కూడ వారికి సమ్మతిలేదు. నో ఛేంజర్లు అప్పటికి నిర్మాణ కార్యక్రమంలో మునిగివున్నారు. ఆ విధంగా వారికి ఇద్దరి పద్ధతులూ నచ్చలేదు. ఏమీ చేయలేరు – ఏమి చెయ్యాలో తోచదు. ఎక్కడో ఏదో తప్పు ఉన్నదనేగాని అదేమిటో చెప్పలేరు. మార్పు కావాలంటారు గాని ఏవిధమైన మార్పు కావాలో ఎరగరు.

ఈ విధంగా నిరాశా నిస్పృహభరితులైన కాంగ్రెసువాదులలో ఐర్లండు, ఈజిప్టు మొదలయిన ప్రాంతాలనుంచి వచ్చిన పోరాటతత్వం గల సామ్రాజ్య వ్యతిరేక ధోరణులు, టర్కీ నుంచి తీవ్ర సామాజిక, సాంస్కృతిక పరిణామాల సందేహాలు, సోవియట్ రష్యా నుంచి సోషలిస్టు అభిప్రాయాలు వ్యాపించనారంభించాయి.

నిస్పృహలో వున్న యువ కాంగ్రెసువాదులలో ఈ భావాలు ఒకమూల వ్యాప్తి పొందుతూ వుంటే సమాజంలోని కొత్త వర్గాలు రాజకీయ రంగంలోకి అడుగుపెడు తున్నాయి.

1920 ప్రాంతంలో శ్రామికవర్గం గణించదగ్గ ఒక శక్తిగా రూపొందింది. ఈ సందర్భంలో ఇది చాల ప్రాముఖ్యం గల విషయం. సహాయ నిరాకరణోద్యమానికి ముందూ ఉద్యమకాలంలోనూ దేశ పారిశ్రామిక, రాజకీయరంగాలలో సమ్మెలు అనేవి ప్రాధాన్యం వహించాయి. శ్రామికవర్గం యొక్క ప్రప్రథమ వర్గ సంఘాలయిన ట్రేడ్ యూనియన్లు క్రమంగా బలపడుతున్నాయి. అఖిలభారత ట్రేడ్ యూనియన్ కాంగ్రెసు పారిశ్రామిక సంబంధాల రంగంలో అడుగుపెట్టింది. ప్రభుత్వం అంతర్జాతీయ కార్మిక సంస్థకు (ఐ.ఎల్.ఓ.) ప్రతినిధులను ఎంచుకొనడం కోసం దీనిని ఉపయోగించుకొనేది. ఇది కార్మికసంఘాల సంఖ్యాభివృద్ధి మీద ఆధారపడి బలపడసాగింది. ఈ సంఘాలకు యువక జాతీయవాదులు నాయకత్వం వహించే వారు. శ్రామికవర్గంతో సంబంధాలు ఏర్పడడంతో, ఈ యువకులకు సామ్రాజ్య వ్యతిరేక భావాలలో తీవ్రతా, సాంఘిక న్యాయాన్ని గురించిన పట్టుదలా అలవడ్డాయి.

శ్రామికవర్గంలో ప్రవేశించి, వారి పోరాటాలలో చురుగ్గా పాల్గొనిన యువక జాతీయ వాదులు పునాదిగా దేశంలో తీవ్రవాద సామ్రాజ్య వ్యతిరేకోద్యమమూ, సాంఘిక, సాంస్కృతిక



విప్లవమూ, సోషలిస్టు ఉద్యమమూ విజృంభించాయి. బొంబాయి, కలకత్తా మొదలైన పారిశ్రామిక నగరాలలో చెదురుబొదురుగా సోషలిస్టు గ్రూపులూ, కమ్యూనిస్టు గ్రూపులూ తలయెత్తాయి. అవి క్రమంగా ఇతర రాజకీయ కేంద్రాలకు కూడా పాకాయి. ఆఖరుకు వర్కర్స్ అండ్ పెజంట్స్ పార్టీ లాంటివి ఏర్పడ్డానికి అవి దోహదం చేశాయి.

తీవ్రవాద సామ్రాజ్య వ్యతిరేకాభిప్రాయాలు వ్యాపించినది శ్రామికవర్గంలో పనిచేయ పూనుకొన్నవారిలోనేకాదు, పట్టణ మధ్యతరగతులలో పనిచేసేవారిలో కూడ ఈ అభిప్రాయాలు వ్యాప్తం అయినాయి. వారిలో కొందరు వ్యక్తిగత దౌర్జన్యవాద ధోరణిని స్వీకరించారు. సహాయ నిరాకరణోద్యమానంతరం దేశంలో ఇటువంటి గ్రూపుల సంఖ్య పెరిగింది. దానితోపాటు వారి కార్యక్రమాలూ ఎక్కువైనాయి. అయితే ఈ వ్యక్తిగత దౌర్జన్యవాద విధానాన్నిగాని, గాంధీజీ చెప్పిన అహింసాసూత్రాన్నీ నిర్మాణ కార్యక్రమాన్నీగాని, స్వరాజ్య పార్టీవారి శాసనసభా ప్రవేశాన్నిగాని అంగీకరించని గ్రూపులు కొన్ని దేశంలో వున్నాయి. ఈ తీవ్రవాద సామ్రాజ్య వ్యతిరేకుల వీరత్వమూ, త్యాగనిరతీ చూచి, కాంగ్రెసు వాదులలో చాలమంది వారిని మెచ్చుకొనేవారు. వారి రాజకీయాలతో అంగీకారం లేకపోయినా స్వాతంత్ర్యం కోసం పోరాడుతున్న జాతికి నిజమైన వారసులుగా వారిని భావించేవారు.

ఈ తీవ్రవాద సామ్రాజ్య వ్యతిరేకులు దేశం అంతటా చిన్న చిన్న గ్రూపులుగా ఏర్పడి పనిచేసేవారు. వారి కార్యక్రమాల్ని నడిపించేటందుకు దేశం మొత్తంమీద కేంద్ర నాయకత్వం ఏదీ లేదు. విధానాలను గురించి వీటిమధ్య తీవ్రమైన భేదాభిప్రాయాలుండేవి. స్వరాజ్య పార్టీవారికి నో ఛేంజర్లకూ, పరిమిత సహకార వాదులకూ (Responsive Co-operators) ఇతర స్వరాజ్య పార్టీవారికీ, కాంగ్రెసు వాదులకూ మితవాదులకూ మధ్యనున్న భేదాభిప్రాయాలంత నిశితంగానూ అవి వుండేవి. అయితే లార్డ్ బర్కెన్ హెడ్ విసిరిన సవాలుమీద దేశవ్యాప్తంగా చర్చలు జరగడం, ఆ సవాలును కాంగ్రెసు స్వీకరించడం, అఖిలపక్ష సమావేశం, నెహ్రూ రిపోర్టు – ఇవన్నీ ఈ గ్రూపులను ఏకం చేయగల జాతీయ గమ్యాన్ని సమకూర్చాయి.

నెహ్రూ రిపోర్టును బలపరచిన రాజకీయవేత్త లందరికీ ప్రతిగా ఈ తీవ్రవాద సామ్రాజ్య వ్యతిరేకులు సంపూర్ణ స్వరాజ్య నినాదం క్రింద ఏకీకృతులయ్యారు. కెనడా, ఆస్ట్రేలియాలు, బ్రిటిష్ సామ్రాజ్యంలోని ఇతర ప్రాంతాలూ అనుభవిస్తున్న మాదిరి అధినివేశ స్వాతంత్ర్యం సాధించాలనే కోరికమీదనే గాంధీజీ, మోతీలాల్ నెహ్రూ, మితవాదులూ, తదితరులూ ఏకాభిప్రాయానికి రాగలిగారు. తీవ్రవాద సామ్రాజ్య వ్యతిరేక గ్రూపులన్నీ ఈ గమ్యాన్ని వ్యతిరేకించాయి. అధినివేశ ప్రతిపత్తి అనే అభిప్రాయాన్నే కాంగ్రెసు

విడనాడాలనీ, బ్రిటిష్ సామ్రాజ్యం నుంచి పూర్తిగా విడిపోవడమే భారతదేశ పోరాటానికి గమ్యంగా స్వీకరించాలనీ వారు కోరారు.

కాంగ్రెసు బయటనున్న తీవ్రవాదులేగాక, కాంగ్రెసు లోపలనున్న తీవ్రవాదులు కూడ ఈ కోరికను బలపరిచారు. సాధారణ కాంగ్రెసువాదులేగాక జవహర్‌లాల్ నెహ్రూ వంటి సమర్థులయిన కాంగ్రెసు నాయకులు కూడా దానిని బలపరిచారు. ఆ నా డాయన కాంగ్రెసు ప్రధాన కార్యదర్శిగా వుండేవాడు. అఖిలపక్ష సభకు ప్రధాన కార్యదర్శిగా పనిచేసినవాడే కూడ. దేశబంధుదాసు తర్వాత బెంగాల్ కాంగ్రెసుకు నాయకత్వం వహించిన సుభాష్‌చంద్రబోసు, గౌహతీలో జరిగిన కాంగ్రెసు మహాసభ అధ్యక్షుడు శ్రీనివాస అయ్యంగార్, కాంగ్రెసు శాసనసభ్యులలో సమర్థుడుగా పేరొందిన సత్యమూర్తి మొదలయిన వారంతా ఈ కోరికను సమర్థించారు. సంపూర్ణ స్వరాజ్య నినాదం కాంగ్రెసు ప్రజానీకాన్ని బాగా ఆకర్షించింది. 1927లో మద్రాసులో జరిగిన కాంగ్రెసు మహాసభ సంపూర్ణ స్వరాజ్యమే కాంగ్రెసు గమ్యమని ప్రకటించింది.

ఈ అభిప్రాయానికి గాంధీజీ పూర్తిగా వ్యతిరేకి. మొదటి ప్రపంచయుద్ధం రోజుల్లోనే చెప్పినట్లు ఆయన బ్రిటిష్ సామ్రాజ్యానికి మిత్రుడు. సామ్రాజ్యంతో సంబంధం కలిగి ఉండడం వలన రావలసిన లాభాలూ, ప్రయోజనాలూ భారతీయులకు, తదితర పాలిత ప్రజలకు లభించడం లేదనేదే ఆయన అభ్యంతరం. అందుచేతనే కెనడా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ ప్రజలకున్న హక్కులే భారతీయులకూ వుండాలని ఆయన కోరాడు. మద్రాసు కాంగ్రెసు తీర్మానాన్ని ఆయన పూర్తిగా వ్యతిరేకించాడు. ఆ సంగతి స్పష్టంగా చెప్పేశాడు కూడా :

> "ఈ మాదిరి తీర్మానాలను అమలుజరపడానికి శక్తిలేని దశలో ఏటా వాటిని పునరుచ్చరించడం వలన కాంగ్రెసు నిర్వీర్యమవుతుంది. అల్లాంటి తీర్మానాలను చేయడమంటే మన అసమర్థతను చాటుకోవడమే. విమర్శకులు మనల్ని చూచి నవ్వుతారు. శత్రువు ఈసడింపులకు గురియవుతాము... మనం బడిపిల్లల డిబేటింగ్ సొసైటీ దశకు వచ్చాం."

సంపూర్ణ స్వరాజ్యం తన ఆశయమని తీర్మానించిన మద్రాసు కాంగ్రెసు తర్వాత రెండేళ్ళకు 1929లో లాహోరులో కాంగ్రెసు మహాసభ జరిగింది. ఆ సభలో సంపూర్ణ స్వరాజ్యం సాధించడం తన ఆశయం అనిగాక 'తక్షణ గమ్యం'గా పేర్కొంది. మద్రాసు తీర్మానంమీదనే చాల వాదప్రతివాదాలు సాగాయి. మాట తేడాయేతప్ప అధినివేశ స్వరాజ్యానికీ సంపూర్ణ స్వాతంత్ర్యానికీ తేడా ఏమీ లేదని మహాత్మాగాంధీ, మోతీలాల్ నెహ్రూలిద్దరూ జవహర్‌లాల్ నెహ్రూ, సుభాష్ చంద్రబోస్, శ్రీనివాస అయ్యంగార్

మొదలయిన నాయకుల్ని ఒప్పించడానికి ఎంతైనా శ్రమపడ్డారు. గాంధీజీ 1928 జనవరి 12న 'యంగ్ ఇండియా'లో ఇల్లా వ్రాశారు:

"స్వరాజ్యం సర్వకాలాలకీ సర్వజనులకూ సంతృప్తిగలిగించే గమ్యం అని నా భావం. ఇంగ్లీషు తెలిసిన భారతీయులు వేళ్ళమీద ఎన్నదగినంత కొద్దిమంది. వారు తామే భారతదేశం అనే భ్రమలో వుంటారు. 'ఇండిపెండెన్సు' అనే ఇంగ్లీషు మాటకు ఒక దేశభాషా పర్యాయపదాన్ని అందరికీ అర్థం అయ్యే పదాన్ని ఎవరైనా చెప్పగల వాళ్ళున్నారా అని సవాలు చేస్తున్నాను. ముప్ఫయి కోట్లమందికీ అర్థం అయ్యే ఏ దేశిపదమైనా ఉపయోగించి మన అభిప్రాయాన్ని వ్యక్తం చేయవచ్చు. స్వరాజ్యం అనేది అల్లాంటి పదాలలో ఒకటి. దానిని మొదల దాదాభాయ్ నౌరోజీ వాడారు. ఇండిపెండెన్సు అనే మాటకు అర్థం అందులో ఇమిడివుంది. అది దానికన్న మంచిమాట." (సం. 2, పుట 428)

మరో ఏడాది పోయాక, కలకత్తా మహాసభను పరిసమాప్తం చేస్తూ మోతీలాల్ నెహ్రూ ఇల్లా అన్నారు :

"నేను సలహా ఇస్తా వినండి. ఇండిపెండెన్సు అనీ, డొమీనియన్ స్టేటస్ అనీ విదేశీ భాషనుంచి ఎరువు తెచ్చుకొన్న రెండు మాటలూ మరచిపోండి. 'స్వరాజ్యం' 'ఆజాదీ' అనే రెండు మాటలూ స్వీకరించండి. పేరు ఏది పెట్టినా స్వరాజ్యం కోసమే అందరం పనిచేద్దాం." (సం. 2, పుట 441)

కాంగ్రెసులోని అగ్రనాయకు లిద్దరూ ఈ విధంగా బహిరంగంగా వ్యతిరేకించినా అధినివేశ స్వాతంత్ర్యంగాక సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలనే వాంఛ ఏమాత్రమే సన్నగిల్లలేదు. పైగా రోజులు గడిచినకొద్దీ అది బలపడింది. జవహర్‌లాల్ నెహ్రూ, సుభాష్ చంద్రబోస్, శ్రీనివాస అయ్యంగార్, సత్యమూర్తి మొదలయినవారు కాంగ్రెసులోనే భారత స్వాతంత్ర్య సమితి అనే సంఘాన్ని ప్రారంభించారు. వేలకొలది యువ కాంగ్రెసువాదులు దాని అండ చేరారు. కాంగ్రెసులో ప్రత్యామ్నాయ నాయకత్వం తయారయ్యేదే. కాని గాంధీజీ పరిస్థితుల్ని పసికట్టారు. అధినివేశ స్వరాజ్యవాదులకూ, సంపూర్ణ స్వాతంత్ర్యవాదులకూ మధ్య రాజీ కుదర్చ తలపెట్టారు. సంపూర్ణ స్వాతంత్ర్యం తన ఆదర్శమే అయినా బ్రిటిష్ ప్రభుత్వం ఒక ఏడాదిలోపున అధినివేశ స్వరాజ్యం ఇచ్చేటట్లయితే కాంగ్రెసు దానిని అంగీకరిస్తుంది. అలా అధినివేశ స్వరాజ్యం ఇవ్వకుంటే గాంధీ – మోతీలాల్ నెహ్రూ మొదలయినవారు తాము కూడా కాంగ్రెసు ఆశయాన్ని సంపూర్ణ స్వాతంత్ర్యంగానే స్వీకరిస్తారు. దాన్ని సాధించేటందుకు దౌర్జన్య రహిత సహాయ నిరాకరణోద్యమాన్ని నడిపిస్తారు. ఇదీ ఆయన సూచించిన రాజీ.



ఈ రాజీ ధోరణిని కలకత్తా కాంగ్రెసులో తీర్మాన రూపంలో ప్రవేశపెట్టదలచారు. దీనికి మొదట జవహర్‌లాల్ నెహ్రూ, సుభాష్ చంద్రబోస్ అంగీకరించారు. కాని తమ అనుచరవర్గాల వొత్తిడికి తట్టుకోలేక రాజీ తీర్మానానికి ఒక సవరణను ప్రతిపాదించ వలసివచ్చింది. ప్రతినిధులలో అధిక సంఖ్యాకులు (1350 మంది) గాంధీజీ తెచ్చిన రాజీ తీర్మానానికి అనుకూలంగా ఒక సంవత్సరంపాటు వేచి వుండడానికి ఓటు చేశారు. కాని వ్యతిరేకించిన వారి సంఖ్య తక్కువేమీ కాదు. 973 మంది ఆ విధంగా వ్యతిరేకించారు. అధినివేశ స్వరాజ్య రాజకీయాలన్నా, రాయబారాలన్నా జనంలో ఎంత అనాసక్తి వుందో అర్థం చేసుకోడానికి ఆ సంఖ్య తోడ్పడుతుంది.

గాంధీ, మోతీలాల్ మొదలయినవారి కోరికను మన్నించే సద్బుద్ధి బ్రిటిష్ ప్రభుత్వానికి లేదు. కాంగ్రెసువాదులలో అత్యధిక సంఖ్యాకులు అధినివేశ స్వరాజ్యమంటే కూడ సంతృప్తిపడే స్థితి లేదు. ఆ దశలో బ్రిటిష్‌వాళ్ళు రాష్ట్రీయ స్వపరిపాలన కన్న అధికంగా ఒప్పుకోడానికి సిద్ధంగాలేరు. దానికైనా ఎన్నో మినహాయింపులు. ముస్లిములకు తదితర అల్పసంఖ్యాక ప్రజలకు 'రక్షణల' మాట అల్లావుండగా, భూస్వామ్య వర్గాలకు, యూరోపియన్‌లకు తదితరుల స్వార్థ ప్రయోజనాలకు బోలెడన్ని 'రక్షణ బందోబస్తులు' పెట్టారు. గాంధీ – మోతీలాల్ మొదలయిన నాయకులు సప్రూవంటి మితవాద నాయకుల తోడ్పాటుతో ఆఖరు నిముషం వరకూ రాయబారాలు నడిపించారు. కాంగ్రెసు పెట్టిన ఏడాది గడువు దాటిపోతూంది. లాహోరు కాంగ్రెసుకు ముందు క్షణంలోకూడ కాంగ్రెసు బ్రిటిష్ ప్రభుత్వంతో ఒడంబడికకు రావడానికి విశ్వప్రయత్నం చేసింది.

గాంధీజీ ఒకమూల బ్రిటిష్‌వాళ్ళతో రాజీకి ప్రయత్నిస్తూనే, రెండోమూల కలకత్తా కాంగ్రెసులో అనుకొన్నట్లు సంపూర్ణ స్వాతంత్ర్య వాంఛను ప్రకటించడానికి సన్నాహాలు సాగించారు. అదే ఆయనలో వున్న వైచిత్ర్యం. అలా చేస్తేనే కాంగ్రెసులో వున్న తీవ్రవాద సామ్రాజ్య వ్యతిరేకశక్తుల్ని ఒప్పించగలడు. కాంగ్రెసు యావత్తూ ఆయన నాయకత్వం క్రింద ఏకమయి నిలుస్తుంది. ఆ సంగతి ఆయనకు తెలుసు. లాహోరులో జరిగే కాంగ్రెసు మహాసభకు అధ్యక్షుడుగా జవహర్‌లాల్ నెహ్రూను సూచించడంలో ఆయన ఉద్దేశమదే.

దేశవ్యాప్తమైన ఉద్యమానికి ఈ మహాసభ పిలుపు నివ్వవచ్చుగనుక గాంధీజీయే అధ్యక్షుడుగా ఉండాలని ఆయన అనుచరులు చాలమంది వాంఛించారు. చాలమంది వల్లభభాయ్ పటేల్ పేరును సూచించారు. ఆయన నడిపించిన బార్డోలీ సత్యాగ్రహం విజయం పొందింది. సంపూర్ణ స్వాతంత్ర్యం సంపాదించాలంటే ఆ పద్ధతులలో పోరాటం నడపవలసి వుంటుందని చాలమందిలో ఒక అభిప్రాయం వుండింది. అందుచేత ఆయన

అధ్యక్షుడుగా ఉండడం బాగుంటుందని వారి ఆలోచన. కాని, ఈ రెండు ప్రతిపాదనలనూ గాంధీజీ త్రోసిపుచ్చారు.

పెద్దలు తప్పుకొని, పిన్నలకు అధికారం వప్పచెబితే కాంగ్రెసు ధ్వంసమయి పోతుందని భయపడ్డవారికి గాంధీజీ ఇలా జవాబు చెప్పారు :

"ఆయనకు (జవహర్‌లాల్‌కు) క్రమశిక్షణ అంటే చాల ఇష్టం. చికాకు కలిగించినా క్రమశిక్షణను దాటకుండా వుండగలవని ఆయన నిరూపించాడు. తన పరిసరాలను దాటి ఆలోచించే తీవ్రవాది ఆయన. అయితే వినయ విధేయతలు కూడ కలవాడు. తెగేదాకా లాగేరకం కాదు." (సం. 2, పుట 489-90)

దేశ యువకుల్ని హెచ్చరిస్తూ గాంధీజీ అది ఒక పరీక్షా సమయమనీ, జవహర్ లాల్‌ను అధ్యక్షుడుగా ఎన్నుకోవడం వారు చేసిన సేవకు గుర్తింపు అనీ వివరిస్తూ ఇలా చెప్పారు :

"ఆవిరిని బలమైన చిన్న పెట్టెలో బంధించినప్పుడే అదొక మహాశక్తి అవుతుంది. విపరీతమైన కదలికను పుట్టిస్తుంది. అదేవిధంగా దేశంలోని యువకులు తమలో అనంతంగా వున్న శక్తిసంపదను బుద్ధిపూర్వకంగా నియమబద్ధం చేసుకొని అవసరమైనంత చొప్పున ఒక పద్ధతిలో ఖర్చుచేయాలి."

ఈ విధంగా గాంధీజీ నో ఛేంజర్లనూ, స్వరాజ్య పార్టీవారినీ ఏకముఖం చేయడానికి జవహర్‌లాల్ ఎన్నికను ఒక సాధనంగా చేసుకొన్నారు. దేశంలో ముఖ్యంగా యువకుల్లో పొంగిపొరలుతున్న సామ్రాజ్య వ్యతిరేకావేశాలను నియమబద్ధం చేసి అవసరమైనంత పరిమితిలో వాటిని ఒక పద్ధతి ప్రకారం ఖర్చుచేయడానికై ఆయన చేసిన మొదటి ప్రయత్నం కూడా ఇదే. ఆధునిక సోషలిజం సాధనకై సాగే అతివాదోద్యమం తన (బూర్జువా) నాయకత్వం క్రిందనే ఉండేటట్లు ఆయన చొరవ తీసుకుని ప్రయత్నించారు. స్వతంత్రంగా వర్గపోరాట పద్ధతులలో అది కొనసాగేటట్లు వదలివేయడం ఆయన కిష్టంలేదు.

జవహర్‌లాల్ కాంగ్రెసు అధ్యక్షుడు కావడమూ, లాహోరులో సంపూర్ణ స్వాతంత్ర్య తీర్మానం ఆమోదింపబడడమూ తమ విజయమేనని సంపూర్ణ స్వాతంత్ర్య వాదులు భావించారు. కాని ఈ విజయం నిజానికి అధినివేశ స్వరాజ్యవాదులకు సంపూర్ణ స్వాతంత్ర్య వాదులకు మధ్య రాజీకి విజయం అని చెప్పాలి. కలకత్తాలో జరిగిన రాజీ ప్రయత్నాలు విఫలమైనాయి. ఇక్కడ అవి విజయం పొందాయి. టెండూల్కరు తన పుస్తకంలో ఉదాహరించిన రెండు పత్రాల భాగాలను చూస్తే ఆ రాజీ ఎటువంటిదో అర్థం అవుతుంది.

లాహోర్ మహాసభకు కొద్ది వారాలు ముందు గాంధీజీ ఒక వ్యాసంలో ఇల్లా వ్రాశారు :

"భారతదేశం స్వతంత్ర ప్రతిపత్తి కలిగి, ఆత్మగౌరవం గల దేశంగా మనగలగాలనే కోరిక నిజంగా బ్రిటిష్ ప్రజలలో కలగడం, వారి హృదయాలు పరివర్తన చెందడం జరిగితే, భారతదేశంలోని ఉద్యోగులు నిజమైన సేవాభావంతో వ్యవహరిస్తే అధినివేశ స్వరాజ్యం అమలు జరుగుతున్నట్లే లెక్క. అటువంటి పరిస్థితి కనబడితే, అధినివేశ రాజ్యాంగం మరికొంత కాలానికి వచ్చినా విచారం లేదు...... అధినివేశ స్వరాజ్యం అంటే నాకు ఇష్టం పుట్టినప్పుడు బ్రిటిష్‌వాళ్ళతో సంబంధం తెంచుకుపోగల అధికారం ఉండడమేనని నా అభిప్రాయం." (సం. 2, పుట 502; క్రింది గీతలు నావి)

గాంధీజీ అభిప్రాయాల్నే జవహర్‌లాల్ నెహ్రూ కూడ తన అధ్యక్షోపన్యాసంలో ఇలా ప్రతిధ్వనించారు :

"మన అభిప్రాయంలో స్వాతంత్ర్యమంటే బ్రిటిష్ పెత్తనంనుంచీ, బ్రిటిష్ సామ్రాజ్యంనుంచీ బయటపడడం. ఇండియా స్వాతంత్ర్యం పొందాక ప్రపంచ దేశాల సహకారానికీ, సమాఖ్యకూ జరిగే ప్రయత్నాలన్నింటికీ స్వాగతమిస్తుంది. తాను సమాన హోదాతో పాల్గొనగల ఒక పెద్ద గ్రూపులో సభ్యత్వం కలిగి వుండేటందుకై తన స్వాతంత్ర్యాన్ని పరిమితం చేసుకొనేటందుక్కూడా సిద్ధపడుతుంది." (సం. 2, పుట 504; క్రింది గీతలు నావి)

మరొకలా చెప్పాలంటే, గాంధీజీ సంపూర్ణ స్వాతంత్ర్యాన్ని అంగీకరిస్తూ దానికి తన కిష్టం అయిన అర్థం చెప్పుకొన్నారు. స్వాతంత్ర్యం వచ్చాక దానిని పరిమితం చేయడానికి జవహర్‌లాల్ ఒప్పుకొన్నాడు.

ఈ విధంగా భేదాభిప్రాయం చాలవరకు పరిష్కారమయింది. గాంధీజీ అనుకొంటున్న స్వాతంత్ర్యమైనా, జవహర్‌లాల్ అంటున్న స్వాతంత్ర్యమైనా బ్రిటిష్‌వాళ్ళ నుంచి గుంజుకోవాలంటే దేశవ్యాప్తంగా పోరాటం అవసరమని తేలింది. అందుచేత కలకత్తాలో చేసిన సంపూర్ణ స్వాతంత్ర్య తీర్మానాన్ని అమలుజరపవలసి వచ్చింది. పోరాటానికి సన్నద్ధం కావలసివచ్చింది. అందుకే లాహోర్ కాంగ్రెసులో గాంధీజీ ఇల్లా అన్నారు :

"మన మిప్పుడో నూతన యుగంలో ప్రవేశిస్తున్నాం. సంపూర్ణ స్వాతంత్ర్యం మన సుదూరగమ్యం కాదు; మన గమ్యం అది."



# 6. ఉప్పు సత్యాగ్రహం

నిజానికి మన జాతి ఒక నూతనయుగంలో అడుగుపెడుతూంది. ప్రజానీకంలో నూతన పోరాట వెల్లువ విజృంభిస్తూంది. 1922లో గాంధీజీ శాసనోల్లంఘనోద్యమాన్ని విరమించినప్పుడు నిస్పృహచెందిన యువతీ యువకులు వేలసంఖ్యలో ముందుకువచ్చారు. స్వాతంత్ర్య పోరాటంలో సుశిక్షితులైన సైనికుల మాదిరిగా పాల్గోవడానికి ఉత్సుకత చూపారు. 1930 జనవరి 26న స్వాతంత్ర్య దినోత్సవాలు చేయమని కాంగ్రెసు వర్కింగ్ కమిటీ ఆదేశించింది. ఆ రోజు దేశమంతటా బ్రహ్మాండమైన ప్రదర్శనలు జరిగాయి. జవహర్‌లాల్ అధ్యక్షతన కాంగ్రెసు కార్యవర్గం ప్రకటించిన "స్వాతంత్ర్య ప్రతిజ్ఞ" చాల ఉత్సాహభరితమైన పత్రాలలో ఒకటి. విదేశీ పాలకుల దుష్పరిపాలనను, దురంత చర్యలను చాల తీవ్రంగా నిరసిస్తూ విదేశీ పాలనను కడముట్టించేవరకూ పోరాటం మానవద్దని దేశంలోని యువదేశభక్తుల కది విజ్ఞప్తి చేసింది. ఆనాడు స్వాతంత్ర్య దినోత్సవాలను జరపడానికై పల్లెలూ, పట్టణాలూ ఒకదానితో ఒకటి పోటీపడ్డాయి. కలకత్తా, బొంబాయి మొదలయిన నగరాలలో వేలసంఖ్యలో ప్రజలు సమావేశమయి ప్రతిజ్ఞలు తీసుకొన్నారు. అసంఖ్యాకమైన గ్రామాలలో సభలు జరిగాయి. వేలసంఖ్యలో ప్రజలు ప్రతిజ్ఞలు తీసుకొన్నారు. (సం. 3, పుట 12)

ఉప్పుచట్టాన్ని ధిక్కరించ నిర్ణయించడమూ, గాంధీజీ దండియాత్ర చూశాక సంపూర్ణ స్వాతంత్ర్య సంపాదనకై పెద్ద ప్రజా ఉద్యమం ప్రారంభమైనట్లే భావించబడింది. మొదట దండిలో గాంధీజీ, తర్వాత అనేకచోట్ల అనేకమంది నాయకులూ ఉప్పుచట్టాన్ని పెద్దయెత్తున ధిక్కరించడానికి పూనుకోవడంతో, బ్రిటిషువాళ్ళు చేసిన ఆ చట్టధిక్కరణను చూడడానికై

స్త్రీలు, పురుషులు, శిశువులు వేలసంఖ్యలో హాజరయ్యారు. అరెస్టుల్ని, లాఠీఛార్జీలను, కాల్పుల్ని లెక్కచేయకుండా ప్రజలు కాంగ్రెసు ఆదేశాన్ని శిరసా వహించారు. ఉద్యమంలో పాల్గొన్నారు.

దిగువ వర్ణనచూస్తే ఆనాడు ప్రజల ఆవేశాలు ఎల్లా ఉన్నాయో గ్రహించవచ్చు.

"కలకత్తా, మద్రాసు, కరాచీలలో కాల్పులు జరిగాయి. దేశమంతటా లాఠీఛార్జీలు జరిగాయి. ఊరేగింపుల్నీ, సభల్నీ నిషేధించారు. విదేశీ బట్టల దుకాణాల వద్దా, కల్లు దుకాణాల వద్దా పికెటింగు తీవ్రతరంచేసి ప్రజలు ఎదురొడ్డారు.

"ఏప్రిల్ 18వ తేదీన చిట్టగాంగ్ ఆయుధాగారంమీద దాడి జరిగింది. ఏప్రిల్ 23న పెషావరులో పెద్ద పెద్ద ప్రదర్శనలు జరిగి విప్లవావేశాలు మహోన్నతస్థాయి నందుకున్నాయి. ఆ మరునాడే ఖాన్ అబ్దుల్ గఫార్‌ఖాన్‌ను అరెస్టు చేశారు. నూతనంగా ఏర్పడిన ఖుదైఖిద్మత్ ఘర్ (దేవుని సేవకులు) లేక రెడ్‌షర్టు సంస్థకు ఆయన నాయకుడు. ఆయనను నిర్బంధించిన ప్రదేశాన్ని వేలమంది ప్రజ చుట్టుముట్టారు. పెషావరులో గొప్ప ప్రదర్శనం జరిగింది. ఆవేశభరితులై వున్న ప్రదర్శకులను లొంగతీయడానికై అధికార్లు సాయుధ మోటార్లను పంపారు; ప్రజలొక కారును తగులబెట్టారు. దానిలో వున్నవాళ్ళు తప్పించుకు పారిపోయారు; అందుపైన జనసమూహంమీద పెద్దయెత్తున కాల్పులు సాగించారు. వందల సంఖ్యలో జనం చచ్చిపోయారు, గాయపడ్డారు. 18వ రాయల్ ఘూర్వాలీ రైఫిల్స్‌కు చెందిన రెండవ బెటాలియన్ తాలూకు రెండు ప్లాటూర్లు (ప్రదర్శకులు ముస్లిములు, వీరు హిందువులు) కాల్చడానికి నిరాకరించాయి. సైనికులు పంక్తులు వదిలేశారు. చాలమంది ఆయుధాలను తిరిగి ఇచ్చేశారు." (సం. 3, పుట 44)

**గాంధీజీని అరెస్టుచేయడంతో కల్లోలం ప్రారంభమయింది.**

"గాంధీజీ అరెస్టుతో దేశమంతటా సమ్మెలూ, హర్తాళ్ళూ ప్రారంభమైనాయి. బొంబాయిలో రమారమి 50 వేలమంది బట్టల మిల్లు కార్మికులు సమ్మె చేశారు. ప్రదర్శనంలో రైల్వేపనివారు కూడా కలిశారు. బ్రహ్మాండమైన ఊరేగింపు జరిగింది. పోలీసులు ఆ ప్రాంతానికి రావడానిక్కూడా భయపడినంత పెద్దది అది. బట్టల వర్తకులు ఆరు రోజులు హర్తాళ్ చేయడానికి నిర్ణయించారు. గాంధీజీని పూనాలో గృహ నిర్బంధంలో వుంచారు. అక్కడ గౌరవోద్యోగులూ, ప్రభుత్వోద్యోగులూ రాజీనామా లివ్వడం ఎక్కువయింది.

"విప్లవోత్సాహం మహోచ్ఛదశలో వుంది. షోలాపూర్‌లో ప్రజలు ఒక వారంపాటు పట్టణాన్ని స్వాధీనం చేసుకొని ప్రభుత్వ పోలీసుల్ని తీసేసి, తమ పోలీసులను నియమించారు. ప్రజల పరిపాలనను నెలకొల్పారు. చివరకు ప్రభుత్వం అక్కడ సైనిక శాసనాన్ని ప్రకటించింది. మైమన్‌సింగ్, కలకత్తా, కరాచీ, లక్నో, ముల్తాన్, ఢిల్లీ, రావల్పిండి,

మర్దాన్, పెషావర్లలో గందరగోళాలు జరిగాయి. సైన్యాలను, విమానాలను, టాంకుల్ని, తుపాకుల్ని, మందుగుండు సామగ్రిని ప్రభుత్వం రంగంలోకి దింపింది. పశ్చిమోత్తర పరగణాల్లో వీనిని యథేచ్ఛగా వాడారు. పఠాన్లమీద 500 టన్నుల బాంబులు వేశారు. కాని, వారి విప్లవోత్సాహం మొక్కవోలేదు. రెడ్‌షర్టుల సంఖ్య రెండువందల నుంచి 80 వేలకు పెరిగింది కూడా. పంజాబులో ప్రభుత్వం సాగించిన దమననీతి 'అహ్రార్' అనే ముస్లిం తీవ్రవాది సంస్థ నిర్మాణానికి దారితీసింది." (సం. 3, పుట 49)

ఒకమూల ప్రజలు కాంగ్రెసు ఆదేశాన్ని అద్భుతంగా గౌరవిస్తున్నారు. అయినా రెండోమూల గాంధీజీతోపాటు కాంగ్రెసు నాయకత్వం ప్రజల ఉత్సాహాన్నీ, పోరాట అభినివేశాన్నీ బూర్జువావర్గానికి కష్టం కలిగించని మార్గాలలోకి మళ్ళించడానికై శక్తివంచన లేకుండా ప్రయత్నిస్తున్నారు. దీనికి వారనేక మార్గాలు తొక్కారు.

మొదటిది : తక్షణాశయం సంపూర్ణ స్వాతంత్ర్యమని ఒప్పుకున్నా, కార్య రూపంలోకి వచ్చేసరికి తాము వ్రాసిన స్వాతంత్ర్య ప్రతిజ్ఞ కాగితంమీద సిరా కూడా ఆరకపూర్వమే దానికి సెలవిచ్చేశారు. వైస్రాయి ప్రకటనమీద వ్యాఖ్యానిస్తూ గాంధీజీ "స్వయంపాలన ఆకారం లేకపోతేమానే, దాని సారం అయినా ఇవ్వడానికి బ్రిటన్ సిద్ధంగా వుంటే శాసనోల్లంఘనాన్ని" ఆపివేయ సిద్ధంగా వున్నానన్నారు. ఆయన పదకొండు అంశాలు కోరారు : దేశమంతటా మద్యనిషేధం పెట్టాలి; రూపాయి మారకపు రేటును 1 షి. 4 పెన్నీలకు మార్చాలి; భూమిపన్నును సగానికి తగ్గించాలి; సైనిక వ్యయాన్ని తగ్గించాలి. ఆ ప్రయత్నంలో వెంటనే నూటికి ఏభయి వంతులు తగ్గించాలి; ఐ.సి.ఎస్. ఉద్యోగుల జీతాలు సగానికి తగ్గించాలి; విదేశీ బట్టల దిగుమతిపై రక్షణ సుంకం విధించాలి; తీర వ్యాపారాన్ని భారతీయ నౌకలకే కేటాయిస్తూ బిల్లు తేవాలి; హత్యా నేరాలకు, హత్యాప్రయత్న నేరాలకు అరెస్టు చేసినవారిని తప్ప రాజకీయ ఖైదీలందర్నీ విడుదల చేయాలి; సి.ఐ.డి. శాఖను రద్దుపరచాలి – లేదా అదుపులో వుంచాలి; ఆత్మరక్షణకై తుపాకీ లైసెన్సులివ్వాలి. అలా ఇవ్వడంలో ప్రజా ప్రతినిధి సంస్థలకు విచక్షణాధికారం వుండాలి.

ఈ పదకొండు అంశాలనూ పేర్కొంటూ గాంధీజీ ఇలా అన్నారు :

"ఈ అవసరాలు చాల చిన్నవే.కాని భారతదేశానికి చాల ప్రధానమైనవి. వైస్రాయి ఈ కోరికలను పరిపూర్తి చేయనీయండి. ఇక శాసనోల్లంఘనం మాటే ఆయన చెవినిబడదు."

రెండోది : జనసముదాయంచేత శాసనోల్లంఘనం చేయించాలంటూనే, ప్రత్యక్ష కార్యాచరణ కొద్దిమంది సత్యాగ్రహులకు మాత్రమే పరిమితం చేసేటందుకు ప్రయత్నించారు. గుజరాత్ విద్యాపీఠం విద్యార్థుల నుద్బోధిస్తూ గాంధీజీ ఇల్లా అన్నారు :

"జనాధిక్యత మీదగాక యోగ్యతమీద మనం ఎక్కువ నమ్మకం ఉంచుతాము. ఆదేశాన్ని

పాటించి వచ్చే అసంఖ్యాక ప్రజలమీదకన్నా నేను ఆశయం కోసం సర్వ త్యాగం చేయగల కొద్దిమంది మీదనే నమ్మకం ఉంచుతాను. అందుకే శాసనోల్లంఘన తీర్మానం హెచ్చు మందిని కదిలించింది." (సం. 3, పుట 2)

మూడోది : ఉద్యమాన్ని పరిమితపరచడం కోసమే కోట్లకొలది రైతుల, కూలీల, ఇతర శ్రమజీవుల కోరికలను పై పట్టికలో చేర్చలేదు. కార్మికులూ, రైతులూ తమ యజమానుల నుంచీ, భూస్వాముల నుంచీ వడ్డీ వ్యాపారుల నుంచీ కోరేవేవీ పై పదకొండు అంశాలలో లేవు. రైతులకు సరాసరి సంబంధించిన దేమన్నా వుందంటే ఒక్క పన్ను సగానికి సగం తగ్గించాలనే దొక్కటే. కౌలురేటు తగ్గించాలని, ఋణ విమోచన జరగాలని, బేదఖళ్ళు నిలపాలని, కార్మికులకూ ఉద్యోగులకూ తగుపాటి జీతాలివ్వాలని మొదలయిన సమస్యలు వేనినీ గమనించనే లేదు.

ఇది జరిగిన మరో ఏడాదికి కరాచీ కాంగ్రెసులో చేసిన ప్రాథమిక హక్కుల తీర్మానంలో కాంగ్రెసు నాయకులు కష్టజీవుల కోరికలలో చాలవానిని అంగీకరించారు. పారిశ్రామిక కార్మికులకు కనీస వేతనాలు, పరిమితమైన గంటలు, మంచి పని పరిస్థితులు, ముసలితనంలో జబ్బు చేసినప్పుడు ఉద్యోగం లేనప్పుడు ఆర్థిక ఇబ్బందులు కలగకుండా రక్షణ మొదలయినవానినీ, రైతులు ఇచ్చే పన్నులూ, భూమిశిస్తులూ బాగా తగ్గించడం, ఆర్థికంగా కిట్టుబాటుకాని కమతాలకు అవసరమనుకొన్నంతకాలం మక్తా తగ్గించడం మొదలయినవానినీ కాంగ్రెసు కార్యక్రమంలో చేర్చారు. అయినా ఆ తీర్మానాన్ని ప్రతిపాదిస్తూ గాంధీజీ ఇచ్చిన ఉపన్యాసం గమనించతగి వుంది :

> "శాసనసభ్యులు కానివారికి, రాజ్యాంగ సంబంధమైన చిక్కుసమస్యలపై ఆసక్తి లేనివారికి, దేశ పరిపాలనా వ్యవహారాలలో ఎక్కువ శ్రద్ధ చూపనివారికే ఈ తీర్మానం ఉద్దేశించబడింది. స్వరాజ్యము లేక రామరాజ్యము అనే దానిలో ఉండ గల స్థూల లక్షణాలు చదువులేని బీద భారత ప్రజలకు చూపడానికే ఇది ఉద్దేశింపబడింది. దండియాత్రకు పూర్వం దీనిలో కొన్నిటిని నా పదకొండు అంశాలలో చేర్చాను. అందులో అవి మరింత స్పష్టంగా వ్రాయబడ్డాయి. అవి వేరే ఒక తీర్మాన రూపంలో మీముందు ఉంచబడినాయి. వీనిని ప్రధాన తీర్మానంలో చేర్చివుంటే ప్రతినిధివర్గానికి ఆదేశంగా తయారయి గుదిబండ అయేది." (సం. 3, పుట 112-113, క్రింది గీతలు నావి)

మరొకలాగ చెప్పాలంటే, కరాచీ తీర్మానాన్ని రెండు ఉద్దేశాలతో తయారు చేశారు. ఒకటి - కాంగ్రెసు నాయకులు తమ కోరికలకోసం పోరాడుతున్నారనే భ్రమతో కష్టజీవులంతా ఉత్తేజితులయ్యేటట్లు చేయడానికి కాంగ్రెసు నాయకులకు తోడ్పడడం;

రెండు – ఆ విధంగా సంపాదించిన ప్రజాబలాన్ని ఉపయోగించి బ్రిటిష్ ప్రభుత్వం నుంచి పై పదకొండు కోరికలను గుంజుకోవడం.

అన్నిటికన్నా ముఖ్యంగా గమనించవలసిన దొకటుంది. సంపూర్ణ స్వాతంత్ర్యాన్ని తక్షణాశయంగా తీసుకొన్నా, ప్రజానీకాన్ని శాసనోల్లంఘనోద్యమంలోకి తీసుకొని వచ్చేటందుకు నిర్ణయించినా దక్షిణాఫ్రికా సత్యాగ్రహం రోజులనాటి నుంచి రూపొందించ బడిన గాంధీజీ విధానంలో చిన్నమెత్తు కూడా మార్పు రాలేదు. తన అదుపు ఆజ్ఞలలో ప్రజా ఉద్యమాన్ని ఒకవైపున నడుపుతూనే వున్నారు. రెండోవైపున ఆ ఉద్యమ బలంతో సామ్రాజ్యవాదులతో రాయబారాలు నడుపుతూనే వున్నారు. బ్రిటిష్ ప్రభుత్వంతో ఒక ఒప్పందానికి రావడమే తన ధ్యేయమని ఆయన మాటలలోనూ, చేష్టలలోనూ కూడ చూపించారు. శాసనోల్లంఘనం ప్రారంభించే ముందు ఆయన వైస్రాయికి వ్రాసిన లేఖ సువిదితం!

> "తనకంటె అధిక జనసంఖ్య కలిగి ప్రాచీనత కలిగి, నాగరికతలో తన కేమాత్రమూ తీసిపోని దేశాన్ని తెలిసో తెలియకో పీడిస్తున్న ఒక జాతిని మార్చేటందుకు – ఎన్ని కష్టాలు పడవలసివచ్చినా ప్రయత్నించవలసిందే.
>
> 'మార్చేటందుకు' అనే శబ్దాన్ని నేను బుద్ధిపూర్వకంగానే వాడాను. అహింస ద్వారా బ్రిటిష్ ప్రజలను మార్చి తాము ఇండియాకు చేసిన అపకారాన్ని వారిచేత గుర్తింపచేయాలనేది నా ఆశయం." (సం. 3, పుట 22)

గాంధీజీ నాయకత్వం క్రింద 1930లో కాంగ్రెసు ప్రారంభించిన శాసనోల్లంఘనోద్యమానికున్న ఈ మూడు లక్షణాలనూ బ్రిటిష్ ప్రభుత్వం తన వైస్రాయి లిద్దరి ద్వారా (లార్డ్ ఇర్విన్, లార్డ్ వెల్లింగ్టన్‌లు) బహు తెలివిగా ఉపయోగించుకొంది. 1930–'32 మధ్య బ్రిటిష్ సామ్రాజ్యవాదు లవలంబించిన ఎత్తుగడలు సూక్ష్మంలో చెప్పాలంటే ఇవి :

వారు సాధారణంగా మనకు తెలిసిన 'ద్వంద్వ విధానాన్నే' అవలంబించారు. ఒకవైపు ప్రజలమీద నిర్బంధాల నుపయోగిస్తూ మరోవైపు నాయకులతో రాయబారాలు నడిపారు. ఈ ద్వంద్వ విధానమే 1931లో కాంగ్రెసు నాయకులు శాసనోల్లంఘనాన్ని నిలిపివేయడానికీ, రౌండ్‌టేబుల్ సమావేశానికి కాంగ్రెసు ప్రతినిధిని పంపడానికి కారణం.

శాసనోల్లంఘనోద్యమాన్ని నిలిపి, రౌండ్‌టేబుల్ సమావేశంలో పాల్గొనే టందుకు ప్రభుత్వం కాంగ్రెసును ఒప్పించింది. తర్వాత కూడా ఇండియాలో ఒకవైపు నిర్బంధ విధానం కొనసాగిస్తూ రౌండ్‌టేబుల్ సమావేశానికి వచ్చిన కాంగ్రెసేతర ప్రతినిధులను బుట్టలో వేసుకొని, కాంగ్రెసు ప్రతినిధి ఏకాకి అయ్యేలా చేసింది. భారతదేశంలో రాజ్యాంగ



సంస్కరణలు చాల చిక్కులతో కూడుకొన్నవనీ, ఆ విషయాన్ని భారతీయ నాయకులే పరిష్కరించుకోలేకపోయారనీ, అందుకే బ్రిటిష్ ప్రభుత్వం చొరవ తీసుకొని, ఆ సమస్యా పరిష్కారానికై కుల, మత ప్రాతిపదికమీద ప్రత్యేక నియోజకవర్గాలను సూచించిందనీ ప్రపంచాన్ని నమ్మించగలిగింది.

ఆ విధంగా సామ్రాజ్యవాదులు రౌండ్‌టేబుల్ సమావేశంలో కాంగ్రెసును ఏకాకిని చేశారు. రాజ్యాంగ సంస్కరణలవంటి "చిక్కు" సమస్యలను కాంగ్రెసు పరిష్కరించలేదని "చూపించారు". తర్వాత కాంగ్రెసుమీద సరాసరి తీవ్రమైన దాడి ప్రారంభించారు. రౌండ్‌టేబుల్ మహాసభనుంచి గాంధీజీ తిరిగి వచ్చేసరికి యు.పి. పశ్చిమోత్తర పరగణాల వంటి రాష్ట్రాలలో ఆర్డినెన్సు పాలన సాగుతూంది. జవహర్‌లాల్ నెహ్రూతో సహా అనేకమంది కాంగ్రెసు నాయకులను జైళ్ళలో పెట్టారు. వైస్రాయితో రాయబారాలు జరపడానికీ, పేచీలో వున్న సమస్యలను పరిష్కరించడానికీ గాంధీజీ చేసిన ప్రయత్నాలన్నీ విఫలమైనాయి. చిట్టచివరకు గాంధీజీ, కాంగ్రెసు వర్కింగ్ కమిటీ 1931 మార్చిలో కుదుర్చుకున్న పోరాట విరమణ స్థితిని రద్దుపరచి, తిరిగి సత్యాగ్రహం ప్రారంభించడానికి నిర్ణయించారు. దానితో ప్రభుత్వం దేశాన్నంతనీ కనివిని ఎరగని భయంకర నిర్బంధ చర్యలకు గురిచేసింది.

సామ్రాజ్యవాదుల ఎత్తుగడలను కాంగ్రెసు నాయకత్వం ప్రతిఘటించ ప్రయత్నించింది. ఆ ప్రయత్నంలో వారు అనుసరించిన ఎత్తుగడలను గమనిస్తే గాంధీజీ తాత్వికాలోచనలూ, పద్ధతులూ కార్యరూపంలోకి వచ్చేసరికి ఏ విధంగా ఉంటాయో అర్థం చేసుకోవచ్చును.

ఉప్పు చట్టాల ధిక్కరణ రూపంలో శాసనోల్లంఘన ప్రారంభించే ప్రయత్నాలు జరుగుతుండగా, వారు ప్రజలలో వున్న సామ్రాజ్యవాద వ్యతిరేకాభిప్రాయాలను రేకెత్తించ పూనుకొన్నారు. రెండోవైపున బ్రిటిషు సామ్రాజ్యవాదులకు హృదయ పరివర్తన కలిగించాలనే సిద్ధాంతంతోసహా దౌర్జన్య రాహిత్యం గురించి నొక్కుతూ ప్రజల ఉద్రేకాలను అదిమి పెట్టేందుకు ప్రయత్నించారు. అందరికీ పరిచితమైన స్వాతంత్ర్య ప్రతిజ్ఞలో వా రిల్లా వ్రాశారు :

> "బ్రిటిష్ ప్రభుత్వం భారతదేశాన్ని ఆర్థికంగా, రాజకీయంగా, సాంస్కృతికంగా, ఆధ్యాత్మికంగా నాశనం చేసింది... ఈ విధంగా నాలుగు విధాల దేశాన్ని నాశనం చేసిన పరిపాలనకు తలవొంచి పడివుండడం మానవునియెడా, భగవానునియెడా కూడ అపచారం చేసినట్లే... మనం తప్పకుండా స్వాతంత్ర్యాన్ని సాధించాలంటే దౌర్జన్య పద్ధతుల ద్వారా కాదని మేము గుర్తిస్తున్నాము."

దీనికి అనుగుణంగానే పైనచెప్పిన పదకొండు అంశాల ప్రణాళికను తయారు చేశారు : అవి బ్రిటిష్ దోపిడీని వ్యతిరేకిస్తున్నాయి, కనుక బూర్జువావర్గంతో సహా అన్ని తరగతుల ప్రజలను సమీకరించగలుగుతాయి. కాని అవి దేశీయ దోపిడీదారులను వ్యతిరేకించడం లేదు. కనుక "మూకల అల్లర్లకు" దారితీయవు.

ఈ దశ గడిచి బ్రిటిష్ ప్రభుత్వంతో రాయబారాలు సాగించవలసిన కొత్త దశ ఏర్పడింది. ఈ దశలో వారు బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా బూర్జువావర్గం యొక్క ఆర్థిక, రాజకీయ పలుకుబడిని బలపరుచుకొనేటట్లుగా ఒప్పందపడేటందుకు వీలయినన్ని విధాల రాయబారాలు నడిపారు. శాసనోల్లంఘనోద్యమాన్ని నిలిపివేసేటందుకు నెహ్రూ తండ్రీకొడుకులూ, గాంధీజీ కోరిన షరతు లివి : 1) తనకిష్టమైనప్పుడు బ్రిటిష్ సామ్రాజ్యం నుంచి వైదొలగే హక్కు భారతదేశానికున్నదని అంగీకరించాలి. 2) భారత ప్రజలకు పూర్తి బాధ్యత వహించే జాతీయ ప్రభుత్వంచేతికి అధికారం రావాలి. వైస్రాయికి వ్రాసిన లేఖలో గాంధీజీ ప్రతిపాదించిన పదకొండు అంశాలను కార్యరూపంలోకి తీసుకురాగల అధికారం దానికి వుండాలి. 3) భారత జాతీయ రుణం అని చెప్పేదానితో సహా బ్రిటిష్‌వారు తమకు రావలసివున్నదనే సొమ్మును గురించీ, ప్రత్యేక సౌకర్యాలను గురించీ స్వతంత్రుడైన మధ్యవర్తిముందు పరిష్కారానికి పెట్టే అధికారం భారతదేశానికి వుండాలి.

ఆ షరతులమీద రాజీ కుదరడం సాధ్యం కాదని తేలినాక, పోరాట విరమణకు సిద్ధపడ్డారు. అది దేశంలో కాంగ్రెసు యొక్క రాజకీయ, నిర్మాణ బలం అధికం అయ్యే టందుకు తోడ్పడింది. మహా బలీయమైన బ్రిటిష్ ప్రభుత్వం కాంగ్రెసుతో రాయబారాలు నడిపింది. కాంగ్రెసు ప్రతినిధితో వ్రాతమూలకమైన ఒప్పందానికి వచ్చింది. కొన్ని ప్రాంతాలలో ఉప్పు చేసేటందుకు అంగీకరించడం ద్వారా బ్రిటిష్ ప్రభుత్వం కాంగ్రెసు కోరికలను పాక్షికంగానైనా అంగీకరించింది. రాజకీయ ఖైదీలలో అత్యధిక సంఖ్యాకుల్ని విడుదల చేసింది. కాంగ్రెసు బలపడడానికీ, స్వాతంత్ర్య పోరాటాన్ని కొనసాగించేటట్లు హుషారు నివ్వడానికీ ఇవి చాలును.

పోరాట విరమణ ద్వారా సాధించుకొన్న విజయాలను కాపాడుకొనేటందుకు వారు చాల పాటుబడ్డారు. పోరాట విరమణ స్వాతంత్ర్య పోరాటాన్ని బలపరుస్తుందనే దానికి అంగీకరించేమని వారు ప్రజలతో చెప్పారు. కాంగ్రెసుకు ఇటువంటి అవకాశం కలిగించడం నిరంకుశోద్యోగి వర్గాని కిష్టంలేదు. ఇక రాజకీయ ఖైదీల విడుదలమీదా, ప్రభుత్వ చట్టాల నమలుపరచడం గురించీ, భూమి పన్ను వసూళ్ళ మీదా కాంగ్రెసుకూ, ఉద్యోగి వర్గానికీ నిరంతరం రండా గొండీ ప్రారంభమయింది.

ఈ సమస్యలలో ప్రతి ఒక్కదానిమీదా కాంగ్రెసు నాయకత్వం తన కోరికలను

సాధించుకొనేటందుకు శక్తివంచన లేకుండా పనిచేసింది. పోరాట విరమణ ఒడంబడికలోని షరతులను ప్రభుత్వం ఖచ్చితంగా పాటించకపోతే రౌండ్‌టేబుల్ సమావేశానికి తమ ప్రతినిధిని పంపేది లేదని బెదిరిస్తూవచ్చారు. ప్రభుత్వం కూడా కొంత బిగువు సడలి వ్యవహరించడంచేతనే వారు చివరకు గాంధీజీని రౌండ్‌టేబుల్ సమావేశానికి పోనిచ్చారు.

ముస్లిములకూ, ఇతర అల్పసంఖ్యాకులకూ కొన్ని ప్రత్యేకతలు చూపడం ద్వారా బ్రిటిష్ ప్రభుత్వం దేశంలో మతకలహాలు రేగడానికి అంకురార్పణ చేసింది. ఈ దుష్ఫలితాలను ప్రతిఘటించడానికి కాంగ్రెసు రెండో రౌండ్‌టేబుల్ సమావేశం లోనూ, తర్వాతనూ చాల గట్టిగా పనిచేసింది. కాని రెండో రౌండ్‌టేబుల్ సమావేశం భగ్నంకావడంతో బ్రిటిష్ ప్రభుత్వం కాంగ్రెసును ముఖాముఖీ ఎదుర్కొని దెబ్బ తీయడానికి అవకాశం చిక్కింది. దీనితో కాంగ్రెసుకు ఆగ్రహం కలిగి ప్రత్యక్ష చర్యకు దిగేటట్లు చేసింది. కాంగ్రెసు నాయకులలోకెల్ల గాంధీజీ మంచి దూరదృష్టి గలవారు. రెండో శాసనోల్లంఘనోద్యమం ప్రారంభం కాగానే ఆయన కొత్త ఎత్తుగడలు వెతకసాగారు.

1932 జనవరి 4న గాంధీజీ అరెస్టయ్యారు. సంపూర్ణ స్వరాజ్యాన్ని సాధించే టందుకు శాసనోల్లంఘనోద్యమాన్ని పకడ్బందీగా నడిపించడంకన్న ముఖ్యంగా చేయ వలసినపని ఒకటున్నదని ఆయనకు మార్చి 11 నాటికనిపించింది. ఆ తేదీని ఆయన ఇండియా మంత్రికి ఒక జాబు వ్రాశారు. దానిలో ఆయన ఇల్లా అన్నారు :

> "రౌండ్‌టేబుల్ సమావేశంలో అల్పసంఖ్యాకుల కోరికల సమస్యను తెచ్చినప్పుడు నిమ్న జాతులకు ప్రత్యేక నియోజకవర్గాలు ఇవ్వడాన్ని ప్రాణంవొడ్డి పోరాడతానని నా ఉపన్యాసంలో చెప్పాను. మీకు గుర్తుండి వుంటుంది. యమకంకోసం, క్షణికావేశంలో అన్న మాట కాదది. ఆ అభిప్రాయం నాలో గట్టిగా వుంది." (సం. 3, పుట 195)

బ్రిటిష్ ప్రధాని ఇచ్చిన 'కమ్యూనల్ అవార్డు' (దీని ననుసరించే నిమ్న జాతులకు ప్రత్యేక నియోజక వర్గాలనిచ్చారు) ఫలితంగా, తాను ప్రాయోపవేశం చేయవలసివస్తుందని ఆయన అన్నారు.

ప్రజానీకాన్ని శాసనోల్లంఘ నోద్యమంలోకి తేవాలనే ప్రయత్నం విరమించుకొని శాసనసభల ద్వారా పోరాటం నడపడానికీ, నిర్మాణ కార్యక్రమం సాగించడానికీ కాంగ్రెసు పథకం మార్చుకోవడం ఇదే ప్రారంభం. బ్రిటిష్ ప్రభుత్వం గాంధీజీ కోరికను నిరాకరించి 'కమ్యూనల్ అవార్డు' ఇచ్చింది. గాంధీజీ ఆమరణ నిరశనవ్రతం ప్రారంభించారు.

ఈ నిరశనవ్రతం ఫలితంగా కాంగ్రెసు నాయకులు, కాంగ్రెసేతర నాయకులు నిమ్నజాతి నాయకులు సమావేశం అయ్యారు. ఒక ఒప్పందానికి వచ్చారు. తత్ఫలితంగా



నిమ్నజాతులకు సంబంధించినంతవరకు కమ్యూన్ల అవార్డును సవరణ చేయడానికి వీలు కలిగింది.

అస్పృశ్యతను పోగొట్టేందుకు దేశవ్యాపితంగా ప్రజలలో ప్రచారం చేయడమూ, నిమ్నజాతుల స్థితిగతులను బాగుపరచేటందుకై పనిచేయడమూ పైన చెప్పిన ఒప్పందంలో వున్న షరతులు. వాని ప్రకారం గాంధీజీ జైలులో వుండే హరిజన కార్యక్రమం సాగించడానికి అనుమతించబడ్డారు. దీనితో జైలు బయట వున్న కాంగ్రెసువాదులనేక మంది శాసనోల్లంఘనోద్యమ ప్రయత్నాలకు బదులు హరిజనోద్ధరణ కార్యక్రమంవైపు దృష్టి తిప్పారు.

హరిజనోద్ధరణ కార్యక్రమంలో జరుగుతున్న పని సంతృప్తికరంగాలేదని చెప్పి గాంధీజీ ఆత్మపారిశుద్ధ్యం కోసమని 1933 మే నెలలో 21 రోజులు ఉపవాసం చేయ బూనుకున్నారు. దాని ఫలితంగా ఆయనను జైలునుంచి విడుదల చేశారు. ఆ అవకాశం తీసుకొని కాంగ్రెసు తాత్కాలికాధ్యక్షునికి శాసనోల్లంఘనోద్యమాన్ని నిలుపుచేయ వలసిందిగా గాంధీజీ సలహా ఇచ్చారు.

అయినా గాంధీజీ అభిప్రాయ ప్రకటనలవల్లగాని, కాంగ్రెసు తాత్కాలికాధ్యక్షుని సూచనలవల్ల గాని ప్రయోజనం కలుగలేదు. ప్రభుత్వం తన నిర్బంధ విధానాన్ని సడలించ లేదు. శాసనోల్లంఘనాన్ని తిరిగి ప్రారంభించమని గాంధీజీ మరల సలహా ఇచ్చారు. అయితే ఈమారు జనానీకాన్ని ఉద్యమంలోకి తేవాలనే ఆలోచన లేదు. దానిని నిర్వహించడంలో విధి నిషేధాలను నిర్వచించారు. తానే ముందుకు వచ్చి వ్యష్టి సత్యాగ్రహం చేశారు. జనానీకాన్ని శాసనోల్లంఘనంలో పాల్గొనేటట్లు చేయడానికి బదులు దేశమంతటా వ్యష్టి సత్యాగ్రహోద్యమం ప్రారంభమయింది.

ఈమారు జైలులో నుంచి హరిజన సేవా కార్యక్రమం కొనసాగించేటందుకు ప్రభుత్వం ఆయనకు అవకాశం ఇవ్వలేదు. అందుచేత ఆయన జైలులో నిరశనవ్రతం ప్రారంభించారు. ఒక దశలో ఆయన పరిస్థితి మరీ ప్రమాదకరంగా తయారయింది. ప్రభుత్వం వెంటనే ఆయనను విడుదల చేసింది. విడుదలయినాక తాను రాజకీయ కార్యక్రమాలకు పూర్తిగా దూరంగా వుంటాననీ, హరిజన సేవా కార్యక్రమంలోనే తన కాలాన్నంతనూ వినియోగిస్తాననీ ఆయన అన్నారు.

1933 ఆఖరు రోజులలోనూ, 1934 ప్రారంభంలోనూ హరిజన నిధి వసూలుకై గాంధీజీ దేశమంతటా పర్యటించారు. అయినా జైళ్ళ బయటవున్న కాంగ్రెసు నాయకులూ, ఆయనా ఈ పర్యటనలో శాసనోల్లంఘనోద్యమం యొక్క భవిష్యత్తును గురించి ఒకరితో ఒకరు మాట్లాడుకోవడానికి ఉపయోగించుకున్నారు. అదివరకే కొందరు కాంగ్రెసు నాయకులు సంప్రదింపులు జరిపి స్వరాజ్య పార్టీని నిర్మించాలనే ఆలోచనలో వున్నారు.

సహజంగానే వారు గాంధీజీ సలహా కోరారు. ఈ ఆలోచనల పర్యవసానంగా ఆయన 1934 ఏప్రిల్ 7వ తేదీని ఒక ప్రకటన చేశారు. అందులో ఇలా వుంది :

"ఏవో నిర్దిష్టమైన కోరికలకోసంగాక స్వరాజ్యంకోసం శాసనోల్లంఘనం చేయడం మానవలసిందిగా కాంగ్రెసువాదులకు నేను సలహా ఇవ్వవలసి వుంది. ఆ శాసనోల్లంఘన వ్యవహారాన్ని నాకు వదలిపెట్టంది. ఆ శాస్త్రంగురించి నాకంటె బాగా ఎరుగుదునన్న వ్యక్తి ఆ విధమైన విశ్వాసం నాకు కలిగించేవరకూ నా నాయకత్వంక్రిందనే ఎవరయినా శాసనోల్లంఘనానికి పూనుకోవాలి. సత్యాగ్రహ సృష్టికర్తగా, ప్రారంభకుడుగా నే నీ అభిప్రాయం తెలుపుతున్నాను. అందుచేత ఇతఃపూర్వం నా సలహామీదగాని, నా సలహా పొందామనుకొనిగాని స్వరాజ్యంకోసం శాసనోల్లంఘనం చేసినవారంతా ఇక శాసనోల్లంఘనం చేయవద్దని ప్రార్థిస్తున్నాను." (సం. 3, పుట 319)

గాంధీజీ ఈ విధంగా ప్రకటించిన వెంటనే ప్రభుత్వం "శ్రీ గాంధీ చేసిన ప్రకటనను ఆమోదించి, శాసనోల్లంఘనోద్యమాన్ని నిలిపివేసేటందుకు అవసరమను కొంటే కాంగ్రెసు నాయకులు అఖిలభారత కాంగ్రెసు కమిటీని సమావేశపరచడానికి అభ్యంతరం చెప్పద"ని ఒక ప్రకటన చేసింది.

ఈ విధంగా 1934 మే నెలలో జరిగిన అఖిలభారత కాంగ్రెసు కమిటీ సమావేశానికి పూర్వరంగం తయారుచేయబడింది. ఆ సమావేశం గాంధీజీ ప్రకటనను ఆమోదించి, శాసనోల్లంఘనోద్యమాన్ని నిలిపివేసింది. కేంద్ర శాసనసభకు జరుగనున్న ఎన్నికలలో పాల్గొనటానికి నిర్ణయం తీసుకొంది.

# 7. కాంగ్రెసు నుండి నిష్క్రమణ

పై ఘటనలన్నిటినీ తెలుసుకున్న తర్వాత గాంధీజీ ఆ విధంగా ఎందుకు చేశారని ఎవరైనా అడగడం సహజం. జాతీయ శత్రువుకు వ్యతిరేకంగా ప్రజలు బ్రహ్మాండమైన పోరాటం జరుపుతూంటే, ఆ పోరాటాన్ని నడిపే మహావ్యక్తి అంతకంటె స్వల్పమైన ఒక సమస్యమీద (సమాజంలోను, రాజ్యాంగ వ్యవస్థలోను అస్పృశ్యుల స్థానమేమిటనేది) తన దృష్టినంతా ఎందుకు నిలిపారు? రాజకీయ ప్రజా ఉద్యమం నడిపేందుకు దాన్నొక ఆధారంగా చేసుకోడానికి బదులు సంఘ సంస్కరణోద్యమానికి దాన్ని ప్రాతిపదికగా చేసుకోడానికి కారణమేమిటి? మొట్టమొదటి అవకాశాన్నుపయోగించుకొని దేశవ్యాపిత శాసనోల్లంఘనోద్యమాన్నెందుకు ఆయన విరమించవలసివచ్చింది?

ఈ ప్రశ్నలకు జవాబులు తెలుసుకోవాలంటే, సత్యాగ్రహాన్ని గురించి గాంధీజీ చేసిన ప్రకటనలమీదనే మనం ఆధారపడకూడదు. న్యాయమైన ఆశయం కొరకు ప్రారంభింపబడ్డ ప్రజాపోరాటం "దౌర్జన్య" మార్గం చేబట్టినప్పుడు లేదా అలా చేబట్టే ప్రమాదమేర్పడినప్పుడు మాత్రమే దాన్ని విరమించవచ్చునన్నది గాంధీజీ సత్యాగ్రహ సిద్ధాంతం. అట్టి ప్రమాద మేర్పడ్డం వల్లనే 1922 ఉద్యమం విరమింపబడిందని ఆయన నొక్కిచెప్పారు. కాని అట్టి ప్రమాదం 1932లో లేదు. విదేశీ పాలకులు సత్యాగ్రహులమీద చాల క్రూరమైన, అమానుషమైన హింసాకాండ ప్రయోగించినప్పటికీ, అహింసావ్రతాన్ని పాటించడంలో వారు గాంధీజీ కోరిన స్థాయినందుకున్నారు.

సత్యాగ్రహోద్యమంలో పాల్గొన్న వేలకొద్ది యువతీ యువకులు గాంధీజీ ఉత్తర్వులను తు.చ. తప్పక పాటించారు. అందుచేత గాంధీజీ హరిజనులకు ప్రత్యేక నియోజకవర్గాల

సమస్యమీద నిరాహార వ్రతం ప్రారంభించడానికి నిశ్చయించుకున్నప్పుడు వారంతా భగ్నమనోరథులయారు; ఆ తర్వాత ఆయన తన యావచ్ఛక్తినీ, కాలాన్నీ హరిజనోద్ధరణకు వినియోగించదలచుకున్నప్పుడు వారు ఇంకా బాధపడ్డారు. సామ్రాజ్య వ్యతిరేక పోరాటాన్ని, రాజకీయోద్యమాన్ని నడిపిన ఒక మహానాయకుడు అంతకన్న స్వల్పమైన ఈ సాంఘిక సమస్యమీద తన దృష్టిని కేంద్రీకరించినందుకు, ఇతరుల్ని కూడా అలా కేంద్రీకరించమని బోధించినందుకు వారు ఆగ్రహావేశులయ్యారు. ఉద్యమానికి అపచారం జరిగినట్లు వారు భావించారు.

గాంధీజీ తన ఎత్తుగడలను బాధ్యతారహితంగా మార్చివేసుకున్నట్లు వారికనిపించింది. ఆయన అలా ఎందుకు నిశ్చయించుకున్నారు? వేలాదిగా వున్న తన అనుచరుల్లో ఆయన ఎందుకు అసంతృప్తి కలిగించారు? కొందరు వాదిస్తున్నట్లు ఆయన "రాజకీయ పోరాటాలకన్న సంఘ సంస్కరణలకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వడం" వల్లనా? కానేకాదు. అన్నిటికంటె ముఖ్యమైన విషయమేమంటే, గాంధీజీ ఒక వర్గం యొక్క – పెట్టుబడిదారీ వర్గం యొక్క – తెలివైన రాజకీయ నాయకుడు. ఆయన ఎల్లప్పుడూ వారి వర్గ ప్రయోజనాలకోసమే పని చేశాడు. 1932 సెప్టెంబరులో ఆయన నిరాహార వ్రతానికి పూనుకోడం, ఆ తర్వాత పైకి సాంఘిక సమస్యగా కనబడే హరిజనోద్ధరణకై పని చేయడం నిర్దిష్టమైన ఒక రాజకీయ సమస్యను పరిష్కరించేందుకు అతి జాగ్రత్తగా రూపొందింపబడిన ఎత్తుగడలో ఒక భాగం మాత్రమే.

ఈ సందర్భంలో మనం 1932 పోరాటమెలా ప్రారంభింపబడిందో జ్ఞాపకం చేసుకుందాం. గాంధీజీ కాంగ్రెసు ప్రతినిధిగా రెండవ రౌండ్‌టేబుల్ కాన్ఫరెన్సులో పాల్గొన్నారు. కాంగ్రెసుకీ, బ్రిటిష్ ప్రభుత్వానికీ రాజీ కుదరనందున అది భగ్నమైంది. అట్టి పరిస్థితుల్లో, కాంగ్రెసువంటి ఆత్మగౌరవం గల జాతీయ సంస్థకు ప్రజాపోరాటం నడపడం తప్ప వేరుమార్గం లేకపోయింది. రెండోవైపున ప్రభుత్వం కాంగ్రెసును అణచివేయడానికి నిశ్చయించుకొంది. 1930–1931 కథ మళ్ళీ జరక్కుండా చూడ్డానికి కట్టుదిట్టమైన చర్యలు తీసుకొంది (1930–'31లో ప్రభుత్వానికీ కాంగ్రెసుకీ మధ్య సంప్రతింపులు జరిగాయి). మరో విధంగా చెప్పాలంటే, 1932లో ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటం నడపడంతప్ప మరో మార్గం లేకపోయింది.

ఈ పరిస్థితిని ఇలాగే కొనసాగనిస్తే ప్రభుత్వం తన ఇష్టంవచ్చిన ప్రకారం వ్యవహరిస్తుందనీ, తనకు తోచిన విధంగా రాజ్యాంగాన్ని రూపొందిస్తుందనీ గాంధీజీ అభిప్రాయపడ్డారు. ఆ రాజ్యాంగాన్ని కుల–మత పార్టీలతో సహా కాంగ్రెసేతర పార్టీలన్నీ కాంగ్రెసును బలహీనపరచేందుకు ఉపయోగించుకుంటాయనీ, ఆ పార్టీలను బ్రిటిష్

ప్రభుత్వం జాతీయ వాంఛను నిరాకరించేందుకు ఉపయోగించుకొంటుందనీ ఆయన భయపడ్డారు. ఈ ప్రమాదాన్ని నివారించేందుకాయన ప్రయత్నించారు. బ్రిటిష్ ప్రభుత్వంతో రాయబారాలు నడిపేందుకాయన సర్వశక్తుల్నీ వినియోగించారు. అందుచేత ఆయన సహజంగా శాసనోల్లంఘనోద్యమాన్ని ఉపసంహరించాలనుకున్నారు.

ఈ ఉద్దేశంతోనే గాంధీజీ సాంఘిక, రాజకీయ స్వభావాలు రెండూ గల ఒక సమస్యను (హరిజనులకు సమష్టి నియోజకవర్గాలుండాలా, ప్రత్యేక నియోజకవర్గాలుండాలా అనేది) ఎంచుకున్నారు. ఇది ఒకవైపు ప్రజల సమక్షంలో నిలబడి సంఘ సంస్కరణకు కొంత కృషి చేస్తున్నట్లు నిరూపించుకోడానికీ అవకాశం కలిగిస్తుంది; మరోవైపు రాజ్యాంగ సంస్కరణలకు సంబంధించిన ఒక అంశంమీద ప్రభుత్వంతో రాయబారాలు నడపడానికీ అవకాశం కలిగిస్తుంది. అయితే ప్రభుత్వం ఆయన మాటనే ఆధారం చేసుకొని, హరిజనోద్ధరణను కేవలం సంఘ సంస్కరణ విషయంగా పరిగణించింది; రాజకీయ సమస్యపై రాయబారాలు నడపడానికి నిరాకరించింది. అయినా గాంధీజీ ఆ కొద్దిపాటి అవకాశాన్నైనా వినియోగించుకొని తన సహచరులతోను, ప్రజలతోను గల సంబంధాలను పటిష్టమొనర్చుకున్నారు.

తర్వాత జరిగిన ఘటనలు హరిజనోద్ధరణపట్ల ఆయన చూపిన శ్రద్ధ కేవలం సాంఘికమైనదే కాదని రుజువు చేశాయి. జైలునుండి విడుదల అయి రాగానే ఆయన (1933 మే) మొట్టమొదటి అవకాశం తీసుకొని కాంగ్రెసు అధ్యక్షునిచే సమష్టి శాసనోల్లంఘనోద్యమాన్ని విరమింపజేశారు. అయినా, బ్రిటిష్ ప్రభుత్వం రాజకీయ సమస్యపై కాంగ్రెసుతో రాయబారాలు నడపడానికి నిరాకరించింది; తన కదిి పాదాక్రాంత మవాలని చెప్పింది. అందుచేత ఆయన తన ఆత్మగౌరవాన్నీ, కాంగ్రెసు గౌరవాన్నీ కూడ రక్షించవలసివచ్చింది. సమష్టి శాసనోల్లంఘనం కాకపోయినా, వ్యష్టి శాసనోల్లంఘనమైనా ప్రారంభించవలసి వచ్చింది. మళ్ళీ ఆయన మొట్టమొదటి అవకాశం తీసుకొని, ఏడాదివరకు రాజకీయ సమస్యలమీద మౌనం వహించదలచుకొన్నానంటూ ప్రకటించారు; ఆ విధంగా ప్రభుత్వానికి తిరిగి రాజీ సూచన చేశారు.

కాంగ్రెసుకీ, ప్రభుత్వానికీ మధ్య ఏర్పడ్డ సంఘర్షణవల్ల కాంగ్రెసు ఇరుకున పడింది. ఆ స్థితినుంచి దాన్ని కాపాడవలసి వచ్చింది. గాంధీజీ ఇందుకు పూనుకున్నారు. హరిజనోద్ధరణ విషయంలో ఆయన చూపిన ఆసక్తికీ, ఆ తర్వాత కార్యకలాపాలకూ కారణమిదేనని మనం గ్రహించవలసి వుంటుంది. బ్రిటిష్ ప్రభుత్వంతో సంప్రతింపులు జరపడానికీ, రెండవ రౌండ్‌టేబుల్ కాన్ఫరెన్స్‌లో తాత్కాలికంగా భగ్నమైన రాజ్యాంగ సంస్కరణలను పునరుద్ధరించడానికీ, నూతన పరిస్థితుల్లో కాంగ్రెసు తన విధుల్ని సక్రమంగా

నిర్వర్తించగలిగేటట్లు ఆ సంస్థను పునర్వ్యవస్థీకరించడానికీ – అదొక ప్రయత్నం మాత్రమే.

కనుకనే, ఉద్యమాన్ని ఆపుజేయవలసిందని 1934లో గాంధీజీ ఇచ్చిన సలహాను కాంగ్రెసులోని మితవాద నాయకులంతా అంగీకరించారు. 1922లో అలా కాదు. అప్పుడు ఉద్యమం విరమింపబడినప్పుడు మోతీలాల్ నెహ్రూ వంటి మితవాద నాయకులు కూడ గాంధీజీ చర్యను ఖండించారు. అంతేకాదు, 1920 ప్రాంతంలో కాంగ్రెసు స్వరాజ్య పార్టీ అనీ, నో ఛేంజర్లనీ రెండు గ్రూపులుగా విడిపోయింది. 1934లో అలాకాక, పార్లమెంటరీ కార్యక్రమం విషయమై నాయకుల్లో ఇంచుమించు ఏకగ్రీవాభిప్రాయం వుంది. "దేశంలో పార్లమెంటరీ మనస్తత్వం స్థిరపడిపోయింద"ని గాంధీజీయే 1934లో ప్రకటించారు. కొత్తగా రూపొందింప బడనున్న రాజ్యాంగం ఎంతో ప్రధానమైన రాజకీయ సమస్య అనీ, దానిపట్ల వ్యతిరేక వైఖరి ప్రదర్శింపబడితే ప్రమాదకరమైన ఫలితాలు కలుగుతాయనీ మితవాద నాయకత్వం ఏకగ్రీవంగా అభిప్రాయపడింది. 1920లో స్వరాజ్య పార్టీ తానే ప్రత్యేకంగా ఎన్నికలను నిర్వహించేందుకొక పార్లమెంటరీ బోర్డును నియమిస్తే, 1934లో అఖిలభారత కాంగ్రెసు కమిటీయే పార్లమెంటరీ బోర్డును నియమించింది.

ఈ విధంగా ఎత్తుగడల విషయమై కాంగ్రెసు నాయకుల్లో ఇంచుమించు ఏకాభిప్రాయం ఉన్నప్పటికీ, కాంగ్రెసు ఒక ఐక్య సంస్థగా మాత్రం లేదు. కాంగ్రెసువాదుల్లో తీవ్రమైన చర్చలు ప్రారంభమయినాయి. గాంధీజీ 1932 సెప్టెంబరులో నిరాహారవ్రతం జరిపిన తర్వాత అనుసరించిన ఎత్తుగడలను పలువురు తీవ్రంగా ఆక్షేపించడం మొదలు పెట్టారు. అలాగే, స్వరాజ్య పార్టీని స్థాపించడంలో చొరవ తీసుకున్న మితవాద నాయకుల కార్యకలాపాలను దుయ్యబట్టడం ప్రారంభించారు. కాంగ్రెసు నాయకత్వపు విధానాలయెడ అసంతృప్తి 1933–34లో వ్యాపించినంత విస్తృతంగా, తీవ్రంగా ఇదివరకెన్నడూ వ్యాపించియుండలేదు. 1934లో జవహర్‌లాల్ నెహ్రూ గాంధీజీకి వ్రాసిన ఒక ఉత్తరం చూస్తే, అసంతృప్తి ఏ స్థాయికి వెళ్ళిందో బోధపడుతుంది. ఆయన ఇలా వ్రాశారు :

> "ఈ విధంగా పోరాటం ఉచ్ఛస్థాయికి చేరుకున్నప్పుడు ఎవరైతే శత్రువు ఇష్టాను సారం జాతీయ పతాకెను దింపివేశారో వారి చేతుల్లోకే అది తిరిగి వెళ్ళింది; రాజకీయాలు క్షేమకరంగా లేనిరోజుల్లో రాజకీయాలను విడిచిపెట్టి తిరిగి క్షేమకరంగా తయారైనప్పుడు అందరికంటె ముందుకు దుమికినవారి చేతుల్లోకి జాతీయ పతాకం వెళ్ళింది.
>
> ఇక వారు కాంగ్రెసు తరపున, దేశం తరఫున ప్రతినిధులుగా ముందుకొచ్చి ప్రకటించిన ఆదర్శాలెలాంటివి? అసలు సమస్యల జోలికి వెళ్ళకుండా, సాధ్యమైనంత వరకు సౌమ్యమైన భాషను ఉపయోగిస్తూ, స్వార్థపరుల ప్రయోజనాలపట్ల సానుభూతిని ప్రకటిస్తూ, స్వాతంత్ర్యానికి శత్రువులైన అనేకమందికి సలాములు చేసి, కాంగ్రెసులోని పురోగామి

శక్తుల్నీ, పోరాటశక్తుల్నీ ఎదుర్కోడంలో మాత్రం కాఠిన్యాన్ని, ధైర్యాన్ని ప్రదర్శించి కొన్ని కలగాపులగపు ఆశయాల్ని ప్రకటించారు." (సం. 3, పుట 381)

1934లో ఉద్యమాన్ని విరమిస్తూ చేసిన నిర్ణయమూ, పార్లమెంటరీ కార్యక్రమాన్ని ఆమోదిస్తూ చేసిన నిర్ణయమూ నెహ్రూను ఎంత బాధించాయో ఆయన మాటలవల్ల అర్థం చేసుకోవచ్చు. నెహ్రూ ఇలా వ్రాశారు :

"ఆ పోటు నా హృదయాన్నెంతో గాయపరచింది. ఆయనతో అనేక సంవత్సరాల సాహచర్యంవల్ల కలిగిన విశ్వాసబంధం ఒక్కసారి తెగిపోయినట్లనిపించింది."

దీనికి టెండూల్కర్ ఈ క్రింది వాక్యం చేర్చారు :

"ఇలాంటి మనోభావమే అనేకమంది కాంగ్రెసువాదులలో కలిగింది."

అయితే, సాధారణ కాంగ్రెసువాదుల్లో కలిగిన వ్యతిరేకత పార్లమెంటరీ కార్యక్రమంపట్ల వ్యతిరేకతగా వ్యక్తం కాలేదు. నాయకత్వం వలెనే వారు కూడా పార్లమెంటరీ సంస్థలను స్వాతంత్ర్య పోరాటంలో సాధనాలుగా మాత్రమే ఉపయోగించుకోవాలన్న విషయం గుర్తించారు. శాసనసభలను బహిష్కరించే కార్యక్రమంలో మోజు నాయకులకూ లేదు, అనుచరులకూ లేదు. అయితే, పార్లమెంటరీ సంస్థల నెందుకోసం ఉపయోగించుకోవాలనేది అసలు ప్రశ్న. బ్రిటిష్ వారితో తిరిగి రాయబారాలు ప్రారంభించేందుకా? లేక సామ్రాజ్య వ్యతిరేక ప్రజా ఉద్యమాన్ని పటిష్టమొనర్చేందుకా? రెండోది : పార్లమెంటరీ సంస్థలను వినియోగించుకోడం ప్రధానంగా లేక పూర్తిగా సామ్రాజ్య వ్యతిరేకోద్యమాన్ని బలపరచేటందుకా? లేక సామ్రాజ్యవాదానికీ సామ్రాజ్యవాద ఏజంట్లకూ వ్యతిరేకంగా రాజీలేని పోరాటం జరపడానికి ప్రజాసామాన్యాన్ని – ముఖ్యంగా కార్మికుల్నీ, రైతుల్నీ, మధ్యతరగతి ప్రజల్నీ – సమీకరించేందుకా? ఈ ప్రశ్నలు లక్షలాది సాధారణ కాంగ్రెసు వాదుల్ని వేధించసాగాయి.

కాంగ్రెసు సంస్థలో ఈ పరిణామాలేకాక, జాతీయ అంతర్జాతీయ రంగాల్లో ఎన్నో ప్రధానమైన పరిణామాలు జరిగాయి. ఉదా : పెట్టుబడిదారీ ఆర్థిక సంక్షోభం (1929–'33 ఆర్థిక మాంద్యం). సోవియట్ యూనియన్‌లో మొదటి పంచవర్ష ప్రణాళిక విజయవంతం కావడం, జర్మనీలో నాజీజం అభివృద్ధిచెందడం, అనేక పెట్టుబడిదారీ దేశాల్లో అలాంటి శక్తులే వృద్ధిచెందడం, మీరట్ కుట్రకేసులో కమ్యూనిస్టులు ఎంతో వీరోచితంగా కమ్యూనిజం యొక్క ఔన్నత్యాన్ని నిరూపిస్తూ స్టేట్‌మెంట్లు ఇవ్వడం వగైరా. ఈ పరిణామాలు వేలాది విప్లవ యువకుల్ని కమ్యూనిస్టు సిద్ధాంతంవైపు ఆకర్షించాయి.

దేశంలోని వివిధ కమ్యూనిస్టు గ్రూపులు నెమ్మదిగా అయినా ఖచ్చితంగా బలపడ్డాయంటేను, అవన్నీ కలిసి 1933 చివరిరోజుల్లో భారత కమ్యూనిస్టు పార్టీ కేంద్ర

కమిటీగా సంఘటితమయాయంటేను కారణం ఇదే. కేంద్ర కమిటీ నిర్మింపబడిన కొద్ది మాసాల తర్వాత భారత ప్రభుత్వం కమ్యూనిస్టు పార్టీని నిషేధించడం ద్వారా క్రూరమైన దమననీతిని అమలుజరిపింది. అదివరకే గాంధీజీ నాయకత్వంపట్ల విరక్తిచెందియున్న వేలాది సామ్రాజ్య వ్యతిరేక యువతీ యువకులు అంతకన్న తీవ్రమైన సోషలిస్టు పంథాలో ఆలోచించడానికి ప్రభుత్వచర్య అడ్డురాకపోయినా, కమ్యూనిస్టు పార్టీ విస్తృతం కావడానికీ పటిష్టమవడానికీ అది అడ్డంకిగా తయారయింది. ఈ మార్గంలో ఆలోచిస్తూవచ్చిన కాంగ్రెసువాదులు 1934 మే మాసంలో సమావేశమై అఖిలభారత కాంగ్రెసు సోషలిస్టు పార్టీని స్థాపించడానికి నిశ్చయించుకున్నారు.

కాంగ్రెసులో అంతకంతకు అభివృద్ధిచెందుతూ వచ్చిన ఈ సోషలిస్టు చైతన్యం జవహర్‌లాల్ నెహ్రూలో బలీయంగా మూర్తీభవించడం చూచి గాంధీజీ ఒక కొత్త కార్యక్రమాన్ని చేబట్టాడు. మొదట్లో అది సాధారణ కాంగ్రెసువాదుల్ని ఆశ్చర్యచకితుల్ని చేసింది. కాని తర్వాత కాంగ్రెసులో అతివాద భావాల ప్రభావాన్ని నిరోధించదలచుకున్న కాంగ్రెసువాదుల కది చాల సహాయం చేసింది.

1934 సెప్టెంబరులో గాంధీజీ సర్దార్ పటేల్‌కి ఇలా జాబు వ్రాశారు :

> "ఇక నానాటికీ వృద్ధిచెందుతున్న సోషలిస్టులున్నారు. వీరికి జవహర్‌లాల్ ఏకైక నాయకుడు. అతడు కోరేదేమిటో నాకు బాగా తెలుసు... ఆయన అభిప్రాయాల్నే ఇంచుమించు సోషలిస్టు గ్రూపు వ్యక్తం చేస్తోంది. అయితే ఆయన పద్ధతులు, వారి పద్ధతులు సరిగ్గా ఒకటే కాకపోవచ్చు. ఆ గ్రూపు అంతకంతకు అధికంగా ప్రజల్లో పలుకుబడిని, ప్రాధాన్యాన్ని సంపాదించి తీరుతుంది... వారి అధికార పత్రాలలో ప్రచురింపబడిన కార్యక్రమాన్ని చూచాను. దానితో నాకు ప్రధానమైన విభేదాలున్నాయి. అయితే, నా నైతిక పలుకుబడిని ఉపయోగించి, వారి భావాల వ్యాప్తిని నేను అరికట్టదలచుకోలేదు. కాంగ్రెసులో నే నుండడం అంటే అట్టి పలుకుబడిని ఉపయోగించడ మన్నమాటే." (సం. 3, పుట 387-8)

గాంధీజీ కనుగొన్న ప్రత్యామ్నాయ మార్గం కాంగ్రెసు నుండి నిష్క్రమించడం. ఈ సూచనను వివరిస్తూ ఆయన 1934 సెప్టెంబరు 17వ తేదీని ఒక సుదీర్ఘమైన ప్రకటన చేశారు. అందులో, "మేధావివర్గమ"ని ఆయన పిలిచేవారికీ, తనకూ మధ్య ఏయే విషయాల్లో ప్రధానంగా అభిప్రాయ భేదాలున్నాయో తెలియజేశారు. సాధారణ కాంగ్రెసువాదులు పరిగణించే విధంగా తాను అహింసను విధానంగా (Policy) పరిగణించననీ, మత సిద్ధాంతంగా (Creed) పరిగణిస్తాననీ ఆయన పునరుద్ఘాటించారు. రాట్నంలోను, ఖద్దరు లోను తనకున్న విశ్వాసాన్ని మరొకసారి తెలియజేశారు. "పార్లమెంటరీ పార్టీ"తో తనకు

అభిప్రాయ భేదాలున్నాయన్నారు. అయితే తన నైతిక పలుకుబడిని వినియోగించి వారి మార్గంలో ఆటంకాలు పెట్టబోనన్నారు (సోషలిస్టుల విషయంలో మాదిరిగా). అందుచేత గాంధీజీ, సత్యాగ్రహానికే తన యావజ్జీవితాన్ని అంకితం చేయడంవల్ల "సత్యాగ్రహ ప్రయోగం" కొనసాగించడానికి "తనకు సంపూర్ణ స్వేచ్ఛ" ఉండాలని భావించారు.

కాంగ్రెసు నుంచి నిష్క్రమించడానికి గాంధీజీ తీసుకున్న నిర్ణయం సహజంగా తీవ్ర వివాదానికి దారితీసింది. బొంబాయిలో అక్టోబరులో జరిగిన కాంగ్రెసు మహాసభకు ప్రతినిధులుగా వచ్చిన వారందరూ అన్నిటికంటే ఈ సమస్యకే ఎక్కువ ప్రాధాన్యమిచ్చారు. తన నిర్ణయాన్ని పునరాలోచించుకోవలసిందని ఆయనను చాలమంది పదే పదే ప్రార్థించారు. కాని ఆయన పట్టుదల సడలలేదు. మహాసభ మరొకసారి "మహాత్మాగాంధీ నాయకత్వంలో విశ్వాసం" ప్రకటిస్తూ ఒక తీర్మానం చేసింది. అందులో ఇంకా ఇలా ఉంది :

> "ఆయన కాంగ్రెసు నుంచి నిష్క్రమించేందుకు తీసుకున్న నిర్ణయాన్ని పునరాలోచించుకోవడం అవసరమని కాంగ్రెసు గట్టిగా అభిప్రాయపడుతోంది. కాని ఈ విషయంలో ఆయనను ఒప్పించడానికి జరిగిన ప్రయత్నాలు విఫలమైనందున ఈ మహాసభ అయిష్టంగా ఆ నిర్ణయాన్ని అంగీకరిస్తూ, భారతజాతికి ఆయన చేసిన నిరుపమానమైన సేవకు కృతజ్ఞత తెలియజేస్తూంది. అవసరమైనప్పుడల్లా తాను కాంగ్రెసుకు సలహా ఇస్తూ వుంటాననీ, మార్గం చూపుతూ వుంటాననీ హామీ ఇచ్చినందుకు ఈ మహాసభ తన సంతృప్తిని ప్రకటిస్తోంది." (సం. 3, పుట 372)

కాంగ్రెసు నుంచి ఆయన నిష్క్రమించడానికి రెండు కారణాలు చెప్పబడ్డాయి. ఒకటి : తన కాలాన్నంతటినీ, శక్తినంతటినీ నిర్మాణ కార్యక్రమంమీద కేంద్రీకరించి పని చేసేటందుకు. రెండు : పార్లమెంటేరియన్లు, సోషలిస్టులు, కాంగ్రెసులోని తదితర గ్రూపులు తన నైతిన పలుకుబడికి లోనుకాకుండా ఎవరి కార్యక్రమాలను వారు అమలుజరుపు కోడానికి అవకాశ మిచ్చేటందుకు. అందుచేత ఆయన వివాదగ్రస్తమైన ఏ రాజకీయ సమస్యమీద బహిరంగంగా ప్రకటనలు చేయకూడదనుకున్నారు; ఉపన్యాసాలీయ రాదనుకున్నారు.

"హరిజన్" పత్రికలో ఆయన నిరంతరం వ్రాసే వ్యాసాల్లోను, దేశవ్యాపిత సంచారాల్లో ఆయన ఇచ్చిన ఉపన్యాసాల్లోను, తరచు పత్రికా విలేకరులకిచ్చే ఇంటర్వ్యూల ల్లోను, ఉత్తర ప్రత్యుత్తరాల్లోను ఖాదీ, గ్రామీణ పరిశ్రమలు, పారిశుద్ధ్యం, గోసంరక్షణ, కుటుంబ నియంత్రణ మొదలైన సమస్యలను మాత్రమే చర్చించేవారు. వాటికీ, ఈ సమస్యలకూ సంబంధం వుండేదికాదు.

కాని కాంగ్రెసువాదులతో "సంప్రతింపులకు" ఆయన ఎల్లవేళల సిద్ధమే గనుక,

కాంగ్రెసు రాజకీయాల్లో ఆయన తన పలుకుబడిని ఉపయోగిస్తూనే వుండేవారు. ప్రధాన రాజకీయ సమస్యలన్నిటిమీద ఆయన సలహా పొందడానికి వర్కింగ్ కమిటీ సభ్యులు పరుగులెత్తేవారు. అందుచేత గాంధీజీ కాంగ్రెసు నుంచి నిష్క్రమించినప్పటికీ రాజకీయాల నుంచి నిష్క్రమించలేదు. ఈ విషయం తన సహచరులతోను, అనుచరులతోను చర్చించే టప్పుడాయన స్పష్టం చేశారు. ఉదాహరణకు 1936 ఫిబ్రవరిలో గాంధీ సేవాసంఘ సమావేశంలో ఉపన్యసిస్తూ ఆయన ఇలా చెప్పారు :

"ఈ కార్యక్రమాలు (నిర్మాణ కార్యక్రమం, రాజకీయ కార్యక్రమం) ఒకదాని కొకటి సంబంధం లేనివనీ, పరస్పరం విరుద్ధమైనవనీ కొందరు అభిప్రాయపడుతున్నారు. మనలో దురభిప్రాయాలేర్పడ్డానికి చాలవరకు కారణం ఈ అపోహ. నిర్మాణ కార్యక్రమంలో నిమగ్నమైవున్న ప్రచారకుడు రాజకీయ కార్యక్రమాన్ని చిన్నచూపు చూస్తున్నాడు. అలాగే రాజకీయోద్యమంలో పాల్గొంటున్న వ్యక్తి నిర్మాణ కార్యక్రమాన్ని చిన్నచూపు చూస్తున్నాడు. నిజానికి అలాంటి వైరుధ్యమేమీ లేదు. రాజకీయ కార్యక్రమమని పిలువబడేదానికీ, నిర్మాణ కార్యక్రమమని పిలువబడేదానికీ మధ్య అడ్డుగోడ ఏదీ లేదన్న విషయం ఈపాటికి ప్రచారకులందరూ గ్రహించివుండాలి. మన పని విధానంలో అలాంటి అడ్డుగోడలుండవు." (సం. 4, పుట 66)

ఆయన ఉపన్యాసాలన్నిటిలోను, రచనలన్నిటిలోను హరిజనోద్ధరణ, గ్రామీణ పరిశ్రమలు మొదలైన అంశాలు నిర్మాణ కార్యక్రమంలోని భాగాలనీ, అవన్నీ భారత స్వాతంత్ర్యం కొరకు జరిగే అహింసాయుత పోరాటంలో ముఖ్యమైన అంగాలనీ ఆయన నొక్కిచెప్పేవారు. అందుచేత గాంధీజీ రాజకీయాలనుంచి విరమించే సమస్య ఉత్పన్నం కాలేదు.

ఈ విధంగా గాంధీజీ కాంగ్రెసు నాయకత్వపు విధానాలను రూపొందించడానికి ప్రయత్నిస్తూ, ఎప్పటికప్పుడు వారికి సలహాలిస్తూ, మరోవైపున కాంగ్రెసు సోషలిస్టు పార్టీ నాయకులమీద తన పలుకుబడిని ఉపయోగించేవారు; వారికి సలహాలిచ్చేవారు. ఆచార్య నరేంద్రదేవ్‌కి ఆయన ఒక జాబు వ్రాస్తూ సోషలిస్టులు జవహర్‌లాల్ నెహ్రూతో సంప్రతించడం మంచిదని సూచించారు.

"ఆయన మనమధ్యనే ఉంటే (నెహ్రూ అప్పుడు జైల్లో వున్నాడు), నెమ్మదిగా పరుగిడేవాడు. మీరు మీ కార్యక్రమాన్ని శాస్త్రీయ సోషలిజం అని పిలుచుకొంటున్నారు. దానికి బదులు భారతదేశ పరిస్థితుల కనుగుణ్యమైన ఆచరణయోగ్య సోషలిజంను కార్యక్రమంగా తీసుకోవలసిందని నేను సూచించాను. పలుకుబడి గల ఒక కమిటీచే తయారుచేయబడ్డ మీ కార్యక్రమం ఇంకా ముసాయిదా రూపంలోనే ఉన్నందుకు నేను సంతోషిస్తున్నాను.



దానికి మీరు అంతిమ స్వరూపమిచ్చేముందు సోషలిస్టు ధోరణులు గలవారితోను, వాస్తవ పరిస్థితులు తెలిసినవారితోను సంప్రదింపులు జరపడం బుద్ధికుశలత అనిపించు కొంటుంది.” (సం. 3, ఫొటోస్టాట్ పుట 344)

జవహర్‌లాల్ నెహ్రూను తమ నాయకునిగా పరిగణించవలసిందనీ, ఆయన నాయకత్వం కింద పనిచేయవలసిందనీ కాంగ్రెసు సోషలిస్టులకు ఆయన సలహా చెప్తున్నారంటే అది కాకతాళీయంగా జరగలేదు; నెహ్రూ ఎడల ఆయనకున్న వ్యక్తిగత గౌరవంవల్ల అసలే కాదు. గాంధీజీ అనుసరిస్తున్న రాజకీయ విధానంలో అదొక భాగం. ఈ సందర్భంలో మనమొక విషయం జ్ఞాపకం చేసుకోవడం ఉపయోగకరం. జవహర్‌లాల్ నెహ్రూను లాహోర్ కాంగ్రెసుకు అధ్యక్షునిగా ఎన్నుకోవలసిందని సూచించినప్పుడాయన అతివాద యువకుల్ని ఉద్దేశించి, నెహ్రూ ఎన్నిక వారి సేవకు ప్రతిఫలంగా పరిగణించ బడాలన్నారు. ఆ సందర్భంలో వారిని ఆయన ఆవిరశక్తితో పోల్చారు. “ఆవిరిని బలమైన చిన్న పెట్టెలో బంధించినప్పుడే అదొక మహాశక్తి అవుతుంది” అని ఆయన అన్నారు.

“అదేవిధంగా దేశంలోని యువకులు తమలో అనంతంగా వున్న శక్తిసంపదను బుద్ధిపూర్వకంగా నియమబద్ధం చేసుకొని అవసరమైనంత చొప్పున ఒక పద్ధతిలో ఖర్చుచేయాలి.”

మరోవిధంగా చెప్పాలంటే, కాంగ్రెసు నాయకత్వం యువకుల దేశభక్తిని త్యాగనిరతిని “సరియైన మార్గంలో” నడిపేటందుకు నెహ్రూ ఒక సాధనమని ఆయన అభిప్రాయం. 1930–’32లో ఇది సాధ్యపడిందనీ, అలాగే కొత్త దశలో కూడ ఇది సాధ్యపడవచ్చుననీ గాంధీజీ భావించారు.

ఈ విధంగా ఆయన వ్యూహం, ఒకవైపు కాంగ్రెసులోని మితవాద నాయకత్వాన్ని పటిష్టమొనర్చడం; మరోవైపు అతివాదశక్తులు జవహర్‌లాల్ నెహ్రూ నాయకత్వాన బలపడి సమైక్యం కావడం. తాను మాత్రం పూర్వరంగంలో వుండి, మితవాదులకూ అతివాదులకూ కూడ సలహాలిస్తూ, వారి విధానాలమీద తన పలుకుబడిని ఉపయోగించదలచుకున్నారు. కాంగ్రెసు యొక్క ప్రత్యక్ష నాయకత్వం నుంచి గాంధీజీ నిష్క్రమించడంలో అర్థం యిదే.

# 8. ఐక్య సంఘటన

ఈ వ్యూహం మితవాద నాయకత్వం యొక్క రాజకీయావసరాలకు సరిగ్గా సరిపడింది. బ్రిటిష్ ప్రభుత్వం బలవంతంగా ప్రజలమీద నూతన రాజ్యాంగ చట్టాన్ని రుద్దబోతున్న రోజులవి. కాంగ్రెసుకు అదొక పెద్ద సవాలు. అందుచేత కాంగ్రెసు సంస్థ తీవ్రమైన విభేదాలతో రెండు చీలిపోవడం నాయకత్వానికి ఇష్టంలేదు. అతివాద – మితవాద పక్షాల మధ్య విభేదాలు, గాంధీవాదం – ఆధునిక సోషలిజం – బూర్జువా పార్లమెంటరీ విధానం వంటి సామాజిక సిద్ధాంతాల మధ్య విభేదాలు, సామాజిక – మత విషయక సమస్యలపై విభేదాలు – వీటన్నిటిని సమన్వయపరచి మొత్తం జాతికే శత్రువైన సామ్రాజ్యవాదంమీద కాంగ్రెసు ఏకోన్ముఖంగా పోరాటం జరపవలసివచ్చింది. ఈ విధంగా, ఒకవైపు పార్లమెంటేరియన్ల, మితవాదుల ప్రాబల్యాన్ని నిలబెట్టుకుంటూనే, మరోవైపు సోషలిస్టులకు తదితర అతివాద శక్తులకు కొన్ని సౌకర్యాలీయడం కాంగ్రెసు మితవాద నాయకత్వానికి ఎంతో అవసరమైంది.

అయితే ఇది సోషలిస్టులకు తదితర అతివాద శక్తులకు కొన్ని సౌకర్యాలిచ్చే సమస్య మాత్రమే కాదు; చేయవలసింది ఇంకా వుంది. కాంగ్రెసు నిజంగా సామ్రాజ్య వ్యతిరేక మార్గం, తీవ్రవాద మార్గం అవలంబిస్తోందని కష్టజీవులైన ప్రజాసామాన్యానికి, అతివాద భావాలు గల యువకులకు నమ్మకం కలిగేటట్లు చేయవలసివచ్చింది; ఈ ఉద్దేశంతోనే, కాంగ్రెసు నాయకత్వం 1929లో చేబట్టిన పద్ధతిని – అతివాదశక్తుల నాయకుణ్ణి కాంగ్రెసు నాయకునిగా చేసే పద్ధతి – చేబట్టింది. 1929లో వలె 1936లో నెహ్రూ కాంగ్రెసు అధ్యక్షుడుగా ఎన్నుకోబడ్డాడు. అంతేకాదు, ఆయన పదవీకాలం పూర్తి అయి, కొత్త

అధ్యక్షుణ్ణి ఎన్నుకోవలసిన అవసరమేర్పడినప్పుడు, తిరిగి ఆయనే అధ్యక్షుడుగా ఎన్నుకోబడ్డారు (1937). రెండు సంవత్సరాలు వరసగా నెహ్రూ అధ్యక్షపదవి నలంకరించడం చాలదా అన్నట్లు – ఆ పదవీకాలం పూర్తి అయాక 1938లో మరొక అతివాద నాయకుడు సుభాష్‌బోస్ కాంగ్రెసు అధ్యక్షుడుగా ఎన్నుకోబడ్డాడు. అతివాద నాయకులు అధ్యక్ష స్థానంలో వున్న ఈ కాలమంతటిలోను కాంగ్రెసు సోషలిస్టు పార్టీ సభ్యులు తదితర అతివాదులు కాంగ్రెసు వర్కింగ్ కమిటీలో సభ్యులుగా ఉండేవారు. కాంగ్రెసులో ఈ అతివాద శక్తుల ప్రభావాన్ని గురించి మితవాద నాయకుల అభిప్రాయ మేమిటో తెలుసుకొనేందుకు సర్దార్ వల్లభాయి పటేల్ ప్రకటన మనకు తోడ్పడుతుంది. 1937లో కాంగ్రెసు అధ్యక్ష పదవికి ఆయన పేరు సూచింపబడినప్పుడు సర్దార్ పటేల్ తన పేరును ఉపసంహరించుకొని నెహ్రూను ఎన్నుకోవడం మంచిదని చెప్పారు. తన ప్రకటనలో ఆయన ఇలా తెలియజేశారు.

> "నేను నా పేరును ఉపసంహరించుకొంటున్నానంటే దాని అర్థం నెహ్రూ అభిప్రాయాలన్నిటితోను ఏకీభవిస్తున్నానని కాదు. నిజానికి కొన్ని కీలక సమస్యలమీద నా అభిప్రాయాలు జవహర్‌లాల్ అభిప్రాయాలతో భేదిస్తాయన్న విషయం కాంగ్రెసువాదులందరికీ తెలుసు... జవహర్‌లాల్‌కీ నాకూ మధ్య – కాంగ్రెసువాదుల మధ్య – తీవ్రమైన భేదాభిప్రాయా లేర్పడవచ్చు. కాంగ్రెసు అంటే ఆయనకు అపారమైన విశ్వాసం ఉంది; మెజారిటీ ఒక నిర్ణయం చేసినప్పుడు దానితో ఆయన ఏకీభవించకపోయినా తు.చ. తప్పక దాన్ని అమలుజరుపుతారు. కాంగ్రెసు అధ్యక్షునికి నియంతృత్వాధికారాలు లేవు; సుసంఘటితమైన మన సంస్థకు అతడు ఛైర్మన్ మాత్రమే. కాంగ్రెసు ఒక వ్యక్తిని అధ్యక్షునిగా ఎన్నుకున్నంతమాత్రాన అది తన అధికారాలను వదులుకోదు. మొత్తం జాతికి ప్రాతినిధ్యం వహించే విషయంలోను, దేశంలోని వివిధ శక్తుల్ని సక్రమంగా నడిపించే విషయంలోను జవహర్‌లాల్‌తో సాటివచ్చేవారు లేరు. అందుచేత ఆయన్నే అధ్యక్షునిగా ఎన్నుకోవలసిందని ప్రతినిధులందరినీ కోరుతున్నాను." (సం. 4, పుట 138)

ఈ విధానంవల్ల మంచి లాభాలు కలిగాయి. నెహ్రూ రెండు సంవత్సరాలు వరుసగా అధ్యక్షపదవి నలంకరించడం (1936–'38); ఆయన నాయకత్వం కింద సోషలిస్టుల సహకారంతో ఎన్నికల ప్రణాళిక, వ్యవసాయ కార్యక్రమం తయారుకావడం (ఫెయిజ్‌పూర్ కాంగ్రెసులో); ఆ రెండిటిని ప్రచారం చేసేందుకు ఆయన యావద్భారత దేశం పర్యటించడం; నెహ్రూ వ్యాప్తిలోకి తెచ్చిన అతివాద నినాదాలవల్ల ఉత్తేజితులైన అతివాదులు వేలసంఖ్యలో స్వార్థంవీడి కార్యరంగంలోకి దుమకడం – ఇవన్నీ 1937 సాధారణ ఎన్నికల్లో అభివృద్ధి నిరోధక శక్తులకు వ్యతిరేకంగా లక్షలాది ప్రజల్ని కాంగ్రెసు వెనుక సమీకరించేందుకు

చాలా తోడ్పడ్డాయి. కులాభిమానులు, తదితర అభివృద్ధి నిరోధకశక్తులు పరాజయం పొంది 11 రాష్ట్రాలలోను 7 రాష్ట్రాలలో కాంగ్రెసు పెద్ద మెజారిటీ సంపాదించిందంటే ప్రధాన కారణం కాంగ్రెసు ఆందోళనలో అతివాద భావాల ప్రభావమేనని చెప్పాలి.

ఎన్నికల తరువాత మాసాలలో కాంగ్రెసుకీ బ్రిటిషు ప్రభుత్వానికీ మధ్య తీవ్రమైన భేదాభిప్రాయాలు ఏర్పడ్డప్పుడు కూడ ఈ అతివాద ధోరణి కాంగ్రెసు నాయకత్వానికెంతో సహాయపడింది. ఏ రాజ్యాంగచట్టం ప్రకారం ఈ ఎన్నికలు జరిగాయో ఆ చట్టం రాష్ట్ర గవర్నర్లకు చాలా విస్తృతమైన అధికారాలను ఇచ్చింది. అవి అమలుజరిగితే ఎన్నికల ద్వారా ఏర్పడ్డ శాసనసభలు, వాటికి బాధ్యత వహించవలసిన మంత్రివర్గాలు చాల అపహాస్యంపాలౌతాయి. అందుచేత కాంగ్రెసు నాయకత్వం ఈ అసాధారణ అధికారాలు ఉపయోగింపబడవనే హామీని బ్రిటన్ నుంచి కోరింది. అట్టి హామీనిస్తేకాని తమకు మెజారిటీ లభించిన రాష్ట్రాలలో మంత్రివర్గాలను ఏర్పరచబోమని తెలియజేశారు. కాని అట్టి హామీ ఇవ్వడానికి బ్రిటిషు ప్రభుత్వం సిద్ధంగాలేదు. అందుచేత ఈ సమస్యపై ప్రతిష్టంభన ఏర్పడింది. నూతన రాజ్యాంగం అమల్లోకి రావలసిన సమయంలో అది భగ్నమయ్యే సూచనలు కనిపించాయి.

ఇట్టి పరిస్థితుల్లో కాంగ్రెసు అభేద్యమైన ఐక్యతను ప్రదర్శించింది. దానివల్ల బ్రిటిషు ప్రభుత్వం చాలా ఆందోళన చెందింది. కాంగ్రెసు అడిగిన హామీ నివ్వకపోతే తీవ్ర పరిణామాలు తప్పవని గ్రహించింది. కనుకనే తన నిశ్చయాన్ని చర్చిలో ఇండియా కార్యదర్శి జట్లండు ప్రభువు బ్రిటిషు ప్రభుత్వం యొక్క వాదాన్ని వివరించాడు; గాంధీజీ కాంగ్రెసు వాదాన్ని స్పష్టం చేశాడు. (ఈ వివాదంలో గాంధీజీ నిర్వహించిన పాత్ర చూస్తే కాంగ్రెసు నాయకత్వం నుంచి ఆయన నిజంగా ఎందుకు వైదొలగారో తెలుస్తుంది.) చివరకు కాంగ్రెసు బ్రిటిష్ ప్రభుత్వం ఒక ఒప్పందానికి వచ్చాయి. జాతీయ దృక్పథం ప్రకారం ఆ ఒప్పందం పూర్తిగా సంతృప్తికరమైనది కాదు. కాంగ్రెసులోని అతివాద శక్తులు దాన్ని విమర్శించాయి. అయినా ఆ ఒప్పందంవల్ల కాంగ్రెసు మంత్రివర్గాల స్థాపన విషయంలో అనుకూలమైన నిర్ణయానికి రాగలిగింది.

ఈ నిర్ణయం గాంధీజీ కార్యవిధానంలో ఒక మార్పును తీసుకువచ్చింది. ఇదివరలో ఆయన నిశ్చయించుకున్నట్లు తన కార్యకలాపాలను నిర్మాణ కార్యక్రమానికి మాత్రమే పరిమితం చేసుకుని కూర్చోదలచుకోలేదు. 1937 జులై 17న హరిజన పత్రికలో ఆయన ఈ క్రింది విధంగా వ్రాశారు.

"వర్కింగ్ కమిటీ, ఇతర కాంగ్రెసువాదులు మంత్రివర్గ స్వీకార సమస్యపై నేను తెలియజేసిన అభిప్రాయాన్ని అంగీకరించినందున అసలు అధికార స్వీకారం అంటే నా దృక్పథం

ఏమిటో, కాంగ్రెసు ఎన్నికల ప్రణాళిక ప్రకారం యే యే కార్యాలు చేయవచ్చునో తెలియజేయవలసిన బాధ్యత నామీద వుంది. "హరిజన్" పత్రికను నిర్వహించే విషయంలో నా అంతట నేను విధించుకున్న పరిమితులను అతిక్రమిస్తున్నందుకు క్షమార్పణ చెప్పుకోవలసిన అవసరం లేదనుకుంటాను. ఇందుకు కారణం స్పష్టమే. భారతదేశం స్వాతంత్ర్యం సాధించుకొనేందుకు ఇండియా చట్టం పూర్తిగా నిరుపయోగమని యావన్మందీ అంగీకరిస్తున్నారు. అయితే బలప్రయోగం ద్వారా చేసే పరిపాలనకు బదులు మెజారిటీ అభిప్రాయం ద్వారా చేసే పరిపాలన నెలకొల్పేటందుకు అది కొద్దిగానైనా ఉపయోగ పడుతుందనడంలో సందేహం లేదు. 3 కోట్లమంది స్త్రీ పురుషులకు ఓటింగు హక్కు ఇచ్చి, వారి చేతుల్లో విస్తృతమైన అధికారాలను అప్పగించడమంటే అర్థం ఇదే. ఐతే, మనపై బలవంతంగా రుద్దబడిన ఈ రాజ్యాంగానికి క్రమక్రమంగా మనం ఇష్టపడతామని, అంటే పరాయి పాలకుల పెత్తనాన్ని మనం చివరకు వరప్రసాదంగా భావిస్తామని వారి ఆశ. ఈ ఆశను మనం పటాపంచ లొనర్చవచ్చు. ఇందుకు 3 కోట్లమంది ఓటర్లచే ఎన్నుకోబడ్డ ప్రతినిధులు ఆత్మవిశ్వాసంతో పనిచేయాలి. తమకీయబడిన అధికారాలను – మంత్రివర్గ అధికారాలతో సహా – సక్రమంగా వినియోగించుకోగల తెలివితేటలు సంపాదించుకోవాలి. చట్టాన్ని తయారుచేసినవారి ఉద్దేశాలను భగ్న మొనర్చే విధంగా ఆ అధికారాలను ఉపయోగించాలి. వారు ఊహించని విధంగా ఈ చట్టాన్ని న్యాయశాస్త్ర పరిమితుల్లో అమలుజరుపుతూ, వారు ఉద్దేశించిన విధంగా దాన్ని ఉపయోగించకుండా వుంటే ఇది సులభసాధ్యమౌతుంది." (సం. 4, పుట 207)

కాంగ్రెసు సంస్థకు గాంధీజీ తిరిగి నాయకత్వం వహించే దశ ప్రారంభమైందని పై వాక్యాలనుబట్టి సులభంగా తెలుసుకోవచ్చు. పేరుకు ఆయన ఇంకా కాంగ్రెసు బయటే ఉన్నప్పటికీ, కాంగ్రెసు మంత్రివర్గాలను నడపడంలో ఆయన ఒక ప్రబలమైన శక్తిగా వున్నారు. "హరిజన" పత్రికలో ఆయన ప్రతివారం కాంగ్రెసు మంత్రివర్గాలకు సలహాలిస్తూ వ్యాసాలు వ్రాయడం ప్రారంభించారు. వేరు వేరు పరిస్థితులలో వారెలా మెలగాలో, ఏయే పనులు చేయాలో సూచనలిస్తూ వచ్చారు. ఆ రోజుల్లో గాంధీజీ వ్రాసే వ్యాసాలు "ఆదేశపత్రాలు"గా వార్తాపత్రికలు వర్ణించేవని టెండూల్కర్ తెలియ జేశారు. మద్యనిషేధం, విద్యావిధానం, పన్నులు మొదలైన సమస్యలపై అనుసరించదగు విధానాన్ని గాంధీజీ "హరిజన" పత్రిక ద్వారాను, కాంగ్రెసు మంత్రులకు నాయకులకు ఇచ్చే వ్యక్తిగత సలహాల ద్వారాను వివరిస్తూ ఉండేవారు. అంతేకాదు, వివిధ రాష్ట్రాలలో కాంగ్రెసు మంత్రులకు గవర్నర్లకు లేదా వైస్రాయికి మధ్య విభేదాలేర్పడినప్పుడల్లా ఆయనే స్వయంగా అన్ని విషయాల్లోనూ కలుగజేసుకొనే వారు. ఉదాహరణకు బీహారు, యు.పి. రాష్ట్రాలలో

రాజకీయ ఖైదీల విడుదల సమస్యపై మంత్రులకూ, గవర్నర్లకు మధ్య విభేదాలేర్పడినప్పుడు కాంగ్రెసు యొక్క రాజకీయ ప్రతినిధిగా వ్యవహరించినది గాంధీజీయే. అలాగే ఒరిస్సా రాష్ట్రంలో మంత్రివర్గం క్రింద పనిచేసే ఒక సివిలియన్ ఉద్యోగి గవర్నరుగా నియమించబడినప్పుడు ప్రతిష్టంభన ఏర్పడింది. ఆ సమయంలో గాంధీజీ జోక్యం కలిగించుకున్నందున అది నివారింపబడింది. అయినప్పటికీ ఒకే సంస్థలో అతివాద, మితవాద శక్తులు ఐక్యతతో పనిచేయడంవల్ల, అతివాద నాయకులు ఆ సంస్థను నడుపుతూండడంవల్ల అతివాద శక్తులెంతో బలపడ్డాయి. సోషలిస్టు భావాలు, రాజీలేని సామ్రాజ్య వ్యతిరేకత, భూస్వామ్య వ్యతిరేక – పెట్టుబడిదారీ వ్యతిరేక భావాలు, యావత్ప్రపంచంలోని సామ్రాజ్య వ్యతిరేక ఫాసిస్టు వ్యతిరేక శాంతిశక్తులతో చేతులు కలపాలనే ధోరణి – ఇవన్నీ అదివరకెన్నడూ ఊహించనంతగా ప్రజల్ని ఉత్తేజపరచాయి. కార్మిక సంఘాలు, రైతు సంఘాలు, విద్యార్థి యువజన తదితర సంఘాలు శాస్త్రీయ సోషలిజంను తమ సిద్ధాంతంగా ప్రకటించుకున్న కాంగ్రెసు సోషలిస్టు పార్టీ, కమ్యూనిస్టు పార్టీ, తదితర పార్టీశక్తులు – ఎంతో త్వరితగతిని అభివృద్ధిచెందడం ప్రారంభించాయి. స్వదేశ సంస్థానాలలోని లక్షలాది జనసామాన్యం నూతన చైతన్యంతో తమ హక్కులకోసం పోరాడ్డానికి ముందుకు వచ్చారు. ప్రజాస్వామ్య యుత మైన రాజ్యాంగాన్ని నెలకొల్పాలనే నినాదం మీద వారు అనేక పోరాటాలు జరిపారు.

ఇవన్నీ పాక్షికంగా అంతర్జాతీయ పరిణామాలవల్ల కలిగిన ఫలితాలనడంలో సందేహం లేదు. అంటే సోవియట్ యూనియన్ అంతకంతకు బలమైన రాజ్యంగా అభివృద్ధిచెందడం, యూరపులో ఫాసిస్టు వ్యతిరేక శక్తులకు విజయాలు లభించడం, స్పెయిన్, చైనా, అబిసీనియా మొదలైన దేశాల్లో ఫాసిస్టు వ్యతిరేక శక్తులు జాతీయ విమోచన శక్తులు వీరోచిత పోరాటాలు జరపడం వగైరా. ఈ నూతన చైతన్యం కాంగ్రెసు నాయకత్వంలో సైతం ప్రతిబింబించింది. ఇది ఎంతో ప్రాధాన్యం గల పరిణామం. అతివాద, సామ్రాజ్య వ్యతిరేక, సోషలిస్టు శక్తుల సంఘీభావానికి ఇది తార్కాణం.

# 9. అధికార స్వీకారం తర్వాత

సామ్రాజ్య వ్యతిరేక ఐక్యసంఘటన యొక్క మొదటిదశలో – అంటే బ్రిటిష్ వారి సవాలుకు ఎదురు నిలిచి ఎన్నికల్లో బ్రహ్మాండమైన విజయం సాధించడానికి సన్నాహాలు జరుగుతున్న దశలో – మితవాద నాయకత్వం అతివాద శక్తుల ప్రాబల్యాన్ని అట్టే అంతగా పట్టించుకోలేదు. మరోవైపు బ్రిటిష్‌వారి మీద విజయం సాధించిన తర్వాత దేశంలో ఏర్పడ్డ నూతన పరిస్థితులు మితవాద నాయకత్వానికి చాల చికాకు కలిగించాయి. కాంగ్రెసు నాయకులు చాల రాష్ట్రాల్లో అధికారాన్ని స్వీకరించినప్పటి పరిస్థితిని టెండూల్కర్ ఇలా వర్ణించాడు.

> "కొత్త సమస్యలు ఉత్పన్నమయాయి. అంతవరకు సిద్ధాంత సమస్యలుగా మాత్రమే ఉన్న ఆంతరంగిక సంఘర్షణలు కొత్త రూపం ధరించాయి. ఎవరూ కూడ – అధికార స్వీకారాన్ని వ్యతిరేకించినవారు సైతం – కాంగ్రెసు నాయకుల్ని చిక్కుల్లో పెట్టాలనుకోలేదు. అయితే రైతాంగ ప్రదర్శనల ద్వారాను, సమ్మెల ద్వారాను వారిమీద ఒత్తిడి తీసుకువచ్చేందుకు నిర్విరామంగా ప్రయత్నాలు జరిగాయి. అవి కాంగ్రెసు నాయకుల్ని చాల చికాకుపెట్టాయి. బీహారులో రైతు ఉద్యమం కాంగ్రెసుతో ఘర్షణకు దిగింది. ఇతరచోట్ల కూడ, కాంగ్రెసు నాయకులు అధికారంలోకి వచ్చిన ఫలితంగా ప్రజల్లో రేకెత్తిన కొత్త ఆశలు అడియాసలవడంతో అసంతృప్తి వ్యాపించింది." (సం. 4, పుట 248)

అందుచేత, గాంధీజీ నాయకత్వం క్రింద కాంగ్రెసు మితవాద నాయకులు రెండువైపులా పోరాటం నడపవలసివచ్చింది. ఒకవైపున ఫెడరల్ రాజ్యాంగంలోని అత్యంత

అభివృద్ధి నిరోధకమైన భాగాన్ని బలవంతంగా ప్రవేశపెట్టదలచుకున్న బ్రిటిష్ పాలకులమీద పోరాటం ప్రారంభించవలసివచ్చింది. రెండోవైపున ఎన్నికల ప్రచారాన్ని, ఫలితాల్ని ఆధారం చేసుకొని కాంగ్రెసును ఇంకా అతివాద మార్గంలో నడపదలచుకున్న, సమరశీల సామ్రాజ్య వ్యతిరేక శక్తులను బలపరచదలచుకున్న అతివాద శక్తుల్ని ప్రతిఘటించవలసివచ్చింది. భారతజాతికి ఉమ్మడి శత్రువు అయిన బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా అతివాద, మితవాద శక్తుల్ని ఐక్యపరచే సమస్య ఆనాడు లేదు. ఇటు బ్రిటిష్‌వారితోను, అటు అతివాదులతోను కూడ పోరాడుతూ, మితవాద నాయకత్వం తన స్థానాన్ని బలపరచుకొన జూస్తోంది. ఇదే ఆనాటి సమస్య. ఈ కొత్త పరిస్థితుల్లో తన పాత్ర తాను నిర్వహించడానికి గాంధీజీ నాయకత్వం క్రింద కాంగ్రెసు నాయకులొక వ్యూహాన్ని రూపొందించారు. దాన్ని ఈ క్రింది విధంగా వివరించవచ్చు.

మొదటి విషయం : కార్మిక సంస్థలమీద, రైతు సంఘాలమీద దాడి ప్రారంభమైంది. అది ఒకవైపు పోలీసు నిర్బంధ విధానం రూపం ధరించింది; మరోవైపు సిద్ధాంత ప్రతిఘటనగా రూపొందింది. రైతు కార్మిక సంఘాలను అణచేందుకు అరెస్టులు, శిక్షలు, లాఠీఛార్జీలు, కాల్పులు ప్రారంభమయాయి. కాంగ్రెసును అణచేటందుకు ఇండియన్ పీనల్‌కోడ్, క్రిమినల్ ప్రొసీజర్ కోడ్‌లలో ఏ యే సెక్షన్లను బ్రిటిష్ పాలకులు ఉపయోగించి అప్రతిష్ఠపాలయారో ఆ సెక్షన్లనే కాంగ్రెసు ప్రజా ఉద్యమాలను అణచేందుకు ఉపయోగించసాగింది. దీన్నంతటినీ గాంధీజీ సమర్థించారు. అట్టి చర్యలకు పూనుకొన్న కాంగ్రెసు మంత్రివర్గాలను ఆయన ఇలా బలపరిచారు :

> "పౌరస్వేచ్ఛ అనగా నేరాలు చేసేందుకు స్వేచ్ఛ కాదు... కాంగ్రెసు ఏడు రాష్ట్రాలలో అధికారంలో వుంది. కనీసం ఈ రాష్ట్రాలన్నిటిలోను ఎవరేమి చెప్పదలచుకున్నా చెప్పవచ్చుననీ, ఎవరేమి చేయదలచుకున్నా చేయవచ్చుననీ కొందరు అభిప్రాయ పడుతున్నట్లు కనిపిస్తుంది. కాంగ్రెసు మనోభావాలను నేనర్థం చేసుకున్నంతవరకు అలాంటి విశృంఖలత్వాన్ని అదెన్నడూ సహించదు." (సం. 4, పుట 248-49)

రెండవ విషయం : రాష్ట్రాలలో వారు సంపాదించిన అధికారాన్ని ఉపయో గించుకొని దేశాన్నెదుర్కొంటున్న కొన్ని సమస్యలను పరిష్కరించ పూనుకొన్నారు. ఆ విధంగా బ్రిటిష్ పాలకులకంటె తమ కెక్కువ బలం కలదనీ, ప్రజలెదుర్కొంటున్న ప్రధాన సమస్యలను పరిష్కరించగల శక్తి తమ కున్నదనీ రుజువు చేయదలచుకున్నారు. భారతదేశాన్నంతటినీ ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు వారొక ప్లాను తయారుచేయ సంకల్పించారు. ఇందుకుగాను అధికారంలోకి వచ్చిన కొత్త రోజుల్లోనే వారు వివిధ కాంగ్రెసు రాష్ట్రాలలో ఉన్న పరిశ్రమల మంత్రులందరితోను ఒక సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సమావేశంలో జాతీయ ప్లానింగ్



కమిటీ నియమింప బడింది. దానికి అధ్యక్షుడు జవహర్‌లాల్ నెహ్రూ; కార్యదర్శి కె.టి.షా. భవిష్యత్తులో స్వతంత్ర భారతదేశం ఎలా వుంటుందో తెలియజేసే ఒక నమూనా చిత్రాన్ని ప్రజల ముందుంచేందుకు మొట్టమొదటిసారిగా కాంగ్రెసు చేసిన ప్రయత్నమిది. ఇండియన్ ప్లానింగ్‌ను గురించి సర్. ఎం. విశ్వేశ్వరయ్య తన గ్రంథంలో చేసిన రూపకల్పనను వాస్తవ ప్రపంచంలోకి తెచ్చేందుకు జరిగిన ప్రయత్నమది.

ఇలాగే విద్యావేత్తల సమావేశం కూడ చాల ప్రాధాన్యం వహిస్తుంది. సామ్రాజ్య వాదులు ప్రవేశపెట్టిన విద్యావిధానం స్థానే కాంగ్రెసు ప్రవేశపెట్టదలచుకున్న విద్యా విధానమెలా ఉంటుందో స్థూలంగా ఆ సమావేశం తెలియజేసింది. (నేటి బేసిక్ విద్యా విధానానికది అంకురం అని చెప్పవచ్చు.) ఆనాడు దేశాన్నెదుర్కొంటున్న ప్రధాన సమస్యలకు "నిర్మాణాత్మకమైన పరిష్కార మార్గాలు" చూపడానికి కాంగ్రెసు ఈ విధంగా ప్రయత్నించ డాన్నిబట్టి, "శాంతిభద్రతల సమస్య"ను "పకడ్బందీగా" పరిష్కరించేందుకు కఠిన చర్యలు తీసుకోడాన్నిబట్టి – కాంగ్రెసు "బాధ్యతలేని ఆందోళనకారుల" పార్టీ కాదనీ, "నిర్మాణ కార్యక్రమం" కలిగిన "బాధ్యతగల పార్టీ" అని, దాన్ని అమలుజరపగల "పరిపాలనానుభవం" తనకున్నదనీ రుజువు చేయదలచుకొంది.

మూడవ విషయం : సంస్థానాలపట్ల, ప్రజాతంత్ర సంస్కరణలకై సంస్థాన ప్రజలు సాగిస్తున్న ఉద్యమాలపట్ల ఒక నూతన దృక్పథం రూపొందింపబడింది.

కాంగ్రెసు సంప్రదాయ సిద్ధంగా సహాయ నిరాకరణోద్యమ కాలంనుంచీ సంస్థానాల ఆంతరంగిక వ్యవహారాల్లో జోక్యం కలిగించుకోరాదన్న అభిప్రాయంతో ఉంటూవచ్చింది. ఇందుకు కారణం, విదేశీ పాలకుల పెత్తనాన్ని కూలద్రోయడమే జాతీయోద్యమం యొక్క లక్ష్యమనీ, సంస్థానాధిపతులకూ సంస్థాన ప్రజలకూ మధ్య ఉండవలసిన సంబంధాలు ఆంతరంగిక సమస్య అనీ, జాతీయ పోరాటంలో అది భాగం కాదనీ చెప్పబడుతూ వుండేది. ఈ కారణం వల్లనే 1928లో నెహ్రూ రిపోర్టు తయారుచేయబడేటప్పుడు సంస్థానాల సమస్య సర్వపక్ష సమావేశం యొక్క పరిధిలోకి రాకుండా పోయింది.

కాని బ్రిటిష్‌వారు కాంగ్రెసును దెబ్బకొట్టడానికీ, స్వరాజ్యవాంఛను తిరస్కరించడానికీ సంస్థానాధీశుల్ని సాధనంగా ఉపయోగించుకోదలచారు. ఈ విషయం రౌండ్‌టేబుల్ కాన్ఫరెన్స్‌లో రుజువైంది. 1935 నాటి భారత ప్రభుత్వ చట్టం అమల్లోకి వచ్చాక ఇది మరింత స్పష్టంగా ద్యోతకమైంది. రాజ్యాంగ చట్టంలో ఫెడరల్ విభాగానికి సంబంధించిన సమస్యపై బ్రిటన్ వివిధ రాజకీయ పార్టీలతో బేరమాడవలసిన అవసరం కలిగింది. ఆ బేరాల్లో సంస్థానాధీశులకు కీలకపాత్ర యివ్వబడింది.

ఈ విధంగా బ్రిటిష్‌వారు జాతీయ ప్రయోజనాలకు విరుద్ధంగా సంస్థానాధీశుల్ని



తమ కీలుబొమ్మలుగా ఉపయోగించుకోడానికి నిశ్చయించుకున్నారు. అందుచే కాంగ్రెసు నాయకత్వం సంస్థానాధీశులపట్ల వారి నిరంకుశ పాలనపట్ల నూతన విధానమవలంబించ వలసివచ్చింది. అంతేగాక, దేశమంతటా అతివాద శక్తులు బలపడుతూండడంవల్ల ప్రజాసామాన్యంలో ఒక నూతన చైతన్యం ఏర్పడింది. దాని ప్రభావం సంస్థాన ప్రజలమీద కూడా పడింది. కాంగ్రెసు నాయకత్వానికి ఇష్టం వున్నా లేకపోయినా సంస్థాన ప్రజలు బాధ్యతాయుత పరిపాలన కావాలనే నినాదంతో అంతకంతకు ముందుకు వచ్చి ప్రజాతంత్ర హక్కులకోసం పోరాడ్డం ప్రారంభించారు.

ఇట్టి పరిస్థితుల్లో 1938 ఫిబ్రవరిలో జరిగిన హరిపురా కాంగ్రెసు సంస్థానాల యెడ ఒక నూతన విధానాన్ని రూపొందించింది. దాని ప్రకారం కాంగ్రెసు "సంస్థానాల ఆంతరంగిక వ్యవహారాల్లో జోక్యం కలిగించుకోరాద"న్న పంథాను విడిచిపెట్టి, సంస్థాన ప్రజలు తమ సంస్థల ద్వారా బాధ్యతాయుత పరిపాలనకై చేసే పోరాటాలను ప్రోత్సహించా లన్న విధానాన్ని చేపట్టింది. అయితే సంస్థానాల్లో కాంగ్రెసు ఒక రాజకీయ సంస్థగా పనిచేయదలచుకోలేదు – ఆ మేరకు అది పాత విధానాన్నే అనుసరించదలచుకొంది. గాంధీజీ ఒక సంస్థానం తర్వాత ఇంకొక సంస్థానంలో ప్రజా ఉద్యమాలను నడిపే విషయమై స్వయంగా సలహాలివ్వడం ప్రారంభించారు. ఆయన ప్రధాన అనుచరులైన జమ్నాలాల్ బజాజ్, డాక్టరు పట్టాభి సీతారామయ్య మొదలైనవారు ఈ ఉద్యమాల్లో పాల్గొనసారం భించారు. గాంధీజీ రాజకోటలో ప్రజా ఉద్యమాన్ని స్వయంగా నడిపారు.

కాంగ్రెసు విధానంలో వచ్చిన ఈ మార్పును వివరిస్తూ ఆయన ఇలా తెలియజేశారు:

> "సంస్థాన ప్రజలు మేల్కోనంతకాలం సంస్థాన వ్యవహారాల్లో జోక్యం కలిగించుకోరాదన్న విధానం అత్యుత్కృష్టమైన రాజనీతిజ్ఞత అని నా అభిప్రాయం. కాని సంస్థాన ప్రజలు సర్వత్రా మేల్కొని, తమ హక్కులకోసం పోరాడుతూ ఎంత కాలమైనా బాధలు అనుభవించడానికి దృఢ సంకల్పులైనప్పుడు ఆ విధానాన్నే అనుసరించడం పిరికితన మనిపించుకొంటుంది." (సం. 5, పుట 30)

అయితే, గాంధీజీ నడిపిన ఇతర పోరాటాలన్నిటిలోవలెనే ఈ పోరాటాల్లో కూడ, ప్రజలు కార్యరంగంలోకి దుమికేటట్లు ఒకసారి ప్రోత్సహింపబడ్డ తర్వాత తాను విధించిన పరిమితులను ఉల్లంఘించే "విచిత్ర" ధోరణి ఒకటి వారిలో ఉందని తెలుసుకున్నారు. సహాయ నిరాకరణ రోజుల్లో "బ్రిటిష్ ఇండియా"లో విజృంభించిన జాతీయోద్యమం ఏ స్థాయిలో ఉండేదో ఇంచుమించు ఆ స్థాయికి 1930–'40 ఉత్తరార్ధ భాగంలో సంస్థాన ప్రజల ఉద్యమం చేరుకుంది. నిరంకుశులైన సంస్థానాధీశులకు వ్యతిరేకంగా ప్రజలు వారంతటవారు క్రోధావేశాలను ప్రదర్శించడం, దానివల్ల ఒక రాష్ట్రం తర్వాత మరొక

రాష్ట్రంలో అనేక ఘటనలు జరగడం పరిపాలయింది. వాటిని తాను ఆమోదించనని గాంధీజీ తెలియజేస్తూ వచ్చారు. తరువాత తిరువాన్కూరులోను, రాజకోటలోను, ఒరిస్సా సంస్థానాల్లోను, తదితరచోట్ల తన శిష్యులే సత్యాగ్రహ సూత్రాలకు ఖచ్చితంగా కట్టుబడి ఉండడంలేదని తెలుసుకొన్నారు. సంస్థాన ప్రజల పోరాటాలకు ఆయన రూపొందించిన "కొత్త పద్ధతి" దాని ఫలితమే. దాన్ని ఆయన ఈ క్రింది విధంగా వివరించారు :

"అధికారంలో ఉన్నవారితో ప్రత్యక్ష సంప్రతింపులు జరపాలని నేను అభిప్రాయ పడుతున్నాను. ఇదివరలో సంస్థాన కాంగ్రెసు కార్యకర్తలు అధికారంలో ఉన్నవారితో దూరాన నిలబడి మాట్లాడేవారు; అలాగే అధికారంలో ఉన్నవారు సంస్థాన కాంగ్రెసు కార్యకర్తలతో అట్లా దూరంనుంచే మాట్లాడేవారు. దీనిమూలంగా వారి మధ్య అగాధం పెద్దదవుతూ వచ్చింది. ఉభయ పక్షాలూ సామరస్యంతో మెలగాలని బోధించడంతోనే సత్యాగ్రహి కర్తవ్యం పూర్తికాదు... సత్యాగ్రహి చేయవలసిన మొట్టమొదటి, చిట్టచివరి పని గౌరవప్రదమైన అంగీకారం కుదుర్చుకొనేందుకు సమస్త అవకాశాల్ని ఎల్లప్పుడూ అన్వేషించడం... నాయకుల్లో క్రియాత్మకమైన అహింస ఉన్నట్లయితే, అట్టి అంగీకారం కుదుర్చుకోడం పూర్తిగా సాధ్యమనే విశ్వాసం, అవసరమనే నమ్మకం అలవరచుకోవాలి. అట్టి నమ్మకం వారిలో ఉంటే, తామనుసరించవలసిన మార్గం వారికి తప్పక బోధపడుతుంది." (సం. 5, పుట 152-153)

కొత్తగా చైతన్యం పొందిన సంస్థాన ప్రజలను కాంగ్రెసు బలపరుస్తుందనీ, రెండోవైపు ప్రజా ఉద్యమం "ప్రమాదకరమైన" పద్ధతుల్లో అభివృద్ధిచెందడం తనకిష్టం లేదనీ సంస్థానాధీశులకు స్పష్టం చేయడమే గాంధీజీ ఉద్దేశమని పై మాటలవల్ల అర్థం చేసుకోవచ్చు. అంతేకాక, సంస్థాన ప్రజలను అదుపులో ఉంచి, సంస్థానాధీశులు సైతం "సురక్షితమని" భావించే పద్ధతుల్లో ఉద్యమాన్ని నడపదలచుకున్నట్లు కూడా స్పష్టమవుతూంది. మరోవిధంగా చెప్పాలంటే, బ్రిటిష్ పాలకులతో ఏకమై కాంగ్రెసును వ్యతిరేకించవద్దనీ, బ్రిటిష్‌వారికి వ్యతిరేకంగా కాంగ్రెసుతో చేతులు కలపవలసిందనీ సంస్థానాధీశులకు గాంధీజీ విజ్ఞప్తి చేశారు.

నాల్గవ విషయం : పై విధంగా, అతివాద శక్తులను అదుపులో ఉంచడానికీ, మంత్రి పదవులను స్వీకరించడం ద్వారా తాను సంపాదించిన శక్తిని పటిష్ఠమొనర్చుకోడానికీ, సంస్థాన ప్రజల్లో కొత్తగా వచ్చిన చైతన్యాన్ని ఉపయోగించుకొని సంస్థానాధీశులతో రాజీ చేసుకోడానికీ కాంగ్రెసు నాయకత్వం ఒకవైపు ప్రయత్నిస్తూ వచ్చింది; మరోవైపు నూతన రాజ్యాంగచట్టంలోని ఫెడరల్ భాగాన్ని ప్రతిఘటించడం మీద తన దృష్టిని కేంద్రీకరించి పనిచేయ నారంభించింది. భారతదేశానికి మరో రాజ్యాంగ చట్టం తయారు

చేయడానికి ప్రజాతంత్రయుతంగా ఎన్నుకోబడు రాజ్యాంగనిర్ణయ సభను ఏర్పరచాలని అది కోరింది. ఈ సమస్యపైననే – అనగా నూతన రాజ్యాంగ చట్టంయొక్క ఫెడరల్ విభాగంపైననే – కాంగ్రెసుకీ బ్రిటిష్ ప్రభుత్వానికీ మధ్య చాలా పెద్ద అగాధం ఏర్పడింది.

విచిత్రమేమంటే, ఇదే సమస్యపై కాంగ్రెసులోని మితవాద – అతివాద శక్తుల మధ్య కూడ చాలా పెద్ద అగాధమేర్పడింది. ఒకవైపు గాంధీజీ నూతన రాజ్యాంగంలోని ఫెడరల్ భాగాన్ని వ్యతిరేకించారు. రాజ్యాంగ నిర్ణయసభను ఏర్పరచాలని కోరారు. కాని రెండోవైపున బ్రిటిష్ ప్రభుత్వంతో సంప్రతింపులు జరపడానికి తాను సిద్ధంగా ఉన్నట్లు స్పష్టం చేశారు. "న్యూయార్కు టైమ్స్" విలేఖరి మిస్టర్ స్టీల్‌తో ప్రసంగిస్తూ గాంధీజీ ఇలా చెప్పారు :

"అధినివేశ ప్రతిపత్తి భారతదేశంవంటి దేశాలకు కూడా వర్తించునట్లు ఆ శబ్దం నిర్వచింప బడితే, ఇంగ్లండ్‌తో ఇండియా ఒప్పందం కుదుర్చుకోడం సంభవమైతే – నాకు ఏ శబ్దమైనా పట్టింపు ఉండదు. బ్రిటిష్ రాజనీతిజ్ఞులు భారతదేశం విషయంలో ఇతర శబ్దాలన్నిటినీ విడిచిపెట్టి ఆ శబ్దాన్నే ఉపయోగించడం ఎక్కువ వీలు అనుకుంటే నేను పేచీపెట్టను."

దీనికి మిస్టర్ స్టీల్ ఇలా చెప్పాడు : "కాని కాంగ్రెసులో సుభాష్‌బోసు వంటివారు బ్రిటిష్ సామ్రాజ్యం వెలుపల భారతదేశం సంపూర్ణ స్వాతంత్ర్యం అనుభవిస్తూ ఉండాలని కోరుతున్నారు గదా!"

గాంధీజీ ఇలా జవాబిచ్చారు :

"అది కేవలం శబ్ద ప్రయోగానికి సంబంధించిన సమస్య. మే మిద్దరం ఉపయోగించే భాష వేరు అయినప్పటికీ, ఈ విషయంలో నాకూ సుభాష్‌బాబుకూ భేదం ఏమీ లేదు; ఉందంటే నేనంగీకరించను." (సం. 5, పుట 138)

కాని ఆచరణలో వారిద్దరి మధ్య భేదం శబ్ద ప్రయోగానికే పరిమితమై లేదనీ, కాంగ్రెసును ఎదుర్కొంటున్న ప్రధాన రాజకీయ – నిర్మాణ సమస్యలయెడ అనుసరించదగు కీలక వైఖరిలోనే భేదం ఉన్నదనీ స్పష్టమైపోయింది. కాంగ్రెసులో 1934 నుంచీ విభేదాలుంటూనే వచ్చాయి. ఇందులో ఎట్టి సందేహం లేదు. కాంగ్రెసులో అతివాద, మితవాద ముఠాలేర్పడ్డానికి కారణం ఈ విభేదాలే. అయితే, మొట్టమొదటి సాధారణ ఎన్నికల్లో కాంగ్రెసు ఏకైక సంస్థగా పోటీచేయవలసిన అవసరమేర్పడ్డంవల్ల ఆ విభేదాలు అడుగునపడ్డాయి. ఈ కారణంవల్లనే మూడేండ్లు వరసగా అతివాదులు కాంగ్రెసు అధ్యక్షులుగా ఉండడం అవసరమని మితవాద నాయకులు అభిప్రాయపడ్డారు. అయితే, కాంగ్రెసు మంత్రివర్గాలేర్పడ్డ తర్వాత రాష్ట్ర మంత్రులకూ సాధారణ కాంగ్రెసువాదులకు

మధ్య సంఘర్షణలు పెద్దయెత్తున వ్యాప్తి చెందుతూన్నప్పుడు అతివాదులకు సౌకర్యాలిచ్చి సంతృప్తిపరచే దశ అంతం కావలసిందనీ, వారితో పోరాడవలసిన దశ ప్రారంభమవాలనీ మితవాద నాయకత్వం భావించింది. దీని పర్యవసానమే త్రిపుర కాంగ్రెసు అధ్యక్ష పదవికి బోసు – పట్టాభి గారల మధ్య జరిగిన పోటీ. ఆ పోటీ యొక్క పరిణామ క్రమాన్ని పరిశీలిస్తే, అది ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగిన పోటీ మాత్రమే కాదని స్పష్టమవుతుంది.

సుభాష్ బోసు రెండవసారి అధ్యక్ష పదవికి పోటీచేయడానికి నిశ్చయించుకున్నప్పుడు సర్దార్ పటేల్, రాజేంద్రప్రసాద్, జమ్నాలాల్ బజాజ్, జైరామ్ దాస్ దౌలత్ రామ్, శంకర్రావు దేవ్, భోలాభాయ్ దేశాయ్, ఆచార్య కృపలానీ ఒక సంయుక్త ప్రకటన చేస్తూ డాక్టరు పట్టాభి ఏకగ్రీవంగా ఎన్నుకోబడే అవకాశం కలిగించవలసిందనీ, తన నిర్ణయాన్ని పునరాలోచించుకోవలసిందనీ సుభాష్ బోసుకు విజ్ఞప్తి చేశారు. దానికి బోసు ఇలా సమాధానమిచ్చారు :

> "ఒక అతివాదపక్ష అభ్యర్థిని కాంగ్రెసు అధ్యక్షునిగా చేయ ప్రయత్నించడం అప్రధానమైన విషయం కాదు. వచ్చే యేడు ఫెడరల్ స్కీముపై కాంగ్రెసు మితవాదపక్షానికీ, బ్రిటిష్ ప్రభుత్వానికీ మధ్య రాజీ జరిగే అవకాశాలున్నట్లు దేశంలో అనేకమంది అభిప్రాయపడు తున్నారు. అందువల్ల ఒక అతివాది అధ్యక్షుడుగా ఉండడం మితవాద నాయకత్వానికి ఇష్టంలేదు. ఎందుచేతంటే, అట్టి అధ్యక్షుడు రాజీ జరక్కుండా చేసేందుకు పక్కలో బల్లెంగా ఉండవచ్చు... ఇట్టి పరిస్థితుల్లో నఖశిఖ పర్యంతం ఫెడరల్ స్కీముకు బద్ధశత్రువైనవాడే కాంగ్రెసు అధ్యక్షుడుగా ఉండడం అవసరం." (సం. 5, పుట 36)

సర్దార్ పటేల్ జనవరి 25వ తేదీన ఒక ప్రకటన చేశారు. అందులో, డాక్టరు పట్టాభిని అభ్యర్థిగా నిలబెట్టాలని "మౌలానా ఆజాద్, జవహర్‌లాల్ నెహ్రూ, రాజేంద్రప్రసాద్, భూలాభాయ్ దేశాయ్, కృపలానీ, మహాత్మా గాంధీ, నేను హాజరైయుండగా జరిగిన మూజువాణీ సంప్రతింపులలో నిర్ణయింపబడింద"ని తెలియజేశారు.

జనవరి 27వ తేదీని జవహర్‌లాల్ నెహ్రూ చేసిన ప్రకటనలో, తాను కూడా ఆ సంప్రతింపులలో పాల్గొన్నట్లు సర్దార్ పటేల్ పేర్కొన్న విషయాన్ని కాదన లేదు. తాను సుభాష్ బోసుకు అనుకూలుణ్ణని గాని, డాక్టరు పట్టాభికి అనుకూలుణ్ణని గాని చెప్పలేదు. అధ్యక్ష ఎన్నికపై ప్రారంభమైన వివాదం దురదృష్టకరంగా పరిణమిస్తున్నందుకు విచారం మాత్రం ప్రకటించారు. కాంగ్రెసు సంస్థ ఫెడరల్ స్కీమును ఖచ్చితంగా తిరస్కరించిందనీ, అందుచేత ఈ ఎన్నికలో ఫెడరల్ స్కీముపై అభిప్రాయ భేదాలేర్పడే సమస్య లేదనీ నెహ్రూ తెలియజేశారు. మరో విధంగా చెప్పాలంటే, జవహర్‌లాల్ నెహ్రూ మితవాదపక్షంతో ప్రత్యక్షంగాను, సంపూర్ణంగానూ చేరిపోలేదు గాని సుభాష్ బోసు వైఖరిని స్థూలంగా వ్యతిరేకించారు.

అధ్యక్ష ఎన్నికపై చాల తీవ్రమైన పోటీ జరిగి మితవాద పక్షం ఓడిపోయింది. ఓటింగులో సుభాష్ బోసుకు 1580 ఓట్లు, డాక్టరు పట్టాభికి 1375 ఓట్లు వచ్చాయి. ఎన్నికల ఫలితం ప్రకటింపబడగానే గాంధీజీ ఇలా వ్రాశారు :

"శ్రీ సుభాష్ బోసు తన ప్రత్యర్థి అయిన డాక్టరు పట్టాభి సీతారామయ్యపై ఖచ్చితమైన విజయం సాధించారు. తిరిగి ఆయన కాంగ్రెసు అధ్యక్షుడుగా ఎన్నుకోబడ్డం మొదటనుంచీ నాకిష్టంలేదు. కారణాలలోకి నేనిప్పుడు వెళ్ళను. ఆయన తన ప్రణాళికలో పేర్కొన్న విషయాలు, చేసిన వాదనలు సరియైనవని నేననుకోడంలేదు. తన సహచరులను గురించి ఆయన తెలియజేసిన విషయాలు న్యాయసమ్మతమైనవీ కావు; గౌరవప్రదమైనవీ కావు. అయినప్పటికీ, ఆయన గెలిచినందుకు నేను సంతోషిస్తున్నాను. మౌలానా ఆజాద్ పోటీ నుంచి విరమించుకున్నప్పుడు డాక్టరు పట్టాభిని విరమించుకోవద్దని చెప్పింది నేను గనుక, ఓటమి నాదేగాని ఆయనిది కాదు." (సం. 5, పుట 30)

ఐనా, మితవాద నాయకత్వం ఈ ఓటమిని అంగీకరించదలచుకోలేదు. నిజానికి, సుభాష్ బోసు విజయం తన ఓటమి అన్న గాంధీజీ మాటలనే ఉపయోగించుకొని ప్రజాభిప్రాయాన్ని తమ కనుకూలంగా త్రిప్పుకొనేటందుకు, కాంగ్రెసు ప్రతినిధుల తీర్పును మార్పించేందుకు మితవాద పక్షం ప్రయత్నించింది. వర్కింగ్ కమిటీ నుంచి 12 మంది సభ్యులు రాజీనామా ఇచ్చారు. వారు : సర్దార్ పటేల్, మౌలానా ఆజాద్, రాజేంద్రప్రసాద్, సరోజని నాయుడు, భూలాభాయ్ దేశాయి, పట్టాభి సీతారామయ్య, శంకర్రావు దేవ్, హరికృష్ణ మెహతాబ్, ఆచార్య కృపలానీ, దౌలత్ రామ్, బజాజ్, గఫూర్ఖాన్ గారలు. వారు తమ సమిష్టి జాబులో ఇలా తెలియజేశారు :

"దేశానికొక ఖచ్చితమైన పాలసీ ఉండాలనీ, అలా ఉండవలసిన సమయం నేడు వచ్చిందనీ మేము అభిప్రాయపడుతున్నాం. కాంగ్రెసులోని పరస్పర విరుద్ధములైన గ్రూపుల మధ్య రాజీ ఇందుకు ప్రాతిపదికగా ఉండరాదనికూడా మేము భావిస్తున్నాం. అందుచేత మీరు మెజారిటీ అభిప్రాయానికి ప్రాతినిధ్యం వహించే వారితోనే వర్కింగ్ కమిటీని నియమించడం యుక్తమని అభిప్రాయపడుతున్నాం." (సం. 5, పుట 56)

ఈ సమిష్టి జాబును "తయారుచేసినది గాంధీజీయేనని విశ్వసింపడుతూ" న్నట్లు టెండూల్కర్ తెలియజేశారు.

నెహ్రూ ఈ జాబుమీద సంతకం పెట్టకపోయినప్పటికీ, ఆయన కూడ వర్కింగ్ కమిటీ సభ్యత్వానికి రాజీనామా పెట్టారు.

"ఆయన (నెహ్రూ) ఇరుపక్షాల మధ్య రాజీ కుదర్చడానికి ప్రయత్నించారు. సుభాష్ బోసు తన ఎన్నికకుముందు ఫెడరేషన్ సమస్యపై మితవాదులు బ్రిటిష్ ప్రభుత్వంతో

రాజీ చేసుకొనబోతున్నారంటూ చేసిన ఆరోపణను ఉపసంహరించుకోవలసిందని బోసుకు ఆయన ఒక లేఖ వ్రాశారు." (సం. 5, పుట 56)

జవహర్‌లాల్ నెహ్రూతో కలుపుకొని మొత్తం 13 మంది సభ్యులు వర్కింగ్ కమిటీ నుంచి రాజీనామా ఇవ్వడం చిన్న విషయమేమీ కాదు. కాంగ్రెసులో ఏర్పడ్డ ఆంతరంగిక సంక్షోభానికి ఇది ప్రారంభ దశ. ఇంత పెద్ద సంక్షోభం అదివరకెప్పుడూ కాంగ్రెసులో ఏర్పడలేదు. కాని చివరకు మితవాదులే జయించారు.

త్రిపురీ మహాసభలో కాంగ్రెసు ప్రతినిధులు వ్యక్తం చేసిన ఆవేదనను మితవాద పక్షం పూర్తిగా ఉపయోగించుకుంది. గాంధీజీ కోరిక ప్రకారం కొత్త వర్కింగ్ కమిటీని నియమించవలసిందని సుభాష్ బోసును కోరుతూ వారొక తీర్మానం ఆమోదింపచేశారు.

కాని బోసు గాంధీజీ సలహా తీసుకొనడానికి వెళ్తే, ఆయనతో గాంధీజీ ఇలా చెప్పారు:

"నాకు మీ అభిప్రాయాలు తెలుసు; అధిక సంఖ్యాక సభ్యులు మూలసూత్రాల్లో ఎలా భేదిస్తున్నారో కూడ నేనెరుగుదును. అందుచేత నేను మీకు కొన్ని పేర్లిస్తే, మీమీద వాటిని రుద్దినవాణ్ణవుతాను. నేను మీకు వ్రాసిన జాబుల్లో ఈ పరిస్థితిని గురించి చాల వివరంగా తెలియజేశాను. ఈ మూడు రోజుల్లోను మన ఇద్దరి మధ్య ఎంతో సన్నిహితంగా సంభాషణలు జరిగినప్పటికీ, నా అభిప్రాయాన్ని మార్చుకోవలసిన అవసరం కనపడ్డంలేదు. పరిస్థితులిలా ఉన్నప్పుడు మీరు మీ సొంత కమిటీని నియమించుకోవచ్చు; అట్టి స్వేచ్ఛ మీకుంది." (సం. 5, పుట 102-103)

గాంధీజీ ప్రదర్శించిన ఈ వైఖరివల్ల బోసు తన అధ్యక్ష పదవికి రాజీనామా ఇవ్వవలసి వచ్చింది. ఆయన స్థానంలో రాజేంద్రప్రసాద్ అధ్యక్షుడుగా నియమించ బడ్డారు. 100కి 100 పాళ్ళూ మితవాద నాయకులే ఉన్న వర్కింగ్ కమిటీని రాజేంద్రప్రసాద్ నియమించారు. జవహర్‌లాల్ నెహ్రూను కూడా అందులో లేకుండా చేశారు. కొత్త వర్కింగ్ కమిటీ తీసుకున్న మొదటి చర్యలలో ఒకటి అ.భా. కాంగ్రెసు కమిటీని సమావేశపరచి సుభాష్ బోసూ, సోషలిస్టులూ తదితర అతివాదులూ ఎంత వ్యతిరేకించినప్పటికీ రెండు ముఖ్యమైన తీర్మానాలను ఆమోదింపజేయడం. ఏ కాంగ్రెసుపాలిత రాష్ట్రంలోనూ ఆ రాష్ట్ర కాంగ్రెసు కమిటీ అనుమతి లేకుండా ఏ రూపంలోనూ సత్యాగ్రహం చేయరాదనీ. అందుకు సన్నాహాలు జరపరాదనీ కాంగ్రెసు వాదులందరినీ ఈ తీర్మానం నిర్దేశించింది. దేశమంతటా అభివృద్ధి చెందుతున్న అసంఖ్యాకమైన రైతాంగ పోరాటాల్లో కాంగ్రెసువాదులు పాల్గొనకుండా చేయడమే దీని ఉద్దేశమని వేరే చెప్పనక్కర్లేదు. డాక్టరు లోహియా ఈ విధంగా వాదించారు :



"మంత్రివర్గ కార్యాల్లోను, నిర్మాణ కృషిలోను మీ (గాంధీజీ) కార్యక్రమ మొక్కటే సరిపోతుందని ప్రజలీరోజున భావించడంలేదు; రైతాంగ పోరాటాలవంటి కార్యక్రమాలతో వారు కొన్ని ప్రయోగాలు చేస్తున్నారు. జనరల్ సత్యాగ్రహోద్యమం లేనప్పుడు కూడా ఈ కొత్త కార్యక్రమాల్లో కొంతవరకు స్థానిక స్వభావంగల చెదురుబొదురు చర్యలు అవసరమవుతాయి." (సం. 5, పుట 176)

దీనికి గాంధీజీ ఇలా జవాబు చెప్పారు :

"చాల సందర్భాలలో రైతుల్ని అహింసాయుత చర్యలకు ప్రోత్సహించడం కనపడ్డంలేదు. ఇలా చెప్పవలసివస్తున్నందుకు నేను విచారిస్తున్నాను... నిజం చెప్పవలసివస్తే, నేను నా చుట్టూ చూస్తున్నది అహింసాయుత పోరాటానికి సన్నాహాలు కావు; హింసాత్మక చర్యలకు ప్రయత్నాలు. ఈ ఉద్దేశం ఎవరికీ లేకపోవచ్చు; కాని పర్యవసానం మాత్రం ఇదే." (సం. 5, పుట 177-8)

ఈ తీర్మానం తీవ్రమైన ఒక నిర్మాణ సంఘర్షణకు నాందీ ప్రస్తావన. సుభాష్ బోసు, క్రింది కాంగ్రెసు కమిటీలలో ఉన్న అనేకమంది ప్రముఖ కాంగ్రెసు సభ్యులు పై తీర్మానంపట్ల నిరసన తెలియజేసేందుకు యావద్భారతదేశంలో జులై 9వ తేదీని బహిరంగ సభలు జరపడానికి నిశ్చయించుకున్నారు. తదనుగుణ్యంగా చాలచోట్ల "నిరసన దినోత్సవం" జరిగింది. దీన్ని గురించి వర్కింగ్ కమిటీ చర్చించి, ఈ క్రింది విధంగా తీర్మానించింది :

"తీవ్రమైన ఈ శిక్షణా వ్యతిరేక చర్యకు శ్రీ సుభాష్ చంద్రబోసు బెంగాల్ రాష్ట్ర కాంగ్రెసు కమిటీ అధ్యక్షుడుగా ఉండడానికి అనర్హుడనీ, 1939 ఆగస్టు లగాయతు మూడు సంవత్స రాల వరకు ఆయన ఏ కాంగ్రెసు కమిటీ సభ్యుడుగాను ఉండరాదనీ తీర్మానించడమైనది."

ఈ చర్య సహజంగా అతివాద, మితవాద పక్షాలమధ్య తీవ్రమైన సంఘర్షణకు దారితీసింది. అయితే, అతివాదులను పెద్దయెత్తున కాంగ్రెసు నుంచి వెళ్ళగొట్టేందుకు ఈ చర్య దారితీయకముందే ప్రపంచ ప్రాముఖ్యంగల మహా సంక్షోభం ఒకటి ముంచుకు వచ్చింది. హిట్లరు పోలెండుమీద దాడిచేశాడు. వెంటనే బ్రిటన్ జర్మనీమీద యుద్ధం ప్రకటించింది; ఆ యుద్ధంలో భారతదేశం కూడా భాగస్వామి అని వైస్రాయి ప్రకటించాడు. భారతదేశంలో ప్రజాభిప్రాయ మేమిటో తెలుసుకోకుండా బ్రిటన్ ఈ విధమైన ప్రకటన చేసినందుకు యావద్భారత ప్రజలు ఆగ్రహావిష్టులయ్యారు. ఈ యుద్ధంవల్ల "విపత్కర పరిస్థితి" ఏర్పడిందనీ, "భారతదేశ భద్రత ప్రమాదంలో పడింద"నీ చెప్పి వైస్రాయి అనేక ఆర్డినెన్సులను జారీచేయడంతో, ఇంచుమించు అగ్నిపర్వతం బ్రద్దలవుతోందా అనిపించింది.

# 10. కాంగ్రెసు కార్యవర్గంతో విభేదాలు

**యు**ద్ధం ప్రారంభమయింది. ఒకటో ప్రపంచయుద్ధానికీ, రెండో ప్రపంచ యుద్ధానికీ నడుమ గడచిన పదిహేనేళ్ళలోనూ యుద్ధాన్ని గురించి గాంధీజీ అభిప్రాయాలేమన్నా మారాయా అన్న ప్రశ్న సహజంగా వస్తుంది. ఏమంటే, ఆయన అహింసా సిద్ధాంతవాదియే అయినా మొదటి ప్రపంచయుద్ధానికి సైనికులను చేర్చడానికై బ్రిటిష్ సామ్రాజ్యవాదుల రిక్రూటింగ్ సార్జంటుగా పనిచేశారు. రెండో ప్రపంచ యుద్ధంలో కూడ ఆయన ఆ విధంగానే వ్యవహరిస్తారా? ఒక సుప్రసిద్ధుడైన కాంగ్రెసు వాది ఆయన నీ ప్రశ్న వేశాడు. దానికి గాంధీజీ ఇచ్చిన సమాధానం ఇది :

> "ఈ యుద్ధం పేరు వింటే ఇదివరకెన్నడూ కలగనంత బాధ, భయం కలుగుతూంది. ఈనాడు నాకు కలుగుతున్నంత విచారం ఇదివరలో ఎన్నడూ కలగలేదు. గత యుద్ధంలోలాగ స్వయంగా వెళ్ళి రిక్రూటింగ్ సార్జెంటుగా పనిచేయకుండా ఈ బాధే నిరోధిస్తూంది. అయినా, మిత్రరాజ్యాల మీదనే నాకు సానుభూతి వుంది. అది ఆశ్చర్యకరం కావచ్చు. ఇష్టమున్నా లేకపోయినా ఇది పాశ్చాత్య ప్రజాతంత్ర విధానానికీ హిట్లరు నిరంకుశ రాజరికానికీ మధ్య యుద్ధంగా పరిణతి పొందుతూంది. (సం. 5, పుట 207)

ఆ విధంగా బ్రిటన్‌యెడ గాంధీజీ దృక్పథం మారలేదనుకోవచ్చు. బ్రిటనే యుద్ధంలో గెలవడం ఆయన అభిమతం. అయితే వారికి సాయుధ సహాయం మాత్రం ఇవ్వరు. మొదటి ప్రపంచయుద్ధం నాటికన్న ఆయన మరీ అహింసావాది కావడమే దానికి కారణం అనిపిస్తుంది. కాని, ఇటువంటి అభిప్రాయం సరియైనది కాదు.

ఒకటి : మొదటి ప్రపంచయుద్ధంలో గాంధీజీ తనకు బుద్ధిపుట్టింది గనక రిక్రూటింగ్ సార్జంటుగా పనిచేయలేదు. ఆనాడు భారతీయ బూర్జువావర్గం అనుసరిస్తున్న విధానంలో అదొక భాగం. అమెరికాలో ఏర్పడిన గదర్ పార్టీకి చెందిన విప్లవకారులు కొద్దిమందీ, బెంగాల్‌లోనూ, ఇతర రాష్ట్రాలలోనూ వున్న కొద్దిమంది "దౌర్జన్యవాదు" లనబడేవారూ తప్ప ఆనాడు జాతీయోద్యమ నాయకులందరూ ఆ యుద్ధంలో బ్రిటన్‌కు సాయం చేయాలనీ, బాధ్యతాయుత ప్రభుత్వం కావాలనే జాతీయ వాంఛను బ్రిటన్ ఆమోదించవలసిందిగా డిమాండు చేయాలనీ అనుకొన్నారు. అదే పద్ధతిని అనుసరించారు.

రెండోది : స్వరాజ్యం సాధించాలనే రాజకీయాశయంతోనే తాను రిక్రూటింగ్ సార్జంటుగా పనిచేస్తున్నానని గాంధీజీయే స్పష్టంగా చెప్పారు.

> "సామ్రాజ్య రక్షణకై జరుగుతున్న యుద్ధంలో పాల్గొనడమే స్వరాజ్య సంపాదనకు సులభమైన మార్గం. సామ్రాజ్యం నశిస్తే దానితోపాటు మన ఆశలూ అంతరిస్తాయి. మన హక్కుల్ని ఈవేళే సాధించుకోకుంటే తర్వాత మోసం చేస్తారని కొందరంటున్నారు. సామ్రాజ్య రక్షణలో మనం కూర్చుకొన్న శక్తే తర్వాత మన హక్కుల్ని సంపాదించి పెడుతుంది."

అని గాంధీజీ చెప్పిన మాటలను ఇదివరకే ఒక ప్రకరణంలో ఉదహరించాను. "మనం సామ్రాజ్యంకోసమూ, స్వరాజ్యంకోసమూ ఈపాటి త్యాగం చేయడానికి సంసిద్ధం కాలేకపోతే మనం దానికి అర్హులం కాము అన్నా తప్పులేదు" అని కూడా ఆయన అన్నారు.

మూడోది : రెండు ప్రపంచయుద్ధాల మధ్యకాలంలో భారతీయ బూర్జువావర్గం బాగా బలపడింది. రాష్ట్రీయ స్వాతంత్ర్యం సంపాదించింది. ఏడు రాష్ట్రాలలో కాంగ్రెసు తన మంత్రివర్గాలనే ఏర్పరచగలిగింది. తన స్థానాన్ని ఇంతగా బలపరచుకొన్నా కాంగ్రెసుకు తృప్తి కలగలేదు; అందుచేత ఒకవైపున ప్రజల ఒత్తిడికి, రెండోవైపున రాయబారాల ద్వారా తమ బలాన్ని ఇంకా విస్తరింపజేసుకొనేటందుకు ప్రయత్నించింది. ముప్పయ్యోపది ఉత్తరార్ధంలో గాంధీజీ నాయకత్వాన కాంగ్రెసు అనుసరించిన వ్యూహం ఇది.

అందుచేత సహజంగా కాంగ్రెసు ధోరణి కూడా ఈ వ్యూహానికి అనుకూలంగానే వుంటుంది : మొదటి ప్రపంచయుద్ధంలోలాగ ఇప్పుడు బేషరతుగా బ్రిటిష్‌వాళ్ళ యుద్ధ ప్రయత్నాలకు కాంగ్రెసు సహకారం ఇవ్వడానికి సిద్ధంగాలేదు. అయినా, కనీసం యుద్ధానంతరం అయినా తాము కోరినట్లు కేంద్రంలో అధికారం ఇస్తామని వాగ్దానంచేస్తే బ్రిటిష్‌వాళ్ళకి చేయగల సహాయం అంతా చేస్తామని కాంగ్రెసు నాయకత్వం స్పష్టం చేసింది.

కాంగ్రెసు ఒక్కటే కాదు, బూర్జువా, భూస్వామివర్గాల నాయకత్వం క్రింద వున్న ముస్లింలీగు, హిందూ మహాసభ, మితవాదులు మొదలయిన పార్టీలూ, సంస్థలూ అన్నీ ఈ విధంగానే ఆలోచిస్తున్నాయి. అయితే ఈ సంస్థలకు కాంగ్రెసుతో పేచీలున్నాయి.

కాం(గెసునుంచి వారు కోరుతున్నవి కొన్ని వున్నాయి. బ్రిటిష్‌వాళ్ళకు వ్యతిరేకంగా కాం(గెసును బలపరచడానికవి సిద్ధంగా లేవు; కాని, వానిలో ఏదీ కూడ తమ పెద్దవాళ్ళు వెనకటి యుద్ధంలో చేసినట్లు బ్రిటిష్‌వాళ్ళకి బేషరతుగా సహాయం చేయడానికి సిద్ధంగాలేవు.

మొత్తం బూర్జువావర్గం యొక్క, అందులోనూ ప్రత్యేకంగా కాం(గెసు యొక్క పరిస్థితులలో వచ్చిన ఈ మార్పే గాంధీజీ ధోరణిలో మార్పునకు కూడా కారణం. మొదటి ప్రపంచయుద్ధం తర్వాత యుద్ధం అంటే ఏవగింపు కలగడానికి కారణం, తాను ప్రాతినిధ్యం వహిస్తున్న వర్గం ఇతఃపూర్వంకన్న బలంగా ఉండడమూ, ఆ కష్ట దినాలలో సహాయం చేయనని చెప్పి బ్రిటిష్‌వాళ్ళ మీద ఒత్తిడి తీసుకురాగల స్థితిలో ఉండడమూను.

యుద్ధం ఎడ గాంధీజీ యొక్క అభిప్రాయాలూ, కాం(గెసు వర్కింగ్ కమిటీ యొక్క అభిప్రాయాలూ ఏవిధంగా పరిణామం పొందాయో శ్రీ టెండూల్కర్ వివరించారు. దానిని మనం అంగీకరించితే రెండో ప్రపంచయుద్ధ ప్రారంభ దినాలలో ఈ ఇద్దరి దృక్పథాల మధ్యా అతి ప్రధానమైన వైరుధ్యాలేవో వున్నాయనుకోవలసి వస్తుంది. బ్రిటిష్ వాళ్ళకి కావలసిన సహాయాన్ని బేషరతుగా ఇవ్వాలని గాంధీజీ, కొన్ని షరతుల నంగీకరిస్తేనే సహాయం ఇవ్వాలని కాం(గెసు కార్యవర్గం. కాం(గెసు కోరిన షరతుల నంగీకరిస్తే సైన్య సమీకరణ మొదలయిన అన్ని విషయాలతోనూ బ్రిటిష్ వాళ్ళకు తోడ్పడాలని కాం(గెసు కార్యవర్గం, కేవలం నైతికమైన, హింసారహితమైన సహాయాన్ని మాత్రమే ఇవ్వాలని గాంధీజీ – ఈ విధంగా భిన్న ధోరణులు తీసుకున్నట్లు ఆయన వ్రాశారు.

అహింస అనేదానియెడ గాంధీజీకీ, కాం(గెసు కార్యవర్గానికీ గల అభిప్రాయాలు విభిన్నం. అదే ఈ విభిన్నతకూ కారణం. కాం(గెసు కార్యవర్గం ఒక్క బ్రిటిష్ ప్రభుత్వంతో జరిపే పోరాటానికే అహింసా సూత్రానికి పరిమితం చేస్తుంది. ఇక మతకలహాలలోను, రౌడీ చర్యల విషయంలోను, ఆక్రమణపరులను ప్రతిఘటించడంలోను, అహింసా సూత్రానికే కట్టుబడి ఉండడం వారి అభిమతం కాదు. కాని, ఆంతరిక సమస్యల్నీ, బయలనుంచి వచ్చే దాడుల్నీ కూడా అహింసా సూత్రానికి అనుగుణంగానే పరిష్కరించాలని గాంధీజీ అంటారు.

గాంధీజీకీ, కాం(గెసు కార్యవర్గానికీ మధ్యనున్న ఈ భిన్న దృక్పథాలు యుద్ధ ప్రారంభదినాలలో తీవ్రమైన వాదోపవాదాలకు దారితీశాయి. కాం(గెసులో ఆంతరిక వైరుధ్యాలకు కారణమైనాయి. గాంధీజీకి అతి సన్నిహితులయిన అనుచరులూ, భుజాలవంటి వాళ్ళూ అయిన సర్దార్ పటేల్, రాజగోపాలాచారి మొదలయినవారు అహింసా సూత్రాన్ని వర్తింపచేయడంలో గాంధీజీ అభిప్రాయాల్ని అంగీకరించలేక పోయారనీ, ఆ కారణంగా ఆయనతో భేదించేవరకు వచ్చారనీ, గాంధీజీ, ఆయన జీవితచరిత్ర వ్రాసిన టెండూల్కరూ మనలను నమ్మమంటారు.

ఈ వివాదం వచ్చిన తీరును చూస్తే ఒకటి కనబడుతుంది. ఇది పైకి ఒక నైతిక సమస్యగా కనబడుతున్నా, బ్రిటిష్ వాళ్ళతో వ్యవహరించేటప్పుడు అవలంబించ వలసిన ఎత్తుగడలను గురించిన అభిప్రాయ భేదమే దీనికి మూలం అని గ్రహించవచ్చును. మరొకటి కూడా కనబడుతుంది. పరస్పరాంగీకారంతో గాంధీజీకీ, కాంగ్రెసు కార్యవర్గంలోని అత్యధిక సంఖ్యాకులకూ మధ్య జరిగిన పని విభజనగా కూడా ఇది కనబడుతుంది. ఉదాహరణకు దీనినే తీసుకోవచ్చును. ఒక దశలో ఈ విభేదానికి మూలమైన పరిస్థితులు తాత్కాలికంగా పరిష్కారమైనాయి. మళ్ళీ కొంత కాలానికి అంతకన్న తీవ్రరూపంలో ముందుకు వచ్చి మళ్ళీ పరిష్కారమైనాయి.

యుద్ధం ప్రారంభమైనాక కాంగ్రెసు కార్యవర్గం మొట్టమొదటిసారి సమావేశం అయినప్పుడే ఈ విభేదం సన్నగా కనబడింది. "బ్రిటిష్ వారికిచ్చే సహాయాన్ని బేషరతుగా ఇవ్వాలనే అభిప్రాయంమీదనే ఒంటరిగాణ్ణి అయిపోయినందుకు చింతిస్తున్నాను." (సం. 5, పుట 204) అని గాంధీజీ అనుకొన్నది ఈ సందర్భంలోనే. యుద్ధం అప్పుడే ప్రారంభమయింది. ఆ యుద్ధంలో రెండు పక్షాలవారూ, ఏవిధంగా వ్యవహరిస్తారో, ఫాసిస్టు వ్యతిరేక పక్షంలోని వేర్వేరు రాజ్యాలు ఏవిధంగా వ్యవహరిస్తాయో అప్పటికింకా స్పష్టం కాలేదు. ఆ పరిస్థితులతో కాంగ్రెసు కార్యవర్గం గాంధీజీ సలహాను త్రోసిపుచ్చింది. భవిష్యత్తులో బ్రిటిష్ వారితో రాయబారాలు జరపవలసి వచ్చినప్పుడు తన స్థితి బలహీనపడేటట్లుగా కాంగ్రెసు కార్యవర్గం అప్పుడే ఒక నిర్ణయం తీసుకోవడాని కిష్టపడలేదు. కేవలం అహింసా సూత్రం ప్రాతిపదికమీద బేషరతుగా సాయం ఇస్తానన్నా, షరతులతోనో, బేషరతుగానో ఇచ్చినా కాంగ్రెసు స్థితి బలహీనపడుతుంది.

కాంగ్రెసు ప్రతిపాదనల ప్రాతిపదిక మీద చర్చలు జరపడానికీ ఒప్పందం కుదుర్చుకొనడానికీ బ్రిటిష్ ప్రభుత్వం సిద్ధంగా లేదని తర్వాతి ఘటనలు రుజువు చేశాయి. ప్రజాతంత్రమూ, స్వయం నిర్ణయాధికారమూ అనేది ఇండియాకు వర్తిస్తాయో, వర్తించవో విస్పష్టంగా ప్రకటించమని ప్రభుత్వాన్ని కాంగ్రెసు కోరింది. ముస్లింలీగు, నిమ్నజాతుల సమాఖ్య, మితవాదులు, సంస్థానాధీశులు మొదలయిన వారి కోరికలను అడ్డంపెట్టుకొని బ్రిటిష్ సామ్రాజ్యవాదులు కాంగ్రెసు కోరికలను ఎదురొడ్డారు. ఆనాడు భారత మంత్రిగా వున్న లార్డ్ జెట్లండు, వైస్రాయిగా వున్న లార్డ్ లిన్‌లిత్‌గోల ప్రకటనలు చూస్తే ఇది తెలుస్తుంది. ఈ ప్రకటనలలో "పాత వాసన" పోలేదనీ, "బ్రిటిష్ సామ్రాజ్య స్తంభాలనదగిన – యూరోపియన్ల ప్రయోజనాలు, సైన్యాలు, సంస్థానాధీశులు, మతవైషమ్యాలు – నాలుగింటి మీదా" (సం. 5, పుట 202) ఆధారపడడమే ఇప్పటికీ కనిపిస్తూందనీ ఆ ప్రకటనలమీద గాంధీజీ వ్యాఖ్యానించారు. ఈ నాలుగు స్తంభాలలో చివర పేర్కొన్న

మతవైషమ్యాలను బ్రిటిష్ సామ్రాజ్యవాదులు ఉపయోగిస్తున్న విధానం అంతకంతకు కాంగ్రెసుకు బాధాకరంగా తయారవుతూంది. ముస్లింలీగు బలపడుతూంది. ఇతర అల్పసంఖ్యాకులతో కలిసి అది కాంగ్రెసు మార్గానికి ఎన్నో అవరోధాలు కల్పిస్తూంది.

ఇవన్నీ చూశాక ఎంతో వత్తిడి తెస్తే తప్ప బ్రిటిష్ ప్రభుత్వం తమ కోరికలను ఖాతరు చేయదని కాంగ్రెసు కార్యవర్గానికి తోచింది. అందుచేత రాష్ట్ర ప్రభుత్వాలలో వున్న కాంగ్రెసు మంత్రులను రాజీనామా పెట్టమని ఆదేశించింది; దీని వెనక ఇంకా కొన్ని చర్యలు తీసుకొని దేశాన్ని 'ఎటుండి ఎటువచ్చినా' సర్వసిద్ధంగా వుండేటట్లు చేయతలంచింది. ఈ పనిచేయడంలో గాంధీజీ, అహింసావాద ధోరణి, నాజీ సైనిక బలాన్ని సైనిక బలంతో నిరోధించవద్దని నాజీలను హింసారహిత పద్ధతిలో ఎదుర్కోమంటూ, ఆయన బ్రిటన్‌కూ, ఇతర మిత్రదేశాలకూ చేసిన విజ్ఞప్తి, కాంగ్రెసు కార్యవర్గానికి బాగా ఉపకరించాయి. అప్పటికే ప్రజలలో వేగంగా ప్రబలమవుతున్న యుద్ధవ్యతిరేక భావాల్ని మరింత తీవ్రం చేశారు. తమ యుద్ధ ప్రయత్నాలు కొనసాగడం సులభం కాదనే భావం బ్రిటిష్ ప్రభుత్వానికి కలగచేయడం వారి అభిప్రాయం.

దీనివలన ఒకటి అర్థం అవుతూంది. ఈ దశలో గాంధీజీకీ, కాంగ్రెసు కార్యవర్గానికీ మధ్య అభిప్రాయ భేదాలు లేవు. అంతేకాదు, కాంగ్రెసు కార్యవర్గం గాంధీజీ సూచనల ననుసరించి పోరాటానికి తయారు కావలసిందని ప్రజలకు, ముఖ్యంగా కాంగ్రెసువాదులకు విజ్ఞప్తి చేసింది. 1934లో బొంబాయిలో జరిగిన కాంగ్రెసు మహాసభ తర్వాత మరల రామఘర్ కాంగ్రెస్‌లోనే మహాత్ముడు ఉపన్యసించారు. బ్రిటిష్ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానానికి ఫలితంగా కాంగ్రెసూ, కాంగ్రెసువాదులూ మనుష్యులను పంపిగాని, ధనం, సరుకులు ఇచ్చిగాని యుద్ధానికి సహాయపడలేరు అంటూ రామఘర్ కాంగ్రెసు తన ప్రధాన తీర్మానంలో పేర్కొంది.

యుద్ధానికి వ్యతిరేకంగా నడిపే పోరాటం ఎలా వుండాలి? దానిని ఎలాగ నడపాలి? అనే విషయంమీద కాంగ్రెసు మహాసభలో గాంధీజీ తన అభిప్రాయాలను వివరించారు. రామఘర్ మహాసభ పూర్తి అయిన వెంటనే "ఒక్కొక్క కాంగ్రెసు కమిటీ ఒక్కొక్క సత్యాగ్రహ కమిటీ" అంటూ ఆయన నినాదం ఇచ్చారు. కాంగ్రెసు కమిటీలూ, కాంగ్రెసువాదులూ సత్యాగ్రహులుగా ఏవిధంగా పనిచెయ్యాలో ఆయన వివరంగా సలహాలు పంపారు.

కాని, త్వరలోనే అంతర్జాతీయ పరిస్థితి మారింది. 1940 మే, జూన్‌లలో బ్రిటనూ, మిత్రరాజ్యాలూ నాజీల చేతులలో వరుసన పరాజయాలు పొందాయి. పశ్చిమ యూరపు అంతా నాజీలకు లొంగిపోయింది. బ్రిటన్ భవిష్యత్తు గురించే పెద్ద ఆందోళన పుట్టింది. బ్రిటన్‌లో ప్రభుత్వం మారింది. ఛాంబర్లేన్ పోయి చర్చిల్ ప్రధానమంత్రి అయ్యాడు.

ఈ పరిణామాల ఫలితంగా భారతదేశం ఎడల బ్రిటన్ విధానం ఏమన్నా మారుతుందాయనే ప్రశ్న భారతదేశంలో వచ్చింది.

"పాశ్చాత్య దేశాలలో గంటగంట కెందరో బలి అయిపోతున్నారు. ప్రశాంతములయిన భవనాలు నాశనం అయిపోతున్నాయి. ప్రస్తుతం ఉన్న ప్రతిష్టంభనను పరిష్కరించి గౌరవనీయమైన ఒప్పందం జరిగేటట్లు నేను సర్వవిధాలా ప్రయత్నిస్తాను" అని గాంధీజీ అన్నారు. (సం. 5, పుట 349)

యుద్ధ ప్రారంభ దినాలనాటికన్న ఇప్పుడు గాంధీజీకీ, కాంగ్రెసు కార్యవర్గానికీ మధ్య తీవ్రమయిన అభిప్రాయభేదాలు రాకతప్పదు. పరిస్థితులు అట్లాంటివి. బ్రిటన్ స్థితే ప్రమాదంలో పడిందిగనక బ్రిటిష్ రాజకీయవేత్తలు కాంగ్రెసుతో రాజీకి రాకతప్పదని కార్యవర్గ సభ్యులలో ఎక్కువమంది భావించారు. అదే జరిగేటట్లయితే కేవలం అహింస ప్రాతిపదికమీదనే జరగాలనీ కోరే గాంధీజీ చేతిలో నాయకత్వం ఉండడం కాంగ్రెసుకు చాలా చిక్కుగా వుంటుంది.

గాంధీజీతో సహా కాంగ్రెసు కార్యవర్గం సుదీర్ఘంగా చర్చించింది. అహింసా సూత్రాన్ని దేశరక్షణ కార్యక్రమాలకు వర్తింపచేయలేమని చివరకు జూన్ 21వ తేదీన వారొక ప్రకటన చేశారు. దేశాన్ని అహింసాయుత పోరాటంలో నడిపే బాధ్యత గాంధీజీ మీద నుంచి తప్పించారు. కార్యవర్గం తన తీర్మానంలో ఇలా చెప్పింది : "కాంగ్రెసు తన అహింసా సిద్ధాంతానికే కట్టుబడి ఉండాలని మహాత్మా గాంధీ కోరుతున్నారు. బయటినుంచి వచ్చే ఆక్రమణల నుంచీ, దేశంలో బయలుదేరే అరాజక చర్యల నుంచీ స్వాతంత్ర్యాన్ని కాపాడుకొనేటందుకు కూడా సైన్యాలను భారతదేశం ఉపయోగించదని ప్రకటించాలంటున్నారు." గాంధీజీ అభిప్రాయాలతో సమంగా తాము అంత దూరం పోలేకపోయినా "ఆయన తన మహదాదర్శం కోసం తనకు నచ్చిన పంథాలో పనిచేసేటందుకు స్వేచ్ఛ" ఉండాలని కార్యవర్గం భావించింది. అందుచేత "కాంగ్రెసు అనుసరించే పంథాకూ, చేసే పనులకూ ఆయనకు బాధ్యత లేకుండా చేయ నిర్ణయించింది." (సం. 5, పుట 355)

ఇది జరిగిన వెంటనే పూనాలో అఖిల భారత కాంగ్రెసు కమిటీ సమావేశం జరిగింది. దానిలో అధ్యక్షుడు ఆజాద్ ఇలా అన్నారు :

"కాంగ్రెసు ఒక రాజకీయ సంస్థ. మన దేశానికది స్వాతంత్ర్యం సంపాదించడానికి కంకణం కట్టుకుంది. ప్రపంచ శాంతిని నెలకొల్పడానికి ఏర్పడ్డ సంస్థ కాదది. మహాత్మా గాంధీ చెప్తున్నంత దూరం మనం పోలేము. అది మన బలహీనతే అంటాను. అయితే మనకున్న బలహీనత మానవజాతి కంతకూ వున్న బలహీనతే గాని వేరుకాదు. మన ముందుకు వచ్చే క్లిష్ట సమస్యలన్నింటినీ మనం పరిష్కరించవలసిందే. కాంగ్రెసు నుంచి



మహాత్మా గాంధీ విడిపోయారన్న సత్యాన్ని మనం గుర్తించాలి. ధైర్యం వహించాలి.” (సం. 5, పుట 384)

యుద్ధానంతరం భారతదేశ స్వాతంత్ర్యాన్ని గుర్తిస్తామని బ్రిటిష్ ప్రభుత్వం ప్రకటిస్తే కాంగ్రెసు విదేశీ దాడిని ఎదుర్కొనేటందుకు జాతీయ ప్రభుత్వంలో పాల్గొనడానికి సిద్ధంగా వున్నదని పూనా సమావేశంలోనే అఖిల భారత కాంగ్రెసు కమిటీ ప్రకటించింది.

కాని, అనుకొన్న విధంగా దీనికి బ్రిటిష్ ప్రభుత్వం సమాధానం ఇవ్వలేదు. జులై నెలలో కాంగ్రెసు చేసిన ‘పూనా ప్రకటన’కు ప్రత్యుత్తరంగా బ్రిటిష్ ప్రభుత్వం ఆగస్టులో ఒక ప్రకటన చేసింది. భారతీయులే తమ రాజ్యాంగాన్ని నిర్మించుకోవలసి ఉంటుందనీ, అయితే దానికి రెండు షరతులున్నాయనీ వైస్రాయి ఆ ప్రకటనలో తెలిపాడు. ఆ షరతులలో మొదటిది బ్రిటిష్ ప్రభుత్వం తీసుకొన్న బాధ్యతలను వారు అంగీకరించాలి. రెండోది అల్పసంఖ్యాకుల అభిప్రాయాలను తోసివేయకూడదు. బ్రిటిషువారు తమ పాత స్తంభాలు నాలుగింటినీ పట్టుకొని నాటకం ఆడుతున్నారనేది దీనివలన స్పష్టం అవుతూంది. టెండూల్కరు వ్రాసినట్లు ఈ ప్రకటన తమకు ‘అన్యాయం చేసింద’ని కాంగ్రెసు వారు భావించారంటే ఆశ్చర్యం లేదు. వారు గాంధీజీతో బహిరంగంగా భేదించారు. “అహింసా సిద్ధాంతాన్ని భారత జాతీయ రక్షణకు వర్తింపచేయలేమని ప్రకటించారు. యుద్ధ ప్రయత్నాలలో పాల్గొనాలంటే ఏమేమి జరగాలో స్పష్టపరిచారు.” కాని...

బ్రిటిష్ ప్రభుత్వం కాంగ్రెసు ప్రతిపాదనను బహిరంగంగా నిరాకరించడంతోనే గాంధీజీకీ, కార్యవర్గానికీ మధ్యనున్న అభిప్రాయభేదం పరిష్కారం కావడానికి తగు పరిస్థితి ఏర్పడింది. కార్యవర్గం అఖిల భారత కాంగ్రెసు కమిటీ అత్యవసర సమావేశాన్ని జరిపింది. దానిలో ఆజాద్ ఇలా ఉపన్యసించారు :

> “ఈ ఘటనలు మహాత్మా గాంధీని వచ్చి తిరిగి నాయకత్వం వహించవలసిందిగా కోరేటట్లు చేశాయి. ఆయన దాని కంగీకరించారు. ఇప్పుడు ఆయనకూ కాంగ్రెసు కార్యవర్గానికీ మధ్య ఎటువంటి భేదాభిప్రాయాలూ లేవు.” (సం. 5, పుట 396)

తర్వాత గాంధీజీ వ్రాసి తయారుచేసిన తీర్మానాన్ని కాంగ్రెసు కమిటీ ఆమోదించింది. “స్వరాజ్య సంపాదనలోనే గాక స్వతంత్ర భారతదేశంలో కూడ అహింసా విధానాన్నీ, కార్యాచరణనూ సాధ్యమైనంతవరకు అనుసరించాలని ఈ కమిటీ గట్టిగా విశ్వసిస్తూంది.” (సం. 5, పుట 396)

అఖిల భారత కాంగ్రెసు కమిటీ చేసిన ఈ తీర్మాన ఫలితమే 1940–41లో జరిగిన యుద్ధ వ్యతిరేక వ్యష్టి సత్యాగ్రహం. ఈ సత్యాగ్రహాన్ని మొదట ప్రారంభించిన వాడు ఆచార్య వినోబాభావే. ఆయన తర్వాత గాంధీజీ స్వయంగా ఎన్నిక చేసిన వ్యక్తులు.

అటు తర్వాత ఆయనే ఎన్నిక చేసిన చాలమంది సత్యాగ్రహంలో పాల్గొన్నారు. ఇది చాల నెలలపాటు కొనసాగింది. బ్రిటన్ ప్రారంభించిన యుద్ధ ప్రయత్నాలలో భారతదేశాన్ని ఇరికించినందుకు అసమ్మతి తెలపడానికే ఈ సత్యాగ్రహం ఉద్దేశించబడింది. జరిగింది కూడ అంతే. ఈ పోరాటం స్వాతంత్ర్యం కోసం ప్రారంభించినది కాదనీ, "ప్రస్తుతానికి పూర్తియైన వాక్స్వాతంత్ర్యం, రచనా స్వాతంత్ర్యంతోనే మనం సంతృప్తిపడవలసి వుంటుంద"నీ గాంధీజీ తన ఉపన్యాసాల లోనూ, ప్రకటనలలోనూ అనేకమార్లు గుచ్చిగుచ్చి చెప్పారు. ఈ పోరాటంలో విజయం కలుగుతుందనే నమ్మకం తనకు లేదని ఆయన స్పష్టంగా చెప్పారు : "ఒక మొండి శత్రువును ఎదిరించి ప్రాణపణంగా పోరాడుతున్న ప్రభుత్వాన్ని మనం ప్రతిఘటిస్తున్నాము... మన పోరాటం కూడ యూరోపియన్ల పోరాటంతో సమానమైన ఆశయాలు కలిగి వుండాలి."

ఇది జరిగిన కొద్ది నెలల తర్వాత 1941 డిసెంబరులో గాంధీజీకీ కాంగ్రెసు కార్యవర్గానికీ నడుమ మరల వైరుధ్యాలు తలెత్తాయి. 1940 సెప్టెంబరులో జరిగిన బొంబాయి సభ తీర్మానం ద్వారా తనమీద మోపిన బాధ్యతను తొలగించవలసిందిగా గాంధీజీ మరల కోరారు. కాంగ్రెసు కార్యవర్గం దానికి అంగీకరించింది. ఆనాటి పరిస్థితులను టెండూల్కరు ఇలా వివరిస్తున్నారు :

"1. జూన్ నడిమిని జర్మనీ రష్యాపై దాడి ప్రారంభించడంతో అంతర్జాతీయ పరిస్థితి తారుమారు అయింది. వైస్రాయి ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్‌నూ, జాతీయ రక్షణ కౌన్సిల్‌నూ ఏర్పరుస్తామని ప్రభుత్వం జూలైలో ప్రకటించింది."

"2. రాజకీయ పరిస్థితులను బాగుపరచి, ప్రజలు యుద్ధానికి తోడ్పడేటట్లు చేయడం అత్యవసరమని 1941 ఆకురాలుకాలం ఆఖరు రోజుల నాటికి స్పష్టమయింది. నెమ్మదిగా జర్మనీ రష్యాలోకి తోసుకుపోతూంది. పశ్చిమాసియాగుండా కూడ ఎప్పుడో దాడి ప్రారంభించ గలదనుకొంటున్నారు. ఇండో చైనాలో జపాన్ కాలు నిలదొక్కుకొని పూర్తిగా యుద్ధంలోకి దిగడానికి సన్నాహాలు చేసుకొంటూంది. ఇండియాకున్న అనంత సహజ సంపదల్నీ, మానవ బలగాన్నీ సమకూర్చుకోవడం నైతిక తంత్రం రీత్యా అత్యవసరం అయింది."

"పెరల్ హార్బర్ దెబ్బతగిలేటందుకు ముందు బ్రిటిష్ ప్రభుత్వం రాజీకి సుముఖత్వం కనబరచింది." (సం. 6, పుట 14-17)

(పండిత జవహర్‌లాల్ నెహ్రూనూ, మౌలానా అబుల్‌కలాం ఆజాద్‌ను, శాసనోల్లంఘనోద్యమ సందర్భంలో శిక్షలు పడినవారినీ విడుదల చేయడం ద్వారా ఈ సుముఖతను కనబరచింది - నంబూద్రిపాద్.)

"3. 1941 డిసెంబరు 23న కాంగ్రెసు కార్యవర్గం బార్డోలీలో సమావేశం అయింది.

గత సమావేశానికీ దీనికీ మధ్య పధ్నాలుగు నెలలు గడిచాయి. ఈ మధ్యకాలంలో జరిగిన విషయాల నది పరిశీలించింది. జపాన్ కూడా యుద్ధంలోకి దిగింది కనుక ప్రమాదకరంగా తయారయిన పరిస్థితులను గురించి వాస్తవిక దృక్పథంతో ఆలోచించవలసిన అవసరం ఏర్పడింది."

కాంగ్రెసు కార్యవర్గం "ప్రమాదకరంగా తయారయిన పరిస్థితులను గురించి వాస్తవిక దృక్పథం" ప్రకటించేక గాంధీజీ వారికి ఒక జాబు వ్రాశారు. బొంబాయి తీర్మానానికి తానూ ఇతరులూ చేసిన వ్యాఖ్యలలో కనబడే భిన్నత్వానికి ఆయన ఆ లేఖలో ఆశ్చర్యం కనబరచారు:

"బొంబాయి తీర్మానాన్ని మళ్ళీ చదివాక నాతో భేదిస్తున్న వారిదే సరియైన అభిప్రాయమని నాకు తోచింది. ఆ మాటలకు లేని అర్థాన్ని నేను ఊహించుకొన్నా ననిపించింది. యుద్ధ ప్రయత్నాలను ప్రతిఘటించడంలో అహింస అవశ్యానుసరణీయం కాదని తెలిశాక నేను కాంగ్రెసుకు నాయకత్వం వహించడం సాధ్యంకాని పని... అందుచేత, బొంబాయి తీర్మానం నా మీద ఉంచిన బాధ్యత నుంచి నన్ను తప్పించగోరుతున్నాను." (సం. 6, పుట 42)

ఆ కోరికను కాంగ్రెసు కార్యవర్గం వెంటనే ఆమోదించింది. ప్రభుత్వం రాయబారాలకు సుముఖత్వం చూపింది. అవి కొనసాగడానికి ఆటంకాలు తొలగించబడినాయి.

"4. ఘటనలు అతివేగంగా జరిగిపోతున్నాయి. ఆసియాలోనూ, యూరపులోనూ కూడా మిత్రరాజ్యాలు ఓటమి పొందుతున్నాయి... బర్మాలో బ్రిటిష్ సేనలు పొందిన పరాజయం తాకిడి చైనాలోకంటా తగిలింది. 1942 ఫిబ్రవరిలో మార్షల్ చాంగ్ కైషేక్ భార్యా సహితంగా ఢిల్లీ వచ్చాడు. ఆయన బ్రిటన్‌కూ, ఇండియాకూ నిర్మొగమాటంగా ఒక విజ్ఞప్తి చేశాడు. భారతీయులకు రాజకీయాధికారం ఇవ్వవలసిందని పరిపాలకులకు విజ్ఞప్తి చేశాడు." (సం. 6, పుట 73)

"5. ఈ పరిణామాల ఫలితంగా బ్రిటిష్ ప్రభుత్వం రాయబారాలు ప్రారంభించవలసి వచ్చింది."

"1942 మార్చి 7న రంగూన్ పడిపోయింది. ఇంక జపాను బెంగాల్ మద్రాసుల మీదుగా ఆక్రమణ సాగిస్తుందనే అనిపించింది. మార్చి 11న చర్చిల్ ఒక ప్రకటన చేస్తూ తన యుద్ధకాల మంత్రివర్గం భారతదేశానికి ఒక ప్రణాళికను తయారు చేసిందనీ, దానికి న్యాయంగా తగినంత ఆమోదం లభిస్తుందేమో తెలుసుకొని, జపాను నుంచి రక్షించుకోవడంలో 'భారతీయుల శక్తి యుక్తులన్నీ కేంద్రీకృతం అయ్యేటట్లు చేయడానికి' సర్ స్టాఫర్డ్ క్రిప్స్ భారతదేశానికి వెళ్ళడానికి సిద్ధపడ్డారనీ చెప్పాడు." (సం. 6, పుట 87)

# 11. "క్విట్ ఇండియా" ఉద్యమం – అటు తర్వాత

పైన చెప్పిన ఘటనలను చూస్తే గాంధీజీకీ కాంగ్రెసు కార్యవర్గానికీ మధ్య వచ్చిన విభేదానికి మూలం దేశ రక్షణలో హింసా విధానం కూడునా కూడదా అనే నైతిక సమస్య కాదనీ, బ్రిటిష్‌వాళ్ళపై ఎలా ఒత్తిడి తేవాలి, ఎలా రాయబారాలు నడపాలనేదే అసలు సమస్య అనీ అర్థం చేసుకోగలం.

గాంధీజీ అహింసా సూత్రానికి మెలికలేమీ లేవు. యుద్ధ ప్రయత్నాలను అహింసా మార్గంలో ప్రతిఘటించాలన్న ఆయన పట్టుదల బ్రిటిష్‌వాళ్ళ మీద బాగా ఒత్తిడి తీసుకు రావడానికి ఉపయోగించింది. అందుచేతనే పోరాటం పేరు చెప్పి బెదిరించవలసివచ్చి నప్పుడూ, పోరాటానికి ఏర్పాట్లు చేయవలసివచ్చినప్పుడూ కాంగ్రెసు కార్యవర్గం తప్పకుండా ఆయన నాయకత్వాన్ని కోరింది.

రెండోవైపున, బ్రిటిష్‌వాళ్ళతో రాయబారాలకు అవకాశం చిక్కినప్పుడల్లా కాంగ్రెసు కార్యవర్గం 'వాస్తవిక దృక్పథం' తీసుకొని, అధికారం ఇస్తేనే బ్రిటన్‌కు భారతదేశం సహాయం చేస్తుందని చెప్పింది. అల్లాంటి పరిస్థితులు వచ్చినప్పుడల్లా తనను నాయకత్వ బాధ్యత నుంచి తప్పించవలసిందని గాంధీజీయే కోరడమూ, కాంగ్రెసు కార్యవర్గం ఆమోదించడమూ జరిగింది. ఇదొక అద్భుతమైన ఏర్పాటు. ప్రజలు తెచ్చే ఒత్తిడిని సాయంచేసుకొని, బ్రిటిష్‌వాళ్ళతో రాయబారాలు సాగించడాన్ని ప్రధాన వ్యూహంగా అనుసరిస్తున్న బూర్జువావర్గానికిది మంచి వీలుగా కుదిరింది.

అటు తర్వాత కాంగ్రెసు ప్రతినిధులకూ, బ్రిటిష్ ప్రభుత్వ ప్రతినిధులకూ సాగిన రాయబారాలను కనక గమనిస్తే గాంధీజీకీ ఇతర కాంగ్రెసు నాయకులకూ మధ్యనున్న



వైరుధ్యాలు, అనుకూల్యాలు బాగా అర్థం అవుతాయి.

రాయబారాలు నడిపేటందుకు కాంగ్రెసు కార్యవర్గానికి అవకాశాలు కలిగించడం కోసమే 1941 చివర రోజులలోనూ, 1942 ప్రారంభంలోనూ గాంధీజీ కాంగ్రెసు నాయకత్వాన్ని వదలుకొన్నారు. పేరుకు కాంగ్రెసు అధ్యక్షుడూ, కార్యవర్గమూ రాయబారాలు సాగిస్తున్నా అడుగడుగునా గాంధీజీ సలహా తీసుకొనేవారు. గాంధీజీ సరాసరి రాయబారాలలో పాల్గొకుండా దూరంగా వున్నా, ఆయన సలహా ప్రకారమే కాంగ్రెసు రాయబారాలలో తన విధానాలను రూపొందించుతూంది. పైగా కాంగ్రెసు కోరిన కనీస కోరికలను ఇవ్వడానికి బ్రిటిష్ ప్రభుత్వం సిద్ధంగా లేదని స్పష్టంకాగానే గాంధీజీ మరల ముందుకు వచ్చి యుద్ధ వ్యతిరేక, బ్రిటిష్ వ్యతిరేకోద్యమాలకు నాయకత్వం వహిస్తూ వచ్చారు. చరిత్ర ప్రసిద్ధమైన "క్విట్ ఇండియా" (ఇండియా నుంచి వైదొలగండి) అనే నినాదాన్ని రూపొందించినది ఆయనే.

1940-'41లో బ్రిటిష్‌వారి యెడ గాంధీజీ ప్రదర్శించిన వైఖరికీ, '42లో ప్రకటించిన వైఖరికీ ఎంతో తేడా వుంది. 1940-'41లో తన నాయకత్వం క్రింద ప్రారంభించిన పోరాటం స్వాతంత్ర్యం కోసం కాదని ఆయన అన్నారు.

> "తమ స్వాతంత్ర్యమే మహా ప్రమాదంలో ఉన్నవాళ్ళతో మనం స్వాతంత్ర్యం కోసం పోరాడ్డం ఏమిటి? ఒక దేశం మరో దేశానికి స్వాతంత్ర్యం ఇవ్వడం సాధ్యమైనప్పటికీ బ్రిటిష్‌వాళ్ళు ఇవ్వగల స్థితిలో లేరు. తమ ప్రాణానికే ముప్పు వచ్చినప్పుడు ఒకరి ప్రాణం కాపాడలేరు. తమ స్వాతంత్ర్యం కోసం వారు ప్రాణాలొడ్డి పోరాడవలసి వచ్చినప్పుడు వాళ్ళలో ఏమాత్రం న్యాయబుద్ధి వున్నా, మన వాక్స్వాతంత్ర్యాన్ని వారు అంగీకరించాలి." (సం. 5, పుట 48)
>
> కాని; 1942లో ఆయన అభిప్రాయాలు మారాయి :
>
> "బ్రిటిష్‌వాళ్ళు ఒక క్రమమైన పద్ధతిలో వెళ్ళిపోవాలనేది నా అభిప్రాయం. సింగపూర్, మలయా, రంగూన్‌లలో జరిగినట్లు ప్రమాదంలో చిక్కుకోకూడదు. అలా చేయడానికి చాలా గొప్ప ధైర్యం వుండాలి. ఆ పని చేయడం అంటే – మానవునికి వుండే పరిమితులను వొప్పుకోవడమూ, భారతదేశం యెడ మంచిగా వ్యవహరించడమూ అవుతుంది." (సం. 6, పుట 92)

"వాక్స్వాతంత్ర్యం చాలు : అంతకన్నా వేరేమీ అక్కర్లేదు." – "నిల్చున్నపాటున స్వాతంత్ర్యం ఇవ్వాలి" అనే రెండింటి మధ్య తేడాను పోరాట పద్ధతులలో గల తేడాగా మనం పరిశీలించవచ్చును. 1940-'41లో గాంధీజీ తన పరీక్షల కాగిన కొద్దిమంది సత్యాగ్రహులకే పోరాటాన్ని పరిమితం చేశారు. సత్యాగ్రహాన్ని ఎవరో కొద్దిమంది వ్యక్తులకు

మాత్రమే పరిమితం చేయవద్దనీ, దానిని ప్రజాపోరాటంగా నడపవలసిందనీ చెప్పినవారిని ఆయన త్రోసిపుచ్చారు. "సత్యాగ్రహులు ఎంతో స్వల్ప సంఖ్యలో వుంటే వచ్చే ఇబ్బంది లేదు. పది పన్నెండుగురే అయినా వాళ్ళు కాంగ్రెసు కంతకూ ప్రాతినిధ్యం వహిస్తారు."

"ఒక్క రాయబారి దేశ ప్రజలందరికీ ప్రాతినిధ్యం వహించడంలేదా?" అని గాంధీజీ ప్రశ్నించారు.

కాని 1942లో ఆయన దృక్పథం పూర్తిగా మారింది. దౌర్జన్యాలకు దిగినందుకు ప్రజలను నిందించనిది ఆయన జీవితంలోకల్లా అప్పుడే. (చౌరీ చౌరా వగైరాల నాటివలె) ప్రజల పోరాట కార్యక్రమాలయెడ ఆయన మామూలుగా ప్రదర్శిస్తూ వచ్చిన దృక్పథాన్ని మార్చుకొన్నారు. ప్రభుత్వం 'దారుణ దౌర్జన్యాలు చేయడంచేత ప్రజలు ప్రతిక్రియా రూపంలో దౌర్జన్యాలు' చేసివుంటారనే ధోరణిని ఆయన తీసుకున్నారు.

క్విట్ ఇండియా ఉద్యమాన్ని ప్రారంభించినప్పుడు ప్రజలు తమంతట తామే విజృంభిస్తారని 1942 ఆగస్టు 8కి పూర్వమే గాంధీజీ ఊహించినట్లు కనపడుతుంది. బ్రిటిష్ ప్రభుత్వానికే కాదు – భూస్వాములకు కూడ వ్యతిరేకంగా కోట్లకొలది రైతాంగం తిరుగుబాటు చేస్తారని ఆయన అన్నారు. ఆయన జీవితంలోకల్లా ప్రజా పోరాటాన్ని గురించి చెప్పడం అదే మొదలు. రైతులు పన్నులు ఇవ్వడం మానుతారనీ, "దానితో స్వతంత్రంగా కార్యాచరణకు దిగగల ధైర్యం కలుగుతుంది; అటు తర్వాత భూములను స్వాధీనం చేసుకోవడం జరుగుతుంది" అనీ అమెరికన్ పత్రికా రచయిత లూయీఫిషర్‌తో ఆయన అన్నారు. "దౌర్జన్యంగానేనా" అని ఫిషర్ ప్రశ్నించాడు.

"దౌర్జన్యం జరగవచ్చు. అయితే భూస్వాములు కూడ సహకరించవచ్చునేమో" అన్నారు గాంధీ.

"మీరు ఆశాజీవులు" అని ఫిషర్ వ్యాఖ్యానించారు.

"పారిపోవడం ద్వారా సహకరించకూడదా?" అన్నారు గాంధీజీ.

"తీవ్ర ప్రతిఘటనకు దిగకూడదా?"

"పదిహేను రోజులపాటు కల్లోలాలు జరిగితే జరగవచ్చు. కాని, త్వరితంగానే వాటిని అదుపులో పెట్టగలమనుకుంటాను" అన్నారు గాంధీజీ. (సం. 6, పుట 122)

కాని నిజంగానే ప్రజలు విప్లవ పోరాటంలోకి రావాలని గాంధీజీ కోరారనుకో కూడదు. బ్రిటిష్‌వాళ్ళు దేశంలో నుండి పోయేటట్లు చేయడానికై జరిగే ఉద్యమాన్ని గురించి ప్రచారం చేస్తూన్న రోజుల్లో "రైతులు భూములను పట్టుకోవడం" "15 రోజులపాటు కల్లోలాలు" అంటూ చెప్పినా, శ్రామిక వర్గాన్ని కాని, రైతాంగాన్ని కాని విప్లవ పోరాటాల్లోకి తీసుకురావడానికీ, వారిని నడిపించడానికీ గట్టి ప్రయత్నాలేవీ ఆయన చెయ్యలేదు.

అఖిల భారత కాంగ్రెస్ కమిటీలో ఆయన ఇచ్చిన రెండు గంటల ఉపన్యాసం లోనూ రైతుల్నీ, కూలీల్నీ, కార్మికుల్నీ గురించి ఒక్కమాట కూడ చెప్పలేదనేది గమనించవలసిన విషయం. దానిలో అధిక భాగం హిందూ ముస్లిం సమస్యమీద తన యొక్క, కాంగ్రెస్ యొక్క దృక్పథాల వివరణకే ఉపయోగించారు. దాని తర్వాత పోరాటాన్ని సాగించడంలో అనంత త్యాగాలు చెయ్యవలసిన అవసరాన్ని గురించి కొద్దిమాటలు చెప్పారు. (విజయమో, వీరమరణమో అన్నది ఆయన ఇచ్చిన నినాదమే) దీని తర్వాత పత్రికా రచయితలకు, సంస్థానాధీశులకు, ప్రభుత్వోద్యోగులకు, సైనికులకు, విద్యార్థులకు క్విట్ ఇండియా ఉద్యమాన్ని బలపరచడానికై ఒక్కొక్కరు ఏమేం చేయాలో చెప్పారు. జనానీకంలో అత్యధిక భాగమైన కార్మికులు, రైతులు గాంధీజీ దృష్టిలోకే రాలేదు. విజయమో వీరమరణమో అన్న నినాదంతో నిశ్శబ్దంగా త్యాగం చెయ్యడం తప్ప వారు ప్రత్యేకంగా నిర్వహించవలసిన పాత్ర ఏమీ లేదు.

గాంధీజీ కాంగ్రెస్ కార్యవర్గం కోసం తయారుచేసిన "ఆదేశాల ముసాయిదా"ను చూస్తే, ఈ విధంగా మరచిపోవటం యాదృచ్ఛికంగా జరిగినది కాదని తెలుస్తుంది. ఆ ముసాయిదా దేశమంతటా హర్తాళ్ జరపడానికై ఒక రోజును నిర్ణయిస్తుంది. (20 ఏళ్ళ క్రితం సహాయ నిరాకరణోద్యమాన్ని ప్రారంభించినప్పుడు ఇల్లాగే హర్తాళ్‌తో ప్రారంభించారు.) కాని దాంట్లోనే ఆయన స్పష్టంగా హర్తాళ్ రోజున పట్టణాల్లో ఊరేగింపులు జరుపకూడదు. సభలూ సమావేశాలూ జరుపకూడదు. ప్రజలంతా 24 గంటలు నిరాహారం ఉండి ప్రార్థనలు చెయ్యాలన్నారు. "దౌర్జన్యాలుకాని, అల్లర్లుకాని జరుగుతాయనే భయం లేదు కనుక" గ్రామాల్లో ఊరేగింపులు, సభలు కూడ చెయ్యవచ్చునన్నారు. దీనిని చూస్తే ఒకటి అర్థం అవుతుంది. గత పోరాటాలలో వలెనే ఇప్పుడు కూడ కష్టజీవులైన ప్రజానీకం ప్రదర్శనలు, ఇతర కార్యక్రమాలు సాగించకుండా ఆటంకపరచడమే గాంధీజీ ఉద్దేశం.

మరొకటి కూడా వుంది. భూస్వాములకు వ్యతిరేకంగా రైతాంగం ఎదురుతిరగకుండా తగినన్ని జాగ్రత్తలు తీసుకోవడం ఆ ముసాయిదాలో కనిపిస్తుంది. లూయీఫిషర్‌తో తాను చెప్పిన మాటలకు వ్యతిరేకంగా రైతులు ప్రభుత్వంతో మాత్రమే పోరాడాలని ఆయన చెప్పారు.

> "జమీందారీ వ్యవస్థ ఉన్నచోట్ల రైతులు జమీందారుకూ, అతడు ప్రభుత్వానికీ పన్నులిస్తారు. ఆ జమీందారు రైతులతో కలసి వచ్చినట్లయితే పన్నులో ఆయనకు రావలసిన భాగాన్ని ఉభయులూ కలసి నిర్ణయించుకుని ఆ భాగం అతనికి ఇవ్వాలి. జమీందారు ప్రభుత్వం ప్రక్క చేరితే పన్నేమీ ఇవ్వక్కర్లేదు." (సం. 6, పుట 215)

"ఆగస్టు విప్లవాన్ని" గాంధీజీ నిజమైన ప్రజావిప్లవ పోరాటంగానే నడపడానికి

ఏర్పాట్లు చేశారంటూ చాల రాజకీయ గ్రూపులు, వ్యక్తులు భావిస్తున్నారు. కాని పైదానిని చూస్తే అది సత్యం కాదని తెలిసిపోతుంది. అయితే ఒక్కటి నిజం. ప్రజలు పోరాటాల్లోకి ఉత్సాహంతో వస్తారేమోనన్న ఆదుర్దా ఇదివరకున్నంతగా ఈ పోరాటంలో గాంధీజీకి లేదు. పోరాటాన్ని ప్రారంభించడం వలన ప్రజలలో ఉత్సాహం, చొరవ, ఆవేశం విపరీతంగా పెరుగుతాయని ఆయన ఊహించారు. అలా జరగాలని కోరారు కూడ. ఇదివరకటి పోరాటాల్లో అహింసను ఖచ్చితంగా పాటించాలన్నారుకాని ఇప్పుడు అంతగా పాటించక పోయినా ఆయన పట్టించుకో లేదు. అయితే సామ్రాజ్యవాదులూ, వారి భారతీయ తాబేదార్లూ పూర్తిగా ఓడిపోయేటంత వరకూ రాజీ రాయబారాలు లేని ప్రజా పోరాటాన్ని సాగించేటందుకై ఆయన సిద్ధంగా వున్నారని అనుకోవచ్చా?

గాంధీజీకి అటువంటి అభిప్రాయాలేవీ లేవని తర్వాత జరిగిన ఘటనలు నిరూపించాయి. పోరాటం ఎంతో కాలం జరగదని "వేగంగా, క్లుప్తంగా" ముగుస్తుందని ఆయన భావించారంటే ప్రజల ఆవేశపూరిత చర్యలకు భయపడి ప్రభుత్వం రాజీకి వస్తుందని ఆయన ఊహించినట్లు చెప్పవచ్చు. ప్రభుత్వ యంత్రాన్ని స్తంభింపచేసే ఆవేశపూరిత చర్యలకు ప్రజలు పూనుకొనవచ్చు. "ప్రభుత్వ ఆజ్ఞలు న్యాయమైనవయితేనే వానిని అమలుజరుపుతా"మని ప్రభుత్వోద్యోగులు, సైనికులు ఎదురుతిరగవచ్చు. అలా జరిగితే ప్రభుత్వ యంత్రం కొద్దిరోజులపాటు అయినా స్తంభించిపోతుంది. మిత్రరాజ్య నాయకులు బ్రిటిష్‌వాళ్ళ మీద వత్తిడి తెచ్చి ఇండియా కోరికలను అంగీకరించేటట్లు చేస్తారు – అనే ధోరణిలో ఆయన ఆలోచించినట్లు తోస్తుంది. ఈ సందర్భంలో ఒక్కటి గమనించటం అవసరం. ఆగస్టుకు పూర్వం కొన్ని వారాలపాటు ఆయన ఇచ్చిన ఉపన్యాసాలు, వ్రాసిన వ్రాతలు మిత్ర రాజ్యాలనూ, వారి నాయకులనూ ఉద్దేశించినవే. ఆ కాలంలో ఆయన పత్రికా రచయితలకు ఎన్నో ఇంటర్వ్యూలు ఇచ్చారు. మార్షల్ చాంగ్‌కై షేక్‌కు, అధ్యక్షుడు రూజ్‌వెల్ట్‌కు వ్యక్తిగతంగా ఉత్తరాలు వ్రాశారు. "రష్యాను, చైనాను రక్షించవలసిన" అవసరాన్ని ఆయన మాటిమాటికీ పేర్కొన్నారు. "విదేశీ పత్రికలకు, వాని ద్వారా ప్రపంచానికి" ఒక ప్రత్యేక విజ్ఞప్తి చేశారు. చిట్టచివరకు అఖిల భారత కాంగ్రెస్ కమిటీ సమావేశంలోనే ఉపన్యసించారు. వీటన్నిటిలోనూ కూడా ఇండియా తరఫున మిత్రరాజ్యాలు కలుగచేసుకొని బ్రిటన్‌పై వత్తిడి తెస్తాయని తా నాశిస్తూన్నట్లు గాంధీజీ స్పష్టం చేశారు. అఖిల భారత కాంగ్రెస్ కమిటీ కార్యక్రమాన్ని ముగిస్తూ మౌలానా ఆజాద్ తన ఉపన్యాసంలో ఇలా అన్నారు : "కాంగ్రెస్ కోరికలను ఐక్యరాజ్యాల ముందు పెడుతున్నాము. ఆఖరి నిమిషం వరకూ ఒప్పందం కుదుర్చుకునేటందుకే ప్రయత్నిస్తాం."

బొంబాయిలో అఖిల భారత కాంగ్రెసు కమిటీ సమావేశం జరిగిన కొద్ది వారాలకే



ఈ అంచనాలు తప్పు అని తేలిపోయింది. ప్రభుత్వ యంత్రాన్ని స్తంభింప చేసేపాటిగా ప్రజల విజృంభణ లేదు. భారతీయుల కోరికల నంగీకరించేటట్లు మిత్రరాజ్యాలు బ్రిటన్ మీద వత్తిడి చెయ్యనూ లేదు. "తమరిని దేశం నుంచి సాగనంపేటందుకై దౌర్జన్యరహితం గానూ, సహితంగానూ జరిగిన ప్రయత్నాలను రెంటినీ ప్రభుత్వం సెప్టెంబరు నాటికి అణచివేయనూ వేసింది." – అని టెండూల్కర్ వ్రాశాడు.

సరిగ్గా '32లో చేసినట్లే ఇప్పుడు కూడా గాంధీజీ జైలులో నిరశనవ్రతం చేశారు. ఈ రెండుమార్లూ కూడ రాజకీయాలతో నిమిత్తంలేని నైతిక సమస్యలపైనే ఆయన నిరశనవ్రతాలను ప్రారంభించినట్లు అనిపిస్తుంది. కాని, రెండింటా కూడ రాజకీయాలతో నిమిత్తంలేని నైతిక సమస్యలు రాజకీయ కార్యాచరణకు ప్రారంభకము లైనాయి. రాజకీయ సమస్యల మీద బ్రిటిష్‌వారితో రాయబారాలు ప్రారంభించడానికి అవి ఉపయోగపడ్డాయి.

భారతీయ సమాజంలో హరిజనుని స్థానం ఏమిటనేది సామాజిక సమస్యగా కనబడుతుంది. దానిమీదనే గాంధీజీ 1932లో జైలులో నిరశనవ్రతం ప్రారంభించారు. ఆ విషయం గురించి ఇంతకుముందు ప్రకరణంలో వ్రాశాను. బ్రిటిష్ ప్రధాని ఇచ్చిన కమ్యూనల్ అవార్డును సవరింపచేయడాని కది ఉద్దేశించబడింది. ఆ నిరశనవ్రతం రాజ్యాంగ సమస్యమీద రాయబారాలు కొనసాగించడానికై వినియోగించుకోబడింది. 1942 ఆగస్టులో జరిగిన అఖిల భారత కాంగ్రెసు కమిటీ సమావేశానంతరం ప్రభుత్వం తాను సాగించిన నిర్బంధ చర్యలను సమర్థించుకొనే టందుకు కొన్ని ఆరోపణలు చేసింది. ఆ ఆరోపణలను ఆయన ఒక నైతిక సమస్యగా తీసుకొని 1942–'43లో ఉపవశించారు. 1943 జనవరిలో ఆయన వైస్రాయికి వ్రాసిన లేఖనుబట్టి చూస్తే అదొక రాజకీయ సమస్యేగాని, నైతిక సమస్య కాదని అర్థం అవుతుంది.

> "పర్యవసానంగా (1) నేను ఒక్కణ్ణే ఈ పని చెయ్యాలనేటట్లయితే ఇంతవరకు నేను చేసినది తప్పని చూపండి. నేను సరిదిద్దుకుంటాను. (2) అలాగాక కాంగ్రెసు తరపున నన్నేదన్నా ప్రతిపాదన చేయమంటారా నన్ను కాంగ్రెసు కార్యవర్గ సభ్యుల వద్దకు పంపండి. ఈప్రతిష్టంభనను తొలగించేటందుకు దృఢచిత్తంతో పని చేయండని నా విజ్ఞప్తి." (సం. 6, పుట 234–235)

గాంధీజీ సూచనలను ప్రభుత్వం స్వీకరించే ధోరణిలో లేదు. దానితో ఆయన నిరశనవ్రతం ప్రారంభించారు. ఆయన వయస్సులో నిరశనవ్రతం అనేసరికి దేశం అంతా గగ్గోలెత్తిపోయింది. ప్రజల ఆదుర్దాను ప్రభుత్వం పాటించవలసి వచ్చింది; నిరశనవ్రత కాలంలో ఆయనను దర్శించవచ్చిన పెద్దలందరికీ ప్రభుత్వం అనుమతి నిచ్చింది. కాంగ్రెసు

నాయకుల్ని విడుదల చేయాలనీ, కాంగ్రెసుకూ, ప్రభుత్వానికీ మధ్య రాయబారాలు సాగాలనీ కోరుతూ ప్రచారం ప్రారంభమైనది అప్పటినుంచే.

'క్విట్ ఇండియా' ఉద్యమం ప్రారంభించాక నాయకులను ప్రభుత్వం అరెస్టు చేయడంతో వచ్చిన రాజకీయ ప్రతిష్టంభనను పరిష్కరించేటందుకై తన శక్తినంతనూ వినియోగిస్తానని ఆయన తనను చూడవచ్చిన నాయకులతో చెప్పారు. మార్చి నెలలో కాంగ్రెసేతర నాయకులు బొంబాయిలో సమావేశమయి ఒక ప్రకటన చేశారు :

> "గాంధీజీతో ఈమధ్య కొంతమంది మాట్లాడాము. అటు తర్వాత సమాధానం కుదిర్చేటందుకు ఈ సమయంలో ఏమన్నా ప్రయత్నాలు చేస్తే ఫలించగలవని పించింది. గాంధీజీని విడుదలచేస్తే దేశంలో ఏర్పడిన ప్రతిష్టంభనను పరిష్కరించే టందుకు ఆయన సలహా సహాయాలివ్వగలరనీ, యుద్ధప్రయత్నాలు కొనసాగించటానికి ఆటంకాలుంటాయన్న భయమక్కర్లేదనీ మా నమ్మకం." (సం. 6, పుట 250)

ప్రభుత్వంతో రాయబారాలు జరపడం విషయంలో కాంగ్రెసు తన అభిప్రాయాన్ని మార్చుకొన్నట్లే ముస్లింలీగుతో రాయబారాల విషయంలో కూడ గాంధీజీ 'క్విట్ ఇండియా' దినాలనాటి అభిప్రాయాన్ని మార్చుకొన్నారు. దీనిని మరో ఏడాది పోయాక శ్రీమాన్ రాజగోపాలాచారి స్పష్టం చేశారు :

> "1943 ఉపవాసకాలంలో గాంధీజీతో చర్చించి రూపొందించిన ఒక పథకాన్ని రాజగోపాలాచారి 1944 జులై 10వ తేదీన వెలువరించారు. కాంగ్రెసుకూ, ముస్లింలీగుకూ ఒప్పందం కుదిర్చేటందుకై ఆ పథకం తోడ్పడుతుందని భావించబడింది." (సం. 6, పుట 332)

జిన్నాతో సరాసరి సంబంధం పెట్టుకొనేందుకు గాంధీజీ ప్రయత్నించారు. "ఆయన నాకే వ్రాయకూడదా?" అని జిన్నా చెప్పినట్లు విని గాంధీజీ మే నెలారంభంలో జాబు వ్రాశారు :

> "మీ ఆహ్వానానికి సంతోషం. ఉత్తరాల ద్వారాకన్న ముఖాముఖి మాట్లాడుకోవడం బాగు... అందరికీ అంగీకారయోగ్యమైన పరిష్కారాన్ని కనిపెట్టాలనే దృఢ దీక్షతో మత సౌమనస్యం గురించి మీరూ నేనూ ఎందుకు చర్చించకూడదు? దానికి సంబంధించినవారికీ, దానియెడల ఆసక్తి గలవారికీ మన పరిష్కారం అంగీకార యోగ్యం అయ్యేటట్లు చేయడానికి ఇద్దరం కలిసి ఎందుకు పని చెయ్యకూడదు?" (సం. 6, పుట 259-260)

కాంగ్రెసుతో రాయబారాలకుగాని, కాంగ్రెసు ముస్లింలీగుల మధ్య రాయబారాలకు అవకాశాలు కల్పించడానికి గాని ప్రభుత్వం నిరాకరించింది. గాంధీజీ ఉపవాసానికి ముందు ఆయన వ్రాసిన ఉత్తరాల కిచ్చిన సమాధానాలలో అఖిల భారత కాంగ్రెసు కమిటీ చేసిన

ఆగస్టు తీర్మానంతో తనకేమీ సంబంధం లేదని చెప్పమనీ, చాలామంది కాంగ్రెసు నాయకులూ, ప్రజలూ జరిపిన దౌర్జన్య చర్యలను ఖండించమనీ ప్రభుత్వం పట్టుపట్టింది. కాంగ్రెసేతర నాయకులు గాంధీజీని దర్శించదలచినప్పుడు ప్రభుత్వం అనుమతించలేదు. దానికి చెప్పిన కారణాలివి :

"కాంగ్రెసు విధానంలో మార్పు రానంతవరకు కాంగ్రెసు యెడ మా దృక్పథం మారడం అనే సమస్యే లేదు. మీ సద్భావానికి వందనాలు. సుఖవంతమైన పరిష్కారం తీసుకు రావాలనే మీ ఆదుర్దాకు అభివందనాలు. పరిస్థితులు పైన నేను చెప్పినమాదిరిగానే ఉన్నంతవరకూ గాంధీనీ, ఇతర నాయకుల్నీ కలుసు కొనేటందుకు మీరు కోరిన ప్రత్యేక సౌకర్యాలను కలిగించలేను." (సం. 6, పుట 251–252)

గాంధీజీ జిన్నాకు వ్రాసిన జాబును పంపడానికి కూడా ప్రభుత్వం నిరాకరించింది.

"చట్టవిరుద్ధమైన ప్రజా ఉద్యమాన్ని నిరసించడానికి బదులు ప్రోత్సహిస్తూ, మంచి చిక్కు సమయంలో ఇండియా యుద్ధప్రయత్నాలకు ఎంతో ఆటంకం కలిగిస్తున్నందుకు డిటెయిన్ చేయబడిన వ్యక్తితో సంబంధాలు పెట్టుకొనేటందుకూ రాజకీయాల మీద ఉత్తర ప్రత్యుత్తరాలు నడిపించేటందుకూ ప్రభుత్వం సౌకర్యాలు కలిగించదు." (సం. 6, పుట 260)

అందుచేత 1943లో పూర్తిగానూ, 1944లో సగంవరకునూ రాజకీయ ప్రతిష్టంభన కొనసాగింది. కాంగ్రెసు నాయకులను డిటెన్షన్‌లో అట్టేపెట్టినందుకు దేశం చాల క్రోధంతో వుంది. కాని వారిని విడుదల చేయడానికి ప్రభుత్వం సిద్ధం కాలేదు. 1944 మే నెలలో – అప్పుడైనా గాంధీజీ ఆరోగ్యం బాగా చెడినప్పుడే ఆయనను విడుదల చేశారు.

అయినా ఈ విడుదల పరిస్థితులను కొద్దిగా చక్కబరచింది. కాంగ్రెసుకూ ప్రభుత్వానికీ మధ్య ఉండవలసిన సంబంధాలను గురించీ, హిందూ–ముస్లిం సమస్యను గురించీ గాంధీజీ తన నూతన విధానాన్ని ప్రతిపాదించి బహిరంగంగా దానిని ప్రచారం చేయగలిగారు. దానికి సంబంధించిన వారందరూ ఆ విధానాలను పునరాలోచించేటందుకు తోడ్పడే చర్యలన్నీ తీసుకున్నారు.

మొదటిది : న్యూస్ క్రానికల్ విలేకరి స్టీవర్ట్ గెల్డర్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఆనాటి రాజకీయ పరిస్థితుల మీద తన అభిప్రాయాలను స్పష్టపరిచారు. ఆ ఇంటర్వ్యూలో ఆయన ఇలా అన్నారట :

"1942లో మేము అడిగినదానికీ, ఈవేళ అడిగేదానికీ తేడా వుంది. ఈవేళ పౌర పరిపాలన మీద పూర్తి అధికారం నెరపగల జాతీయ ప్రభుత్వంతో మేము సంతృప్తి పడతాము. 1942లో అలా కాదు." (సం. 6, పుట 318)



ఈ పత్రికా విలేకరితో ఇంటర్వ్యూ అంటే మామూలుది కాదు. "ప్రస్తుత ప్రతిష్టంభనను తొలగించేటందుకై నేను (గాంధీజీ) చేసిన ప్రయత్న ఫలితం అది. ఆ మాటలు ప్రభుత్వాధినేతల కుద్దేశించాను గాని ప్రజలకు కాదు." గెల్డర్ ఇంటర్వ్యూ అనంతరం ఆయన వైస్రాయికి రెండు ఉత్తరాలు వ్రాశారు. దానిలో దిగువ విధంగా విస్పష్ట ప్రకటన చేశారు :

"భారతదేశానికి తక్షణం స్వాతంత్ర్యం ప్రకటించాలి. కేంద్ర శాసనసభకు బాధ్యత వహించే జాతీయ ప్రభుత్వాన్ని ఏర్పరచాలి. యుద్ధం జరుగుతున్నంత కాలం సైనిక చర్యలు ఇప్పట్లా కొనసాగవచ్చు కాని దానికి సంబంధించిన ఖర్చు భారం భారతదేశంమీద పడకూడదు. ఈ విషయాలను స్పష్టం చేస్తూ ప్రభుత్వం ప్రకటన చేయాలి. అలా జరిగితే పరిస్థితులు మారినాయిగనక '42 ఆగస్టు తీర్మానంలో తలపెట్టినట్లు శాసనోల్లంఘనం చేసే ప్రయత్నం పనికిరాదనీ, యుద్ధ ప్రయత్నాలకు కాంగ్రెసు పూర్తిగా తోడ్పడాలనీ కాంగ్రెసు కార్యవర్గానికి సలహా ఇవ్వడానికి నేను సిద్ధంగా వున్నాను." (సం. 6, పుట 327–28)

రెండు : ఒకవైపున ప్రభుత్వంతో రాయబారాలు జరుపుతూనే గాంధీజీ ముస్లింలీగుతో కూడ రాయబారాలు జరిపారు. రాజగోపాలాచారి పథకం ఆధారంగా సెప్టెంబరు నెలలో గాంధీ – జిన్నాల మధ్య సంభాషణలు ప్రారంభం అయినాయి. 1942లో రాజగోపాలాచారి తయారుచేసిన పథకమూ ఇదీ ఒకటే. ఆ రోజున దానిని కాంగ్రెసులో అత్యధిక సంఖ్యాకులు త్రోసిపుచ్చారు.

మూడోది : ఆగస్టు పోరాటం సమస్య మీద గాంధీజీ తన దృక్పథాన్ని స్పష్టంచేశారు. "ప్రభుత్వం మతిచెడినట్లు వ్యవహరించింది. కొందరు ప్రజలూ అలాగే వ్యవహరించారు. కాంగ్రెసు పేరుమీదనో, నా పేరుమీదనో విధ్వంసక చర్యలు తదితరాలు జరిగాయి." 1944లో ఆగస్టు 9 ఉత్సవం జరిపే సమస్యమీద ఒక్క బొంబాయిలో తప్ప "ఆ రోజుమటుకు ప్రత్యేకంగా పోలీసులు పెట్టే నిషేధాజ్ఞలను అతిక్రమించవద్దు" అని ఆయన ప్రజలకు హితవు చెప్పారు. బొంబాయిలో కూడా '42 ఆగస్టులో ఆ చారిత్రక సమావేశం జరిగినచోట, నాకు చాల అందుబాటులో ఉండేచోట్ల' మాత్రమే పోలీసు నిషేధాలను నామమాత్రంగా ధిక్కరించాలని చెప్పారు. "రహస్య జీవితం గడుపుతూ వున్నవారు పైకి వచ్చెయ్యాలి. పోలీసుల కన్నుకప్పడానికి వారినుంచి తప్పించుకోడానికి ప్రయత్నించకుండా తాను చేస్తున్న పనేదో అధికారులకు చెప్పేయడం ద్వారా బైటపడవచ్చు" అని ఆయన ఆదేశించారు. అందుచేత ఇది దేశవ్యాప్తంగా ప్రభుత్వాన్ని ధిక్కరించే విధానాన్ని నిషేధిస్తూ, నామమాత్రమైన ప్రతిఘటన మానకుండా సాగించే కార్యక్రమం అని చెప్పవచ్చును.



గాంధీజీ ఈ ప్రయత్నాలు సాగిస్తూన్న సమయంలోనే నేతాజీ ఐ.ఎన్.ఏ. (ఆజాద్ హింద్ ఫౌజ్)ను సమకూరుస్తున్నారు. ఇద్దరు నాయకులూ అనుసరిస్తూన్న విధానాలు పరస్పర విరుద్ధాలు : ఒకటి క్విట్ ఇండియా ఉద్యమం నుంచి వెనుకకు తగ్గే ప్రయత్నం. రెండోది దేశంలోని విప్లవశక్తులకు తోడుగా బయటనుంచి సైన్యసహాయం తెచ్చి ఉద్యమాన్ని ముందుకు కొనిపోయే ప్రయత్నం.

అయినా ఇవి రెండూ ఒకదాని కొకటి సహాయకారులు. గాంధీజీ వెనక్కి తగ్గే ప్రయత్నం చేస్తున్నా, జెండాను దింపలేదు. ఆగస్టు 9న బొంబాయిలో "నామమాత్ర ఆజ్ఞోల్లంఘనం" జరపమనడమే దానికి ఉదాహరణ. అందుచేతనే 1944 అక్టోబరులో గాంధీజీ 75వ జన్మదిన సందర్భంలో రంగూన్ నుంచి నేతాజీ ఈ విధంగా ప్రకటించారు: "జాతిపితా ! భారత స్వాతంత్ర్య సాధనకై సాగిస్తున్న ఈ పవిత్ర పోరాటాన్ని ఆశీర్వదించండి." నేతాజీ కార్యక్రమంమీదా, పనులమీదా గాంధీజీ ఏవిధమైన వ్యాఖ్యలూ చెయ్యలేదు.

కాని, ఈ రెండు విధానాలు తమ తక్షణ గమ్యాలను సాధించలేకపోయాయి. బ్రిటిష్ ప్రభుత్వం అభేద్యమైన అవరోధాల్ని కల్పించి గాంధీజీ రాయబార ప్రయత్నాలను భగ్నపరచింది. భారతదేశానికి స్వాతంత్ర్యం ఇస్తూ వెంటనే ప్రకటనచేసి, జాతీయ ప్రభుత్వాన్ని ఏర్పరచేటట్లయితే యుద్ధ ప్రయత్నాలకు పూర్తిగా తోడ్పడతామని ఆయన చేసిన ప్రతిపాదనకు వైస్రాయి ఈ విధంగా సమాధానం ఇచ్చాడు : "మీరు చెప్పినట్లు కేంద్ర శాసనసభకు బాధ్యత వహించగల జాతీయ ప్రభుత్వాన్ని ఏర్పరచాలంటే రాజ్యాంగాన్ని మార్చాలి. ఈ యుద్ధకాలంలో ఆ పని సాధ్యంకాదు." ముస్లింలీగ్‌తో గాంధీజీ జరిపిన రాయబారాలు కూడా విఫలమైనాయి. రాజాజీ సూచించిన పథకాన్ని జిన్నా నిరాకరించాడు. గాంధీజీ ప్రతిపాదించిన సూచనలు "భారతదేశంలో ముస్లిములకు పాకిస్తాన్ ఇవ్వాలనే కోరికను పూర్తిగా తల్లక్రిందులు చేయడానికే ఉద్దేశించబడినాయి." అని త్రోసిపుచ్చాడు.

1942 ఆగస్టు విధానంనుంచి వెనుకకు తగ్గేటందుకై మార్గాలు వెతకడంలో గాంధీజీ చేసిన ప్రయత్నాలు విఫలమైనట్లే, నేతాజీ విధానం కూడా విఫలమయింది. 1944లో యూరపులో రెండో రంగం తెరువబడింది. సోవియటు సేనలు జర్మనీలో అతివేగంగా చొచ్చుకుపోతున్నాయి. చైనాలోనూ, ఇతర ఆసియా దేశాలలోనూ జాతీయ ప్రతిఘటనోద్యమ వీరులు చాల తీవ్రంగా పోరాడుతున్నారు. ఫలితంగా జపాన్ ఫాసిస్టుల సహాయంతో విదేశాల నుంచి భారతదేశంలోని విప్లవోద్యమానికి సహాయంగా సాయుధ సైన్యాన్ని తీసుకురావాలని నేతాజీ చేసిన ప్రయత్నం విఫలమయింది. ఐ.ఎన్.ఏ. ఏర్పడిన కొద్ది కాలానికే ఆ సైన్యాన్నీ, వారికి సహాయులుగా వున్న జపానీ సైన్యాన్నీ మిత్రరాజ్యాల సేనలు ఎదుర్కొన్నాయి. పునస్సమీకరింపబడి, మంచి నిర్మాణంలో వున్న ఈ సేనల

ఎదుర్కోలుతో జపాన్ సైన్యాలూ ఐ.ఎన్.ఏ. ఓడిపోయాయి. ఐ.ఎన్.ఏ. ఏర్పడిన ఉద్దేశమూ, దాని స్వభావమూ దేశ ప్రజలలో అభిమానాన్నీ, దేశభక్తినీ రేకెత్తించగలగింది గనుక అది ఒక శక్తిగా మిగిలిందేగాని, ఓటమి తర్వాత దాని ఆకారమైనా మిగలలేదు.

అంతర్జాతీయంగా వచ్చిన ఈ పరిణామాల ప్రభావం దేశంలోని రాజకీయ పరిస్థితులమీద కూడా వుంది. మిత్రరాజ్య సేనలు నిరాటంకంగా విజయయాత్ర సాగిస్తుండడంచేత యుద్ధ పరిస్థితుల పేరు చెబితే కాంగ్రెసు నాయకుల్ని జైళ్ళలోనే ఉంచడంగాని, రాజ్యాంగంలో మార్పులు చేయడానికి వీలులేదనడంగాని ప్రభుత్వం చేయలేకపోయింది. దేశంలోని రాజకీయ ప్రతిష్టంభనను పరిష్కరించేటందుకై ప్రభుత్వం కొత్త ప్రయత్నాలు చేయవలసి వచ్చింది.

1945 జూన్ నెల మధ్యలో కాంగ్రెసు కార్యవర్గ సభ్యులను జైళ్ళనుంచి విడుదల చేయడంతో ఈ ప్రయత్నాలు ప్రారంభమైనాయి. తర్వాత కేంద్ర ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్‌ను పునర్నిర్మించేటందుకు కొన్ని ప్రతిపాదనలు చేశారు.

> "గవర్నరు జనరలు, సర్వసేనాధిపతీ తప్ప దానిలో మిగతావారంతా భారత రాజకీయ నాయకులే వుంటారు. దానిలో హిందువులకు, ముస్లిములకు సమాన ప్రాతినిధ్యం వుంటుంది... ఈ పథకమును కొనసాగించేటందుకు వైస్రాయి పార్టీ నాయకులతోనూ,రాష్ట్ర ప్రధానులు మాజీ ప్రధానులతోనూ ఒక సమావేశం జరుపుతాడు. తన కొత్త ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్‌కు సభ్యులను ఎన్నుకొనేటందుకై కొన్ని పేర్లను సూచించవలసిందిగా వారిని కోరుతాడు." (సం. 7, పుట 7)

కాని, మంత్రిమండలిలో మౌలానా ఆజాద్, అసఫాలీలను చేర్చడానికి జిన్నా అభ్యంతరం చెప్పడంతో ఈ ప్రయత్నాలు విఫలమైనాయి. మత సమస్యను – ముఖ్యంగా హిందూ ముస్లిం సమస్యను – బ్రిటిష్ ప్రభుత్వం బాగా ఉపయోగించుకొని ప్రభుత్వంలో మార్పు రాకుండా చేస్తూందని అంతకంతకు స్పష్టమవుతూంది.

దీనితో ప్రజానీకంలో పెద్ద ఆందోళన రేగింది. ప్రభుత్వ విధానాలు వారి కంతకంతకు నగ్నంగా కనబడుతున్నాయి. జాతీయ ప్రభుత్వాన్ని ఏర్పరచేటందుకు జరుగుతున్న రాయబారాలు విఫలమయ్యాక ఐ.ఎన్.ఏ. ఖైదీల విడుదలకై దేశ వ్యాప్తంగా ఆందోళన చలరేగింది. 1945 చివర భాగంలో ఐ.ఎన్.ఏ. ఖైదీల విచారణ ప్రారంభ మయింది. వారి డిఫెన్సుకై బయలుదేరిన ఉద్యమం సామ్రాజ్య వ్యతిరేక పోరాటాలకు కొత్త దీప్తినిచ్చింది. దానిని గురించి టెండూల్కరు ఇలా చెప్పారు :

> "ముప్ఫయ్యేళ్ళ క్రితం మూలబెట్టిన బారిస్టరు దుస్తులతో నెహ్రూ కోర్టుకు హాజరయ్యాడు. నిందితుల తరపున వాదిస్తున్న భూలాభాయి దేశాయి సుభాష్ చంద్రబోసు ఉజ్జ్వల

నాయకత్వం క్రింద ఐ.ఎన్.ఏ. నిర్వహించిన మహత్తర పాత్రను దేశంముందుకు తెచ్చారు. ఐ.ఎన్.ఏ. నిందితులను విడుదల చేయాలని దేశం కోరింది. తన కోరికను సాధించు కుంది. దీనిని గురించి నెహ్రూ ఇలా అన్నారు: "భారతదేశంలో అధికారం చలాయిస్తున్న వారి పట్టుదలకూ, ప్రజల పట్టుదలకూ మధ్య జరిగిన కుస్తీ ఇది. చివరకు ప్రజల పట్టుదలే నెగ్గింది." (సం. 7, పుట 17–18)

ఒకవైపున ఇండియన్ నేషనల్ ఆర్మీవారి సమస్య సామ్రాజ్య వ్యతిరేకోద్యమాన్ని దృఢపరుస్తున్న సమయంలోనే రెండోవైపున దాని ప్రభావం బ్రిటిష్‌వారి అధీనంలో వున్న భారతీయ సేనలమీద కూడా కనబడింది. 1942 ఓటమిగాని, ఐ.ఎన్.ఏ. ఓటమిగాని భారతీయుల విప్లవోత్సాహాన్ని అణచలేకపోయింది. రాయల్ ఇండియన్ నౌకాదళం తిరుగుబాటు ఈ విషయాన్ని స్పష్టపరచింది.

పరిస్థితులు చూసి గాంధీజీ చాల ఆదుర్దాపడ్డారు. ఆర్.ఐ.ఎన్. (రాయల్ ఇండియన్ నేవి) తిరుగుబాటుకు ఒక వారంరోజులు ముందు ఆయన 'హరిజన్' పత్రికలో ఇలా వ్రాశారు :

> "వాతావరణం ద్వేషపూరితంగా వుంది. ఆలస్యం సహించలేకుండా వున్న దేశభక్తు లీవాతావరణాన్ని ఉపయోగించుకొంటారు. వీలుచిక్కితే దౌర్జన్యంతోనైనా స్వాతంత్ర్య సాధనకు పూనుకుంటారు... ఐ.ఎన్.ఏ. ఆవేశం మనలనందర్నీ పట్టుకొంది. నేతాజీ పేరు అద్భుతాల్ని చేయిస్తూంది. ఆయన దేశభక్తి అసమానం... అంతకంటె నేను పొగడలేను. ఆయన ప్రయత్నం విఫలంకాక తప్పదని నేను ఎరుగుదును. ఆయన ఐ.ఎన్.ఏ.ను దేశంలోకి తీసుకువచ్చినా ఆయన ప్రయత్నం నెగ్గి వుండేది కాదని చెప్పగలను. ఏమంటే ఆ విధమైన పని చేయడంవలన ప్రజలు స్వశక్తిమీద ఆధారపడడం నేర్చుకోరు." (సం. 7, పుట 76–78)

ఆర్.ఐ.ఎన్. తిరుగుబాటును "ఎంతో బాధాపూర్వకమైన ఆసక్తితో" గమనిస్తు న్నానని ఆయన వర్ణించారు.

> "నౌకాసైన్యంలో వచ్చిన ఈ తిరుగుబాటు, తదనంతర ఘటనలు అహింసాయుత చర్యలనడానికి ఏమాత్రం వీలులేదు... నౌకాసైన్యంలోని భారతీయులకు అహింస అంటే తెలిసినా, దానిని వారు అభిమానించినా దౌర్జన్యరహిత ప్రతిఘటన మార్గాని కెంతో గౌరవం, మర్యాదా లభించేవి. ఎంతో ఫలవంతమయ్యేది... ఇటువంటి చర్య దౌర్జన్య శూన్యమైతే నేను అహింసాయుత సహాయ నిరాకరణం అంటాను. కాని, ప్రస్తుత పద్ధతిలో వారు భారతదేశాన్ని అవాంఛనీయమైన తప్పుమార్గాన పెడుతున్నారు." (సం. 7, పుట 78–79)

సామ్రాజ్య వ్యతిరేక ఉద్యమపు ఈ నూతన వెల్లువను చూచాక బ్రిటిష్ ప్రభుత్వం తన పాత పద్ధతులింక పనిచెయ్యవని గ్రహించింది. అందుచేత వెంటనే రాజకీయ ప్రతిష్టంభనను పరిష్కరించేటందుకై కొత్త చర్యలు తీసుకొన నిర్ణయించింది. వివిధ రాజకీయ పార్టీలతో రాయబారాలు జరిపేటందుకు ముగ్గురు మంత్రివర్గ సభ్యులతో ఒక రాయబార వర్గాన్ని పంపింది.

వారు ఏప్రిల్, మే నెలల్లో సుదీర్ఘమైన రాయబారాలు జరిపారు. తక్షణ కార్యక్రమాన్నీ, సుదూర కార్యక్రమాన్నీ నాయకులముందుంచారు. కొత్తగా రాష్ట్ర శాసనసభలకు ఎన్నికైన వారితో రాజ్యాంగ చట్టసభను ఏర్పరచాలనేదాన్ని సుదూర కార్యక్రమంలో చేర్చారు. రాష్ట్రాలను ఎ, బి, సి తరగతులుగా విభజించారు. ఇందులో ఏ తరగతికి చెందిన రాష్ట్రం అయినా ఇండియన్ యూనియన్ నుంచి విడిపోవచ్చును – ఇది కొంతవరకు ముస్లింలీగు వాంఛలను నెరవేరుస్తుంది. ఇక కాంగ్రెసుకు, ముస్లింలీగుకు, ఇతర పార్టీలకు, గ్రూపులకు చెందినవారితో మధ్యంతర ప్రభుత్వాన్ని ఏర్పరచడం తక్షణ కార్యక్రమం.

ఎంతో కాలం రాయబారాలు సాగాక ఈ ప్రతిపాదనల ఫలితంగా 1946 చివరి భాగంలో మధ్యంతర ప్రభుత్వం ఏర్పడింది. ఒక ఏడాది అనంతరం ఇండియా, పాకిస్తాన్‌ల పేరుతో రెండు స్వతంత్ర రాజ్యాలు అవతరించాయి.

# 12. ఆగస్టు 15 : విజయమా – పరాజయమా?

**1947**లో బ్రిటిష్‌వారు అధికారాన్ని తమ చేతిలో పెట్టటం ప్రపంచంలోనే ఒక అసాధారణమైన విషయంగా కాంగ్రెసు నాయకులు చెప్పుకుంటారు. ఫ్రాన్స్, రష్యా, చైనా మొదలైన దేశాలలో జరిగిన విప్లవాల్లా కాకుండా 1947 'ఇండియా విప్లవం' ఒక్క రక్తపు చుక్క కూడ కార్చకుండా సాధించబడిందనీ, దానికి కారణం అహింసావాది నాయకత్వమేననీ చెప్పుకుంటారు.

1947 ఆగస్టు 15న ఆనాటి కాంగ్రెసు అధ్యక్షుడు ఆచార్య కృపలానీ దేశానికొక సందేశమిస్తూ ఈ విషయాన్ని సాధికారంగానే ప్రకటించారు.

> "అంత తక్కువ రక్తపాతంతో, అంత తక్కువ హింసతో కోట్లకొలది స్త్రీ పురుషుల భవిష్యత్‌ను మార్చే మహద్ఘటన ఇంతకు పూర్వం ఎప్పుడూ జరగలేదు. మహాత్మా గాంధీ నాయకత్వమే దీనికి కారణం. మన జాతిపిత అంటే ఆయనే. స్వాతంత్ర్య సాధనకై అహింసా పోరాటాన్ని సాగించడంలో ఆయన మనకు నాయకత్వం వహించారు. ఆ స్వాతంత్ర్యాన్ని ప్రజాసేవలో ఫలవంతం చెయ్యడానికి ఆయన మార్గం చూపించారు." (సం. 8, పుట 95)

ఈ అభిప్రాయంతో ఒక్క వ్యక్తి మాత్రమే ఏకీభవించలేదు. ఆ వ్యక్తి మరెవ్వరో కాదు. గాంధీజీయే. టెండూల్కర్ ఇలా వ్రాశారు :

> "దేశమంతటా ఉత్సవాలు జరుగుతున్నాయి. విదేశీ పాలన నుంచి భారతదేశాన్ని విముక్తి పరచడంలో విశేషపాత్ర వహించిన వ్యక్తి మాత్రం ఆ ఉత్సవాలలో పాల్గోలేదు. భారత ప్రభుత్వ ప్రచార శాఖకు సంబంధించిన ఒక ఉద్యోగి సందేశం ఇవ్వమంటూ గాంధీ దగ్గరకు వచ్చినప్పుడు ఆయన చెప్పేదేమీ లేదన్నారు. సందేశం ఇవ్వకపోతే బాగుండదని

ఆయనన్నారు. 'సందేశం ఏమీ లేదు; బాగుండకపోతే పోనీ' అని గాంధీజీ సమాధానం ఇచ్చారు." (సం. 8, పుట 95-96)

మరో అయిదు నెలలకు 1948 జనవరి 26న గాంధీజీ చంపివేయబడటానికి నాలుగు రోజులు ముందు - ఆయన ఇలా అన్నారు :

"జనవరి 26 స్వాతంత్ర్యదినం. అంతవరకు మనకు కనిపించని, చేజిక్కి వుండని స్వాతంత్ర్యం కోసం పోరాడుతూన్న రోజుల్లో ఈ ఉత్సవం జరపడం బాగానే ఉండేది. కాని ఇప్పుడంటారా, అది మన చేతికి వచ్చింది. కాని మనం ఆశించినది మాత్రం రాలేదు. మీమటుకు ఏమోగాని, నామటుకు మాత్రం జరిగిన దిదే." (సం. 8, పుట 338)

ఈ నిరాశకు కారణం దేశమంతటా విజృంభించిన మతోద్రేకాలే. 1946-'47లో బ్రిటిష్ ప్రభుత్వానికీ, కాంగ్రెస్ ముస్లింలీగ్ తదితర పార్టీల నాయకులకూ మధ్య చర్చలు జరిగిన అనంతరం భారత జాతీయోద్యమ చరిత్రలో కనివిని ఎరుగనంతటి భయంకరమైన ఉద్రేకాలు చెలరేగాయి. ఆగస్టు 15కు ముందు నెలలలో జరిగినట్లు ఒకవైపున ముస్లింలు, మరొకవైపున హిందువులు, శిక్కులు ఎన్నో వేలమంది ఒకరినొకరు హత్య చేసుకున్నారు.

భారత ప్రజలకు తాను నిర్దేశించినది ప్రేమమార్గమే కాని ద్వేషమార్గం కాదని గాంధీజీ పొడుగునా చెప్తూండేవారు. భారత ప్రజలు ఈ మార్గాన్ననుసరిస్తే దేశాన్ని మహా క్రూరంగా అణచిపెడుతూన్న బ్రిటిష్ సామ్రాజ్యవాదుల హృదయాలను మార్చివేయ గలుగుతారని ఆయన అభిప్రాయం. కాని, బ్రిటిష్ సామ్రాజ్యవాదుల హృదయాలను మార్చటంమాట అట్లా వుంచి, మన దేశ ప్రజల హృదయాలను ఐక్యపరచడంలో ఆ విధానం విఫలమయే పరిస్థితి ఏర్పడింది.

తాను తన జీవితమంతా బోధించిన సిద్ధాంతాలు అధికార సంక్రమణాన్ని తెచ్చిపెట్టిన పరిస్థితులచే ఓడింపబడ్డాయే గాని జయించలేదని "పూర్తిగాను, నిరాడంబ రంగాను" అంగీకరించినది గాంధీజీయే. జూలై 14న ఆయన ఇలా అన్నారు :

"ఈ 30 ఏళ్ళూ మనం ఆచరించినది అహింసాయుత ప్రతిఘటన కాదు; నిష్క్రియా ప్రతిఘటన. ఇది మన అశక్తత. సాయుధ ప్రతిఘటన చేయడానికి అయిష్టత మూలంగా నీరసమైన ప్రతిఘటన చేశాం. ఉక్కు గుండెలు కలవాళ్ళు మాత్రమే అహింసాయుత ప్రతిఘటన చేయగలరు. అదెల్లాగో చేతనయితే, స్వతంత్ర భారతదేశం ప్రపంచం ముందు మరొకలా కనిపించేది. ఇప్పటిలాగా రెండుగా చీల్చబడటం, పరస్పరానుమానాలతో కొట్టుమిట్టాడటం వుండేది కాదు. సాధారణ ప్రజానీకానికి మతమంటే ఏమిటో తెలియదు.

వాళ్ళకు దేవుడొక్కడే. జీవితావసరాలు ఆ దేవుడు. ఆకలికి నకనకలాడుతూన్న ఆ దిగంబర ప్రజాకోటికి ఇంత తిండీ బట్టా పెట్టే ఆలోచన మాని ఈ రెండు భాగాలూ ఒకదానితో ఒకటి సంఘర్షణ పడుతున్నాయి." (సం. 7, పుట 57)

గాంధీజీ జీవించియున్న ఆఖరి క్షణంవరకూ తనకు తోచిన పద్ధతిలో దుష్ట మత శక్తులకు వ్యతిరేకంగా పోరాడటం ఆయన గొప్పతనం. 1946 ఆగస్టు 16వ తేదీని ముస్లింలీగు "ప్రత్యక్ష కార్యాచరణ" దినంగా ప్రకటించింది. ఆ రోజున కలకత్తాలో మొట్టమొదటిమారు మతకలహాలు బయలుదేరాయి. దేశమంతటా మతోద్రేకాలు ప్రమాదకరంగా పెరిగిపోయేటట్లు కనపడ్డాయి. ఆ క్షణం నుంచీ గాంధీజీ మతసామరస్యం బోధించడానికే తన శక్తినంతనీ వినియోగించారు. కొట్లాటలు పట్టణాల నుంచి పల్లెలకు ప్రాకుతున్నాయనగానే, ఇతర పనులన్నీ కట్టిపెట్టి ఐక్యతా ప్రబోధానికై ఉద్యమించారు. అనేక వారాలపాటు బెంగాల్‌లోని నవఖలీ జిల్లాలో గ్రామ గ్రామం తిరిగారు. అదే ప్రచారంలో నవఖలీ నుంచి బీహారు వెళ్ళారు. అక్కడ నుండి పంజాబు వెళ్ళాలని ఆయన ఊహ. అక్కడ నుండి కలకత్తా, మళ్ళీ ఢిల్లీ వెళ్ళారు. మతోద్రేకాలను ప్రతిఘటించటం, కొట్లాటల్లో బాధపడినవారికి సహాయం చెయ్యడం, కాందిశీకులకు రక్షణ ఇవ్వటం మొదలైన సమస్యలు ప్రార్థనానంతర ఉపన్యాసాలలో ప్రాముఖ్యత వహించేవి.

కాని, ఆయన సందేశం వెనుకటంత ఉపయోగకరంగా లేదని స్పష్టమయింది. ఇదివరలో ఆయన ఎదురుగుండా ఉంటే చాలు ఉపవాసంచేస్తే చాలు – మత ద్వేషాలు పెరగకుండా ఆగేవి. వివిధ మతాల నాయకుల్నీ ప్రజల్నీ ఐక్యపరచేవి. ఇప్పుడు నవఖలీ, బీహారు, కలకత్తా, ఢిల్లీ మొదలైన ప్రదేశాలకు ఆయన వెళ్ళడం వలన కలహాలు కొంతకాలం ఆగినా, దూరప్రదేశాల మాట అటుంచి ఆయన ఉన్నచోట కూడ పరిస్థితులలో పెద్దగా మార్పు ఏమీ రాలేదు.

ఇండియా పాకిస్తాన్‌ల మధ్య యుద్ధం వచ్చే అవకాశం ఉందిసుమాయని గాంధీజీ ప్రజలను హెచ్చరించవలసినంత తీవ్ర పరిస్థితులు ఒక దశలో కనిపించాయి. దీనితో దేశం అంతటా సంచలనం కలిగింది. యుద్ధానికి గాంధీజీ అంగీకరించారని కొందరు చెప్పేరుకూడాను. దానితో గాంధీజీ తాను యుద్ధావకాశాలు కలగడానికి కారణమైన పరిస్థితులేమిటో చెప్పవలసివచ్చింది.

"ఒక చిన్న పిల్లవాడు తెలియక పాముపేరు చెప్పినా అది తప్పక ఆ ఇంటికి వస్తుందనే మూఢనమ్మకం మనలో ఉంది. అలాంటి మూఢనమ్మకమే యుద్ధాన్ని గురించి ఉంటుందని నేను అనుకోను. ప్రస్తుత పరిస్థితులను పరిశీలించి, రెండు రాజ్యాల మధ్య యుద్ధం



రావడానికి గల కారణాలను స్పష్టంగా చెప్పడం వలన ఈ రెండు రాజ్యాలకు నేను సహాయం చేశాననే అనుకుంటున్నాను. యుద్ధాన్ని సాధ్యమైనంతవరకు రాకుండా చెయ్యడానికే నే నీ సంగతి చెప్పాను; యుద్ధాన్ని ప్రోత్సహించడానికి కాదు. ప్రజలు మతిచెడినట్లు హత్యలు, దోపిళ్ళు, విధ్వంసాలు కొనసాగించడం వలన తమ ప్రభుత్వాలను కూడ పురిగొల్పినవారౌతారని నేను హెచ్చరించదలచాను. ఒకదాని తర్వాత ఒకటిగా వచ్చే పరిణామాలను ప్రజల దృష్టికి తేవడం తప్పా?" (సం. 8, పుట 169–170)

మత సామరస్యం కోసం ఎవరన్నా ప్రయత్నం చేస్తే వానిమీదికి రెండు మతాలకూ చెందిన దురహంకారులు విరుచుకుపడేటంతగా మతద్వేషాలు పెరిగి ఉన్నాయని గాంధీజీ ఎరుగును. మతద్వేషాలను ప్రతిఘటించడంలో తనకు ప్రమాదం రాగలదని కూడ ఆయన ఎరుగును. జనవరి 28వ తేదీని రాజకుమారి అమృత కౌర్‌తో మాట్లాడుతూ తనను "ఏ పిచ్చివాడో కాల్చి చంపే" అవకాశం ఉన్నదని ఆయన అన్నారు. అటువంటిది తటస్థపడితే "చిరునవ్వుతో స్వీకరిస్తాను. నాలో కోపం ఉండకూడదు. హృదయంలోను, పెదవులమీద కూడ భగవంతుడే ఉండాలి" అన్నారు. ఈ మాటలన్న రెండురోజులకే ఆ దుర్ఘటన జరిగింది.

ఆగస్టు 15న జరిగిన ఉత్సవాల్లో గాంధీజీ పాల్గొనకుండా చేసినది ఈ ఘటనలే కాదు, కాంగ్రెస్‌లో కూడ ఇంత ముఖ్యమైన ఘటనలే జరుగుతున్నాయి. అధికారం చేతిలోకి రాకపూర్వమే కాంగ్రెస్ ద్వారా కాంగ్రెస్ నాయకులు తమ స్వార్థప్రయోజనాలను సాధించేటందుకు ప్రయత్నిస్తూండటం గాంధీజీకి చాల బాధ కలిగించింది. 1946 జులై "ఒక విచారకరమైన ఘటన" అను శీర్షికతో ఒక వ్యాసం వ్రాశారు. అందులో ఇలా తెలియజేశారు :

> "రాజ్యాంగసభకు సభ్యులుగా ఉండగోరేవారినుంచి నా కెన్నో ఉత్తరాలు వస్తూంటాయి. ఈ ఉత్తరాలు మేధావి వర్గానికి దేశ స్వాతంత్ర్యంమీద కంటె సొంత లాభాలమీదనే దృష్టి ఉన్నట్లు స్పష్టం చేస్తున్నాయి. ఇది చూస్తే భయం వేస్తోంది. ఈ దరఖాస్తులు ఒక జబ్బుకు లక్షణం. ఈ విషయంలో నా సహాయం కోరవద్దని చెప్పడం కంటె రోగలక్షణాన్ని ప్రజలకు చూపించడానికే నే నిది వ్రాస్తున్నాను." (సం. 7, పుట 186)

ఈ రోగం ఇంకా తీవ్రమయింది. చాల ప్రమాదకరం అయింది. దీనిని గురించి అనేకమంది గాంధీజీకి వ్రాయనారంభించారు. ఈ పరిస్థితులు మత వైమనస్యాలకు తోడయి 1948 జనవరిలో ఆయన ఉపవాసానికి కారణం అయినాయి. జనవరి 12న ప్రార్థనోపన్యాసం అనంతరం ఆయన తాను మరునాటి నుంచీ నిరశనవ్రతం ప్రారంభించ

దలచినట్లు ప్రకటిస్తూ, ఆంధ్రదేశంలోని సుప్రసిద్ధ కాంగ్రెసువాది దేశభక్త వెంకటప్పయ్యగారు వ్రాసిన ఒక జాబులోని క్రింది విషయాలను చదివి వినిపించారు :

"ఆర్థికానికీ రాజకీయాలకు సంబంధించిన అనేక చిక్కు సమస్యలకు తోడు కాంగ్రెసు వాదులలో వచ్చిన నైతిక పతనం ఒక పెద్ద సమస్య అయిపోయింది. ఇతర రాష్ట్రాలలో ఎలావుందోగాని, మా రాష్ట్రంలో పరిస్థితులు ఎంతో విచారం కలిగిస్తున్నాయి. రాజకీయాధికారం చేతికి రావడంతో వారి తలలు తిరిగి పోయేయి... కాంగ్రెసువాదులలో వచ్చి ముఠా తగవులు, ధనార్జనకోసం శాసనసభ్యులు, కౌన్సిలు సభ్యులు చేస్తున్న పనులు, మంత్రుల బలహీనత – ఇవి ప్రజానీకంలో తిరుగుబాటు స్వభావాన్ని రేకెత్తిస్తున్నాయి. ఇంతకన్న బ్రిటిష్ ప్రభుత్వమే నయమని కాంగ్రెసు తిట్టేటంతవరకు వచ్చింది." (సం. 8, పుట 302–03)

ముఠా తగవులూ, అధికార వ్యామోహమూ రాష్ట్ర, జిల్లా కాంగ్రెసు కమిటీలకు మాత్రమే పరిమితంకాలేదు. కేంద్ర నాయకత్వంలో కూడ ఇవి వున్నాయి. 1947 నవంబరు నెలలో ఒక చిన్న తగవు భారత రాజకీయ నాయకత్వంలో తలయెత్తింది.

"మొట్టమొదటి రోజుననే గాంధీజీ ఎదుట తాను తన పదవికి రాజీనామా నిస్తున్నట్లు కాంగ్రెసు అధ్యక్షుడు కృపలానీ అఖిలభారత కాంగ్రెసు కమిటీకి చెప్పారు. ప్రభుత్వం ఆయనను సంప్రదించడంలేదు. ఆయనమీద పూర్తి విశ్వాసం వుంచడంలేదు. ప్రభుత్వం కాంగ్రెసు పార్టీని లెక్కచేయడంలేదు. ఈ పరిస్థితులలో రాజీనామా నివ్వడం సబబేనని గాంధీ అభిప్రాయపడినట్లు కృపలానీ చెప్పారు. నెహ్రూ, పటేల్‌లు ప్రభుత్వ అధినేతలు. వారికి గల పలుకుబడీ, కాంగ్రెసు సంస్థమీద వారికున్న పెద్దరికమూ అందరికీ తెలిసినదే. వారూ పార్టీ ఒకటేనన్నట్లు కలిసిపోయారు. తమ అధికారానికి ఆటంకంగా వుండేవానిని కాంగ్రెసు అధ్యక్షునిగా ఎందుకు ఉంచుకోవాలి?" (సం. 8, పుట 23)

కృపలానీ రాజీనామాను అంగీకరించి, ఆయన స్థానంలో రాజేంద్రప్రసాదును నియమించడంతో ఆ చిక్కు విడింది. కాని సర్దార్ పటేల్‌కూ, జవహర్‌లాల్ నెహ్రూకు మధ్య సంబంధాలు బాగులేవు. "సర్దార్ పటేలుకూ, నెహ్రూకు మధ్య నున్న వైమనస్యాన్ని గాంధీ ఎరుగును. అది ఆయనకు చాల దుఃఖం కలిగించింది. వారిద్దరూ కలిసి పని చెయ్యాలనేది ఆయన కోరిక" – అంటూ టెండూల్కర్ వ్రాశారు. జనవరి 30వ తేదీ మధ్యాహ్నం 4 గంటలకు – అంటే మరో గంటకు హత్య జరుగుతుందనగా – ఈ విషయం గురించే గాంధీజీ సర్దార్ పటేల్‌తో మాట్లాడారు. "సాయంకాల ప్రార్థన ముగిశాక నెహ్రూ, ఆజాద్‌లు ఆయనను చూడవలసి వుంది."

కాంగ్రెసులో వచ్చిన ఈ నూతన పరిణామాలను చూచి గాంధీజీ కాంగ్రెసు భవిష్యత్తును గురించి గట్టిగా ఆలోచించారు. ఆఖరి రోజులలో కాంగ్రెసును పునర్నిర్మించే టందుకై ఆయన ఒక నిబంధనావళి తయారుచేశారు. దానిలో ఆయన ఇలా వ్రాశారు :

> "కాంగ్రెసు ప్రస్తుత రూపంలో ప్రచార సాధనంగానూ, పార్లమెంటరీ కార్యక్రమాన్ని కొనసాగించే పనిముట్టుగానూ మాత్రమే తయారయింది. దాని మొదటి ఉపయోగం ఇప్పుడు లేదు. భారతదేశంలోని 7 లక్షల గ్రామాలూ సాంఘికంగానూ, నైతికం గానూ, ఆర్థికంగానూ స్వాతంత్ర్యం సంపాదించడం ఇంకా మిగిలేవుంది. భారత దేశం తన ప్రజాతంత్ర గమ్యాన్ని చేరుకొనే క్రమంలో సైనికశక్తి మీద పౌరశక్తి పైచేయి సంపాదించే టందుకై పోరాటం జరిగితీరుతుంది. రాజకీయ పార్టీల, మతసంస్థల మధ్య జరిగే అనుచిత పోటీనుంచి కాంగ్రెసును దూరంగా వుంచాలి. ఈ కారణంచేతనూ, ఇతర కారణాలతోనూ అఖిలభారత కాంగ్రెసు కమిటీ ఇప్పుడున్న కాంగ్రెసు సంస్థను రద్దుపర్చడానికి తీర్మానిస్తోంది. దిగువ నిబంధనలతో దానిని 'లోకసేవక సంఘం'గా పరిణతిపొందించ నిర్ణయిస్తూంది. ఈ నిబంధనలను అవసరాన్నిబట్టి మార్చే అధికారం ఈ కమిటీకి వుంది." (సం. 8, పుట 342)

గాంధీజీ అనుచరులందరూ సంపూర్ణ స్వాతంత్ర్యం సంపాదించుకొన్నామని ఉత్సవాలు చేస్తుంటే ఆయన ఆ స్వాతంత్ర్యం అస్థిరమైనదనీ, అది లభించిన తీరు బాగాలేదనీ విచారపడ్డారు. ఇతర కాంగ్రెసు నాయకులందరూ తమ నాయకత్వాన జాతీయోద్యమం విజయం పొంది అధికారాన్ని తీసుకోగలిగిందని హుషారుపడుతూంటే ఆయన రెండు కారణాలచేత భారత రాజకీయ పరిస్థితులు అస్థిరంగా వున్నాయని ప్రజల దృష్టికి తెచ్చారు. ఒకటి : హిందూ ముస్లిం తగాదాలు. వాని ఫలితంగా ఇండియా పాకిస్తాన్‌ల మధ్య తగాదాలు. రెండోది : కాంగ్రెసు సంస్థలో ప్రవేశించిన కుళ్ళూ, పతనమూ.

ఆయన ఇతర కాంగ్రెసు నాయకులవంటివారు కారనడం ఇందుకే. ప్రజల తత్వాన్ని గమనిస్తూ హిందూ ముస్లిం ప్రజల మధ్యనున్న సంబంధాలలో పెద్ద మార్పు రావడం, కాంగ్రెసు యొక్క ఆంతరికస్థితి బాగుపడడం జరిగితేతప్ప నూతన భారత ప్రభుత్వం నిలబడలేదని ఆయన చెప్పారు.

ఇంతేకాదు, ఆయనకు స్వార్థంలేదు. మొత్తం బూర్జువావర్గానికి ఆయన ప్రతినిధే కాని, ఆ వర్గానికి చెందిన ఏదో ముఠాకు చెందిన మనిషికాదు; అందుచేతనే ఆయన దూరదృష్టితో మొత్తం వర్గంయొక్క దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని ప్రతి సమస్యనూ పరిశీలించేవారు. అందుచేతనే నూతన రాజ్యం యొక్క సుస్థిరతకు

నష్టకరంగావున్న విషయాలను ఆయన నిష్పాక్షిక దృష్టితో చూడగలిగారు. ఆ కారణాలను తొలగించడానికి ఆయన చెయ్యగలదంతా చేశారు. భారత బూర్జువావర్గం యొక్క సిద్ధాంత ప్రవక్తగా, రాజకీయ నాయకుడుగా వ్యవహరించిన గాంధీజీ గొప్పతనం అక్కడే వుంది.

రాజకీయ అస్థిరతకు కారణాలేమిటో, ఆ కారణాలు ఎలా ఉద్భవించాయో కొత్తగా రాజ్యం ఏర్పడుతున్న స్థితిలోనే గాంధీజీ స్పష్టంగా చూడగలిగారు. అయితే తాను ముప్ఫయ్యేళ్ళపాటు ప్రేమను బోధించినా, చివరకు మరణించేనాటికి దేశం రెండు స్కంధావారాలుగా చీలిపోయి యుద్ధం సాగిస్తూంది. భారతదేశానికి స్వతంత్రం సాధించాలనే రాజకీయాదర్శం ఫలవంతమయ్యే దశలో మత ప్రాతిపదికపై రెండు రాజ్యాలేర్పడి పరస్పరం యుద్ధోన్ముఖములైనాయి. ఇదెందుకు తటస్థపడిందో ఆయనకు సమాధానం దొరకలేదు. తన నాయకత్వం క్రింద దేశం కోసం అనంత త్యాగాలు చేసిన వ్యక్తులే అధికారంకోసమూ, స్వలాభాలకోసమూ పేచీపడడం ఎందుకు వచ్చిందో ఆయనకు అర్థంకాలేదు.

మనుష్యుణ్ణి నైతికంగా పునరుజ్జీవింపజేసేందుకే తాను అహింసాయుత ప్రతిఘటనను బోధించి కార్యరూపంలో పెట్టగా, మనుష్యుడే మతిపోగొట్టుకొని ఈ దురంతాలకు పాల్పడుతున్నాడన్న దొక్కటే ఆయనకు కారణంగా కనబడింది. అయితే ముప్ఫయ్యేళ్ళపాటు ఆయన ఇచ్చిన ప్రేమసందేశం మానవుని పిచ్చితనాన్ని ఎందుకు పోగొట్టలేదు? ఆతనికి మతిస్థిరత్వం ఎందుకు కలిగించలేదు? పైగా మానవుడు స్థైర్యంచెడి పిచ్చివాడైపోతున్నాడే! ఈ సమస్య కూడా ఆయనకు తెగలేదు. చివరకు భగవంతునిమీద భారం వేయడంతప్ప మరోదారి తోచలేదు.

మతావేశాలను ప్రతిఘటించేటందుకై ఆయన ఎంతో ధైర్యంగా పనిచేస్తున్నా ఆత్మవిశ్వాసాన్ని కోల్పోయారు. జీవితానందాన్ని, జీవితేచ్ఛనుకూడా కోల్పోయారు. 1947లో తన జన్మదిన సందర్భంలో ఒక పత్రికా విలేకరి అడిగిన ప్రశ్నకు సమాధానంగా ఆయన ఇలా వ్రాశారు :

> "నూటపాతికేళ్ళ వరకూ బ్రతకాలని కోరడమూ, ఈనాడే మరణించాలని కోరడమూ కూడ మంచిపని కాదు. సందేహం లేదు. నా విషయంలో సర్వం ఆ పరమాత్మ ఇష్టానికే విడిచిపెట్టేను. నూటపాతికేళ్ళ వయస్సు వచ్చేవరకూ జీవించి ఉండాలనే వాంఛను నేను ఇదివరలో ప్రకటించివుంటే, నూతన పరిస్థితులలో ఆ వాంఛను ఒదులుకోవడమే మంచిది... హిందువయినా ముస్లిం అయినా మరొకడయినా పరమకిరాతకంగా సాగించే ఈ హత్యాకాండను చేతులు ముడుచుకొని చూస్తూ కూర్చునే పరిస్థితిలో నన్ను పెట్టేకన్నా 'ఈ దుఃఖమయ ప్రపంచం' లోంచి తీసుకుపోవలసిందిగా సర్వశక్తిమంతుడైన ఆ భగవంతుని ప్రార్థిస్తున్నాను." (సం. 7, పుట 176)



గాంధీజీ గొప్పతనంలో పరిమితులిక్కడే మనకు కనబడతాయి. బూర్జువావర్గ ప్రపంచ దృక్పథం ఆయన దృష్టిని కమ్మివేస్తూండడంచేత అధికారం వప్పగింతకు ముందూ తర్వాతా దేశంలో మతవైషమ్యాలు చెలరేగడమూ, కాంగ్రెసులో పతనస్థితి రావడమూ ఏదో యాదృచ్ఛికంగా జరిగిందేగాని సామాజిక పరిణామ క్రమంలో వచ్చే కొన్ని సూత్రాల ఫలితమని ఆయనకు తట్టలేదు. దీనినే ఆయన చూడగలిగి వుంటే, ఈ వైషమ్యాలను ఏవో కొన్ని సాంఘిక శక్తులు రెచ్చగొడుతున్నాయనీ, హిందూ ముస్లిం ప్రజానీకంలోని దుష్టత్వం వీనికి కారణం కాదనీ గ్రహించి వుండేవారు. అప్పుడు హిందూ–ముస్లిం ప్రజల భవిష్యత్తును దేవుని చేతిలోపెట్టి తృప్తిపడడం మాని, ఈ వైషమ్యాలను రెచ్చగొడుతున్న సామాజిక శక్తులతో ఘర్షణపడివుండేవారు.

మతవైమనస్యాలు రేపడానికే కొన్ని సామాజిక శక్తులు పనిచేస్తున్నాయన్న ఆలోచన లేకపోవడంచేత అభివృద్ధి నిరోధకశక్తులతో జరిగే పోరాటంలో ప్రజలు ఐక్యంగా వ్యవహరించడం ఆయనకు మతవైషమ్యాలకన్న ఎక్కువ భయోత్పాతం కలిగించింది. నావికుల పోరాటంలో హిందూ ముస్లిం ప్రజలు చూపిన ఐక్య పోరాటశక్తికి ఆయన ఎంత అదిరిపోయారో చూడండి :

> "నౌకా సేనలలో వచ్చిన ఈ తిరుగుబాటూ, తదనంతర ఘటనలూ ఏవిధంగానూ అహింసాయుత చర్యలు కానేరవు... దౌర్జన్యచర్యలకై హిందువులు ముస్లిములు తదితరులు కలియడం అనేది అపవిత్రం. అది ఒకరి నొకరు నరుక్కోడానికి దారితీస్తుంది. బహుశా దాని కిదే నాందియేమో కూడా. ఇది భారతదేశానికీ, ప్రపంచానికీ కూడ నష్టకరం... రాజ్యాంగం విషయంలో అది కాత్రగడలవద్ద (బారికేడ్లు) హిందూ ముస్లిములను ఏకంచేస్తుంది... దౌర్జన్య విధానానికయినా ఇది తప్పు పద్ధతే... బ్రిటిష్‌వాళ్ళ ప్రకటనల ఎడ విశ్వాసంలేక ముందే పేచీలు తెచ్చే హ్రస్వదృష్టిని అది ప్రకటిస్తూంది... శతాబ్దాల తరబడి మందకొడిగా పడివున్న భారతదేశాన్ని మేల్కొలిపి, స్వరాజ్యంకోసం అస్పష్టంగా నైతేనేమి తపన పుట్టించడంలో అహింసా విధానం సఫలమయిందో లేదో అరుణా ఆమె సహచరులూ ఆలోచించడం అవసరం. నా అభిప్రాయంలో దాని కొక్కటే సమాధానం వుంది." (సం. 7, పుట 78–81. క్రింది గీతలు నావి.)

కాంగ్రెసువాదులలో వచ్చిన పతనానికి కారణాలను చూడలేకపోవడానికి కూడా అదే కారణం. ఆయనకు వర్గకలహ సిద్ధాంతం అంటే అయిష్టం. భూస్వామ్య పెట్టుబడిదారీ వర్గాలలోని వ్యక్తుల క్షేమానికి తాను పనిచేస్తానని ఆయన వొప్పుకుంటారు. అందుచేతనే కాంగ్రెసులోని పైతరగతి, మధ్యతరగతి రాజకీయ నాయకులు అధికారాన్ని హస్తగతం

చేసుకొనడానికై ఎంత త్యాగం చెయ్యగలరో ఆ అధికారాన్ని స్వాయత్తం చేసుకొనేటందుకూ స్వార్థ ప్రయోజనాలు సాధించుకొనేటందుకూ అంతగానూ పేచీపడతారని ఆయన గ్రహించలేకపోయారు. అంతవరకూ స్వార్థరహితంగా పనిచేసినవారు అంతలో సిగ్గువిడిచి స్వార్థపరులుగా మారడానికి కారణం ఏమిటో గాంధీజీ చూడలేకపోయారు. కాంగ్రెసు వాదులలో వచ్చిన నైతిక పతనానికి కారణాలు చెప్పలేకపోయారు. ఆ పతనాన్ని చూడ గలిగారేగాని, ఆపలేకపోయారు. ఫలితం ఏమిటి? మనుష్యుడు సహజంగా మంచివాడేనన్న భావనతో బయలుదేరి చివరకు మానవుడు మతభ్రష్టుడయ్యాడనీ, పతనం పొందాడనీ సిద్ధాంతీకరించే స్థితికి వచ్చారు.

గాంధీజీ నాయకత్వం క్రింద స్వాతంత్ర్యం పొందామని కోట్లకొలది ప్రజలు ఉత్సవాలు జరుపుకొంటున్న సమయంలో తన జీవితాదర్శం (మనుష్య స్వభావాన్ని పునరుజ్జీవింపచెయ్యడం) విఫలమయిందని ఆయన అనుకొన్నారు. చరిత్రలో గమనించ వలసిన విషయాలలో ఇదొకటి. గాంధీవాదం ఒక రాజకీయ వ్యూహంగా, బ్రిటిష్ వ్యతిరేక పోరాటంలో బూర్జువావర్గపు ఎత్తుగడగా విజయం పొందింది. కాని నూతన సామాజిక సిద్ధాంతంగా, మానవ పునరుజ్జీవనకు నూతన పద్ధతిగా అది పూర్తిగా విఫలమయింది. ఇంతకన్న మంచి సమాధానం మరొకటి లేదు.

# 13. గాంధీవాదం అంటే?

**మ**హాత్మా గాంధీ జీవితంలోనూ, ఆయన ఉపదేశాలలోనూ వున్న ప్రత్యేకత ఏమిటి? 1920లో ఆయన తన ఆత్మకథ వ్రాయడం ప్రారంభించినప్పుడు పేర్కొన్నట్లు ఆయన జీవితగాథ కేవలం "సత్యాన్వేషణ కథ" మాత్రమేనా?

మోహన్‌దాస్ గాంధీ 'జాతిపిత'గా ఎట్లా అయ్యాడు? మొదటి ప్రపంచ యుద్ధ కాలంలో ప్రభుభక్తి పరాయణుడుగా పనిచేసిన రిక్రూటింగ్ సార్జెంటు 1942 నాటికి 'విజయమో వీరమరణమో (Do or Die) ఉద్యమానికి నాయకత్వం వహించడం, ఆవేశకరమైన 'క్విట్ ఇండియా' నినాదాన్ని ఇవ్వడం ఎలా తటస్థించింది? పోర్బందరు సంస్థాన ప్రభువుల విశ్వాసానికి పాత్రులయిన ఉద్యోగుల కుటుంబంలో పుట్టిన వ్యక్తి భారతీయ సంస్థానాలలో ప్రజాతంత్ర హక్కుల కోసం పోరాడడం ఎలా సాధ్యమయింది? అభివృద్ధికర ఉద్యమాలేవీ లండనులో ఆయనను ఆకర్షించలేకపోయాయి. వెళ్ళి వెళ్ళి శాకాహారోద్యమంలో చిక్కుకున్నాడు. అటువంటి మతాభిమానపరుడైన యువకుడు నాయకుడుగా పరిణతి పొందడం ఎలా జరిగింది?

ఇవి వట్టి ఉబుసుపోక వేసే ప్రశ్నలు కావు. మన దేశంలో ఈనాడు ప్రజాతంత్ర వాదులెవరైనా సరే నిర్వహించవలసిన ఆచరణీయ బాధ్యతలకూ వీనికీ సంబంధం వుంది. ఏమంటే ఈనాడు మహాత్ముడు జీవించి ఉండకపోవచ్చు. అయినా మన దేశంలోని ప్రజాతంత్రోద్యమంలో పలువురు వ్యక్తులూ, అనేక గ్రూపులూ ఆయన జీవితాంతంవరకు బోధించిన సిద్ధాంతాలనుబట్టి నడుచుకొంటున్నారు.

ఉదాహరణకు భూదానోద్యమానికి పునాది గాంధీ ఉపదేశాలే. అందులో సందేహం

లేదు; ఆ ఉద్యమ సిద్ధాంతాలతోనూ, కార్యవిధానాలతోనూ అందరూ ఏకీభవించకపోవచ్చు. కాని, దానిని నిర్లక్ష్యం చేయడానికి మాత్రం వీల్లేదు. భూదానోద్యమానికి రెండు లక్షణాలున్నాయి – ఈనాడున్న భూసంబంధమైన ఆస్తి వ్యవస్థనది వ్యతిరేకిస్తూంది. రెండోవైపున భూమి పంపకంలో వున్న ఆ వ్యవస్థను 'అహింసాయుత' పద్ధతులలో సువ్యవస్థితం చేయాలని చెబుతూంది. మన దేశంలో కల్లా అతి ప్రధానమైన భూ పంపక సమస్యకు గాంధీజీ ఉపదేశాలను అనువర్తింప చేస్తూంది.

మరొకటి కూడా మరవకూడదు. ఈనాటి గాంధీవాదులలో చాలమంది (వినోబాజీతో సహా) ఏదో ఒక రూపంలో శాంతి ఉద్యమంలో పాల్గొంటున్నారంటే అది గాంధీజీ ఉపదేశాల ప్రభావమే.

రెండోవైపున కేంద్రంలోనూ, రాష్ట్రాలలోనూ కూడ ఈనాటి ప్రభుత్వాధికారులు శ్రామికవర్గంలోనూ, రైతాంగంలోనూ విజృంభిస్తున్న ప్రజోద్యమాన్ని "మూకల దౌర్జన్య చర్యల" పేరుతో ఎదుర్కొంటున్నారు. ఈ పనిని గాంధీజీ ఉపదేశాల పేరు మీదనే జరిగిస్తున్నారనేది కూడ గుర్తుంచుకోవాలి.

కాంగ్రెసులోని అన్ని ముఠాలవారు, అన్ని ధోరణులవారు కూడ – ఒక్క కమ్యూనిస్టు పార్టీ తప్ప మిగిలిన అన్ని పార్టీలూ – తమ విధానాలను సమర్థించు కొనేటందుకు గాంధీజీని, ఆయన ఉపదేశాలనూ ఉపయోగించుకొంటున్నారు. దానినిబట్టే మన జాతీయోద్యమ చరిత్రలో గాంధీజీ నిర్వహించిన పాత్రయొక్క అత్యధిక ప్రాముఖ్యాన్ని అర్థంచేసుకోగలం. అందుచేత మన ప్రజాతంత్రోద్యమాన్ని ఇంకా ఇంకా ముందుకు తీసుకుపోవాలంటే గాంధీజీ పాత్రనూ, ఆయన ఉపదేశాల ప్రాముఖ్యతనూ చాల జాగ్రత్తగా అంచనా కట్టవలసిన అవసరం వుంది.

ఇదంత సులభమైన పని కాదు. చారిత్రక వ్యక్తులనేకమందిని అర్థం చేసుకోడమెలా కష్టమో అలాగే గాంధీజీని కూడ అర్థంచేసుకోడం చాల కష్టం. "ప్రజానీకాన్ని సామ్రాజ్య వ్యతిరేక పోరాటాలలోకి తెచ్చి, జాతీయోద్యమాన్ని ఆయన ఉత్తేజపరచాడు" అనీ, "మన జాతీయోద్యమాన్ని విప్లవకర పంథాలో సాగకుండా శక్తివంచన లేకుండా విప్లవద్రోహిగా పనిచేశాడు" అనీ ఆషామాషీగా చెప్పెయ్యడం సాధ్యం కాదు.

ఆయన జీవితంలో అనేక ఘటనలు జరిగాయి. మానవుని జీవిత సమస్య లన్నింటిమీదా ఆయన అనేక సంగతులు వ్రాశారు. అనేక సందర్భాలలో ఆయన చర్యలు హఠాదావేశభరితాలు. వాటన్నింటినీ ఆధారం చేసుకొని ఎవరికి వారు ఆయనను గురించీ, ఆయన సిద్ధాంతాలను గురించీ తమ ఇచ్చవచ్చినట్లు వ్యాఖ్యానించవచ్చు. తమ అభిమాన సిద్ధాంతాలకు బలంగా వాని నుపయోగించుకోవచ్చు. ఆయన జీవితంలోంచి కొన్ని

ఘటనలు, రచనలు, ఉపన్యాసాల నుంచి కొన్ని భాగాలను తీసి గుదిగుచ్చడమే వారు చేయవలసిందల్లా. కాని, చారిత్రక దృష్ట్యా ప్రాముఖ్యం గల వాటిని ఏరడం, ఆయన జీవితంలోను, ఉపదేశాలలోనూ గల వివిధ లక్షణాల మధ్య గల పరస్పర సంబంధాన్ని తెలుసుకోవడం, దానినుంచి ఆయనను గురించీ, ఆయన సాధనను గురించీ ఒక సమగ్రమైన అభిప్రాయానికి రావడం కష్టం.

దురదృష్టవశాత్తూ ఈ విషయంలో ఇంతవరకు జరిగిన ప్రయత్నాలన్నీ పై రెండు తరగతులకు చెందినవే. ఒకరకం ఆషామాషీగా ఆయనకన్నీ అభినందనలే యిస్తుంది. మరోరకం ఆషామాషీగానే ఆయన పనులన్నిటినీ విమర్శిస్తుంది. ఇవి రెండూ పాక్షికాలే. ఈ బురదలో పడకుండా మనం తగు జాగ్రత్తలు తీసుకోవాలి. అటువంటి ప్రయత్నంలోనే నాకు గాంధీజీ జీవితం గురించి తెలుసుకోదగినవిగా కనిపించిన అంశాలను క్రింద యిస్తున్నాను.

మొదటి అంశం : గాంధీజీ ఆదర్శ భావవాది అనే దానిని మనం గుర్తుంచుకోవాలి. ప్రపంచాన్ని ఆయన భౌతికవాద దృక్పథంతో గమనించకపోవడం ఒక్కటే కాదు. ఆయన తన ఎదుట కొన్ని ఆదర్శభావాల నుంచుకొని, జీవితాంతం వాటిని అంటిపెట్టుకుని వున్నారు. సత్యం, అహింస, భోగత్యాగం మొదలయిన నైతిక విలువలూ; స్వాతంత్ర్యం, ప్రజాతంత్రం, శాంతి మొదలయిన రాజకీయ ఆదర్శాలు; వర్ణభేద నిర్మూలనం, స్త్రీ స్వాతంత్ర్యం, వివిధ కులాల, మతాల మధ్య ఐక్యత మొదలయిన సామాజిక గమ్యాలు ఆయన జీవితంలోను, బోధలలోనూ పెనవేసుకుపోయాయి. ఆయన రాజకీయ జీవిత ప్రారంభదినాలలో దక్షిణాఫ్రికా సత్యాగ్రహోద్యమంలో దుముకడానికి కారణం కొన్ని ఆదర్శాలను ఆయన అంటిపెట్టుకుని వుండడమే. తర్వాత దేశ స్వాతంత్ర్యం కోసం సత్యాగ్రహాన్నీ, ఇతర ఉద్యమాలనీ ఆయన ప్రారంభించడానిక్కూడా అదే కారణం; అనేక ప్రజాతంత్ర విషయాలను ఆయన బలపరచారన్నా, జాతీయైక్యత అనే పవిత్ర కార్యక్రమంలో ఆత్మబలిదానం చేశారన్నా కూడ అదే కారణం.

రెండో అంశం : అంతవరకూ నిద్రాణమైవున్న కోట్లకొలది పల్లెటి ప్రజలను ఉత్తేజపరచడంలో ఆయన ఆదర్శ భావవాదం చాల ప్రధానపాత్ర నిర్వహించింది. ప్రజలతో మాట్లాడేటప్పుడు ఆయన తాత్విక పదజాలాన్ని ఉపయోగిస్తూండడం, ఆయన గడుపుతున్న నిరాడంబర జీవితము, ప్రజల వాంఛలకోసం పోరాడడంలో ఆయన చూపిన తెగువ – ఇవన్నీ పల్లెటి ప్రజానీకాన్ని ఆయనవైపు ఆకర్షించాయి. ఆయనను తమ రక్షకుడుగా, భగవదవతారంగా, తామున్న దుర్దశ నుంచి రక్షించే వాడుగా భావించారు.

అనేక సామాజిక విషయాలమీదా – ఆర్థిక, సాంస్కృతిక సమస్యలమీదా ఆయన

అభిప్రాయాలు 'అభివృద్ధి నిరోధకముల'ని మనం అనుకోవచ్చు (వానిలో చాలామటుకు నిస్సందేహంగా అభివృద్ధి నిరోధకమైనవే కూడ). రైతు ప్రజా సామాన్యానికీ, ఆధునిక జాతీయ – ప్రజాతంత్రోద్యమ నాయకులూ, కుతర్కపరులైన ప్రతినిధులకూ మధ్య ఆయన సంధానకర్తగా పనిచెయ్యడానికి ఆ అభివృద్ధి నిరోధక దృక్పథాలే తోడ్పడ్డాయన్న సంగతిని మనం మరువకూడదు. అభివృద్ధి నిరోధకమైన సామాజికాభిప్రాయాల బలమే గాంధీజీకి అత్యంత బలీయమైన విప్లవకర పరిస్థితిని కల్పించడంలో – అంటే గ్రామీణ ప్రజా సామాన్యాన్ని ఆధునిక జాతీయ ప్రజాతంత్రోద్యమంలోకి ఆకర్షించడంలో – ఉపయోగ పడిందని చెప్తే పరస్పర విరుద్ధంగా కనిపించవచ్చు. అసలు మన జాతీయ రాజకీయ జీవితంలోనే ఒక వైరుధ్యం వుంది. మన జాతీయ ప్రజాతంత్రోద్యమాన్ని భూస్వామ్యవర్గంతో సంబంధంగల బూర్జువావర్గం నడిపింది. అదొక వైరుధ్యం. ఆ వైరుధ్యమే దానిలో ప్రతిబింబించింది.

మూడో అంశం : గ్రామీణ బీద ప్రజానీకాన్ని జాతీయోద్యమంలోకి ఆకర్షించడంలో ఆయన ప్రముఖపాత్ర వహించారు. నిజమే; కాని మొదటి ప్రపంచయుద్ధం అనంతరం ప్రజలలో వచ్చిన బ్రహ్మాండమైన చైతన్యపు వెల్లువ ఆయన వలననే వచ్చిందనడం మాత్రం సరికాదని చెప్పాలి. భారతదేశంలోనూ, యావత్ప్రపంచంలోనూ జరుగుతున్న చారిత్రాత్మక పరిణామాల ఫలితంగా ఆ చైతన్యం వచ్చింది. భారతీయ రైతాంగంయొక్క ఆర్థిక పరిస్థితులు క్రమక్రమంగా దిగజారు తున్నాయి. మొదటి ప్రపంచ యుద్ధకాలంలోనూ, దాని తర్వాతనూ అవి మరీ అధ్వాన్నమైనాయి; భారత జాతీయోద్యమంలో అతివాదులు బలపడ్డారు. కొన్ని ప్రదేశాలలో వారు రైతాంగంలోని కొన్ని తరగతులవారితో సంబంధాలు పెట్టుకొన్నారు కూడా; టర్కీలోనూ, చైనాలోనూ వచ్చిన విప్లవాలు, ముఖ్యంగా రష్యా విప్లవం మొదలయిన అంతర్జాతీయ పరిణామాలు ఆసియా ప్రజల మనస్సులకు బాగా పట్టాయి. భారతీయ రైతాంగంలో చైతన్యం వృద్ధిపొందించిన కారణాలలో యివి కొన్ని మాత్రమే. గాంధీజీ రంగంలోకి రాకపోయినా వీని ప్రభావం పనిచేసే వుండేది. అయితే అది మరొక విధంగా వుండేది.

అయితే, భారతీయ రైతాంగంలో వచ్చిన చైతన్యానికి ఒక నిర్దిష్టమైన రూపం ఇవ్వడంలో ఆయన వ్యక్తిత్వానికి చాల ముఖ్యమైన పాత్ర వుంది. ఈ నూతన చైతన్యం స్వాతంత్ర్యం, ప్రజాతంత్రం కొరకు సాగుతున్న రాజకీయోద్యమంతో లంకెపడి నడవడానికి గాంధీజీ వ్యక్తిత్వం చాల ముఖ్యమైన పాత్ర వహించింది. పల్లెటి ప్రజాసామాన్యాన్ని జాతీయ ప్రజాతంత్రోద్యమంలోకి ఆకర్షించి దానిని బలపరచడంలో గాంధీజీ చేసిన సేవను



విస్మరించడం అంటే ప్రజలలో వచ్చిన చైతన్యానికి ఆయనే కారణం అని చెప్పినట్లుగా కేవలం పాక్షికంగానే వుంటుంది.

నాలుగో అంశం : మన జాతీయ ప్రజాతంత్రోద్యమంలో పెద్ద బలహీనత వుంది. అంతవరకు నిర్మాణయుక్తంగాని అన్ని తరగతుల గ్రామీణ బీద ప్రజానీకాన్నీ గాంధీజీ ఆ ఉద్యమంలోకి తెచ్చి ఆ బలహీనతను అధిగమించారు. దానిని నిజమైన జాతీయోద్యమంగా చేశారు. ఈ విషయమై ఆయనను అభినందించవలసిందే. కాని, జీవితాంతంవరకూ ఆయన పల్లెటూరి బీద ప్రజానీకం స్వతంత్రశక్తిగా వ్యవహరించడం పేరు చెప్తేనే భయపడు తూండేవారన్న విషయం మరువకూడదు. స్వాతంత్ర్యంకోసమూ, ప్రజాతంత్రంకోసమూ పోరాటంలోకి వారిని సమీకరించాలనే ఆయన పూర్తి అభిప్రాయం. కాని వారు బూర్జువావర్గం యొక్క నాయకత్వం క్రిందనే పనిచెయ్యాలని ఆయన పట్టుపట్టారు.

చౌరీచౌరా ఘటనల కాలంనుంచి చనిపోయేవరకూ కూడ స్వాతంత్ర్య, ప్రజాతంత్ర పోరాటాల ప్రతి దశలోనూ, పల్లెటూరి ప్రజానీకాన్ని బూర్జువావర్గానికి క్షేమకరమైన పరిధుల లోనే ఉంచడానికి ఆయన అనేక విధానాలను, ఉపాయాలను అవలంబిస్తూ వచ్చారు. దీనిని గుర్తించకపోతే మొదటి ప్రపంచయుద్ధ కాలంలో సామ్రాజ్యవాదుల రిక్రూటింగ్ సార్జెంటుగా పనిచేయడానికి అభ్యంతరంలేని వ్యక్తి సామ్రాజ్యవాదులతోనూ, వారి ఏజంట్లతోనూ పోరాడేటప్పుడు ప్రజానీకం అహింసా విధానాన్ని తప్పకూడదని పట్టుపట్ట డానికి కారణం ఏమయివుండాలో తెలుసుకోలేము.

అయిదో అంశం : పల్లెటి ప్రజానీకం విషయంలోనేకాదు, శ్రామికవర్గం విషయంలోనూ, ఇతర కష్టజీవుల విషయంలోనూ ఆయన అవలంబించిన విధానం కూడ బూర్జువావర్గానికే తోడ్పడింది. ధర్మకర్తృత్వ సిద్ధాంతాన్ని ఆయన ప్రతిపాదించారు. రాజకీయ కార్యక్రమాలన్నింటా కొన్ని నైతిక సూత్రాలను తప్పనిసరిగా పాటించితీరా లన్నారు. తన అనుచరులు పార్లమెంటులో చేసే పనులకు, తాను సాగిస్తున్న నిర్మాణ కార్యక్రమాన్ని బహునేర్పుగా ఆయన అనుసంధించారు. శత్రువుకు వ్యతిరేకంగా ప్రజోద్యమాన్ని సాగిస్తూనే శత్రువుతో రాయబారాలు జరపడం అనేది గాంధీజీ అనుసరించిన ప్రత్యేక పద్ధతి. ఇవన్నీ కూడ (క) ప్రజలను సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా కార్యరంగంలోకి తీసుకురావడంలోనూ (ఖ) వారిని ప్రజావిప్లవ కార్యాలలో పాల్గొనకుండా నిరోధించడం లోనూ బూర్జువావర్గానికి ఎంతో తోడ్పడ్డాయి. ప్రజలను కార్యరంగంలోకి ఉరికించడం లోనూ, వారిని నిలవరించడం లోనూ ఆయనకున్న శక్తి, సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా ప్రజోద్యమాన్ని నడిపిస్తూనే రెండోవైపున వారితో రాయబారాలు నడిపించే పద్ధతీ ఆయనను అద్వితీయుడైన బూర్జువావర్గ నాయకునిగా చేశాయి. ఆ వర్గంలోని అన్ని ముఠాలకూ,

అన్ని భాగాలకూ ఆయనయందు విశ్వాసం వుంది. అందుచేత ఆ వర్గాన్నంతనూ ఆయన ఐక్యపరచి కార్యరంగంలోకి తీసుకువచ్చారు.

ఆఖరు అంశం : బూర్జువావర్గానికి గాంధీజీ నాయకాగ్రణి అంటే ఆ వర్గంతో ఆయనకు ఎన్నడూ, ఏ సమస్యమీదా భేదాభిప్రాయం లేదని అర్థంకాదు. ఆయన మార్గదర్శిగా, తత్వవేత్తగా, మిత్రుడుగా పనిచేసిన వర్గంలో అనేక సందర్భాలలో, అనేక సమస్యలమీద ఆయన మాటను సమర్థించేవారు తక్కువ సంఖ్యలో వుండేవారు. అదో ప్రత్యేకత. అటువంటి సందర్భాలలో తాత్కాలికంగా ఎవరికి నచ్చిన దారిని వారు అనుసరిద్దామని ఉభయులూ ఒప్పందానికి వచ్చేవారు. ఇలా అనేక పర్యాయాలు జరిగింది. సహాయ నిరాకరణోద్యమానంతరం ఒకమారు (స్వరాజ్య పార్టీవారికీ, నో ఛేంజర్లకూ మధ్య పని విభజన జరిగింది); తర్వాత 1932–33లో జరిగిన శాసనోల్లంఘనోద్యమంలో ఓమారు ఇలా జరిగింది; రెండో ప్రపంచ యుద్ధకాలంలో కూడ అనేకమార్లు ఇలాగే తటస్థపడింది; ఆఖరు పర్యాయంగా ఇక స్వాతంత్ర్యం సంపాదించే ముందురోజుల్లోనూ, అటు తర్వాతా కూడ అటువంటిదే జరిగింది.

ఆఖరు రోజుల్లో “ఉక్కుగుండె” సర్దార్ పటేల్ ‘అభేద్య కార్యదక్షతకూ’, అతివాద మేధావి పండిత నెహ్రూ ఆధునికతకూ మధ్య ఆయన ఆదర్శ భావవాదం చిక్కుకొని ఘర్షణలో పడింది. అనేక సంవత్సరాలుగా ఆయనకు సహచరులుగా, అనుచరులుగా పనిచేసిన వారికే ఆయన ఆదర్శ భావవాదం నచ్చలేదు. ఆయనకూ, ఆయన సహచరులకూ మధ్య ఏర్పడిన ఈ అగాధంతో స్వాతంత్ర్య సాధనానంతరం ఆయన దుర్మరణానికి పూర్వమే ఆయన జీవితం విచారభరితం అయింది.

ఆయన జీవితం ఆఖరు రోజుల్లో ఆయనకూ, ఆయన సహచరులకూ మధ్య ఏర్పడిన ఈ అగాధం ఏమిటో పరిశీలించ పూనుకొన్నప్పుడే ఆయనను గురించీ, ఆయన ఆశయాలను గురించీ సరియైన అంచనా వేయగలం. గాంధీజీ ఒక దశలో ప్రాధాన్యం ఇచ్చిన నైతిక విలువలు ఆనాడు బూర్జువావర్గానికి తోడ్పడ్డాయి. కాని, అవి ఆయన ఆఖరు రోజులలో ఆ వర్గానికి ఆటంకకరం అయినాయి.

ఆ రోజుల్లో బూర్జువావర్గం రెండు రంగాలలో పోరాటాలు నడపవలసి వచ్చింది. ఒకవైపున సామ్రాజ్యవాదం తోడి పోరాటంలో పట్టణాలలోనూ, పల్లెలలోనూ వున్న బీద ప్రజానీకాన్ని సమీకరించవలసి వచ్చింది. రెండోవైపున ప్రజానీకంలో అంతకంతకు బలపడుతున్న విప్లవ ధోరణులను ఎదుర్కోవలసి వచ్చింది. ఆ సమయంలో గాంధీజీ తెచ్చిన అహింసాయుత ప్రతిఘటన పద్ధతి బాగా ఉపయోగించింది. కాని, సామ్రాజ్యవాదుల తోడి పోరాటం విజయం పొందాక – అంటే బూర్జువావర్గమూ, వారి మిత్రులూ

ప్రభుత్వాధికారాన్ని పట్టుకొన్నాక – రెండు రంగాలలో పోరాడవలసిన అవసరం తీరింది. ఇక ముందు సామ్రాజ్య వాదంతో జరిగే పోరాటాలను ప్రభుత్వ స్థాయిలో జరిగించవచ్చు. దానికోసం ప్రజలను కార్యరంగంలోకి తీసుకురానక్కర్లేదు.

బూర్జువావర్గం చేతిలోకి ప్రభుత్వాధికారం వచ్చాక, అది దానిని తన వర్గ ప్రయోజనాలకోసం ఉపయోగించుకొంటోంది. తత్ఫలితంగా ఆ వర్గమూ దాని చేతిలోవున్న రాజ్యాంగయంత్రమూ ప్రజలతో నిరంతరం రండాగొండిలో పడింది. వారు ప్రభుత్వాధికారం లోకి రావడంతో మరొకటి కూడా జరిగింది. బూర్జువావర్గానికి చెందిన వ్యక్తులు అధికారంలోకి రాగానే (మంత్రులుగా, పార్లమెంటు సభ్యులుగా, శాసన సభ్యులుగా, ఇతర విధాలుగా) వారు ప్రభుత్వమునూ, ప్రజలనూ నష్టపరచి తాము ధనం చేసుకుంటు న్నారు. తమ మిత్రుల, బంధువుల, తాబేదార్ల జేబులు నిండేటట్లు చేస్తున్నారు; లాభం ఉంటుందని తోస్తే ఎటువంటి నీచపు పనికైనా సిద్ధమవుతున్నారు.

మొత్తం బూర్జువావర్గం యొక్క స్థితిలోనూ, ఆ వర్గంలోని వ్యక్తుల స్థితిగతుల లోనూ వచ్చిన ఈ మార్పు గాంధీజీకి నచ్చలేదు. సామ్రాజ్య వ్యతిరేక పోరాటంలో రోజుల్లో తాను బోధించిన ఆదర్శాలనే ఆయన పట్టుకు కూర్చున్నారు. సామ్రాజ్య వ్యతిరేక పోరాటాల రోజుల్లో ఆయన బోధించిన నైతిక విలువలు అధికారంలోకి వచ్చిన రాజకీయవేత్తలకు ఆటంకంగా తయారయినాయి. కాని, గాంధీజీ వానిని వదలలేదు. తన సహచరులలోనూ, అనుచరులలోనూ హఠాత్తుగా వచ్చిన మార్పును ఆయన ఒప్పుకోలేకపోయారు. ముఖ్యంగా హిందూ ముస్లిం ఐక్యతమీదా, కాంగ్రెసువాదులలో వ్యాపిస్తున్న అవినీతి పద్ధతులమీదా ఉభయుల అభిప్రాయాలు కలియలేదు.

సామ్రాజ్యవాద వ్యతిరేక దినాల్లో గాంధీజీ బోధించిన ఆదర్శ భావవాదం బూర్జువావర్గం చేతులలో ఒక పనిముట్టుగా వినియోగపడింది. అందుకే ఆయన 'జాతిపిత' అయ్యారని నిరాటంకంగా చెప్పవచ్చు. మరొకటి కూడా అంత గట్టిగానూ చెప్పవచ్చు. స్వాతంత్ర్య సంపాదనానంతరం ఆయన ఆదర్శ భావవాదం బూర్జువావర్గ ప్రయోజనాలకు ఆటంకమయింది. అందుచేత చివరి రోజులలో ఆయన ఇంచుమించు ఏకాకి అయిపోయారు.

# 14. గాంధీజీ తర్వాత గాంధీవాదం

**మో**హన్‌దాస్ కరంచంద్ గాంధీజీ జీవితగాథ ముగింపుకు వచ్చాం. కనక సహజంగానే ఒక ప్రశ్న వస్తుంది; ఒక హంతకుని చేతిలో ఆయన దుర్మరణం పొందిన పదేళ్ళ తర్వాత ఈనాడు దేశంలో గాంధేయ ఆలోచనా ధోరణి ఎటువంటి స్థితిలో వుంది?

ఇక్కడొక చిత్రమైన విషయం వుంది. గాంధీజీ ప్రియశిష్యులనదగిన వారీనాడు చాలమంది సజీవులయి వున్నారు. వీరంతా ఒకనాడు గాంధేయ సిద్ధాంతాలకు ప్రధాన వ్యాఖ్యాతలుగా ప్రసిద్ధి పొందినవారే. కాని, వారీనాడు గాంధీ సిద్ధాంతాల సారం ఏమిటనే దానిమీద ఏకాభిప్రాయం తెలపడంలేదు. నిత్యజీవితంలో వచ్చే చిక్కు సమస్యలకు ఆ సిద్ధాంతాలను సమన్వయించడంలో కూడ వారికి ఏకాభిప్రాయం లేదు. ఎవరికి వారే తాము గాంధీజీ సిద్ధాంతాలను తు.చ. తప్పకుండా అనుసరిస్తున్నామని చెప్పుకుంటూ, మిగతావారంతా గాంధీజీ ఆదర్శాలను నీటగలుపుతున్నారని నిందిస్తున్నారు.

గాంధీజీ సిద్ధాంతాల సారం ఏమిటనే విషయంలోనూ, నిత్యజీవితంలో ఎదురయ్యే చిక్కు సమస్యలకు వానిని సమన్వయించడంలోనూ గాంధీజీ శిష్యులమనుకొనేవారిలో ఏకాభిప్రాయం లేకపోయినా, వారిలో ఒకరు – వినోబాభావే – గాంధీజీకి నిజమైన అనుచరుణ్ణనీ, ఆయన వారసుణ్ణనీ చెప్తున్నారు. గాంధీజీ జీవితకాలంలో ఆయనను గురించి ప్రజలు అంతగా ఎరుగరు. బ్రిటిషు ప్రభుత్వం భారతదేశాన్ని యుద్ధంలోకి ఈడ్చినందుకు అసమ్మతిగా శాసన ధిక్కారం చేయడానికి గాంధీజీ 1940లో మొట్టమొదటి సత్యాగ్రహిగా ఆయనను తీసుకున్నారు. గాంధీజీ ప్రియశిష్యుడుగా ఆయన పేరు దేశం అంతటా ప్రచారం అయింది. ఆయన గాంధీజీ ప్రియశిష్యుడనీ, గాంధీజీ బోధిస్తున్న ఆదర్శాలను, సిద్ధాంతా

లను నిశ్శబ్దంగా, నిస్స్వార్థంగా ప్రచారం చేస్తూ ఆచరణలో పెడుతున్న ఉత్తముడనీ ప్రజలు ఆయనను అప్పుడే గుర్తించారు.

ఇది జరిగిన మరో పదేళ్ళకు ఆయన పేరు బాగా వెల్లడి అయింది. 1951లో ఆయన భూదానోద్యమాన్ని ప్రారంభించారు. స్వతంత్ర భారతదేశం ప్రధానంగా పరిష్కరించవలసిన భూ సమస్యకు గాంధీ సిద్ధాంతాలను భూదానోద్యమం సమన్వయ పరుస్తుందని ఆయనను అభినందిస్తున్నారు. భూస్వాముల భూములను లాగుకొని, రైతులకు పంచడం అనేది చాల బాధాకరమైన పద్ధతియనీ, భూదాన విధానం ఆ పద్ధతికి ప్రత్యామ్నాయమనీ వినోబాజీ చెప్తున్నారు. కాంగ్రెసు ప్రభుత్వాలు తలపెట్టినట్లు చట్టాలుచేసి భూస్వాముల్ని భూములనుంచి తోలేసి వాటిని రైతులకు పంచిపెట్టినా, తెలంగాణాలో కమ్యూనిస్టులు చేయదలపెట్టినట్లు ప్రజా పోరాటాల ద్వారా ఆ పని చేయదలపెట్టినా బాధే కలుగుతుంది. గాంధీజీ విషయంలో జరిగినట్లే ఆయన విషయంలో కూడ జరుగుతూంది. ఆయనకన్న మేధావంతులు, ప్రత్యేక వ్యక్తిత్వం గలవారూ డజన్లకొద్దీ రోజూ ఆయనవద్ద చేరి, భూ సమస్య మొదలయిన ప్రజా సమస్యలను పరిష్కరించగల సామర్థ్యం జనశక్తికే వున్నదని ఆయన వివరిస్తూంటే శ్రద్ధగా వింటున్నారు. మంత్రులు, ఆచార్యులు, ఇతర సమర్థులు ఆయన ఉద్యమాన్ని అభినందిస్తున్నారు. ఆయన ఉద్యమం విజయం పొందితే దౌర్జన్యరహిత విధానంలో వర్గరహిత, వర్ణరహిత సమాజ స్థాపనకు తామందరూ చేస్తున్న కృషి కూడా సఫలం అవుతుందని చెప్తున్నారు.

వినోబాను గాంధీగారి నిజమైన శిష్యుడుగా వొప్పుకోవడం మినహా మిగతా ఏ విషయంలోనూ ఈనాటి గాంధీవాదులు ఏకాభిప్రాయం తెలుపలేకున్నారు. ఉదాహరణకు ఈనాటి ప్రపంచ సమస్యలయెడ వారి దృక్పథాన్ని చూడవచ్చును. గాంధీవాదులలో విభిన్న అభిప్రాయాలు గలవారున్నారు. 'కమ్యూనిస్టు హంగుదారులు', 'రహస్య కమ్యూనిస్టులు' అనబడే వారినుంచి ప్రపంచ ప్రసిద్ధులైన కమ్యూనిస్టు వ్యతిరేకులు. 'కమ్యూనిస్టు ప్రమాదం గురించి' చెప్పే వాదనలన్నింటినీ చాటుగానైనా వల్లించేవారి వరకూ మనకు కనబడతారు. దేశీయ రాజకీయాలూ ఆర్థిక విషయాలలో కూడ విభిన్న రాజకీయ పార్టీల సభ్యులూ, నాయకులూ అయిన గాంధీవాదులు విభిన్న ఆలోచనా ధోరణులను కనబరుస్తున్నారు. గాంధీజీ బ్రతికి వున్నప్పుడు ఆయన నడిపిన సామ్రాజ్య వ్యతిరేకోద్యమాన్ని ప్రతిఘటించిన వారే కొందరు నేడు గాంధీజీ శిష్యులమని చెప్పుకొంటున్నారు. గాంధీజీ పూర్వశిష్యుల్ని వారు "గాంధీ సిద్ధాంతాలను పాటించడం లేదని" నిందిస్తున్నారు కూడా.

ఇక్కడొక ప్రశ్న వస్తుంది. గాంధీ సిద్ధాంతాల్లో ఈ తికమక అంతా ఎందుకొచ్చింది? గాంధీజీ అనుచరులు తమలో తాము ఎందుకు దెబ్బలాడుకుంటున్నారు? చరిత్ర

పునరావృతమవుతూందా? ప్రవక్తల జీవితకాలంలో వారి శిష్యులంతా ఐక్యంగానే వుంటారు. కాని ఆయన మరణానంతరం దెబ్బలాడుకుంటారు. ఇదీ అంతేనా? అయితే వినోబాభావేను మహాత్ముని వారసుడనీ, నిజమైన అనుచరుడనీ ఏకగ్రీవంగా ఎందుకు చెప్పగల్గుతున్నారు? ఈనాటి సమస్యలతో మహాత్ముని ఉపదేశాలను సరి అయినవిధంగా సమన్వయించడం ఎలాగనే విషయంమీద ఆయన శిష్యులంతా దెబ్బలాడుకుంటూంటే సామ్రాజ్య వ్యతిరేక పోరాటకాలంలో ఆయనను వ్యతిరేకించినవారంతా ఈవేళ తామాయన అనుచరులమని చెప్పుకుంటున్నారేమిటి?

ఈ ప్రశ్నలకు సమాధానం రావాలంటే గాంధీవాదంలోని ప్రధాన విషయాన్ని అర్థం చేసుకోవాలి. నైతిక సూత్రాలైన సత్యాన్ని, అహింసను సమకాలీన సమాజ సమస్యలకు వర్తింపచేయడమే గాంధీవాదంలోని ప్రధాన సూత్రమని అంతా చెప్తూంటారు. ఇది సరి అయిన సమాధానమే కావచ్చు. అయితే వెంటనే మరో ప్రశ్న వస్తుంది. పరిశుద్ధ సత్యము, పరిశుద్ధ నీతి అంటూ ఏమయినా ఉన్నాయా? వీనిని ప్రస్తుత జీవిత సమస్యలకు వర్తింపచేయడంలో ఏకైక మార్గం అంటూ ఉన్నదా? ఉదాహరణకు మొట్టమొదటి ప్రపంచయుద్ధంలో తాను పాల్గొనడం మహాపాపమని గాంధీజీ ఎందుకు భావించలేదు? పైగా బ్రిటిష్ వాళ్ళకోసం సైనికులను సమకూర్చేటందుకై గుజరాతు రాష్ట్రంలో తిరిగి వాళ్ళ తరఫున పనిచేశాడు. కాని, రెండో ప్రపంచ యుద్ధకాలంలో యుద్ధానికి సన్నిహితంగా ఉండడం మహాపాపమని ఆయన భావించారు. మొదటి ప్రపంచ యుద్ధంలో నీతివంత మయిన పని రెండో ప్రపంచ యుద్ధంలో అవినీతి ఎందుకయింది? 1921లో ప్రభుత్వాన్ని "సైతాన్ ప్రభుత్వము" అని నిందించి, శాసనసభలను బహిష్కరించాలన్న గాంధీజీయే, తర్వాత శాసనసభలలో స్వరాజ్యవాదులు పనిచెయ్యడానికి అనుమతించవలసిందని నో ఛేంజర్లకు తానే నచ్చచెప్పడం ఎందుకు జరిగింది? చౌరీచౌరాలో ప్రజలు దౌర్జన్యం చేశారని శాసన ధిక్కారాన్నీ, ఇతర ప్రజాపోరాట రూపాలనూ ఉపసంహరించుకున్న గాంధీజీ, ప్రజలను కాల్చిచంపబూనుకున్న రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వాలను బలపరచడానికి ఏమాత్రం వెనుదీయలే దెందుచేత? ఈ పరస్పర విరుద్ధ విధానాలలో పరిశుద్ధములైన నీతి, సత్యం, అహింస అనేవి ఏవైనా వున్నాయా?

ఈ పుస్తకం వెనుకటి పుటలలో అనేక సందర్భాలలో ఈ ప్రశ్నలే కనిపిస్తాయి. కథ ముగింపుకొచ్చేం కనుక చర్చను ముగించడం అవసరమౌతుంది. ప్రపంచంలో అందరిలాగే గాంధీజీకి కూడా సత్యం, అహింస, నీతి అనేవి సాపేక్షకాలే కాని సంపూర్ణ శుద్ధాలు కావు. బ్రిటిష్ సామ్రాజ్యవాదాన్ని శాంతియుతమైన అహింసా పద్ధతులలో అంతరింపచెయ్యడం నీతి, సత్యము అని ఆయన అభిప్రాయం. ప్రత్యేకమైన ఒక విధానం

ఆ పనిలో తోడ్పడుతుందా తోడ్పడదా అనేదే ఆయన గీటురాయిగా భావించారు. బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి భారతీయ సైనికులను సమకూర్చటం మొదటి ప్రపంచ యుద్ధంలో "నీతి". భారతీయ సైనికులు బ్రిటిష్ సామ్రాజ్య రక్షణలో ఆత్మత్యాగం చెయ్యటం వలన ఆ సామ్రాజ్యంలో స్వపరిపాలన కోసం పోరాడుతూన్న తనబోటిగాళ్ళకు బలం కలుగుతుంది. కాని, యుద్ధ ప్రయత్నాలను వ్యతిరేకిస్తామనే బెదిరింపు స్వాతంత్ర్య పోరాటాన్ని బలపరచ గలుగుతుంది. కనుక నూతన పరిస్థితులలో రెండవ ప్రపంచ యుద్ధానికి తోడ్పడటం "అవినీతి". తాను దూరంగా ఉంటూనే ఉద్యమం యొక్క కొన్ని దశలలో బ్రిటిష్‌వారితో రాయబారాలు నడపడానికి కాంగ్రెస్‌కు అనుమతి ఇచ్చారు. ఆ రాయబారాలకు యుద్ధంలో పాల్గొవడం అనేది ప్రధాన విషయం. తాను దూరంగా ఉండటం అనేది కూడ ఒక ఎత్తుగడే. అవసరమయితే, పరిస్థితులు తప్పివస్తే బ్రిటిష్ వాళ్ళమీద పోరాటం నడిపించడానికి వీలుగానే ఆయన దూరంగా ఉండిపోయారు. "సైతాను ప్రభుత్వం", దానికి సంబంధించిన శాసనసభలు మొదలైనవానిపై ఆయన చూపిన దృక్పథం కూడ ఇటువంటిదే. 1921లో ప్రభుత్వ శాఖలన్నింటినీ ప్రజలు బహిష్కరించాలని గాంధీజీ చెప్పారు. తరువాత వైస్రాయి తోనూ, ఇతర ఉన్నతోద్యోగుల తోనూ రాయబారాలు నడపడంలో తాను అసమర్థుడిని కానని నిరూపించుకున్నారు.

అందుచేత పరిశుద్ధ సత్యానికి, పరిశుద్ధ నీతికి గాంధీజీ కట్టుబడియున్నారని చెప్పడంలో అర్థంలేదు. అలాగే గాంధీజీ అనుచరులూ, సహచరులూ ఆయన చెప్పినదానికీ చేసినదానికీ ఖచ్చితంగా కట్టుబడియున్నారనడం కూడ అర్థం లేనిదే. ఆయన అనుచరుల లోను, సహచరులలోను చాలమంది చాటున "గాంధీగారి పిచ్చి"ని గురించి వేళాకోళం చెయ్యడం జరుగుతూంటుంది. అహింస అనేది మత సిద్ధాంతమా? రాజకీయ విధానమా? అనే చర్చ అందరికీ తెలుసును. గాంధీజీ తన కది మత సిద్ధాంతమన్నారు. ఆయన శిష్యులు చాలమంది తమ కది రాజకీయ విధానమన్నారు. గాంధీవాదం యొక్క ప్రధాన సూత్రాలమీద ఆయనకూ ఆయన శిష్యులకూ గల విశ్వాసంలో ఎంత వ్యత్యాసం ఉందో మనకిక్కడ కనిపిస్తుంది. ఆయన జీవిత కాలంలో సామ్రాజ్య వ్యతిరేక పోరాటాన్ని నడిపిస్తూన్న బూర్జువావర్గం యొక్క పోరాటావసరాలకు అనుగుణంగా సత్యం. అహింస, నీతి మొదలైన వాటిని వర్తింపచెయ్యగలగడం చేతనే గాంధీజీ వారందర్నీ ఐక్యపరచగలిగారు. కష్టజీవులైన ప్రజానీకాన్ని ఉత్సాహపరచడంలోను, వారిని బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా ఐక్యపరచడంలోనూ, ఆ ప్రజల పోరాటాలను బూర్జువావర్గానికి క్షేమకరమైన పరిధుల్లో పట్టియుంచటంలోనూ ఆయనకున్న నేర్పును బూర్జువావర్గం గుర్తించింది. సామ్రాజ్య వ్యతిరేక పోరాటం పోటుపాటులలో గాంధీజీ ప్రజల ఉత్సాహాన్ని కనిపెట్టి చూస్తూండేవారు.

మరోమూల బ్రిటిష్ వాళ్ళతో సంబంధం పెట్టుకుని వుండేవారు. ఈ ఇద్దరితో గల సంబంధాన్ని ఉపయోగించుకుని ప్రజలలో సామ్రాజ్య వ్యతిరేకాభిప్రాయాలను సజీవంగా ఉంచేవారు. రెండోవైపున ప్రజానీకం తన సత్తాను గుర్తించినట్లయితే పెట్టుబడిదారీవర్గ ప్రయోజనాలు పోతాయని భయపడేవారు; అవి అంతరించిపోకుండా చాల జాగ్రత్తపడే వారు. సత్యం, అహింస, నీతి అనే సూత్రాలను వర్తింపచెయ్యడంలో గాంధీజీ ఒక ప్రత్యేక పద్ధతిని అనుసరించడంవల్లనే బూర్జువావర్గ ప్రతినిధులు ఆయనను తమ నాయకునిగా గుర్తించారు. ఆయన సిద్ధాంతాల విషయమై వారికి భేదాభిప్రాయం ఉంటే అది వేరుమాట. 1947 ఆగస్టులో పరిస్థితులు మూలమట్టంగా మారినాయి. అందుచేత దేశ సమస్యలకు ఆయన ధోరణిలో సిద్ధాంతాలను అనువదింపచెయ్యడం అవసరమైంది. అందుచేతనే ఆయనకూ, ఆయన శిష్యులకూ మధ్య పెద్ద అగాధం ఏర్పడింది. రాజ్యాధికారం తమ చేతిలోకి వచ్చింది కనుక ప్రజా ఉద్యమాల అవసరం ఇక లేదని ఆయన శిష్యుల అభిప్రాయం. పైగా అవి తమ పనులకు అడ్డం వస్తాయని కూడా అభిప్రాయపడ్డారు. సాంఘిక, ఆర్థిక వ్యవస్థలలో కావలసిన సంస్కరణలను రాజ్యాధికారం ద్వారానే తీసుకురావచ్చునని వారి అభిప్రాయం. కాని గాంధీజీకి ఆ ఆశలేదు. అధికారం స్వాధీనం చెయ్యడానికి ముందూ తరువాతా వచ్చిన నూతన పరిణామాలు ఆయనకెంతో దుఃఖం, బాధకలిగించాయని వెనుకటి ప్రకరణంలో వివరించాను. నూతన పరిస్థితులకు సరిపడేటట్లు తన సిద్ధాంతాలను పునరుద్బోధించాలని ఆయన అనుకున్నారు. ఆ ఆలోచనతోనే స్వతంత్ర భారతదేశంలో ఏమేమి జరగాలో సూచిస్తూ ఆయన కొన్ని విషయాలను ప్రతిపాదించారు. కాంగ్రెసు రాజకీయాలతో సంబంధంలేని సంస్థగా – లోక్ సహాయక సంఘంగా – కేవలం ప్రజాసేవకోసమే పనిచేస్తూ ఉండాలన్నారు. కాని కాంగ్రెస్ నాయకులు ఈ అభిప్రాయాన్ని నిరాకరించారు. కొన్ని దశాబ్దాలపాటు రాజకీయాధికారం సంపాదించడం కోసం పోరాడిన కాంగ్రెస్ దేశక్షేమం కోసం కొత్తగా సంపాదించిన ఆ రాజ్యాధికారాన్ని ఉపయోగించకుండా వదలుకోవాలనడం అపహాస్యంగా కనిపించింది. అందుచేత 1947 ఆగస్టు 15న తమ చేతుల్లోకి వచ్చిన రాజ్యాంగ యంత్రాన్ని ఉపయోగించుకొని తమకు నచ్చిన విధంగా భారతదేశాన్ని పునర్నిర్మించేటందుకై వారు పూనుకున్నారు.

అయితే ఆయన సన్నిహిత శిష్యులు, అనుచరులు కొద్దిమంది గాంధీజీ అభిప్రాయాన్ని తీసుకుని సర్వసేవాసంఘం పేరుతో పనిచెయ్య పూనుకున్నారు. నూతన రాజకీయ వ్యవస్థలో ఏవిధమైన అధికార పదవికీ ఆశించబోమని వారు ప్రతిజ్ఞ చేశారు. మంత్రి పదవులు, పార్లమెంటు సభ్యత్వాలు, శాసనసభా సభ్యత్వాలు వారి కొప్పవు. గాంధీజీ తన జీవితకాలంలో సూత్రీకరించిన నిర్మాణ కార్యక్రమం ద్వారా ప్రజాసేవకే వారు తమ

కాలం వినియోగిస్తారు. అయితే నూతన పరిస్థితులలో ఆ నిర్మాణ కార్యక్రమాలకు కూడ కొద్ది మార్పులు వచ్చాయి? ఖద్దరు ప్రచారం, గ్రామ పరిశ్రమలు, బేసిక్ విద్యావిధానం మొదలైనవి. మరొకలా చెప్పాలంటే, స్వాతంత్ర్య సాధనానంతరం కాంగ్రెస్ ఏ విధంగా పని చెయ్యాలని గాంధీజీ చెప్పారో ఆ విధంగా వారు సర్వసేవా సంఘాన్ని నడుపుతున్నారు.

ఆచార్య వినోబాభావే నాయకత్వాన సర్వోదయ కార్యకర్తలు సాగిస్తూన్న ఈ కార్యక్రమం నుంచి ఒక కొత్త ఉద్యమం – భూదానోద్యమం – జన్మించింది. ఏ పరిస్థితులలో ఈ ఉద్యమం పుట్టిందో అందరికీ తెలుసు; తెలంగాణా రైతాంగం మొదట నిజాం ప్రభుత్వం మీద తిరగబడింది. నిజాం వ్యతిరేక పోరాటంలో వారు భూస్వాముల పెత్తనాన్ని కూడ అంతమొందించి భూమిని పంచుకున్నారు. నిజాం అనంతరం గద్దెకు వచ్చిన కాంగ్రెస్‌తో కూడ వారు తలపడవలసివచ్చింది. భూస్వాముల నుంచి తీసుకున్న భూమిని రక్షించు కుంటూన్న రైతులకు, రైతు విప్లవాన్ని అణచేటందుకై పంపిన పోలీసులకూ మధ్య తీవ్రమైన ఘర్షణలు జరిగాయి. అనేకమందిని తుపాకులతో కాల్చివేశారు. వందల సంఖ్యలో అరెస్టుచేసి జైలులో పెట్టారు. ఇంకా ఎన్నో విధాల భయోత్పాతం కలిగించారు.

ఈ పరిణామాలను చూశాక వినోబాభావే ప్రజల బాధలను తొలగించడం ఎలాగాయని ఆలోచించసాగారు. సరిగ్గా గాంధీ విధానానికి అనుకూలమైన పరిష్కార మార్గమే ఆయనకు దొరికింది. కమ్యూనిస్టుల నాయకత్వాన రైతులు విప్లవకరమైన పద్ధతిలో భూములను స్వాధీనం చేసుకోవడాన్ని ఆయన నిరాకరించారు. కాంగ్రెసు ప్రభుత్వాలు తలపెట్టినట్లు చట్టాల ద్వారా వ్యావసాయిక సంస్కరణలు తీసుకు రావడాన్ని కూడా ఆయన నిరాకరించారు. (ఈ రెండింటిలోనూ ఏదో ఒక రూపమైన దౌర్జన్యం ద్వారా సమాజంలోని సమస్యలను పరిష్కరించే స్వభావం కనబడుతుంది. మొదటిదానిలో ప్రజలే కార్యరంగంలోకి వస్తారు. ఆ విధంగా దౌర్జన్య విధానం అందులో ప్రత్యక్షంగా వుంటుంది. రెండోదాంట్లో రాజ్యాంగ యంత్రాన్ని ఉపయోగించడం జరుగుతుంది. రాజ్యాంగ యంత్రం అంటే అల్పసంఖ్యాకుల మీద అధిక సంఖ్యాకులు ఒక క్రమపద్ధతిలో దౌర్జన్యం సాగించడమేనాయె.) ఈ రెండింటికీ బదులు భూమిగలవారు ఐచ్ఛికంగా భూమిని ఇచ్చివేసే పద్ధతిని ఆయన ప్రతిపాదించారు. “భూమిగల స్త్రీ, పురుషులు ప్రతి ఒక్కరూ తమకున్నదాంట్లో ఆరోవంతు భూమిలేనివారికివ్వాలి” – అనేది ఆయన నినాదం. విప్లవం ద్వారా రైతులు భూమిని స్వాధీనం చేసుకొనే పద్ధతికీ, అధిక సంఖ్యాకుల ఇష్టానుసారం అల్ప సంఖ్యాకులు ప్రవర్తించేటట్లు చేసే రాజ్యాంగ చట్ట పద్ధతికీ ఇది ప్రత్యామ్నాయమైన పద్ధతి. భూ సమస్యా పరిష్కారానికై ‘రాజశక్తి’ స్థానే ‘జనశక్తి’ నుపయోగించా లనేది భూదానోద్యమానికి కీలకం.

ఈ భూదానోద్యమం అనేక దశలు గడచి గ్రామదానోద్యమంగా పరిణతి చెందింది.



భూదాన దశలో చెప్పినట్లు ఆరోవంతు భూమి నివ్వడంతో వినోబాజీకి తృప్తికలగలేదు. ప్రతి ఒక్కరూ తమ ఆస్తినంతనూ ఇచ్చెయ్యాలన్నారు. వ్యక్తిగత ఆస్తిని రద్దుపరచాలి (భూమి మీద ఆస్తి హక్కును రద్దుపరచడంతో ఇది ప్రారంభ మవుతుంది). గ్రామంలోని యావత్తు భూమినీ గ్రామం యొక్క ఉమ్మడి ఆస్తిగా సమీకరించాలి. గ్రామ భూములను ఉమ్మడిగా చేసుకోవాలి. పంటనంతా సమానంగా పంచుకోవాలి. గ్రామ ప్రజల ఉమ్మడి ప్రయోజనాల కోసం గ్రామ పరిశ్రమలను, ఇతర జీవనోపాధులను ఏర్పాటు చేయాలి – గ్రామదానం గురించి మాట్లాడేటప్పుడు వినోబాజీ మనోనేత్రం ముందు మెదలే చిత్రం అది.

సామ్రాజ్య వ్యతిరేక పోరాటకాలపు పరిస్థితులకు గాంధీజీ వర్తింపజేసిన సూత్రాలనే స్వాతంత్ర్య సంపాదనానంతర పరిస్థితులకు వినోబాజీ వర్తింపజేశారు. సోషలిస్టులూ, కమ్యూనిస్టులూ ప్రతిపాదించేటంత విప్లవకరమైన ఆదర్శాన్నే వినోబాజీ కూడ ప్రతిపాదించారు. సోషలిజం యొక్క ఉన్నత దశ అయిన కమ్యూనిజానికి మార్క్సిస్టులు చెప్పే "శక్తికొలదీ పని, అవసరంకొద్దీ అనుభవం" అనే ఆశయాన్నే వినోబాజీ కూడ ప్రధానంగా చెప్పారు. అయితే ఈ ఆశయం కార్మికవర్గం యొక్క నాయకత్వాన శ్రమజీవు లంతా చిరకాల రాజకీయ పోరాటం ద్వారా సాధించేది కాదు. అత్యధిక సంఖ్యాకులైన పీడిత తాడిత ప్రజాకోటిని పాలకవర్గంగా మార్చడం ద్వారా కూడ సాధించేదికాదు. కష్టజీవులయిన ప్రజాకోటి చేతులలో ప్రభుత్వాధికారం వుండి, దాని ద్వారా విభేదాలను నిర్మూలించడం వలన అది సాధించబడదు. సమాజంలోని ఉత్పాదకశక్తులు విపరీతంగా వృద్ధిపొందడం వలన, సమాజంలో "శక్తికొద్దీ పని, అవసరంకొద్దీ అనుభవం" వుండే దశ కార్యరూపంలో అమలుజరగడం వలన ఆ ఆశయం సాధించబడదు. ప్రబోధం హృదయపరివర్తన ద్వారా అది సాధించబడుతుంది. గాంధీవాదం యొక్క ఆధునిక దశ అయిన గ్రామదానోద్యమం సారమిది. మార్క్సిజానికీ దీనికీ తేడా ఇక్కడే వుంది.

మన దేశాన్ని ఎదుర్కొంటున్న సామాజిక సమస్యలకు సరియైన పరిష్కార మార్గాన్ని ఈ గ్రామదానోద్యమం ద్వారా కనుగొన్నామని భావేగారు ఆయన అనుచరులు చెప్తున్నారు. అయితే కాంగ్రెసు నాయకులుగాని, కమ్యూనిస్టు పార్టీ, ప్రజా సోషలిస్టు పార్టీ వంటి అతివాద పార్టీలుగాని ఆ మాటను అంగీకరించడంలేదు. భూమిమీద వ్యక్తి అధికారం వుండడాన్ని వ్యతిరేకిస్తూనూ, గ్రామీణ జీవితాన్ని పునర్నిర్మించవలసి వుందని చెప్తూనూ భావే చేసే ప్రచారం సాంఘిక ఆర్థిక సమస్యలలో వచ్చే మార్పులకు తోడ్పడుతుందేగాని, నిజంగా మార్పులు జరగాలంటే ప్రభుత్వ యంత్రాంగం ద్వారాగాని సాధ్యం కాదని వారు చెప్తున్నారు. భావేగారూ, ఆయన గ్రామదానోద్యమమూ కొన్ని విజయాలను పొందినప్పటికీ భూమిమీద వ్యక్తి హక్కు వొదులుకొనేందుకు పెద్ద భూస్వాములెవ్వరూ ముందుకు రాలేదు.

అందుచేతనే గ్రామదానోద్యమం గురించి చర్చించేటందుకు భావేగారు రాజకీయ పక్షాలవారందరినీ మైసూరులో సమావేశపరచినప్పుడు వారు తమ కా ఉద్యమం యెడ పూర్తి సానుభూతి వున్నదనీ, కాని భూసంస్కరణలు, సహకారోద్యమము మొదలగువానిద్వారా ప్రభుత్వం పూనుకొంటే తప్ప కేవలం ఈ ఉద్యమం ద్వారానే పని జరగదనీ స్పష్టంగా చెప్పారు. సాంఘిక, ఆర్థిక సమస్యల పరిష్కారానికై భావే ప్రారంభించిన ఐచ్ఛికోద్యమమూ, ప్రభుత్వ కార్యక్రమమూ ఒకదానికొకటి తోడ్పడగలదని అందరూ అంగీకరించారు.

గాంధీజీ బ్రతికివున్న రోజులలో ఆయన ప్రియశిష్యులుగా వున్నవారిలో హెచ్చు మందికి దేశంలో వున్న సాంఘిక, ఆర్థిక సమస్యలన్నింటినీ గ్రామదానోద్యమం పరిష్కరించగలదనే నమ్మకం లేదు. భావేకూ, ఆయన అనుచరులకు దానిమీద ఎంతో నమ్మకం వుంది. ఈనాడు జనశక్తిమీద గాక రాజశక్తిమీద విశ్వాసం ప్రకటిస్తున్నవారూ గాంధీజీ జీవితకాలంలో అనేక సందర్భాలలో అనేక సమస్యలమీద భేదించినవారూ ఒకటేనన్నది గమనించతగి వుంది. శాసనసభలు, ఎన్నికలు, యుద్ధంలో పాల్గొనే విషయం కాంగ్రెసును లోకసేవక సంస్థగా మార్చే విషయం మొదలయినవి ఎన్నయినా ఇక్కడ పేర్కొనవచ్చును. సత్యం, అహింస, నీతి మొదలయినవి రాజకీయాధికారాన్ని చేబట్టేటందుకు తోడ్పడ్డాయి. కనుకనే వానిని గురించి గాంధీజీ చెప్పిన మాటలకు వారు తలవూపారు. ఈవేళ వారు అధికారాన్నీ, దానిని ఉపయోగించే హక్కునూ వొదులుకొనేటందుకు సిద్ధంగాలేరు. రాజ్యాధికారం ఎవరి చేతిలో వుంది? దాని నే విధంగా ఉపయోగిస్తారు? – అనేదానిమీదనే సాంఘిక, ఆర్థిక పరిస్థితుల మార్పుకోసం జరిగే ఉద్యమాల జయాప జయాలు ఆధారపడి వుంటాయని వా రెరుగుదురు.

సాంఘిక, ఆర్థిక పరిస్థితులను మార్చాలంటే, రాజకీయాధికారం చేతిలో వుండాలని కమ్యూనిస్టులు, సోషలిస్టులు, ఇతర అతివాదులు బాగా ఎరుగుదురు. ఏ వర్గమూ తన అధికారాన్ని ఐచ్ఛికంగా వదలుకోదని నూరేళ్ళ క్రితమే మార్క్సుజాన్ని ప్రవచించినవారు చెప్పారు. ఆస్తినీ, అధికారాన్నీ వదులుకోమని భావేగారో, మరొకరో బోధించినప్పుడు ఒకడూ అరా ఆ ఉదాత్త ప్రబోధాలను అందుకోవచ్చు. భూస్వాములు, పెట్టుబడిదారులు, ఇతర పీడకులు మాత్రం ఒక వర్గంగా ఐచ్ఛికంగా సాంఘిక మార్పులకు తలవొగ్గరు. అలా జరుగుతుందని కొందరు కలలుకన్నా, కార్యవాదులైన విప్లవకారులు మాత్రం కలలు మాని పోరాటాలనే నడుపుతారు. అలాంటివారు భావేగారినీ, ఆయన సహచరుల్నీ అభినందిస్తారు. గ్రామదానోద్యమపు ఆశయాల ప్రచారంలో యధాశక్తి తోడ్పడతారు. అంతేగాని రాజకీయాధికారం కోసం సాగించే పోరాటాన్ని మాత్రం నిలపరు.

Mahathmudu Aayana Sidhanthalu

*by* E. M. S. NAMBOODIRIPAD

బ్రిటీషు సామ్రాజ్యవాదానికి అర్జీలు దాఖలా చేసుకుని తన దేశప్రజల్ని విముక్తుల్ని గావించాలనుకున్న మోహన్‌దాస్ కరమ్‌చంద్ గాంధీ విజయమో, వీరస్వర్గమో నినాదాన్ని ఏ విధంగా ఇవ్వగలిగాడు? ఆ పరిస్థితులకు ఆయన ఎందుకు నెట్టబడ్డాడు? కొల్లాయిగట్టి, సామాన్యజనాన్ని సహాయనిరాకరణోద్యమానికి ఏ విధంగా పురికొల్ప గలిగాడు? "అహింసా" మార్గంలో ప్రజలను కార్యోన్ముఖులను చేసి పాశవికమైన బ్రిటీషు దమనకాండ నెదిరించి కోట్లాది మంది ప్రజలు పాల్గొనే రీతిలో ఉప్పు సత్యాగ్రహానికి ఎట్లా నాయకత్వం వహించాడు? ప్రభుభక్తి పరాయణ కుటుంబంలో జన్మించి, ఆ ప్రభువుల్నే ఎదిరించగలిగిన శక్తి ఆయనకెట్లా వచ్చింది? ఉద్యమం తీవ్రరూపం దాల్చినపుడు, తన సన్నిహిత స్నేహితులూ, శిష్యులూ నిరసించినప్పటికీ ఉద్యమాన్ని ఎందుకు వెనక్కు లాగాడు? బహుళ సంస్కృతుల దేశంలో పుట్టి, ఆ దేశంలోని మతోన్మాదులను తనదైన మార్గంలో వ్యతిరేకించి హిందూ–ముస్లిం ఐక్యతకోసం తన ప్రాణాన్ని ఏవిధంగా వద్దాడు? కరమ్‌చంద్ గాంధీ "బాపూజీగా, జాతిపితగా" ప్రజలచేత ఏవిధంగా కొనియాడబడ్డాడు? రాజకీయాల్లో ఆయన వారసత్వం ఎవరికి దక్కాలి?

ఈ ప్రశ్నలన్నింటికీ కామ్రేడ్ నంబూద్రిపాద్ అద్భుతమైన రీతిలో ఈ పుస్తకంలో జవాబులిచ్చాడు. రాజకీయాల్లో ఉన్నవారేగాక, నేటితరం యువకులు సహితం ఈ పుస్తకాన్ని అధ్యయనం చేయాలి.

విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్
చంద్రం బిల్డింగ్స్, చుట్టుగుంట, విజయవాడ-520 004